# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)

## (AIKMKS అనుబంధం)

## రాష్ట్ర మహాసభల సావనీర్ - 2024




సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల నుండి వ్యవసాయరంగాన్ని పరిరక్షించుకుందాం!







మహాసభల సందర్భంగా జరిగిన ప్రదర్శనలో ఒక భాగం

# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)

**(AIKMKS అనుబంధం)**

**రాష్ట్రమహాసభల సావనీర్ - 2024**

# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)
## రాష్ట్రమహాసభల సావనీర్ - 2024

వెల : **రూ. 50/-**

ప్రతులకు :
**మైత్రీ బుక్ హౌస్**
**జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్**
**విజయవాడ-2**

ప్రచురణ :
కా॥ఎస్. ఝాన్సీ, డి. వర్మ, అధ్యక్ష, కార్యదర్శులు, రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)
తరిమెల నాగిరెడ్డి భవన్, న్యూ గిరిపురం, విజయవాడ.
సెల్ : 94403 19977



**రాష్ట్ర మహాసభల 2వ రోజు జరిగిన సదస్సులో ప్రతినిధులు**

# విషయసూచిక


1. ముందుమాట 5

2. రాష్ట్ర మహాసభల రిపోర్టు 7

3. అమరులకు జోహార్లు 10

4. ప్రారంభ సభ
   a. స్వాగతోపన్యాసం 11
   b. ప్రారంభోపన్యాసం 13
   c. వక్తల ప్రసంగాలు 15
      - పాకలపాటి రఘువర్మ
      - సంకు మనోరమ
      - గుర్రం విజయకుమార్
      - శ్రీకాంత్ మొహంతి
      - చాగనూరు మల్లికార్జున రెడ్డి

5. బహిరంగ సభ -ప్రసంగాలు 22
   - ఎం.ఎస్. నాగరాజు
   - ఎస్. ఝాన్సీ
   - ప్రసాదన్న
   - అశోక్ బైతా
   - జె. కిషోర్ బాబు
   - డి. వర్మ
   - సి. విజయ
   - కుంజం రామారావు

6. 'వ్యవసాయ రంగ సంక్షోభం - పాలకుల విధానాలు - మన కర్తవ్యాలు'పై సదస్సు
   ప్రారంభోపన్యాసం : వడ్డే శోభనాద్రీశ్వరరావు 32
   a. అంశం : ఢిల్లీ రైతు ఉద్యమం - కనీస మద్దతు ధర
      వక్తలు : డాక్టర్ కొల్లా రాజమోహన్ 37
      ప్రొఫెసర్ వేణుగోపాలరావు 40
      బండ్ల శ్రీనివాసరావు 42
   b. అంశం : గ్రామీణ యువత - నిరుద్యోగం - వలసలు
      వక్తలు : వి.వి. లక్ష్మీనారాయణ 44
      ఏ. సురేష్ 48
   c. అంశం : భూమి సమస్య - సామాజిక న్యాయం
      వక్తలు : వై. కోటేశ్వరరావు 51
      ఎస్. ఝాన్సీ 55

7. సోదర సంస్థల, ప్రజా సంఘాల ప్రతినిధుల సందేశాలు 57
   - వై. కేశవరావు
   - డి. హరినాథ్
   - ఆదినారాయణ రెడ్డి

- మరీదు ప్రసాదు
- వి. వెంకటేశ్వర్లు
- కే. వి. వి. ప్రసాద్
- కే. శ్రీనివాస్

**8. ఇతర రాష్ట్రాల ప్రతినిధుల సందేశాలు** 67
- అలోక్ ముఖర్జీ (పశ్చిమబెంగాల్)
- శంభు మహతో (జార్ఖండ్ )
- సుశీలన్ (కేరళ)
- గుణాలన్ (తమిళనాడు)
- మాధవరెడ్డి (కర్ణాటక)
- నిరాకర్ (ఒడిశా)
- షిండే సంజయ్ (మహారాష్ట్ర)
- ప్రవీణ్ (ఢిల్లీ)
- హరదేవ్ సింగ్ సంధు (పంజాబ్)

**9. సోదర సంఘాల ప్రతినిధుల సందేశాలు** 73
- గణేష్ పండా (ఏఐఎఫ్టీయూ- న్యూ)
- బి. అరుణ (జనసాహితి)
- ఎం. లక్ష్మి (స్త్రీ విముక్తి సంఘటన)
- వి. హనుమంతరావు (ఓ పి డి ఆర్)
- ఎం. భాస్కర్ (ఎన్ వై ఎస్)
- ఎల్. భాను (పిడిఎస్ఓ)

**10. తీర్మానాలు** 79

**11. రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం కరపత్రం** 84

**12. రాష్ట్ర మహాసభల కరపత్రం** 86

**13. జిల్లా మహాసభల ఫోటోలు** 89

**అనుబంధం**
1. వార్షిక సంచికల, సావనీర్ల సంక్షిప్త పరిచయం 94
2. సంఘం ఆధ్వర్యంలో 1997 -2000 సం॥ల మధ్య భూ పోరాటాలు 103
3. 'చరిత్రాత్మక రైతు రక్షణ యాత్ర' పుస్తక పరిచయం - రబి 107

# ముందుమాట

రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) 2024 జూన్ 15, 16, 17 తేదీలలో ఏలూరులో నిర్వహించిన రాష్ట్ర మహాసభల సావనీరును మీ ముందుకు తెస్తున్నాం. "సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల నుండి వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకుందాం... సహజ సంపదలపై హక్కు దేశ ప్రజానీకానిదే" అనే కేంద్ర నినాదాలతో ఈ మహాసభలు జరిగాయి.

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి నేపథ్యంలో... 'అల్లూరి సీతారామరాజు' ప్రాంగణంలో ప్రారంభ సభను జరుపుకున్నాం.

1937- 38 మధ్యకాలంలో ఆంధ్ర రాష్ట్రంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి- ముఖ్యంగా, నాటి జమీందారీ విధానానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన 'రైతు రక్షణ యాత్ర'కు నాయకత్వం వహించిన రైతాంగ పోరాట యోధులు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందినవారే. శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నుండి మద్రాసు వరకు సాగిన సుధీర్ఘ యాత్రకు నాయకత్వం వహించిన కామ్రేడ్స్ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, చలసాని వాసుదేవరావుల నగర్ లో మహాసభల రెండవ రోజు "వ్యవసాయ రంగ సంక్షోభం- పాలకుల విధానాలు- మన కర్తవ్యాల" పై జరిగిన సదస్సులో వివిధ అంశాలపై వక్తలు ఉపన్యసించారు.

రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సుదీర్ఘకాలం కృషి సాగించిన కామ్రేడ్ కోటయ్యనగర్‌లో మూడవ రోజున ప్రతినిధుల సభను స్ఫూర్తిదాయకంగా నిర్వహించుకొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది.

★ ★ ★

2019 సంవత్సరం నుండి బీజేపీతో అంటకాగి, ప్రజా ప్రయోజనాలను గాలికొదలి, బడా కార్పొరేట్ల విదేశీ కంపెనీల ప్రయోజనాలలో తరించిన వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించి... టిడిపి-బిజెపి-జెఎస్‌పిల కూటమి అధిక స్థానాలను గెలుచుకొని రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో జరిగిన మహాసభలు ఇవి. విపక్షంలో ఉండికూడా బిజెపికి వంత పాడిన టిడిపి, కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వ పాలనా పగ్గాలు చేపట్టిన ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా...ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నాలుగురోజుల కాలవ్యవధిలో.... జరిగిన మహాసభలు ఇవి.

గద్దెపై పాలకులు ఎవరు మారినా... ప్రజా వ్యతిరేక, భూస్వామ్య- సామ్రాజ్యవాద దోపిడీ విధానాల అమలులో మార్పులు ఏమీ ఉండబోవని... ప్రజలు, తమ తక్షణ, మౌలిక సమస్యల పరిష్కారం కోసం... పోరాట మార్గాన సాగటమే మన ముందున్న కర్తవ్యమని మహాసభల సందర్భంగా మాట్లాడిన పలువురు వక్తలు పిలుపునిచ్చారు.

రైతాంగం పండించిన పంటకు చట్టబద్ధమైన మద్దతు ధరను కల్పించడానికి గాని, కౌలు రైతాంగ ప్రయోజనాలను కాపాడటానికి గాని, వ్యవసాయ కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడానికి గాని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపు చేసి... వ్యవసాయ కూలీల, గ్రామీణ పేదల వలసలను అరికట్టడానికి గాని, కనీసపాటి కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడానికి కానీ... వీరెవరూ సిద్ధంగా లేరు. ఆదివాసులను అడవుల నుండి గెంటివేసి, విశాల అటవీ ప్రాంతాలను అభివృద్ధి పేరుతో బడా పారిశ్రామికవేత్తలుకు కట్టబెట్టేందుకు వీలుగా అటవీ సంరక్షణ చట్టాలకు సవరణలు చేయడానికి వీరంతా చేతులు కలిపిన వారే. సమగ్ర భూ సంస్కరణల ద్వారా భూమిలేని నిరుపేదలకు భూమిపై హక్కు కల్పించడానికి గాని,వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపడానికి గానీ... వీరెవరూ సిద్ధం కారు. అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత, ప్రజల ప్రజాస్వామిక ఉద్యమాలపై వివిధ రూపాల్లో నిర్బంధం, అణిచివేత ప్రయోగించడంలో కానీ, ప్రజలను- ముఖ్యంగా, శక్తివంతమైన యువతను మత్తుమందులు, మద్యం వంటి పలు వ్యసనాలకు బానిసలుగా చేయడంలో గాని, ప్రజలందరికీ అందుబాటులో ఉండాల్సిన విద్య- వైద్యాలను ఖరీదైన అంగడి సరుకుగా మార్చడంలోగానీ.... దోపిడీ పాలకులందరూ ఆరితేరిన వారే.

ముఖ్యంగా- ఇటీవల కాలంలో, వాతావరణంలో సంభవిస్తున్న పెను మార్పులు... మానవాళి పాలిట పెను విపత్తుగా పరిణమిస్తున్నాయి. భూతాపాన్ని పెంచే శిలాజ ఇంధనాల వినియోగాన్ని పాలకులు పెంపు చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో విచక్షణారహితంగా అడవుల విధ్వంసానికి అనుమతులు ఇస్తూ, వాతావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నారు. గనుల తవ్వకాలు, భారీ నిర్మాణాల పేరుతో భూగర్భాన్ని, అడవులను, కొండలను భారీ యంత్రాలతో తొలిచివేస్తున్నారు. ప్రవాహ గమనాలను, కాంటూరు స్థాయిలను (ఎత్తుపల్లాలను) ఉల్లంఘించి భారీ అక్రమ కట్టడాలు, బహుళ వరసల రహదారులు,పలు నిర్మాణాలకు అనుమతులు ఇస్తూ పెను విధ్వంసాలకు కారణమవుతున్నారు. ఇటీవల కాలంలో కేరళ రాష్ట్రం వయనాడ్‌లో, హిమాచల్‌ప్రదేశ్‌లో సంభవించిన భారీ వరదలలో వందలాదిమంది మృత్యువాత పడ్డారు. ఆగస్టు చివరలో కురిసిన భారీ వర్షాలతో కృష్ణానదికి వరద రావడంతోపాటు.... బుడమేరు పొంగి, విజయవాడ నగరంలోని లక్షలాది ఆవాసాలను ముంచెత్తింది. లంక గ్రామాలలో రైతాంగం భారీగా నష్టపోయారు. పదుల సంఖ్యలో ఈ వరదలలో ప్రజలు కనుమూశారు. గోదావరి జిల్లాలలో ఏలేరు ఉప్పొంగడం, ఉత్తరాంధ్రలో భారీ వర్షాలలో ప్రజలు, రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. ఈ వరదలలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు రైతు కూలీ సంఘం(ఆం.ప్ర) సంతాపం తెలుపుతోంది.

దశాబ్దాల కాలంగా పాలకులు అనుసరిస్తూ వస్తున్న.... నదులు,చెరువులు,జలాశయాలు, వాగులు, డ్రైన్లకు సక్రమంగా మరమ్మత్తులు నిర్వహించకపోవడం, కాలువల పూడిక తీయకపోవడం, కరకట్టలను పటిష్టం చేయకపోవడం,నీటి ప్రవాహ మార్గంలో అక్రమ కట్టడాలను ప్రోత్సహించడం... వంటి అనేక చర్యలు ఇలాంటి విపత్తులకు తక్షణ కారణాలుగా ఉండి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి.

ఈ విధంగా దేశాన్ని, దేశంలోని సమస్త,సహజ, అటవీ,భూగర్భ సంపదలన్నింటినీ విదేశీ, బహుళ జాతి సంస్థల పరం చేస్తూ ప్రకృతిని వికృతం చేస్తున్న దోపిడీ పాలకుల మౌలిక విధానాలలో తేడా ఏమీ లేదని, దశాబ్దాల కాలపు వారి పాలన, ఆచరణ తేటతెల్లం చేస్తోంది.

కనుక, నిర్మాణయుతమైన రైతాంగ, ప్రజా ఉద్యమాలను అభివృద్ధి చేయడం ద్వారానే... సమస్యల ప్రాతిపదికపై విస్తృత ఐక్య కార్యాచరణను అభివృద్ధి చేయడం ద్వారానే...రైతాంగ సమస్యల పరిష్కారానికి దన్నుగా ప్రజలను,ప్రజాతంత్ర వాదులను, మేధావులను విస్తారంగా సమీకరించడం ద్వారానే... కార్మిక- రైతాంగ ఐక్య పోరాటాల ద్వారానే...పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాలను ఎదుర్కోవటం సాధ్యమవుతుంది.

ఈ కర్తవ్యాలతో ముందుకు సాగుతున్న రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర మహాసభల సందర్భంగా వెలువరిస్తున్న ఈ సావనీర్ లో...మూడు రోజుల కార్యక్రమంలో వక్తల ప్రసంగాలను , సందేశాలను అందించాము.అలాగే 'అనుబంధం' లో...2001 నుండి ప్రారంభించి 2023 వరకు రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) ప్రచురిస్తూ వస్తున్న సావనీర్ లు, వార్షిక సంచికల సంక్షిప్త పరిచయాన్ని, సంఘం ఆధ్వర్యంలో 1997-2000 మధ్యకాలంలో మనుగోపాల(పశ్చిమగోదావరి జిల్లా), బొమ్మన హాళ్(అనంతపురం జిల్లా), దుగ్గేరు(విజయనగరం జిల్లా), పల్నాడు( గుంటూరు జిల్లా) ప్రాంతాల్లో...ఉద్యమాల క్రమంలో సాగిన వర్గ సంఘర్షణలను వివరించే వ్యాసాన్ని, 'రైతాంగ రక్షణ యాత్ర' పుస్తక పరిచయాన్ని అందిస్తున్నాం.

ఈ ప్రచురణకు వివిధరూపాల్లో సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

విప్లవాభినందనలతో....

విజయవాడ
**10-8-2016**

**రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)**
**(AIKMKS అనుబంధం)**

# సామ్రాజ్యవాదుల కబంధహస్తాల నుండి వ్యవసాయరంగాన్ని పరిరక్షించుకుందాం

## రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభల ఉద్ఘాటన

రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభలు జూన్ 15, 16, 17 తేదీలలో ఏలూరు పట్టణంలో జరిగాయి. బ్రిటీష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన మన్యం వీరుడు **అల్లూరి సీతారామరాజు ప్రాంగణం**గా నామకరణం గావించిన సభాస్థలి (ఏలూరు టొబాకో మర్చంట్స్ అసోసియేషన్ ప్రాంగణం) అరుణ పతాకాల రెపరెపలతో, వ్యవసాయ రంగానికి సంబంధించిన వివిధ నినాదాలతో కూడిన బ్యానర్లతో, తరలి వచ్చిన ప్రతినిధులలో ఉత్తేజాన్ని నింపింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి తరలి వచ్చిన వేలాది మంది రైతుకూలీ సంఘం కార్యకర్తలు, ప్రజలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన సౌహార్ద ప్రతినిధులతో 15వ తేదీ ఉదయానికే ఏలూరు పట్టణం కోలాహలంగా మారింది.

### స్ఫూర్తిదాయకంగా జరిగిన ప్రారంభసభ

15వ తేదీ ఉదయం 11 గంటలకు రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జెండాను ఆవిష్కరించటంతో మహాసభలు ప్రారంభ మయ్యాయి. సభికుల ఉత్తేజపూరిత నినాదాల మధ్య **సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్.ఝాన్సీ** జెండాను ఆవిష్కరించారు. ప్రజాకళాకారులు అరుణపతాక గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమాన్ని **సంస్థ కార్యదర్శి కా॥ ఎం.ఎస్.నాగరాజు** నిర్వహించి, అనంతరం జరిగిన ప్రారంభ సభకు వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. **సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ డి.వర్మ** గత మహాసభల నుండి ఈనాటి వరకు అమరులైన రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) నాయకులకు, కార్యకర్తలకు, వివిధ ప్రజా ఉద్యమాల్లో పాల్గొని అశువులు బాసిన ప్రజానీకానికి, ప్రజాతంత్రవాదులకు, రాజ్య హింసకు బలైనవారికి, సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో మూడు రైతాంగ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ ఉద్యమంలో అమరులైన 750 మందికి జోహార్లు అర్పిస్తూ తీర్మానం ప్రవేశపెట్టగా, సభ వారికి సంతాప సూచకంగా రెండు నిముషాలు మౌనం పాటించింది.

మహాసభల సన్నాహక కృషిలో భాగంగా ఏర్పాటైన **ఆహ్వాన సంఘ అధ్యక్షులు, ఏలూరు పట్టణ సీనియర్ వైద్యులు, గౌరవనీయులు డా॥ రావి గోపాల కృష్ణయ్య** సభకు హాజరైన ప్రజానీకానికి, వివిధ జిల్లాల నుండి తరలి వచ్చిన రైతు కూలీ సంఘం నాయకులకు, కార్యకర్తలకు, వివిధ ప్రజాసంఘాల నాయకులకు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన సౌహార్ద ప్రతినిధులకు, ప్రజాకళాకారులకు, మీడియా ప్రతినిధులకు అందరికీ సాదరంగా ఆహ్వానం పలికారు.

ప్రారంభ సభకు అధ్యక్షత వహించిన **కా॥ ఎస్.ఝాన్సీ** మాట్లాడుతూ మహాసభలు జరుగుతున్న పశ్చిమ గోదావరి ప్రాంతం రైతాంగ పోరాటాలకు పేరెన్నికగన్నదని గుర్తు చేశారు. 1937 జులైలో ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు సాగిన చారిత్రాత్మక రైతు రక్షణ యాత్రకు నాయకత్వం వహించిన వారిలో ముఖ్యులు కామ్రేడ్ కొమ్మారెడ్డి సత్యనారాయణ, కామ్రేడ్ చలసాని వాసుదేవరావు ఈ ప్రాంతానికి చెందిన వారేనన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి ఎదురొడ్డి నిలిచి, మన్యప్రాంత ఆదివాసుల వీరోచిత పోరాటానికి నాయకత్వం వహించిన అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంతంలోనే జన్మించాడని, ఆయన శత వర్ధంతి సంవత్సరంలో, ఈ ప్రాంతంలో మహాసభలు నిర్వహించుకుంటున్నామని చెబుతూ ఆ పోరాట వీరుడిని స్మరించుకున్నారు. కాళీపట్నం జమీందారుకి వ్యతిరేకంగా ఈ ప్రాంత ప్రజలు సాగించిన మిలిటెంటు పోరాటాలు, పోరాడే రైతాంగానికి ఎప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటాయని వివరించారు.

**ఎఐకెఎమ్‌కెఎస్ కన్వీనర్ కా॥ సుబోధ్ మిత్రా** ఈ మహాసభలలో **ప్రారంభోపన్యాసం** చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. 'దున్నేవానికే భూమి హక్కు' నినాదంగా దేశంలో బలమైన రైతాంగ ఉద్యమం సాగాలన్నారు. అడవుల నుండి ఆదివాసులను తరిమివేసి, అటవీ సంపదలను బహుళజాతి కంపెనీలకు, కార్పొరేట్లకు కట్టబెట్టే పాలకుల విధానాలకు వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు.

**ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీ పాకలపాటి రఘువర్మ** మాట్లాడుతూ, రైతాంగ సమస్యలను పాలకులు గుర్తించే విధంగా, వాటికి పరిష్కార మార్గాలను అమలుచేసే విధంగా వారిపై వత్తిడి తీసుకురావాలంటే పోరాటాలు తప్ప వేరే మార్గం లేదన్నారు. ఇంకా ఈ సభలో **ఎఐఎఫ్‌టియు (న్యూ) జాతీయ అధ్యక్షులు కా॥ గుర్రం విజయకుమార్, ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ జె.కిషోర్ బాబు, ఎఐకెఎమ్‌కెఎస్ ఒరిస్సా నాయకులు కా॥ శ్రీకాంత్ మొహంతి, ఏఐకెఎమ్‌కెఎస్ తెలంగాణా నాయకులు కా॥ ప్రసాదన్న, కర్ణాటక అడ్వకేట్, మరియు ప్రజాతంత్రవాది చాగనూరు మల్లిఖార్జున రెడ్డి, సామాజిక ఉద్యమకారిణి శ్రీమతి సంకు మనోరమ,** ఇతర ఆహ్వాన సంఘం సభ్యులు పాల్గొని ప్రసంగించారు.

## ఉత్తేజకరంగా సాగిన ప్రదర్శన

ప్రారంభ సభ అనంతరం వేలాది మంది రైతుకూలీలు, ఆదివాసులతో ఏలూరు పట్టణంలో భారీ ప్రదర్శన జరిగింది. సాయంత్రం 3 గంటలకు స్థానిక టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాలు నుండి ప్రారంభమైన ప్రదర్శన ఫ్లైఓవర్, కెనాల్ రోడ్, అంబికా సెంటర్, గోల్డ్ బజార్ల మీదుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంది. ప్రదర్శనకు ముందు భాగాన ఆదివాసీల సాంప్రదాయక కిందిరి నృత్యం, ప్రజా కళాకారుల డప్పు నృత్యాలు పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో మహిళలు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన రైతుకూలీ పేదలు ఎర్రజెండాలు చేబూని, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, దున్నేవానికే భూమి దక్కాలని, వ్యవసాయక విప్లవం వర్ధిల్లాలని, పోలవరం నిర్వాసితులకు శాస్త్రీయ సమగ్ర పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు.

## బహిరంగ సభ

**సంస్థ కార్యదర్శి కా॥ ఎం.ఎస్. నాగరాజు** అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ సభ జరిగింది. ఈ సభలో **సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎన్.ఝాన్సీ** మాట్లాడుతూ ప్రజల మౌలిక సమస్యలను నిర్లక్ష్యం చేయటంలో నూతనంగా అధికారం లోకి వచ్చిన పాలకులు గత పాలకులలానే వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆదివాసులను అడవుల నుండి తరిమివేసే విధానాలు అవలంబిస్తున్నారని, ఈ సమస్యలన్నింటిపై రైతులు, కూలీలు, గిరిజనులు, కార్మికులు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామికవాదు లందరూ కలిసి ఉద్యమాలు సాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా ఈ సభలో **ఎఐకెఎమ్‌కెఎస్ బీహార్ నాయకులు కా॥ అశోక్ బైతా, ఎఐకెఎమ్‌కెఎస్ తెలంగాణా నాయకులు కా॥ ప్రసాదన్న, ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ జె.కిషోర్‌బాబు, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు డా॥ సి.విజయ, పిడిఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ ఎ.సురేష్, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ డి. వర్మ, ఏజెన్సీ గిరిజన సంఘం పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కా॥ కుంజం రామారావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కా॥ బండి కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కా॥ కె. శ్రీనివాస్** పాల్గొని ప్రసంగించారు.

## సదస్సు

16వ తేదీ ఉదయం **'వ్యవసాయరంగ సంక్షోభం-పాలకుల విధానాలు-మన కర్తవ్యాలు'**పై **కామ్రేడ్స్ కొమ్మారెడ్డి సత్యనారాయణ, చలసాని వాసుదేవరావు గార్ల హాల్** (టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాల్) నందు సదస్సు జరిగింది. **సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్.ఝాన్సీ** అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో **మాజీ వ్యవసాయ శాఖా మంత్రి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు** ప్రారంభోపన్యాసం చేస్తూ గత పదేళ్ళ కాలపు నరేంద్ర మోడీ పాలన రైతాంగాన్ని లక్షల కోట్ల రూపాయల నష్టానికి గురిచేసిందని, అదే సందర్భంలో కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రుణాలను రద్దు చేసిందని అనేక వివరాలు తెలియజేశారు. రైతు కూలీ సంఘం మహాసభలు విజయవంతం కావాలని, రైతాంగ సమస్యలపై మరిన్ని పోరాటాలు సాగించాలని తెలిపారు.

**నల్లమడ రైతాంగ సమితి నాయకులు డా॥ కొల్లా రాజమోహన్** 'ఢిల్లీ రైతాంగ ఉద్యమం-కనీస మద్దతు ధర' అనే అంశంపై మాట్లాడారు. ఈ సెషన్‌కు సంఘం రాష్ట్ర కోశాధికారి కా॥ ఎస్. లలితకుమారి అధ్యక్షత వహించారు. డా॥ రాజమోహన్ మాట్లాడుతూ మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ కేంద్రంగా సాగిన రైతాంగ ఉద్యమం జరిగిన తీరును వివరించారు. దీనికి తలొగ్గి మోడీ ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించక తప్పలేదని, కానీ నేటికి కూడా కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించలేదని, డా॥ స్వామినాథన్ కమీషన్ చేసిన సిఫారసులను అమలు చేయటానికి పూనుకోవటం లేదని వివరించారు.

**వ్యవసాయ యూనివర్శిటీ విశ్రాంత ప్రొఫెసర్ శ్రీ ఎన్.వేణుగోపాల్** మాట్లాడుతూ రాష్ట్రంలోని 82 లక్షల హెక్టార్లలో 42 లక్షల హెక్టార్లు, ఆబ్సెంట్ ల్యాండ్ లార్డ్‌ల చేతుల్లో ఉందని, వ్యవసాయంపై ఆధారపడిన దేశంలో 'దున్నేవానికే భూమి' అన్నిటికీ మూలమైనదిగా ఆయన పేర్కొన్నారు. **విశ్రాంత ఐఎఎస్ అధికారి శ్రీ బండ్ల శ్రీనివాస్** మాట్లాడుతూ దేశంలోని సహజ సంపదలపై దేశ ప్రజలకు హక్కు ఉండాలని, అట్టడుగునున్న 50, 60 శాతం ప్రజల జీవితాలలో మార్పు కోసం ఉద్యమాలను కొనసాగించాలని పేర్కొన్నారు.

**మాజీ ఐపిఎస్ అధికారి, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు శ్రీ వి.వి లక్ష్మీనారాయణ** 'గ్రామీణ యువత-నిరుద్యోగం-వలసలు' అనే అంశంపై మాట్లాడారు. ఈ సెషన్‌కు రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ భాషా అధ్యక్షత వహించారు. శ్రీ వి.వి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో, ఎలా వలసలు పెరుగుతున్నాయో వివరించి, దీని పరిష్కారానికి వ్యవసాయాధారిత పరిశ్రమలు పెరగాలన్నారు. **పిడిఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ ఎ. సురేష్** ఈ అంశంపై మాట్లాడుతూ నిరుద్యోగుల కడగండ్లను వివరించారు. ఉపాధి లేమితో యువత తీవ్ర నిరాశా నిస్పృహలతో ఉన్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన చెందుతూ పాలక వర్గాలు యువతను దగా చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**దళిత బహుజన మహాసభ నాయకులు, ప్రముఖ న్యాయవాది శ్రీ వై.కోటేశ్వరరావు** 'భూమి సమస్య – సామాజిక న్యాయం' అనే అంశంపై మాట్లాడారు. ఈ సెషన్‌కు సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ జి. సునీత అధ్యక్షత వహించారు. వై.కె. గారు మాట్లాడుతూ భూమి ఉత్పత్తి సాధనమని, అధికారం– గౌరవం–అవసరంతో ముడిపడి ఉందని తెలిపారు. భూస్వామ్య పునాదులపై పెరిగిన పెట్టుబడిదారీ వ్యవస్థ కులం కుత్తుక

నరకలేదని, దానిని కొనసాగించిందన్నారు. సామాజిక న్యాయం జరగకుండా సమన్యాయం జరగదని పేర్కొన్నారు. **సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఝాన్సీ** ఈ విషయంపై మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తీవ్రంగా ఉన్నాయని, దళితులను, గిరిజనులను, పేద రైతాంగాన్ని, కూలీలను వర్గ ఉద్యమాల ద్వారా ఐక్యం చేసే ఆచరణను కొనసాగిస్తున్నామని, ఈ ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు.

ఈ సదస్సులో **ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ వై. కేశవరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥ వి. వెంకటేశ్వర్లు, ఏపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥ కె.వి.వి ప్రసాద్, ఎఐకెఎమ్ఎస్ నాయకులు కా॥ డి. హరినాథ్, ఎఐకెఎస్ నాయకులు కా॥ మరీదు ప్రసాద్, రాయలసీమ సాధన సమితి నాయకులు ఆదినారాయణ రెడ్డి** తదితరులు మహాసభలు విజయవంతం కావాలని, ఐక్య రైతాంగ ఉద్యమాలను కొనసాగించాలని ఆకాంక్షిస్తూ సందేశాలిచ్చారు.

**ఎఐకెఎమ్‌కెఎస్ కర్ణాటక రాష్ట్ర నాయకులు కా॥ మాధవరెడ్డి, ఒడిషా రాష్ట్ర చాసీమూలియా ఆదివాసీ సంఘం నాయకులు కా॥ నిరాకర్, ఎఐకెఎంకెఎస్ మహారాష్ట్ర నాయకులు కా॥ సంజయ్ షిండే, కేరళ రాష్ట్ర నాయకులు కా॥ సుశీలన్, జార్ఖండ్ నాయకులు కా॥ శంభు మహతో, తమిళనాడు నాయకులు కా॥ గుణాలన్, పశ్చిమ బెంగాల్ పీడిత ప్రజా ఉద్యమ నాయకులు కా॥ అలోక్ ముఖర్జీ** తమ సందేశాలనిచ్చారు.

ఇంకా సోదర ప్రజా సంఘాల నాయకులు **కా॥ గణేష్ పండా (ఎఐఎఫ్‌టియు-న్యూ), కా॥ ఎం. లక్ష్మి (స్త్రీ విముక్తి సంఘటన), కా॥ బి. అరుణ (జనసాహితి), కా॥ ఎన్. భాస్కర్ (నవయువ సమాఖ్య), కా॥ ఎల్. భాను (పిడిఎస్‌యు)** మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సందేశాలిచ్చారు.

## ప్రతినిధుల సభ

మహాసభల చివరిరోజు 17-6-2024న ప్రతినిధుల సభ కా॥ కొప్పుల కోటయ్య హాల్ నందు జరిగింది. ఈ సభకు రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర నాయకులు కా॥ ఇల్లా రామిరెడ్డి, కా॥ డి.వర్మ, కా॥ జి.సునీత, కా॥ ఎం.శోభ, కా॥ శ్రీనునాయుడు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

ఈ సభలో 2018లో జరిగిన జనరల్ కౌన్సిల్ నుండి మహాసభల మధ్యకాలంలో సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల నివేదికను **కా॥ ఎస్. ఝాన్సీ** ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వాన రాష్ట్రంలో జరిగిన ముఖ్యమైన కార్యక్రమాలలో నిలకడగా, క్రియాశీలంగా పాల్గొనటాన్ని వివరించారు. ఆదివాసీలను అడవుల నుండి వెళ్ళగొట్టే సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా 2019లో విశాఖపట్నంలో సదస్సు నిర్వహించామని, అటవీ హక్కుల సంరక్షణ చట్టానికి సవరణలు చేయటాన్ని నిరసిస్తూ 2023లో విశాఖలో భారీ సదస్సు నిర్వహించామని తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమగ్ర, శాస్త్రీయ పునరావాసం కోసం నిలకడైన ఆందోళన కొనసాగిస్తూ వస్తున్నామని తెలియ జేశారు. రాష్ట్ర మహాసభలకు ముందు సభ్యత్వాలను పూర్తి చేసుకుని, వివిధ జిల్లాల మహాసభలు పూర్తి చేసుకుని రాష్ట్ర మహాసభలకు సమాయత్తమైనామని తెలియజేశారు. ఇంకా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యకలాపాల సంక్షిప్త నివేదికను ప్రతినిధుల ముందుంచగా ప్రతినిధుల సభ దీనిని ఆమోదించింది.

అనంతరం కా॥ ఎస్. ఝాన్సీ 24 మందిని నూతన కార్యవర్గంగా ప్రతిపాదించగా ప్రతినిధుల సభ ఆమోదించింది. **సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కా॥ ఎస్. ఝాన్సీ, ఉపాధ్యక్షులుగా కా॥ ఇల్లా రామిరెడ్డి, కా॥ యు. వీరబాబు, కా॥ కె. మోహన్‌లను, కార్యదర్శిగా కా॥డి.వర్మ, సహాయ కార్యదర్శులుగా కా॥ ఎస్.కె. బాషా, కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, కా॥ జి. సునీత, కోశాధికారిగా కా॥ ఎస్. లలిత కుమారి**లను ఆఫీసు బేరర్లుగా కార్యవర్గం, ప్రతినిధుల హర్షధ్వానాల నడుమ ప్రకటించింది.

ప్రతినిధుల సభలో చివరగా - పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాస సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సి2+50తో కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, అటవీ సంరక్షణ చట్టానికి చేసిన సవరణలను రద్దు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను వెనక్కు తీసుకోవాలని, వ్యవసాయాధారిత పరిశ్రమలను నెలకొల్పి గ్రామీణ వలసలను అరికట్టాలని, కాంచనజంగా రైలు ప్రమాద ఘటనకు కారణమైన ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ, 2024 నీట్- యుజి పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని, దళితులపై, మహిళలపై దాడులను అరికట్టాలని, ఇంకా ఇతర రైతాంగ, ప్రజా సమస్యలపై తీర్మానాలను సభ ఆమోదించింది.

**(వక్తల, సోదరసంఘాల, సౌహార్ద ప్రతినిధుల సందేశాల, తీర్మానాల పూర్తిపాఠం లోపలి పేజీల్లో చూడండి)**

## ఆకట్టుకున్న కళారూపాలు

మహాసభల 3 రోజుల కార్యక్రమంలో వివిధ కళారూపాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జెండా ఆవిష్కరణ నుండి ముగింపు వరకు వందలాదిమంది కళాకారులు తమ పాటలతో, నృత్యాలతో సభికులలో ఉత్తేజాన్ని నింపారు. ప్రారంభ సభలో అనేకమంది కళాకారులు డప్పు నృత్యం చేయగా, ప్రజా కళాకారులు కోలాటం ప్రదర్శించారు. బహిరంగ సభా వేదికపై విప్లవోద్యమ అమరవీరుల గురించి గానం చేస్తూ బాలికలు అద్భుతంగా ప్రదర్శించిన 'నెత్తుటి దీపాలు' నృత్య రూపకం ప్రేక్షకులలో తీవ్ర ఉద్వేగాన్ని నింపింది. మహాసభల రెండవరోజు గిరిజన బాలికల త్రయం 'అల్లూరి సీతారామరాజు' బుర్రకథను గానం చేశారు. విశిష్టమైన హావభావాలతో ఎంతో నేర్పుగా సాగిన ఈ బుర్రకథ సభికుల, అతిథుల మెప్పును పొందింది.

విద్యార్థులు, యువజనులు, రైతు కూలీలు, గిరిజనులు, రైతుకూలీ సంఘం సభ్యులు అనేకమంది 3 రోజుల మహాసభల కార్యక్రమాలు అవిచ్ఛిన్నంగా జరగటంలో వాలంటీర్లుగా ఎంతో నిబద్ధతతో, బాధ్యతతో శ్రమించారు. ★

# అమరులకు జోహార్లు

ఎఐకెఎమ్‌కెఎస్ జాతీయ నాయకులు కామ్రేడ్ ఖుదన్ మల్లిక్ 2017లో అనారోగ్యంతో అమరులయ్యారు. నక్సల్బరీ ఏరియాలో అనేక రైతాంగ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శిగా 16 సంవత్సరాలు పనిచేసి కామ్రేడ్ కోటయ్య 2017 డిసెంబర్ 1వ తేదీన అమరులయ్యారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ ముత్తిరెడ్డి శ్రీరాములు 2017 జనవరిలో అమరులయ్యారు. రైతుకూలీ ఉద్యమ నేత కామ్రేడ్ సోనీ 2018 ఫిబ్రవరి 16న అమరులయ్యారు. అనంతపురం జిల్లా రైతుకూలీ ఉద్యమ నాయకులు కామ్రేడ్ బి.తిమ్మారెడ్డి అమరులయ్యారు. గుంటూరు జిల్లా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గసభ్యులు కామ్రేడ్ సింహాద్రి లక్ష్మారెడ్డి, తూర్పుగోదావరి జిల్లా గిరిజన ఉద్యమ నాయకులు కామ్రేడ్ చదల వీరపురెడ్డి అమరులయ్యారు. అనంతపురంకి చెందిన కామ్రేడ్ పెద్దక్క, పల్నాడుకి చెందిన కామ్రేడ్ దేగల నాగమ్మ, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు కామ్రేడ్ జగ్గారపు సుబ్బారావులకు మహాసభ జోహార్లర్పిస్తున్నది.

మార్క్సిస్టు మేధావి, శ్రామికవర్గ దార్శనికుడు, జనశక్తి పత్రిక సంపాదకులు, రైతాంగ సమస్యలపై సైద్ధాంతిక కృషిచేసిన కామ్రేడ్ పోలవరపు జస్వంత్ రావు 2020 ఆగస్టు 29 అమరులయ్యారు. ఎఐకెఎంకెఎస్ జాతీయ కమిటీ సభ్యులు, క్లాస్ స్ట్రగుల్ పత్రిక సంపాదకులు కామ్రేడ్ మధు 2021 ఏప్రిల్ 16న అమరులయ్యారు. రాజస్థాన్‌కు చెందిన పీడిత ప్రజా ఉద్యమ నాయకులు కామ్రేడ్ రంజిత్ సింగ్‌లకు ఈ మహాసభ అరుణాంజలి ఘటిస్తోంది.

చాషీ మూలియా సంఘం ఒరిస్సా రాష్ట్ర నాయకులు కామ్రేడ్ బ్రహ్మానంద మాలిక్. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ రామన్న గౌడ్, తెలంగాణ రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ నల్లాన స్వామీరావులకు జోహార్లర్పిస్తున్నాము.

బీహార్‌లో కైమూర్ జిల్లా కుదిమి గ్రామంలో తమ పట్టాహక్కు భూమిలో వందలాది రైతులు వరికోత కోస్తున్న సమయంలో భూస్వాములు, పెత్తందారీ భూదురాక్రమణ దారులు సాయుధ గూండాలతో తుపాకీ కాల్పులు జరపగా కామ్రేడ్ సంతోష్ ముషాహర్ అనే యువరైతు మరణించారు. ఆ కామ్రేడ్‌కు ఈ మహాసభ జోహార్లు తెలుపుతుంది.

గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ కర్రి మోషే, రెంటచింతల ప్రాంతపు నాయకులు కామ్రేడ్ సురభి అమరలింగం, కృష్ణాజిల్లా రైతు కూలీ నాయకులు కామ్రేడ్ కొప్పినేని ఉమామహేశ్వరరావు, అనంతపురం కామ్రేడ్ తరిమెల నాగరత్నమ్మ, విజయవాడలోని కార్మిక సంఘం నాయకులు కామ్రేడ్ షేక్ మదార్‌లకు జోహార్లర్పిస్తున్నాము.

పీడిత ప్రజా ఉద్యమ నాయకులు కామ్రేడ్ డివి కృష్ణ, కామ్రేడ్ ముక్తార్ పాషా, కామ్రేడ్ పైలా చంద్రమ్మ, కామ్రేడ్ చల్లపల్లి శ్రీనివాసరావు, కామ్రేడ్ పీకే మూర్తి, ఆదివాసీల కోసం అలుపెరగని కృషిచేసిన స్టాన్ స్వామి, సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేష్, పౌరహక్కుల నాయకులు ప్రొ.ఎస్. శేషయ్య, కాకినాడకు చెందిన ప్రజాకళాకారుడు సయ్యద్ అహ్మద్ కరీం, రైతు కూలీ ఉద్యమ మిత్రులు డాక్టర్ వీరభద్రరావు, జానపద కళాకారుడు, గాయకుడు కామ్రేడ్ వంగపండు ప్రసాదరావు, జానపద వాగ్గేయకారుడు కామ్రేడ్ గద్దర్ ,బహుజన నాయకులు ఉసా, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మకాయల రంగనాథ్‌ల మరణం పట్ల సంతాపం తెలియజేస్తున్నాము.

తెలంగాణ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కామ్రేడ్ గంగుల నరసయ్యకు జోహార్లర్పిస్తున్నాము.

తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కోశాధికారి కామ్రేడ్ బి.గురవారెడ్డి, రైతుకూలీ ఉద్యమ మిత్రులు, సీనియర్ ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు కామ్రేడ్ ఎన్.పరమేశ్వర రావు, ప్రజా హక్కుల ఉద్యమ నాయకులు కామ్రేడ్ టి.ఎల్. నారాయణ, ఉద్యమ ఆప్తులు కామ్రేడ్ గోవింద రెడ్డి, ప్రజా రచయిత్రి మహాశ్వేతాదేవి, ఆర్థిక విశ్లేషకులు వి. హనుమంత రావు, ప్రొ॥ కె.పి. సుబ్బారావు, రైతు నాయకులు ఎర్నేని నాగేంద్రరావు, మహాసభ ఆహ్వాన సంఘ సభ్యులు ఎర్నేని సీతాదేవిలకు ఈ మహాసభ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తోంది.

విశాలాంధ్ర దినపత్రిక సంపాదకులు సి.రాఘవాచారి, అరుణోదయ రామారావు, కసుకుర్తి రామలింగం, ప్రజా రచయిత సివి, ప్రముఖ శాస్త్రవేత్త పీఎం భార్గవ తదితరులకు ఈ మహాసభ సంతాపం తెలియజేస్తున్నది.

ఉత్తరప్రదేశ్‌లో హథ్రాస్ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ళ దళిత యువతి మనీషా వాల్మీకి తన తల్లితో కలిసి వ్యవసాయ పనులు చేస్తుండగా అగ్రకులానికి చెందిన నలుగురు వ్యక్తులు పొలాల్లోకి ఈడ్చుకుపోయి సామూహిక అత్యాచారం చేసి, చిత్ర హింసలకు గురిచేసి హత్య చేశారు. ఈ దారుణానికి బలైన మనీషా వాల్మీకికి మహాసభ సంతాపం తెలియజేస్తున్నది.

దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా ప్రజల కోసం పని చేస్తూ మరణించినవారికి ఈ మహాసభ సంతాపం తెలియజేస్తున్నది. పోలీసు కాల్పుల్లో మరణించిన రైతాంగానికి, కార్మికులకు ఈ మహాసభ సంతాపం తెలియజేస్తున్నది. మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ ఉద్యమంలో అమరులైన 750 మంది రైతులకు ఈ మహాసభ జోహార్లు తెలుపుతున్నది.

అప్పుల పాలై ఆత్మహత్యలకు బలైన పేద, మధ్యతరగతి రైతాంగానికి ఈ మహాసభ సంతాపం తెలియజేస్తుంది. ప్రకృతి వైపరీత్యాలకు, పాలకుల సృష్టిస్తున్న మత విద్వేషాలకు మరణించిన పేద, రైతు కూలీలందరికీ మహాసభ సంతాపం తెలియజేస్తోంది. పితృస్వామ్య అణచివేతకు బలైన మహిళలకు ఈ మహాసభ సంతాపం తెలియజేస్తోంది.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ కాండలో మరణించిన వేలాదిమంది బాలలకు, మహిళలకు, పౌరులకు ఈ మహాసభ జోహార్లు అర్పిస్తున్నది. సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి బలైన ప్రజలకు ఈ మహాసభ సంతాపం తెలియజేస్తున్నది. కోవిడ్ విపత్తు కాలంలో, హడావుడిగా ప్రకటించిన లాక్‌డౌన్ కారణంగా వేల మైళ్ళ దూరం నడిచి దారిలోనే మరణించిన వలస కూలీలందరికీ ఈ మహాసభ సంతాపం తెలియజేస్తూ అమరులైన వారందరికీ పేరు పేరున జోహార్లర్పిస్తోంది.

**ఏలూరు**

**15-06-2024**

# ప్రారంభ సభ

## స్వాగతోపన్యాసం

**డాక్టర్ రావి గోపాల కృష్ణయ్య,**
అధ్యక్షులు, ఆహ్వాన సంఘం మరియు సీనియర్ వైద్యులు



ముందుగా రైతుకూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ మహాసభకు విచ్చేసిన మీ అందరికీ పేరుపేరున హృదయపూర్వక ఆహ్వానం పలుకుతున్నాను. ఈ రోజు ఎంతో సుదినము. ఎన్నో త్యాగాలు చేసి రైతులకు ఒక స్థితి కల్పించినటువంటి నేపథ్యంలో ఈ రోజు రైతులకు ఉన్నటువంటి పరిస్థితులు, ఈ 75 సంవత్సరాలు స్వాతంత్ర్యం తర్వాత వచ్చిన మార్పులు, ఇవన్నీ కూడా చర్చించి పరిష్కారం వెతుకుతారని ఆశిస్తూ మహాసభలు విజయవంతంగా జరగాలని కోరుకుంటున్నాను.

ఈ మహాసభకు వివిధ రాష్ట్రాల నుంచి, వివిధ సంఘాల నుంచి, ఉపాధ్యాయుల నుంచి, పత్రికా విలేకరుల నుంచి ఇక్కడ విచ్చేసినటువంటి మిత్రులందరికి ఆహ్వాన సంఘం తరఫున ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను. నేను వృత్తిరీత్యా డాక్టర్‌ని. గవర్నమెంటు సెక్టార్‌లో చేసి రిటైర్ట్ అయ్యాను. మరి నన్ను గౌరవ అధ్యక్షులుగా ఎంపిక చేసిన మీ అందరికీ కృతజ్ఞతలు. నన్ను గౌరవ అధ్యక్షులుగా ఎంపిక చేయడానికి మీరు ఎంతో కొంత వర్క్ చేసి వుంటారు. నా నేపథ్యం కూడా దీనికి కారణం అయ్యి వుండవచ్చు. నేను వ్యవసాయ కుటుంబం నుండి వచ్చినటువంటి వాడిని. అప్పుడు చల్లపల్లి జమిందారీ గ్రామాల్లో మా గ్రామం ఒకటి. అప్పట్లో చలసాని వాసుదేవరావు గారు, చండ్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య గారు, తరిమెల నాగిరెడ్డి గారు వీరంతా కూడా వామపక్ష భావాలతో 'రైతులకు న్యాయం జరగాలి, రైతుల శ్రమ, కూలీల శ్రమ దోపిడీకి గురికాబతుంది, దీన్ని శ్రమచేసే వాడికే దక్కాలనే' నినాదంతో ఈ రైతుకూలీ ఉద్యమం ప్రారంభమయ్యింది. ఇప్పటికి దున్నేవానికే భూమి, భూపరిమితి చట్టాలు వచ్చినా కూడా అమలు అయ్యాయని నేను అనుకోవడం లేదు. కొంత వరకు జరిగితే జరిగి వుండవచ్చు. ఇప్పటికీ కూడా ఏ ప్రభుత్వాలు వచ్చినా సరే 1947 నుండి ఎన్ని ఉద్యమాలు వచ్చినా కూడా డెమొక్రటిక్ సిస్టమ్‌లో ఎలక్షన్స్ జరిగినప్పుడల్లా రైతే వెన్నెముక, రైతు లేనిదే నాలుగు వేళ్ళు లోపలికి పోవు, మనం వాళ్ళకి సహాయం చేయాలి, సహకారం అందించాలి, మేమంతా మీ వెనకాల ఉంటాం అని చెప్పి ప్రతి ఐదేళ్ళ కొకసారి వచ్చే ఎన్నికల పండగ వాతావరణాన్ని సృష్టించి మళ్ళీ షరామామూలే. ఏమి జరగలేదా, అంటే జరగలేదని కాదు. అది ఒక కొత్తరూపంలో వుంది. తర్వాత ఇంతకు ముందు ఈ బ్యాక్‌గ్రౌండ్ 1947, 1950ల నుంచి కూడా మనం ఒకసారి మననం చేసుకుంటే, దేశం మొత్తం మీద సగటు రైతు 2 నుంచి 5 ఎకరాలు ఇది డెల్టాకు సంబంధించినది. ఈ లంక భూములు ఇటువంటివి అయితే ఒక 10,12 ఎకరాలు. 1947, 50, 1960ల దాకా కూడా 2 నుంచి 5 ఎకరాలు వున్నటువంటి రైతు రైతుకూలీలతో కలిసి శ్రమించి దాదాపు సంతృప్తి కరమైనటువంటి జీవితమే గడిపారు. కొంత ఫిజికల్ పార్టిసిపేషన్ కూడా వుందని నేను ధైర్యంగా చెప్పలేను కాని నాట్లు వేయడం, కలుపుతీయడం, గట్లు శుభ్రం చేయటం, కోతలు కోయటం, అప్పట్లో ఎకరానికి పుట్టు అంటే 10 ఎకరాలు. ఎకరానికి 20 బస్తాలు అంటే అప్పట్లో ఇప్పుడు మీది మేము చూపించినట్లు అది చూపించి రైతు గర్వంగా చూపించుకునేవాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పరిణామ క్రమం గనుక మార్పు చేస్తే సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, ఎరువులు ఇవన్నీ కూడా అన్నపూర్ణగా వున్న ఆంధ్ర ప్రదేశ్‌కి ప్రాణమైనటువంటి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వంటి చోట ట్రెడిషనల్ పరిధి మారిపోయి అనుబంధంగా కొన్నాళ్ళు చెరుకు పండించారు. దాని నుండి వచ్చే బై ప్రొడక్ట్ చిన్న చక్కెర మిల్లులు. అనకాపల్లి ఆ ప్రాంతంలో బెల్లం ఇవి కొన్నాళ్ళు జరిగినాయి. కొన్నాళ్లు జరిగి బాగున్నంత కాలం బాగుండి తర్వాత ఎప్పుడైతే ఈ కొంచెం పైనున్నటువంటి ఈ పెట్టుబడీదారీ వ్యవస్థలో ఎప్పుడైతే లాభాలు వాడికి సరిపోయినట్టు లేదో అర్ధంతరంగా మిల్లులు మూసివేసి ఒక సంక్షోభంలో పడవేసారు. ఇది ఒక పరిణామ క్రమం. అట్లానే శ్రీకాకుళం జిల్లాలో జనపనార మిల్లులు. అట్లాగే అవి కూడా ఒక రకంగా రూపాంతరం చెంది బాగుపడినటువంటి పెట్టుబడిదారులు బాగుపడ్డారు. మళ్ళీ దానిలో పనిచేసినటువంటి కూలీలు కూలీలుగా మిగిలిపోయారు. ఇందాక నృత్యరూపకంలో పాటలు విన్నాము. అది ఒక రకమైనటువంటి ఉద్వేగాన్ని మనలో తట్టిలేపుతుంది. అది చూసేటప్పుడు కొంచెం భావోద్వేగానికి గురి అవ్వడం. అప్పటికి ఇప్పటికి వారి జీవితాల్లో మార్పు వచ్చిందా?

అనుకున్న మార్పు వచ్చిందా? వాళ్ళు సంతృప్తి పడ్డారా? పడుతున్నారా? అన్నది మనకు మనం వేసుకోవాల్సిన ప్రశ్న. దానికి పరిష్కారం ఏమిటి? సమస్యను చెప్పేటప్పుడు నువ్వు ఎప్పుడు కూడా పరిష్కారం చూపించాలి. జమిందారీ వ్యవస్థకు పరిష్కారం భూసంస్కరణలు అన్నాడు. మాక్జిమమ్ పల్లపు భూములు 16 ఎకరాలు, మెట్ట భూములు అయితే 25, ఇవన్నీ వచ్చినాయి. 1/70 చట్టంలో అటవీ రక్షణ చట్టం అని పేరు పెట్టేసి కొండప్రాంతాల్లో అడవి ప్రాంతాల్లో ఉండే వారి భూములను, ఎన్నో సంవత్సరాల నుండి సాగుచేస్తున్న భూములను వారి నుండి తీసుకొని నెట్టివేయబడే పరిస్థితి. ఒక వర్గం వాళ్ళ దగ్గర నుండి తీసుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. ఆ తర్వాత చిన్న చిన్న తిరుగుబాట్లు చేయడం వలన కొంత రక్షించుకోగలిగాము. ఇంకో రూపంలో తీసుకునివచ్చి అభివృద్ధి అని చెప్పేసేసి ఇంకొంచెం పెట్టుబడి పెట్టే వాళ్ళతో ఒక ఫ్యాక్టరీలను తీసుకువచ్చి, పరిశ్రమలను తీసుకువచ్చి, ఉద్యోగాలు కల్పిస్తామని మల్టినేషన్స్ కంపెనీలను తీసుకువచ్చి అడవుల నుంచి సహజ సంపదను కూడా బడా పెట్టుబడిదారుల పరం అయ్యే వ్యవహారంగా తయారయిందని మనకు బోధపడుతుంది. అప్పుడప్పుడు నాబోటి వాళ్ళు ఎటువంటి మాటలు మాట్లాడుతారంటే. రైతన్నవాళ్ళు ఎవరైనా ఉన్నారా? మీరు కష్టపడుతున్నారా? కూలీ అంటున్నారు. ఏమి తక్కువ ఉంది పొద్దున 7,8 గంటలకు వస్తే సాయంత్రం 5,6 గంటలకు కూలీ సమయం అయిపోతుంది. ఈ రోజున ఏ కూలీ అయినా సరే రోజుకి 600 రూపాయలు లేనిదే దొరకడం లేదు. ఒక ఎకరాన్ని సాగుచేసి ఇంటికి తెచ్చుకోవాలంటే లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది. కూలీ దగ్గర నుంచి ఎరువులు దగ్గర నుంచి ఇవన్నీ కూడా ఈ సభలో చర్చిస్తారు. ఎవరూ సంతృప్తిగా లేరు. సంతృప్తిగా ఉన్నది ఒక వర్గం మాత్రమే. మరి ఎవరు వచ్చినా సరే ఎలక్షన్స్ అప్పుడు మేము మీ వెనకాల ఉంటాము అని చెబుతున్నారు. మరి ఎంత వరకు ఉంటున్నారో మన అందరికీ తెలిసినదే. తర్వాత రైతుల డిమాండ్స్‌కి వచ్చేటప్పటికీ ఎలక్షన్స్‌కి ముందు చారిత్రాత్మకంగా మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా కొన్ని రోజులు నిరసన కార్యక్రమాలు జరిగాయి. దీని పర్యవసానంగానే చట్టాలను రద్దు చేసి, కొన్ని నిర్ణయాలను చేశారు. దాంట్లో రైతుకి గిట్టుబాటు ధర అనేది ముఖ్యమైనది. అది ఇంకా చట్టం రూపందాల్చలేదు. చట్టం చేయాలని మనమందరం కలిసి శ్రమించి పోరాడవలసిన ఆవశ్యకతగా ఏర్పడుతుంది. ఇంకా పరిష్కార మార్గాలు చూపించి ఇక్కడ జరిగే సదస్సులో కొన్ని సమస్యలను ఏకరువు పెట్టి వెళ్ళిపోకుండా పరిష్కార మార్గాలు నిపుణులైన వాళ్ళు ఆలోచన ఆచరణరీతిగా ఉంటాయని, అటువంటి సలహాలు ఇస్తారని నేను భావిస్తూ, నాకు ఈ అవకాశమిచ్చిన మీ అందరికీ ధన్యవాదాలు. ★




రాష్ట్ర మహాసభల నేపథ్యంలో అల్లూరి శతవర్ధంతి సందర్భంగా వెలువరించిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) 'బులిటెన్' ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు - భీమవరం

ఒక సమాజం మొత్తంగానీ, ఒకలి లియావత్తు దేశం గానీ, లేదా భూమిపై ఉన్న మొత్తం సమాజాలన్నీ కలుపుకున్నాగానీ వారు భూమికి యజమానులు కారు. కేవలం
ఆ భూమిపై గల వనరులను వినియోగించుకోవడం, దాని ప్రయోజనాలు పొందడం మాత్రమే
వారు చేయాలి. తమ తరువాతి తరాలకు ఈ భూమిని మరింత మెరుగైన స్థితిలో అప్పచెప్పడం వారి బాధ్యత.'

**- 'పర్యావరణం'పై మార్క్స్**

## కామ్రేడ్ సుబోధ్ మిత్రా, కన్వీనర్, ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ (ఏఐకెఎంకెఎస్)



ప్రియమైన కామ్రేడ్స్, స్నేహితులారా, నేను ఇక్కడ మీ ముందు నిలబడి ఆంధ్రరాష్ట్ర రైతుకూలీ సంఘం వాళ్ళకి ప్రారంభ ఉపన్యాసం ఇవ్వడం చాలా గర్వంగా భావిస్తున్నాను. ఈ సందర్భంలో మనం ఏదైతే ఆలోచిస్తున్నామో, ఈ కామ్రేడ్స్ అందరితోనూ, స్నేహితులతోనూ పంచు కుంటున్నందుకు సంతోషిస్తున్నాను.

మన భారతదేశం విశాలమైన జనసాంద్రత గల దేశం. అందులోను ఎక్కువమంది రైతులు వ్యవసాయం చేసే ప్రాంతం. ఇక్కడ దాదాపు 540 కి పైగా రైతాంగ గిరిజన పోరాటాలు జరిగాయి. ఈ పోరాటాలన్నిటిలోనూ ఒక ప్రధానమైన జమిందారీ వ్యతిరేక, తెలంగాణ నిజాం నవాబు వ్యతిరేక, మిలటరీకి వ్యతిరేకంగా సాగిన పోరాటాలు కీలకమైనవి. వీటిని మనం పదే పదే ప్రస్తావించుకోవాల్సిన అవసరం ఉంది. అట్లాగే ఉత్తర భారతం లోనూ, దక్షిణ భారతదేశంలోనూ అనేక పోరాటాలు సాగినాయి. ఈ పోరాటాలన్నిటిలో కూడా భారతదేశంలో ప్రధానమైన సమస్య అయిన భూమి సమస్య ప్రస్తావించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ పోరాటాలన్నీ కూడా భారతదేశంలో జరగాల్సిన నిజమైన అభివృద్ధి ఏమిటి అనే దాని కోసం చర్చ సాగింది, పోరాటాలు సాగినాయి. అభివృద్ధి అంటే నిజమైన అర్థంలో రైతాంగ అభివృద్ధి, వ్యవసాయ అభివృద్ధిగా వుండాలి, కానీ అట్లా సాగిందా? అప్పటి నుంచి ఇప్పటిదాకా సాగిన పోరాటాలలో పాల్గొన్న రైతులకు నాయకత్వం వహించే వాళ్ళను అణచివేయడం కోసం పాలకుల నిరంకుశ, నిర్బంధ విధానాలను అమలు చేశారు. ఇవి భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలుగా సాగినాయి. భారతదేశంలో ఇవి అణిచివేతకు గురవుతున్న వివిధ ప్రాంతాలలో దోపిడీకి గురవుతున్న అనేక సమస్యల మీద రైతాంగం చేసిన పోరాటాలని మనం గుర్తుచేసుకోవలసిన అవసరం వుంది.

అట్లానే నీలిమందు రైతాంగ తిరుగుబాటు 1859, 1860లో సాగింది. సంతాల్ గిరిజన రైతాంగ తిరుగుబాటు 1855, 1866లో సాగింది. ఈ పోరాటాలన్నిటిని కూడా ఆ కాలంలో సాగిన రైతాంగ, సామాజిక ఉద్యమాలన్నీ కూడా, రైతుకూలీ ఉద్యమానికి సంబంధించిన వీటన్నిటిని కూడా క్రోడీకరించు కోవడానికి, చెప్పుకోవడానికి మన ముందు వున్నాయి. మనం చేసిన రైతుకూలీ పోరాటాల వల్ల, ఉద్యమాల వల్ల స్వామి సహజానంద సరస్వతి నాయకత్వంలో సాగిన పోరాటం కాని, ఇక్కడ సాగిన రైతు రక్షణ యాత్రగానీ ఇవన్నీ కూడా మనకి సామాజిక మార్పు ఏం జరగాలో చూపించినప్పుడు, ఈ సమాజాన్ని వర్గీకరించుకోవాలి అనే చర్చ సాగింది. దాంట్లో భాగంగానే ఈ వ్యవస్థ అర్ధ వలస– అర్ధ భూస్వామ్య వ్యవస్థగా వుంది. 'ఈ వ్యవస్థలో వర్గ పోరాటాలు సాగాయి' అని పదే పదే మనకు గుర్తుకువస్తాయి. వీటన్నిటిని మనం గమనించినప్పుడు అప్పుడు ఎర్రజెండా నాయకత్వాన, సోషలిస్టుల నాయకత్వాన, కిసాన్ సభ ఏదైతే ప్రావెన్సియల్ కిసాన్ సభ 1920లో ఏర్పడిందో దాని నాయకత్వాన, తర్వాత జరిగిన అనేక పోరాటాలు, ఇవన్నీ కూడా కమ్యునిస్టు పార్టీ నాయకత్వాన, సోషలిస్టుల నాయకత్వాన సాగిన పోరాటాలు – వ్యవసాయక విప్లవం అనే ఒక ప్రధానమైన డిమాండ్‌ను మన ముందుకు తెచ్చినాయి. మనకు ఒక కార్యక్రమంగా ఇచ్చినాయి. దాన్ని మనందరం గమనించు కోవాలి. ఇట్లాంటి పోరాటాలు అన్నీ కూడా ఆంధ్రాలోనూ, తెలంగాణాలో సాగిన వాటిలో కీలకమైనవి. ఈ పోరాటాల ద్వారా ఈ అంశం మనకి ఎత్తిచూపుతుంది. దానిని మనం గమనంలోకి తీసుకోవాలి. అట్లాగే పశ్చిమబెంగాల్‌లోనూ, మహారాష్ట్ర లోనూ, కేరళలోనూ అన్ని చోట్ల కూడా ఇదే రకమైన ఉద్యమాలు జరిగినాయి. 5 సంవత్సరాల పాటు సాగిన తెలంగాణా ఉద్యమం, 1967 తర్వాత దేశమంతా కూడా సాగిన వుద్యమాలు ఒక వెల్లువలా సాగాయి. అట్లా సాగిన ఉద్యమం ద్వారా మనకు అనేకరకమైన వెల్లువలతో కూడిన పోరాటాలు ఆంధ్రలోనూ, మిగతా అనేక చోట్ల వచ్చినాయి. వీటన్నిటిని మనం ముందుకు తీసుకుపోయాం. ఇక్కడ ఆంధ్రలో కూడా మనం రైతుకూలీ సంఘం నాయకత్వాన చేసాము. దానిని నేను తప్పనిసరిగా మీ ముందు ప్రస్తావించు కోవాల్సిన అవసరం ఉంది, విశ్లేషించు కోవాల్సిన అవసరం ఉంది. దాని ద్వారా ఒక పద్ధతిగా మనం కార్యక్రమాలను తీసుకోవడానికి ఇట్లాంటి అవకాశాలు ఉన్నాయి.

ప్రియమైన డెలిగేట్ కామ్రేడ్స్, ఈ రోజు మన మీటింగ్ అవుతున్న సందర్భంగా మనం ఆ విషయానికి ప్రాధాన్యతనివ్వాలి. రెండు రోజులు జరిగే మీ సభలలో మీరు చర్చించాలి. దాని ద్వారా మనం అందరం కూడా రైతాంగాన్ని ఒక సహృద్భావ వాతావరణంలోకి తీసుకెళ్ళడానికి, ఆ పోరాటాలనన్నీ తీసుకురావడం కోసం చర్యలు తీసుకోవాలి. మన నాయకుల నాయకత్వాన, మన ఉద్యమ నాయకత్వాన సాగిన పోరాటాలు ఏవైతే ఉన్నాయో వాటన్నిటిని గుర్తుచేసుకోవాలంటే ఈ

సందర్భంగా కామ్రేడ్ కోటయ్య, కామ్రేడ్ మధు, కామ్రేడ్ జశ్వంత్, కామ్రేడ్ కేంద్రుక అర్జున్ ఇటువంటి వారందరిని కూడా మనం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. కోరాపుట్ ఉద్యమాన్ని కూడా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. మనం చేసే ఈ పోరాటాలన్నీ కూడా, మన రైతుకూలీ సంఘం నాయకత్వాన ఆంధ్రాలో సాగుతున్న ఈ పోరాటాలన్నీ కూడా ఇప్పుడున్న పరిస్థితుల్లో అసలు మనం ఏమిటి అనే అందరికీ చర్చకు వస్తుంది. పంజాబ్‌లో జరిగిన పోరాటం ఏదైతే వుందో, ఆ పోరాటాన్ని మనం ఎత్తిపడుతూవున్నాం. ఆ ఎత్తిపడుతున్న పోరాటం ద్వారా, మనం తీసుకోవాల్సిన ఐక్య పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడం, ఐక్య రైతు సంఘాల్ని ఏర్పాటు చేయడం కోసం, అట్లాగే ఆదివాసీ హక్కుల కోసం మనం పోరాటం చేయాల్సిన అవసరాన్ని మనం గుర్తుచేసుకోవాలి.

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఏవైతే ఉన్నాయో ఆదివాసుల్ని అడవుల్నుండి గెంటివేయడం కోసం, కాజేయడం కోసం చేస్తున్న ప్రయత్నాలకి వ్యతిరేకంగా మనం రెండుసార్లు పెద్ద పెద్ద కార్యక్రమాలు తీసుకున్నాము. వీటన్నిటినీ ఎండగట్టడంలో మనం చాలా ముందున్నాము. అట్లాగే గత ప్రభుత్వం చేసిన నిర్ణయాలు ఏవైతే ఉన్నాయో, రైతాంగానికి నష్టం చేకూర్చే నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటం ఏదైతే వుందో దాని స్ఫూర్తితో మనమందరం కూడా ఐక్య రైతు ఉద్యమాన్ని, సంఘటిత ఉద్యమాన్ని తీసుకురావాల్సి వుంది. ఇట్లాంటివాటన్నింటిని కూడా అందరి ముందు చర్చపెట్టి, చర్చించి, ఆలోచనలకు తీసుకువెళ్ళి వీటన్నిటిని తీసుకోవడం ద్వారా మనం గొప్ప కార్యక్రమాల్ని తీసుకోవాలి. కామ్రేడ్స్ అందరికీ విప్లవాభివందనాలు. వ్యవసాయక విప్లవం వర్ధిల్లాలి. ఇంక్విలాబ్ జిందాబాద్.

# అనేకమే అంతిమ సత్యమని

- దర్భశయనం శ్రీనివాసాచార్య

కొండలూ లోయలూ మైదానాలూ
కూడి ఉండడమే అతులిత సౌందర్యం
కొండ కండ కావరంతో లోయను మింగదు
లోయ పైకి వచ్చి మైదానమ్మీద పొంగదు
మణిపురం అందమైన త్రిపురం
కొండల్ని, లోయల్ని, మైదానాల్ని విడగొట్టి
ఒక్కదానికే పెత్తనమివ్వాలనుకోవడం వికారత్వం, అంతకుమించి క్రూరత్వం
ఒకే ఎత్తు ఒకే రంగు ఒకే మందం ఒకే చందం
ఒకే జెండా ఒకే భాష ఒకే యాస ఒకే వేషం
ఒకే చూపు ఒకే భజన ఒకే ఆహారం ఒకే వ్యవహారం
పలు తెరగుల్ని, పలు వైభవాల్ని, పలు వర్ణ కాంతుల్ని అణచో
అదిలించో కుదించో బెదిరించో భస్మం చేసో
ఒకటి, ఒకటి మాత్రమే వర్ధిల్లేలా
శకటాలు కదపడం విషాదం
అంతకుమించి పరమ విధ్వంసం
ఇన్ని నివాస దగ్ధాలు ఇన్ని నగ్నావమానాలు
ఇన్ని వికృత హననాలు ఇన్ని విచ్చలవిడి వీరంగాలు
ఎన్ని వ్యూహ నిశ్శబ్దాలు ఎన్ని నిశ్శబ్ద వ్యూహాలు
అటు సేతువు మెచ్చదు
అటు హిమాలయము హర్షించదు
నడుమన కదలాడే
నానా నడకల నదులూ ఆమోదించవు
ఇది ఎక్కడో దూరపు ఈశాన్యం సంగతి అనుకోవద్దు
రేపు మన ఊరే మణిపురం కావచ్చు!
మనమే కొండలమూ లోయలమూ మైదానాలమూ!
అనేకమే అంతిమ సత్యమని
మన మాటగా ఇవాళే ప్రకటిద్దాం! ★

## శ్రీ పాకలపాటి రఘువర్మ,

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్‌సి



రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రాష్ట్ర మహాసభకు విచ్చేసిన అందరికీ హృదయపూర్వక ఉద్యమ అభినందనలు.

ఈ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో "రైస్ బౌల్ ఆఫ్ ఎ.పి" అంటే అది ఈస్ట్ వెస్ట్ గోదావరి, అటువంటి పవిత్రమైన ప్రాంతంలో ఈ రోజు ఈ మహాసభలను జరుపుకోవటం నిజంగా అభినందనీయం. అలాగే చరిత్ర చూసేటప్పుడు ఏదైనా సరే మనం గమనిస్తే మొట్టమొదట ప్రతి ఒక్కరి నోటంటా వచ్చేది రైతులు దేశానికి, సమాజానికి వెన్నెముక అంటారు. ఏదైనా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టేటప్పుడు మొదట రైతులకు న్యాయం చేస్తామని చెప్తారు. రైతుని ఆదర్శంగా తీసుకుని బడ్జెట్ ప్రవేశపెడతామంటారు. సామాజిక కోణంలో ఆలోచిస్తే రైతులపై కనికరం చూపాల్సినవసరం లేదు, కానీ ఆదుకోవాలి, సమాజానికి అవసరం. మన అందరికీ కళ్లు ఏ విధంగా అవసరమో, రైతు అనేవాడు సమాజానికి అంతే అవసరం. అన్నం పెట్టేవారు రైతులు అనే ఒక మినిమమ్ కాన్సెప్ట్ ఈ పాలకులకు ఎందుకు ఉండదు అని ఈ సభ ద్వారా ప్రప్రథమంగా ప్రశ్నిస్తున్నాను. ఎందుకంటే రైతు పట్ల జాలి చూపడం కాదండి, హక్కులను కల్పించండి. రైతు కష్టపడి సమాజంలో ఉన్న మానవాళికి, అదే విధంగా పశుపక్ష్యాదులకు, జీవులకు అందరికీ అన్నం పెట్టే చెయ్యి రైతులది. అటువంటి దాని గురించి మనమందరం ఆలోచించాలి. కష్టపడి పండించి, మీ కడుపును నింపుతాం అనేటప్పుడు, చట్టం చేసేటువంటి నాయకులు ఎవరూ కూడా మానవతా దృక్పథంతో ఆలోచించే సందర్భాలు ఏవీ నాటి నుంచీ నేటి వరకు కనిపించలేదు. 'మిమ్మల్ని పోషిస్తాం, మిమ్మల్ని ఉద్ధరిస్తాం, సమాజంలో మిమ్మల్ని సక్రమంగా బతికేటట్టు తయారుచేస్తాం మాకు ఒక మంచి చట్టాన్ని తయారు చేయండి' అనేటప్పుడు ప్రాణాలను అర్పించి త్యాగాలు చేయాల్సిన దుస్థితి ఈ పాలకుల దగ్గర మనకు వచ్చింది అంటే, ఆ పాలించే నాయకులు రైతు దగ్గర తలదించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని ఈ సందర్భంగా చెబుతున్నాను. రైతులు ఎన్నో ఉద్యమాలు, ఎన్నో ప్రాణత్యాగాలు చేసారు. కానీ పాలకులు సరైన చట్టాలు చేసి అన్నం పెట్టే రైతుకు అండగా నిలబడిన సందర్భాలు నాటి నుంచి నేటి వరకు కూడా లేకుండా పోతున్నాయి అంటే మన సమాజం ఎటువెళ్తుంది? ఒక్కసారి ఈ కాలగమనంలో పరిశీలిస్తే వ్యవసాయానికి అండగా ఉండవలసిన పశువులను అపారమైన పశు సంపదలను కబేళాలకు నెట్టి మాంసాన్ని విక్రయించే స్థితికి ఈ మానవ సమాజం దిగజారింది అంటే మరి మనం ఏం నేర్చుకుంటున్నాం? సమాజాన్ని ఏం ఉద్ధరిస్తున్నాం, మనల్ని మనమే మోసం చేసుకుంటున్నాం, మనకి మనమే పతన మవుతున్నాం. అపారమైన భూసంపద ఉంది. ఒడిస్సా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో డబ్బున్న భూ బకాసురులు ఒక అరటి తోట పండించాలన్నా, ఒక టమోటా తోట పండించాలన్నా వేలాది ఎకరాలను ప్రభుత్వం వాళ్ళకి ధారదత్తం చేస్తుందంట. అంటే కమర్షియల్ దృష్టితో చూస్తున్నారు తప్ప అన్నం పెట్టే రైతుకి హక్కుని కల్పించి ఆ భూమిని సాగుచేసుకునే అవకాశం కల్పిస్తే రైతు కుటుంబం బతుకుతుంది. ఆ కుటుంబంతో పాటు సమాజాన్ని కూడా ముందుకు తీసుకెళ్ళగలడు, సమాజానికి ఇంత అన్నం పెట్టగలడు అని ఆలోచించి ఆ చట్టాలను ఎందుకు రూపొందించ లేకపోతున్నారో, ఈ స్వార్థం ఎక్కడి నుంచి వస్తుందో?! ఈ వేదిక మీదున్న పెద్దలు ప్రతి ఒక్కరూ ఎన్నో త్యాగాలు చేసి మనలాంటి వాళ్ళందరినీ చైతన్యపరిచి, ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్నారు. రైతు సుఖంగా ఉండడానికి, రైతుకి అండగా మనం నిలబడుదాం, రైతుకి హక్కుల్ని కల్పిద్దాం అని పరితపిస్తూ వాళ్ళలో చేరినటువంటి మీ అందరికీ కూడా మనస్ఫూర్తిగా శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నాను. ఉద్యమం ముఖ్యం, సమాజం ముఖ్యం, పేదవాళ్ళయిన రైతుకి హక్కు కల్పించడం ముఖ్యం అని పాలకులు కళ్ళు తెరిచే వరకు కూడా మన పోరాటం ఆగకూడదు, ముందుకు కొనసాగించాలి అని ఈ సందర్భంగా ఒక డిక్లరేషన్ తయారు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోరాడితే గానీ ఏ ఒక్కటీ కూడా సమాజంలో హక్కుల్ని పొందలేకపోతున్నాం. ప్రాణాలను అర్పిద్దాం, రైతుని రక్షిద్దాం, సామాన్యులను రక్షిద్దాం, రైతులకు అండ దండగా నిలబడదాం అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. సమాజంలో చాలా విషయాలు ఉన్నాయి. సమాజంలో కనీసంగా రైతులకి వెన్నుదన్నుగా నిలువ వలసిన బాధ్యత ప్రతీ ఒక్కరికీ ఉంది. పాలకులు కళ్ళు తెరిచేటంత వరకు, భూ బకాసురులు మన భూముల్ని మనకు అప్పగించేంత వరకు మనం పోరాటం సాగిస్తానే ఉందాం అని తెలియ జేసుకుంటూ ఈ అమూల్యమైన అవకాశాన్ని కల్పించిన మీ అందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియ జేసుకుంటున్నాను.

## శ్రీమతి సంకు మనోరమ,

మహిళా సామాజిక ఉద్యమకారిణి



డాక్టర్ గోపాల కృష్ణయ్య గారికి, రైతాంగ ఉద్యమాన్ని చాలా క్రియాశీలకంగా నడిపిస్తున్న ఝాన్సీ గారికి, ఇతర నాయకులకు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన నాయకులకు, ఇక్కడున్నటువంటి గౌరవనీయులైన మిత్రులకు, కార్యకర్త లందరికీ కూడా హృదయపూర్వకమైన అభినందనలు, నమస్కారాలు తెలియ జేస్తున్నాను.

నేను ఇక్కడ ఉండటానికి కారణం కమ్యూనిస్టు కుదురు నాది. కాబట్టే ఆమె నన్ను ఇక్కడ నిలబెట్టారు. మీరంతా చాలా విషయాలు తెలిసిన వాళ్ళు. నాకు తెలిసిన కొన్ని విషయాలు పాలుపంచు కుంటాను. ఆ మధ్య ప్రధామంత్రి నరేంద్ర మోడీ ఇటలీ వెళ్ళాడు. ఇటలీకి వెళ్ళి ఇది ప్రజాస్వామ్య విజయం కానే కాదు. ప్రజలలో పనిచేస్తామన్న వాళ్ళు, శాసన సభలకు, పార్లమెంట్‌కి వెళ్ళే అవకాశం ఉందా అంటే అవకాశం లేదు. కువైట్‌లో, మంటల్లో కాలిపోయి ఎందుకు చనిపోయారు వాళ్ళు? మన దేశంలో ఉన్న నిరుద్యోగం, ముఖ్యంగా రైతు కుంటుంబాల నుంచి వచ్చిన వారే ఎక్కువగా పనులు దొరకక అనేక దేశ దేశాలు వలస వెళ్ళిపోయారు. ఇజ్రాయిల్‌లో భయంకరంగా యుద్ధాలు జరుగుతున్నా, వాళ్ళంతా ఉపాధి కోసం అప్లికేషన్‌లు పెట్టుకుని ఇజ్రాయిల్‌కి వెళ్ళారు. భయంకరమైన పరిస్థితుల్లో కూడా మన వాళ్ళు వెరవకుండా భుక్తి కోసం వేరే దేశాలకు వెళ్తుంటే మన పాలకులు మాత్రం పెద్ద పెద్ద మాటలు చెప్తున్నారు.

మన పెద్ద నాయకులకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను. నిరుద్యోగం ప్రధానంగా రైతాంగ కుటుంబాల నుంచే వచ్చింది. రైతు పంట గిట్టుబాటు కాక, ఏమైనా సరే పిల్లల్ని వ్యవసాయం చేయనివ్వడంలేదు. వాళ్ళకున్న తృణమో, ఫణమో అమ్ముకుని వాళ్ళ పిల్లల్ని వేరే దగ్గరకు పంపిస్తున్నారు తప్ప, రైతు వ్యవసాయం చేయలేని పరిస్థితిని ఇవాళ మన సమాజం ఎదుర్కొంటుంది. ఇవాళ మోడీ ప్రభుత్వానికి మన రైతాంగ ఉద్యమం ఒక పాఠం చెప్పింది. ఆ రైతాంగ ఉద్యమం ప్రధానంగా నార్త్ ఇండియాలో జరిగిందని మనందరికీ తెలుసు. మొట్టమొదటిసారి మోడీ ఈ 3 నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్న పరిస్థితిని, ఆ రైతాంగ ఉద్యమం కల్పించింది. అలాంటి గొప్ప చారిత్రాత్మకమైన నిరసనను చేసి రైతుల యొక్క శక్తిని నిలబెట్టిన రైతాంగ ఉద్యమాన్ని తప్పకుండా మనం అభినందించాలి. అంతే కాకుండా మన ప్రాంతాలలో కూడా ఆ స్ఫూర్తిని నింపుకుని ఈ రైతు కూలీ సంఘం తప్పకుండా ముందుకు నడుస్తుందనే ఆశాభావంతో నేను ఉన్నాను.

అలాంటి ఉద్యమాన్ని దక్షిణ భారత దేశంలో ఉన్న రాష్ట్రాలలో కూడా అంతే పెద్ద ఎత్తున నడపాల్సిన అవసరం ఉంది. రైతుని బ్రతికించాలి. దేశానికి వెన్నెముక రైతు, అందుకని ప్రధానంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, ఇక్కడున్న వాళ్ళే కాకుండా, వడ్డే శోభనాద్రీశ్వర రావు గారు, ఝాన్సీ గారు, మేమంతా కూడా మధ్యతరగతి రైతాంగ సమస్యలే కాకుండా, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం కూడా ప్రయత్నం చేయడం జరిగింది. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ అనేది ఈ దేశానికి, పేదల కోసం కావాలి, పేదల విముక్తి కోసం, ప్రజాస్వామ్యం కోసం, ప్రజల పరిస్థితి బాగుపడాలంటే మన రాజ్యాంగాన్ని తప్పకుండా కాపాడుకోవాలి. తప్పకుండా కాపాడటానికి హామీ ఇచ్చారు. ఎలక్షన్స్‌లో పూర్తి మెజార్టీ మోడీకి ఇవ్వకుండా చేయటం గొప్ప విజయంగా భావిస్తున్నాను. ఇవాళ రాజ్యాంగం రక్షింపబడింది. లేకపోతే మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేసే వాళ్ళు. 370 సీట్లు వస్తే 23 మెజార్టీతో రాజ్యాంగాన్ని తలకిందులు చేయాలనుకున్న వాళ్ళకొక చెంపదెబ్బ అని చెప్పి మనమంతా గర్వించాలి. ఈ పరిస్థితుల్లో మనం ఇక్కడ రైతు కూలీ సంఘం మహాసభను జరుపుకుంటున్నాం. రైతు కూలీ సంఘం మహాసభ రాబోయే కాలంలో తప్పకుండా రైతాంగ వుద్యమాన్ని ముందుకు నడిపిస్తారనే ఆశ, నమ్మకం కలుగుతున్నది. నేను ఒక్కరి పేరు చెప్పటమని కాదు. ఝాన్సీ గారు మహిళ. అందుకు నేను గర్విస్తున్నాను. ఒక మహిళ ఈ పెద్ద ఉద్యమానికి, పెద్ద పార్టీకి నాయకత్వం వహిస్తుందంటే నేను చాలా గర్విస్తున్నాను. రాబోయే కాలంలో మహిళలు మరింత ముందుకు రావడానికి ఝాన్సీగారు ఒక సూచికగా ఉన్నారని నేను భావిస్తున్నాను. మన మహిళల్ని జాగ్రుతం చేయాలి. మహిళల్ని చైతన్యపరిచి, జాగృతం చేస్తే తప్పకుండా మార్పులు వస్తాయని నేను భావిస్తున్నాను.

అలాగే అధికారంలోకి కొత్త ప్రభుత్వం వచ్చింది. పోలవరం ప్రాజెక్టుని ఎప్పుడు పూర్తి చేస్తారో ఏమో నాకు తెలీదు. నేను పుట్టక ముందు నుంచి కూడా పోలవరం ఉంది. నాకు ఊహ వచ్చినప్పటి నుంచి పోలవరం మీద ఇంట్రెస్ట్ ఉండేది. దానికి కారణం మా నాన్న కమ్యునిస్టు పార్టీ నాయకుడిగా ఉన్నప్పుడు నా చిన్నతనంలో ఎక్కువగా పోలవరం వైపు వెళ్తుండేవాడు. అంతే కాదు ఎలక్షన్‌లో 400 ఓట్లతో ఓడిపోయాడాయన. అది జనరల్ సీటప్పుడు. ఇది ఈ విషయం ఎందుకు చెప్తున్నానంటే, పోలవరం అనేది ఎప్పుడు పూర్తవుతుంది? పూర్తవ్వటానికి ఈ ప్రభుత్వంపై తప్పకుండా ఒత్తిడి తీసుకురావాలి. పోలవరాన్ని 2,3 ఏళ్ళలోనే పూర్తిచేయాలని చెప్పి, మనమంతా ప్రయత్నం చేయాలి, ఉద్యమాలు నడపాలని నేను భావిస్తున్నాను. దీన్ని ఆపటానికి లేదు. ఇదే సరైన సమయం. కేంద్ర ప్రభుత్వం ఇక్కడి రాజకీయశక్తుల మీద ఆధారపడి

ఉంది. అంతే కాకుండా స్టీల్ ప్లాంట్ గురించి ఎవరూ మాట్లాడలేదు. పవన్ కళ్యాణ్ అప్పుడప్పుడూ చెబుతూ ఉన్నాడు. కానీ ఇప్పుడు దాని మీద ఒత్తిడి తీసుకొచ్చి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపటానికి ఇదే సమయం. ఈ శక్తిని కూడా మనం గట్టిగా ఉపయోగించుకోవాలి. స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ఆ రోజు మొదలైనప్పుడు నేను స్టూడెంట్‌గా థెరిస్సా కాలేజ్ ఏలూరులో (బి.ఏ) చదువు తుండగా "విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు" అని మొట్టమొదటిసారిగా నేను ఉద్యమం లోకి వచ్చింది ఈ స్టీల్‌ప్లాంట్ ఉద్యమంతోనే. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నుండి నేటి ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు వరకు ప్రతి ఉద్యమంలో కాస్తో కూస్తో నేను కూడా భాగస్వామినే. అందుకనే స్టీల్ ప్లాంట్‌కు సంబంధించి అక్కడి కలక్టరేట్‌కు శ్రీ కృష్ణ కమీషన్, విభజన జరిగితే ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఏమిటి అని తెలుసుకోవడానికి వచ్చినప్పుడు నేను కూడా వెళ్ళాను. నేను చెప్పిందేమిటంటే, మాకు స్టీల్‌ప్లాంట్ ఒక్కటే ఉంది. చేపలు, రొయ్యల చెరువులు తప్ప మాకు ఏమి లేవు అని చెప్పాను. ఆ ఉన్న ఒక్క స్టీల్‌ప్లాంట్ ఊడగొడతారంట, ఏమిటి దీని అర్థం? లక్షలాది మంది ఉపాధిని పోగొట్టడమే అవుతుంది. పారిశ్రామికంగా ఆంధ్రప్రదేశ్ వెనకబడి ఉంది. ఆ వెనుక బడిన దాంట్లో మిణుకుమిణుకు మంటూ ఉన్న ఆ విశాఖ ఉక్కుని 100% ప్రైవేటీకరణ చేయడానికి పాలకులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాబట్టి విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదం ఆచరణలో అమలు అయ్యేవరకు పోరాడవలసిన బాధ్యత ఈ తరం మీద, మనందరి మీద, ముఖ్యంగా రైతుకూలీ సంఘం మీద ఉందని ఆ నాయకులకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

అలాగే ఒక విషయాన్ని మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాను. మన కృష్ణ, గోదావరి, బేసిన్‌లో ఉన్న సహజ వాయువంతా గుజరాత్‌కే పోతూ ఉంది. మన వాటా ఏమిటి, మన సంగతేమిటి, మనకు అవసరం లేదా? మన రాష్ట్రంలో నుంచి తీసుకెళ్ళి వాళ్ళు బాగుపడుతుంటే మనమంతా మాట్లాడకుండా కూర్చోవాలా? మాది పశ్చిమగోదావరి జిల్లా . మా ఊర్లో మేధావి కలిదిండి భీమరాజు గారు ఉండేవారు. ఆయన చనిపోయారు. ఆయన ఈ సహజవనరులపై ఇవి మనవి, మనకు వాటా రావాలి అని చెప్పి చాలా ఖచ్చితంగా దాన్ని రాశారు. అది పుస్తకాల్లో ఉంది. మీరు గనుక దీన్ని తీసుకుంటే ఝాన్సీ గారికి, ఇతర నాయకులకు విజ్ఞప్తి చేసేదేమిటంటే మన వాటా మనకు కావాలి, దాని కోసం గట్టిగా ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉన్నది. వాటిపై హక్కు ఒక్క గుజరాత్‌కేనా? మనది, మన సొమ్ము, మన సొత్తు అని దాని కోసం కూడా మనం గట్టిగా ప్రయత్నం చేయాలి.

మరొక విషయం ఏమిటంటే ఇటీవల ఉండవల్లి అరుణ్ కుమార్ గారు మాట్లాడుతూ మద్యం విషయాన్ని కూడా మనముందుకు తెచ్చారు. మద్యం అనేది ఇప్పటికీ కూడా తెగడం లేదు. ఎన్ని సంవత్సరాలైనా రాను రానూ తాగటం ఎక్కువయిపోతోంది, పేద ప్రజలు, పేద కుటుంబాలు నాశనమవుతున్నాయి. వాళ్ళు సంపాదించినదంతా మద్యానికే పోతోంది. ఈ ప్రభుత్వాలు ఆ మద్యం ఆదాయం లేకపోతే బతకలేవా? వేరే వేరే ఏమైనా పెట్టుకో, ఎందుకు అని గట్టిగా అడగాలి. ఆనాడు చంద్రబాబునాయుడి పాలనలో బెల్టు షాపులు వచ్చాయి. ఇవాళ మళ్ళీ తిరిగి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాడు. మనం కూడా ఈ విషయాన్ని ముందుకు తీసుకువెళ్ళవలసిన అవసరం ఉంది. ఇది కూడా ప్రజల, పేదల, రైతుల సమస్యే. ఆ పేదల యొక్క ఆరోగ్యం, వాళ్ళ సంసార జీవితం, వారు చిన్న వయసులో చనిపోతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఒకావిడ చెప్పింది, రాబోయే కాలంలో అందరూ వితంతువులే అని. అలాగే కడపజిల్లాలోని అలసినిపల్లి అనే ఊరు వాళ్ళు మేం ప్రభుత్వానికి పన్ను కడతాం, డబ్బు కడతాం, కాబట్టి దీన్ని ఆపండి అని ఆందోళన చేశారు. మనం పేదల పక్షాన పోరాడుతున్నాం కాబట్టి ఈ విషయాన్ని గమనంలోకి తీసుకొని మనం చేయాలి. ఈ ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలి. ప్రజల యొక్క సంక్షేమం ఏమిటి? బియ్యమిస్తే సంక్షేమమా, డబ్బిస్తే సంక్షేమమా, లేకపోతే మరొకటిస్తే సంక్షేమమా. అసలు విషయాన్ని వదిలేసి ఇదంతా కూడా కల్లబొల్లి కబుర్లు చెప్పి ప్రజల్ని మోసం చేస్తున్నారు. ఇది పెద్ద దోపిడీ. ఆ దోపిడీని ఆపడం కోసం తప్పకుండా జాగృతం చేయాల్సిన అవసరం ఉంది అని నేను భావిస్తున్నాను.

హైదారాబాదు సుందరయ్య విజ్ఞాన భవన్‌లో మాడభూషి శ్రీధర్‌గారు రాజ్యాంగ పీఠిక పుస్తకాన్ని రాసి అక్కడ ఆవిష్కరించారు. రాజ్యాంగ పీఠిక, చారిత్రక విషయాలు దాంట్లో చెప్పదలచుకున్నారు. రాజ్యాంగం ఏం చెప్పింది? అందరికీ న్యాయం జరగాలని, స్వేచ్ఛ, సమానత్వం, జాతి ఐక్యత, వ్యక్తి యొక్క గౌరవం నిలబెట్టాలని చెప్పి రాజ్యాంగం చెప్పింది. అందుకనే ఈ మధ్యన మన రాష్ట్రంలో ఝాన్సీ గారు, వద్దే గారు, విజయరావు గారు, ఇతర మిత్రులందరూ కలిసి రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. మేము కూడా దాంట్లో భాగస్వాములం, రాజ్యాంగ పరిరక్షణగాని లేకపోతే తప్పకుండా రాజ్యాంగాన్ని మార్చేసే వాళ్ళు. ఈ రాజ్యాంగాన్ని మార్చడం కుదరదు. మనుధర్మ శాస్త్రం ప్రకారం చట్టాలు అమలు కావాలి అని మంత్రులందరూ చెప్పారు. మోడీ ఎంత కపటమంటే, రాజ్యాంగం నా దైవం అని చెప్పాడు. అంతకు ముందు చెప్పినదానికి, ఇప్పుడు చెప్పిన దానికి పొంతన లేకుండా అన్నీ అబద్ధాలు చెప్తున్న ప్రధానమంత్రిని ఎప్పుడూ, ఎక్కడా కూడా చూడలేదు. ఇది మన దేశం యొక్క పరిస్థితి. వీటన్నిటికీ వ్యతిరేకంగా పేదల యొక్క బాగు కోసం పోరాటమే మార్గం. "పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప" అని కార్ల్‌మార్క్స్ ఎప్పుడో చెప్పారు. పోరాడితే సంకెళ్ళే పోతాయి. అలాంటి గట్టి పోరాటాన్ని నిర్వహిస్తున్న ఈ రైతుకూలీ సంఘం యొక్క నాయకత్వానికి అభినందనలు తెలియ జేస్తున్నాను. మరింత ముందుకెళ్లాలని, మరింత విస్తృత పరచాలని, అన్ని సంఘాలను కలుపుకొని, ఎలా ఐతే నార్త్ ఇండియాలో వాళ్ళు ఉద్యమాన్ని చేసారో, సౌత్ ఇండియాకి ఇది మార్గదర్శి కావాలని, మీ ఉద్యమం మార్గదర్శి కావాలని మనసారా కోరుకుంటూ అభినందిస్తూ నమస్కరిస్తూ ముగిస్తున్నాను.

# కామ్రేడ్ గుర్రం విజయ్ కుమార్,

జాతీయ అధ్యక్షులు, ఏఐఎఫ్‌టియు (న్యూ)



మహాసభలకు అధ్యక్షత వహిస్తున్న కామ్రేడ్ ఝాన్సీ గారికి, ఆహ్వాన సంఘ అధ్యక్షులు డా॥ గోపాల కృష్ణయ్య గారికి, వేదికపైనున్న పెద్దలు, మహాసభలకు వచ్చిన ప్రతినిధులు అందరికీ ఎఐఎఫ్‌టియు(న్యూ) తరపున నా అభివందనలు.

ఈ మహాసభ 3 రోజుల ఎజెండాను సమగ్రంగా చర్చించి సంపూర్ణమైన తీర్మానాలతోటి ఈ మహాసభ విజయవంతం కావాలి అని చెప్పి ఆకాంక్షిస్తూ, నేను రెండు విషయాలు మీ ముందు మాట్లాడాలను కుంటున్నాను. నేను మీ ముందు నిలబడి మాట్లాడేటప్పుడు నేనొక కార్మిక సంస్థకు కార్యకర్తను, నాయకుడిని, కార్మికవర్గ ప్రతినిధిని. భారతదేశంలో అత్యంత హీనమైన జీవితాలు గడుపుతున్నది భారతదేశ రైతాంగం మరియు భూమిపైన ఆధారపడి జీవిస్తున్న ప్రజానీకం. అలాగే అత్యంత నికృష్టమైన దోపిడీకి గురవుతున్నది శ్రమచేస్తున్న వాళ్ళు, శ్రామిక వర్గానికి చెందిన వాళ్ళు. ఈ రెండు వర్గాలు ఘోరమైన అణచివేతకు, పీడనకు గురవుతూ ఈ సమస్యల నుంచి, ఈ వ్యవస్థ నుంచి పరిష్కారం ఏమిటి? విముక్తి ఏమిటి? అనేది నిరంతరం ఆలోచిస్తూ, సతమతమవుతున్న పరిస్థితిని మనం గమనించవచ్చు. అయితే గతంలో పరిపాలన సాగించినవాళ్ళు, సాగిస్తున్న వాళ్ళు ఈ రెండు వర్గాల సమస్యలకు, ఈ రెండు వర్గాలు అనుభవిస్తున్న పీడనలను తొలగించడానికి వాళ్ళు చేపట్టిన కార్యక్రమం, చేపట్టిన పరిష్కారం, చేపట్టిన ప్రణాళిక ఏదీలేదు. వీళ్ళు గత కాలంలో ఎలాంటి పీడనలను, అణచివేతలను అనుభవిస్తున్నారో, ఇప్పటికీ అదే అనుభవిస్తున్నారు కనుక ఈ వ్యవస్థను మార్చుకోవటం, ఈ పీడనలను తొలగించు కోవటం అనే సమస్య ఈ రెండు వర్గాల ముందు తక్షణంగా ఉన్నది.

మోడీ 10 సంవత్సరాల క్రితం పరిపాలన లోకి వచ్చేటప్పుడు భారతజాతి యావత్తు అన్ని వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు తన దగ్గర ఉన్నాయని, ఆ పరిష్కారాలు అమలు జరుపుతామని చెప్పి వచ్చాడు. ఆ పరిష్కారాలు ఎంత వరకు అమలు జరిపాడు అనే విషయాన్ని చూస్తే, ఈ 10 సంవత్సరాల కాలంలో అతను ఇదీ మీ సమస్యలకు నేను చూపెట్టిన పరిష్కారం, అమలు చేసిన పరిష్కారం, వచ్చిన ఫలితమిది అని చెప్పిన పరిస్థితి లేదు. ఈ ఎన్నికల సందర్భంలో ఆయన మొత్తం సమాజాన్ని, ప్రజలను మూఢత్వంలోకి దించటం కోసం దానికి సంబంధించిన చాలా తప్పుడు ప్రచారాలకు పూనుకున్నాడు తప్ప, పరిష్కారాల గురించి ఆయన ఏమీ చెప్పలేదు. కనుక ఈ వ్యవస్థ మారదు. ఈ వ్యవస్థను మార్చే కార్యక్రమం పాలకులకు లేదు. ఈ వ్యవస్థ మారకుండా ఉండే విధంగా పాలకవర్గాలు ప్రస్తుత పరిపాలనను సాగిస్తూ, ప్రజలను నియంత్రిస్తూ ఉన్నారు. కనుక ఇది మనముందున్న అవస్థ. ఈ అవస్థను తొలగించుకోవాలంటే కార్మికవర్గం, రైతాంగం కలగలిసి ఒక నూతన వ్యవస్థను నెలకొల్పటానికి, ఒక ప్రజాతంత్ర వ్యవస్థను నెలకొల్పటానికి, నూతన ప్రజాతంత్ర వ్యవస్థను నెలకొల్పటానికి మనం పూనుకోవటం తప్ప మరొక మార్గం లేదు. అలాంటి వ్యవస్థను నెలకొల్పుకోవటానికి పోరాటం తప్ప మరొక మార్గం లేదు. ఈ విషయం మనం ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. ఈ పది సంవత్సరాల కాలంలో, అంతకు ముందున్న సంవత్సరాల కాలంలోనూ భారత రైతాంగానికి లభించింది ఏమైనా వుంది అంటే అది ఋణ విముక్తి కాదు, ఆ ఋణ ఊబిలో కూరుకుపోవటం అనేది లభించింది. ఇది నేను చెబుతున్న మాటకాదు, ప్రభుత్వాలు చెబుతున్న మాట. మొత్తం సమస్త లెక్కలను సమీకరించి పార్లమెంటు ముందు పెడుతున్న పాలక వర్గాలకు సంబంధించిన ఉపసంఘాలు చెప్పిన మాట, భారతదేశంలో రైతాంగం, ఉత్పత్తి చేస్తున్న వాళ్ళు, సాగుదారులు 92 శాతం ఋణగ్రస్త స్థితిలో మునిగిపోయారు అనేది ప్రభుత్వం చెప్పింది. అయినప్పటికీ ఋణగ్రస్త స్థితి అనేది పరిష్కారం కావట్లేదు. వి.పి సింగ్ కాలం నుంచి ఋణ విముక్తి పథకాలు కొన్ని వస్తున్నాయి. అయినప్పటికీ ఆ సమస్యలు పరిష్కారం కావట్లేదు. అలానే కార్మికవర్గానికి పనికి తగ్గ ప్రతిఫలం ఉండాలి. వారికి అది లభించడం లేదు. ఆ సమస్య పరిష్కారం కావట్లేదు. ఈ రెండు సమస్యలతో పాటు సమాజం ఎదుర్కొంటున్న మరొక సమస్య నిరుద్యోగం. ఇది కూడా పరిష్కారం కావట్లేదు. కనుక మనం అందరం కార్మికవర్గం, రైతాంగం యావత్తు శ్రామిక ప్రజానీకం ఈ వ్యవస్థను మార్చటానికి ప్రస్తుత దోపిడీ వర్గాలను పాలనాధికారం నుంచి తొలగించుకోవటం కోసం మనం ఆలోచన చేయాల్సిన సందర్భంలో ఉన్నాం. తక్షణ సమస్యల పరిష్కారం కోసం కొట్లాడుతూనే, వాటిని సాధిస్తూనే దీర్ఘకాలం మనం ఈ సమస్య పరిష్కారం కోసం ముందుకు సాగిపోవాల్సిన అవసరం ఉంది. దాని కోసం కార్మిక, కర్షక మైత్రిని నెలకొల్పుకోవాల్సిన అవసరం కూడా ఉన్నది. ఈ విషయాలు అన్నింటినీ మీరు ఆలోచించాలని కోరుకుంటూ మీ మహాసభ జయప్రదం కావాలని మరొక్కసారి కోరుతూ మీ అందరికీ అభివందనాలు. సెలవు.

## కా॥ శ్రీకాంత్ మొహంతి,
ఏఐకెఎంకెఎస్ నాయకులు, ఒడిషా




రైతుకూలీ సంఘం అధ్యక్ష వర్గానికి, ఈ మహాసభకు నలుమూలల నుండి వచ్చిన వారందరికీ, అలాగే ఈ మహాసభ విజయవంతం కావాలని ఒరిస్సా చాషీ మూలియా ఆదివాసీ సంఘం తరపున అభినందనలు తెలియజేస్తున్నాను. అదే విధంగా ఈ సభ ఇక్కడ విజయవంతం చేసుకోవటం అనేది, ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభలు విజయవంతం కావటానికి కూడా ఉపయోగపడుతుంది అని నేను మీకు తెలియజేస్తున్నాను. ఈ రోజు మనం మహాసభ జరుకుంటున్న నేపథ్యం ఏమిటంటే, భారతదేశంలోను, ఆంధ్ర రాష్ట్రంలోనూ వ్యవసాయరంగం, రైతులు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారు. గ్రామాల్లో చూస్తుంటే వాళ్ళ కుటుంబాలకి సంబంధించిన యువతీ, యువకులు ఎంతో మంది ఉద్యోగాలు లేక బయటకు వెళ్ళి నానా అవస్థలు పడుతున్నారు. కానీ లెక్కలుగా చూసుకుంటే రోజుకి సుమారు 30 మందిపైనే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

చరిత్రను మనం చూస్తున్నాం. మనందరికీ తెలిసినదే. 1966లో ఇక్కడ సస్య విప్లవం అనే దాన్ని తీసుకొచ్చారు. ఆ సస్య విప్లవాన్ని మన భారతదేశంలోను, ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేసిన ఫలితంగానే చాలామంది పేద రైతులు కూలీలుగా మారిపోయారు. అదే విధంగా పెద్ద పెద్ద బహుళజాతి కంపెనీలన్నీ కూడా ఈ వ్యవసాయరంగానికి సంబంధించిన దాంట్లోకి వచ్చి, మొత్తం ఈ రోజు భారతదేశంలో వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభలోకి పడటానికి ఇవే కారణం అనే విషయం మనకు తెలిసినదే. ఈ రోజు సస్య విప్లవాన్ని పంజాబ్, హర్యానా, ఆంధ్ర ప్రదేశ్‌లోని తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోను ఎక్కడైతే దీన్ని అమలు చేసారో అక్కడ రైతాంగానికి సంక్షోభం తీవ్రమైంది, ఆత్మహత్యలు పెరిగి పోయాయి. మరో ప్రక్కన సామ్రాజ్యవాదుల యొక్క కనుసన్నల్లో తీసుకువచ్చిన ఈ సస్య విప్లవం ఇక్కడున్న బహుళజాతి సంస్థలకు పెద్ద ఎత్తున లాభాలు చేకూర్చే విధంగా ఉంది. కనుకే ఈ రంగంలో ఉన్న సంక్షోభం మొత్తం వ్యవసాయదారుల జీవితాలన్నింటినీ అతలాకుతలం చేసిన పరిస్థితి ఉంది. భారతదేశం మొత్తం మీద సంయుక్త కిసాన్ మోర్చా తరపున రైతాంగానికి మద్దతు ధర కావాలి అంటే సి2+50 అనే ఫార్ములా మీద మద్దతు ధర కావాలి అని చెప్పి భారతదేశంలో వివిధ ప్రాంతాలలో రైతాంగం ఉద్యమిస్తున్న విషయం తెలిసినదే. మరి దీనికి ముందు అనేక రకాల రైతు సంఘాలు, రైతుకూలీ సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు, ఎవరైనా సరే దున్నేవానికే భూమి కావాలి, దున్ను కోవటానికి కావలిసిన అనేక సదుపాయాలను ఈ పాలకవర్గాలు వారికి అందించాలి, అప్పుడే రైతు యొక్క సమస్య పరిష్కార మవుతుంది అని చెప్పి అనేక ఆందోళనలు చేసిన చరిత్ర ఉంది. ప్రస్తుతం భారతదేశంలో ఈ సంయుక్త కిసాన్ మోర్చా తరపున మద్దతు ధర కావాలి అని చెప్పి జరుగుతున్న ఆందోళనను మరింత ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉంది. ఈ రోజు మనం భారతదేశంలో చూస్తుంటే నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత రైతాంగానికి కావల్సిన మద్దతు ధర గాని, గిట్టుబాటు ధరగాని లేకుండా కేవలం కంపెనీలకు రావాల్సిన లాభాలు కల్పిస్తూ, వాళ్ళకు సమకూర్చే పద్ధతుల్లో కంపెనీ వ్యవసాయాన్ని, కార్పోరేట్ వ్యవసాయాన్ని, వాళ్ళకు కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తూ, వాళ్ళకు పూర్తి లాభాలను చేకూర్చి పెట్టే విధంగా ఈ రోజు మోడీ ప్రభుత్వం ఉంది అనే విషయం మనందరం గమనిస్తూ ఉన్నాం. మనం ఒక విషయం గమనించు కోవాల్సి ఉంటుంది. అది నరేంద్రమోడీ రైతాంగానికి ఏం చేస్తున్నాడు అనే విషయం చూస్తే, ఇటీవల ఈ 7,8 నెలల్లో వేల కోట్ల రూపాయలు రైతుబంధు, రైతు భరోసాపై ఖర్చు పెడుతున్నామని చెబుతున్నారు. మరొక ప్రక్క సబ్సిడీల రూపంలో అనే దాని కింద వాటిని పెద్ద పెద్ద కార్పోరేటు కంపెనీలకు ఇచ్చాడు. ఆ మూడు నల్ల చట్టాలు ఏవైతే తీసుకొచ్చాడో వాటికి వ్యతిరేకంగా 2020 నవంబరు నుంచి ఢిల్లీలో రైతాంగం చేసిన ఆందోళనకు సంబంధించిన విషయాల్లో ఇప్పటి వరకు ఆ మూడు నల్ల చట్టాలను రద్దు చేసుకున్నప్పటికీ కూడా వాటి యొక్క పరిస్థితి ఏంటి, రైతాంగానికి రావలిసినదేమిటి, కార్పోరేటు కంపెనీలని ఏ విధంగా అదుపు చేయాలని లేకుండా, మొత్తం రైతాంగాన్ని అంతా పక్కన పెట్టివేసి, కార్పోరేటు కంపెనీలకు అందిస్తున్న విషయాన్నే మనం నరేంద్ర మోడీ ప్రభుత్వంలో చూస్తూ ఉన్నాం.

పెద్ద పెద్ద కార్పోరేటు కంపెనీలన్నింటికీ కూడా బ్యాంకుల ద్వారా చాలా తక్కువ రేటుకే వాళ్లకి రుణాలు ఇస్తున్నది. మరో ప్రక్కన రైతాంగానికి సంబంధించిన దాంట్లో ఎక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నాయి. ఉదాహరణకు ట్రాక్టర్లు గాని, వ్యవసాయానికి సంబంధించిన పరికరాలన్నింటి మీద 30 శాతం పైన కార్పోరేటు సంస్థలకు ఇస్తున్నది, రైతాంగానికి మాత్రం ఏమీ కనీసం ఇవ్వని పరిస్థితిని చూస్తున్నాం. ఈ రోజు మోడీ ప్రభుత్వం చేస్తున్న పనులు కార్పోరేట్లకు అనుకూలంగా ఇవన్నీ చేసుకుంటూ పోతుంటే, రైతాంగం పరిస్థితి రోజు రోజుకీ కునారిల్లిపోతుంది అనే విషయం మనం చూస్తున్నాం. నరేంద్రమోడీ అనుసరిస్తున్నది ఏమిటంటే భూసంస్కరణలకు సంబంధించిన విషయాలన్నీ కూడా ఎత్తివేసి, కార్పోరేటు కంపెనీలకు వ్యవసాయం పేరుతోటి వాళ్ళకి ఇస్తున్నాడు. మరో ప్రక్కన ఒరిస్సాలోని ఏజెన్సీలో 2/56 అనే చట్టం ఒకటుంది. ఆ చట్టాన్ని రద్దు చేసి అక్కడున్న భూముల

న్నింటినీ ఆదివాసీల వద్ద నుండి లాక్కుని కార్పోరేటు కంపెనీలకు ఇస్తున్న పరిస్థితి ఉంది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీలోని 1/70 చట్టం ఉంది. ఈ చట్టాన్ని కూడా పక్కన పెట్టి ఈ రోజు మొత్తం ఇక్కడి భూముల్ని, అడవిలో ఉండే సంపదనంతటినీ కూడా కార్పోరేటు సంస్థలకు అప్పజెప్పటానికి కావలిసిన దారులన్నీంటిని నరేంద్ర మోడీ వేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో గాని, ఒరిస్సాలో గాని, మొత్తం ఏజెన్సీ ఏరియాల్లో ఉండే పెద్ద పెద్ద ఖనిజ సంపదలన్నింటినీ కార్పోరేటు సంస్థలకు అప్పజెప్పుతున్నాడు. వాళ్లందరూ టాటా, బిర్లాలు, అదానీ, అంబానీలు లైన్లలో నిలబడి అక్కడున్నటువంటి సంపదను తరలించుకుపోయే పరిస్థితి. అది మాకు కావాలంటే మాకు కావాలనే పరిస్థితుల్లో ఉన్నారు. మోడీ మొత్తం వాళ్లకు అనుకూలంగా చూస్తూ ఇక్కడున్న ఆదీవాసీలను, రైతుల్ని, గిరిజనుల్ని అందరినీ వలసకూలీలుగా మార్చే పరిస్థితి ఈ రోజు ఒరిస్సాలోనూ, ఆంధ్రలోనూ సాగుతోంది.

మనం చూస్తూ ఉంటే మొత్తం ఈ పాలకులు సామ్రాజ్యవాదులకు, పెట్టుబడి దారులకి ఈ సంపదను ఇచ్చేసి, భూములున్న వారి నుంచి భూములులేని వారిగా భూమి నుండి గెంటివేసి, భూమి హీనులుగా మార్చివేస్తున్న పరిస్థితి ఉంది. దేశంలో ఉన్న సంపదనంతా కూడా వాళ్ళే దోచుకుపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మనం దున్నేవానికే భూమి, ఎవరైతే వ్యవసాయం చేస్తున్నారో ఆ వ్యవసాయాన్ని పరిరక్షించటం కోసం కావాల్సిన పరిస్థితుల్లో పెద్ద ఎత్తున ఆంధ్రప్రదేశ్ లోనూ, ఒరిస్సా లోనూ, భారతదేశంలో ఉన్న ఇతర రాష్ట్రాలలో కూడా ఈ సంఘాలను మనం పెట్టి ఈ సామ్రాజ్య వాదుల దోపిడీ, ఈ పెట్టుబడిదారుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా, ఈ సంపదల మీద, భూమి మీద పేదవాళ్ళు ఎవరైతే శ్రమిస్తున్నారో వాళ్ళకే కావాలి, చెందాలి అనే పద్ధతుల్లో మనం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించాల్సిన అవసరం మన చాషీ మూలియా ఆదివాసీ సంఘం, ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సంఘం తరపున బాధ్యత మనకున్నది. సంక్లిష్టమైన పరిస్థితుల్లో మనం ఉన్నాం. కనుక మనం మన ఉద్యమాన్ని ఈ సామ్రాజ్యవాదులకు, దోపిడీదారులకు వ్యతిరేకంగా తీవ్రతరం చేయాల్సిన పరిస్థితి ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ తరపున మనం చేయాల్సి ఉంది. కనుక మనమందరం కూడా ఆ ఉద్యమానికి ముందుకు రావలిసిన, ఉద్యమించాల్సిన పరిస్థితి, కర్తవ్యం మన ముందు ఉందనే విషయాన్ని మీకు తెలియజేస్తూ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

## శ్రీ చాగనూరు మల్లిఖార్జున రెడ్డి

**అడ్వకేట్ మరియు ప్రజాతంత్రవాది, కర్ణాటక**



పెద్దలారా! మరియు అక్కచెల్లెలారా అందరికీ అభివందనాలు. వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్యవాదుల కబంధహస్తాల నుండి రక్షించడం ఎలా అని మనం అందరం మాట్లాడుతూ ఉన్నాం. వ్యవసాయ రంగం ఎలా ఉంది అంటే ఈ రోజున ఏలూరు రాష్ట్ర మహాసభలకు పాల్గొనడానికి మేము ప్రొద్దున్నే ఐదున్నరకు ట్రైన్ దిగుతూనే ఉక్కపోత వేసింది. మా బళ్ళారిలో కాస్త చల్లగా ఉంటుంది. కానీ ఇక్కడ ఐదున్నరకే ఇంత ఉక్కపోస్తుంది ఏంటి, తరవాత ఈ వేదిక కూడా విపరీతమైన ఉక్కపోత. మనిషికి నెమ్మదే లేదు ఇక్కడ. మరి అలాంటి పరిస్థితి మన రైతాంగం ఈ రోజు ఎదుర్కొంటోంది. యీ ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి, రైతులకు ఏమైనా సహాయం చేస్తున్నారా, రైతులకు అనుగుణంగా ఏమైనా పాలసీలను రూపొందిస్తున్నారా? లేదా? అనేది గత 75 సంవత్సరాలుగా మనం మాట్లాడుతున్నాము. ఈ రోజుకి కూడా మనం మాట్లాడుతున్నాము. సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రైతాంగానికి పరిష్కారం చూపించగలిగే విధంగా నేటి పాలకులు లేరు. రైతుల పేర్లు చెప్పుకుని ఈ రోజు అందరూ అధికారాన్ని అనుభవిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల జరిగిన పార్లమెంటు ఎలక్షన్స్‌లో మా రాష్ట్రం నుంచి మాజీ ప్రధాని దేవగౌడ కుమారుడు కుమారస్వామి ఉక్కు పరిశ్రమల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసాడు. చేసిన రెండు రోజులలోనే ఇక్కడ మీ అటవీ ప్రాంతాలు ఎలాగో, మాకు అక్కడ బళ్ళారి పీడిత ప్రదేశం. అక్కడ ఊటీలాంటి సందూరు అనే ప్రదేశం ఉంది. ఆ సందూరులో విపరీతమైన ఇనుప ఖనిజాలు ఉన్నాయి. ప్రపంచంలో శ్రేష్టమైన 60 శాతం ఖనిజం ఎక్కడ దొరుకుతుంది అంటే అది మా బళ్ళారి జిల్లా సందూరులో మాత్రమే దొరుకుతుంది.

ఆ అటవీ ప్రాంతం ఎన్నో వేల చెట్లతో సస్యశ్యామలంగా, మూలికల వనంగా అభివృద్ధి చెందిన ప్రాంతము. అలాంటి ప్రాంతానికి మన కుమారస్వామి ఎప్పుడూ ఇలా చెప్తూ ఉంటాడు, మండిన మగ అని, కన్నడలో మండిన మగ అంటే నేను మట్టి కొడుకును, భూమి పుత్రుడిని అని ఎప్పుడూ విర్రవీగుతూ ఉంటాడు. అదే అధికారంలోకి వచ్చిన నాలుగురోజుల్లోనే ఉక్కు పరిశ్రమ శాఖా మంత్రిగా సందూరును సర్వనాశనం చేసే విధంగా ఈ రోజు ఐరన్ స్టీల్స్‌కు ఎన్నో ఎకరాలు ధారాదత్తం చేసాడు. అలాగే జిందాల్ కంపెనీలకు కూడా భూమిని ఇచ్చారు. దీని వలన దాదాపు 150 ఎకరాల ప్రాంతంలో సుమారు 24,900 చెట్లను నరికివేయాల్సి వచ్చింది. అటవీ సంపదను నాశనం చేశారు. నేను భూమి పుత్రుడిని, మట్టి కొడుకును అని చెప్పుకునే కుమార స్వామి అధికారానికి వచ్చిన వెంటనే ఎలాంటి పనులు చేసారన్నది మనకు

కళ్ళారా కనిపిస్తుంది. అలాగే మన ఆహ్వాన సంఘం అధ్యక్షుల వారు ఇచ్చిన ఉపన్యాసాల్లో చెప్పారు. ఇక్కడి నుంచి మద్రాసు వరకు రైతు యాత్ర జరిగింది. రైతు ఋణాల కోసం ఎన్నెన్నో కష్టాలు ఓర్చి ఆ ప్రభుత్వాలను డిమాండ్ చేసారు అనేది. అలాగే కర్ణాటకలో కూడా కర్ణాటక రాజ్య రైతు సంఘం ఆధ్వర్యంలో కర్ణాటక గ్రామీణ బ్యాంక్ అనుసరిస్తున్న విధానాలకు విరుద్ధంగా 2 సంవత్సరాల నుండి నిరంతరాయంగా పోరాటం చేస్తున్నాము. ఆ పోరాట ఫలితమే ఈ రోజు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అని చెప్పి కర్ణాటకలో జరుగుతోంది. చీఫ్ సెక్రటరీ గారు 21వ తారీఖున మా బళ్ళారికి వస్తున్నారు, దాని గురించి మాట్లాడటానికి. అంటే పోరాటాల ద్వారా మాత్రమే ఇవన్నీ సంక్రమిస్తాయని చెప్పడానికి నేను ఈ ఉదాహరణ చెప్తున్నాను. సుమారుగా 2 సంవత్సరాలు పైబడి మా కర్ణాటక రాజ్య రైతు సంఘం పోరాటం చేస్తే ప్రభుత్వంలో కొద్ది కదలిక వచ్చింది, బ్యాంక్‌లో కదలిక వచ్చింది. మార్వాడీల కంటే ఎక్కువ శాతం వడ్డీలు వేసి బ్యాంకులు 3 లక్షలు తీసుకుంటే 30 లక్షల దాక మీ అప్పు అయిందని చెప్పి మీ పొలాలను అమ్మండి, మా అప్పు కట్టండి అనే ధోరణి ఆచరించినప్పుడు మా కర్ణాటక రాజ్య రైతు సంఘం కర్ణాటక అంతా తిరిగి 2 సంవత్సరాల తర్వాత ఒక విజయాన్ని సాధించింది. ఆ విజయాల ఫలితమే ఈ రోజు చీఫ్ సెక్రటరీ మా బళ్ళారి ప్రాంతానికి వస్తున్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అని చెప్పి ఈపాటికే చాలా మంది రైతుల సమస్యలను పరిష్కారం చేసే దిశలో చాలా ఋణాలు అంటే వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌లో 30 లక్షలు కట్టాల్సి ఉంటే 3 లక్షలకే సెటిల్‌మెంట్ చేస్తున్నారు. ఇలాంటి మంచి పనులు కర్ణాటక రాజ్య రైతు సంఘం సాగిస్తూ అది ఒక్కరు కాని, ఇద్దరు కానీ చేస్తే జరిగేది కాదు. ఇలాగ మనం సంఘటిత పరుస్తూ, మనం ఏకమయ్యి చేస్తేనే తప్ప ఈ సమస్యలు పరిష్కారం కావు. దానికే మనమంతా కలిసికట్టుగా మన ఆంధ్ర రైతుకూలీ సంఘ మయితేనేమి, మా కర్ణాటక రాజ్య రైతు సంఘ మయితేనేమి మనమంతా ఎఐకెఎంకెఎస్ నీడన అనుబంధ సంస్థలుగా మనమందరం పనిచేస్తున్నాము. అందరూ కలిసి కట్టుగా పనిచేసి దేశంలో రైతు సమస్యలను పరిష్కరించే దిశగా అడుగువేయాలని కోరుతూ ఈ అవకాశమిచ్చిన పెద్దలకు నమస్కరిస్తూ ముగిస్తున్నాను.

---

విప్లవంలో
కొండలు ఉన్నాయి నదులున్నాయి
సారవంతమైన భూములు ఉన్నాయి
అడవులు ఉన్నాయి సముద్రాలు ఉన్నాయి
సమస్త సంపదలు ఉన్నాయి
మృగాలూ డేగల మీద
ఎక్కుపెట్టిన విల్లమ్ములున్నాయి
భూస్వాములూ దళారీలు
పెట్టుబడిదారులూ సామ్రాజ్యవాదుల పైనా
గురిపెట్టి ఉన్న ఆయుధాలున్నాయి
ప్రతిఘటన ఉంది సాయుధ పోరాటం ఉంది
విప్లవంలో మేధావుల శృతి ఉంది
శ్రామికుల సంగీతముంది
విషాదం మీద పోరాటానికి
ఆనందాన్ని పొందేందుకూ
సౌందర్యాన్ని మొలకెత్తించేందుకు
జీవిత మకరందంలో ముంచెత్తి ఉంచిన
ఆయుధం" విప్లవం"

**- ఛాయరాజ్**

"విప్లవం" నుండి

"పంట పొలంలోని
కలుపు మొక్కల్ని
పెకిలించేయటంలో
ధాన్యానికి పట్టిన
పురుగుల్ని ఏరేయటంలో
సిద్ధహస్తుడతడు;
తన బతుకు పంటను నాశనం చేసే కలుపు మొక్కల్ని
చూస్తూ ఊరుకుంటాడా
తన అస్తిత్వాన్ని కొరుక్కు తినే
కొత్త పురుగులను ఊరికే వదులుతాడా
పదునైన పనిముట్లతో
పంట చేలో వ్యవసాయం చేయటమే కాదు
రోడ్లమీద యుద్ధం చేయటం కూడా తెలుసతనికి
అతడు సేద్యగాడే కాదు
పొలన అదుపు తప్పినప్పుడు
తన ఆకుపచ్చని అస్తిత్వం
మంటగలుస్తున్నప్పుడు
పోరాట యోధుడు కూడా!"

**- చిత్తలూరి**

"పోరాటయోధుడు" నుండి

# బహిరంగ సభ

## కా॥ ఎమ్.ఎస్ నాగరాజు,

రాష్ట్ర కార్యదర్శి, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)



రైతు ఉద్యమాలకు కేంద్రమయినటువంటి ఏలురులో జమీందారీ వ్యవస్థకు, ఈనాందారీ విధానానికి వ్యతిరేకంగా, భూస్వామ్య విధానం రద్దు కావాలని పండించే రైతుకి భూమి దక్కాలని, రైతాంగ సమస్యలను పరిష్కరించాలని 1937లో ఇచ్ఛాపురం నుంచి తడ దాకా సాగించిన చారిత్రాత్మకమైన కొమ్మారెడ్డి సత్యనారాయణ, చలసాని వాసుదేవరావు గార్ల నాయకత్వంలో రైతు రక్షణ యాత్ర సాగింది. కానీ నేటికీ అవే సమస్యలు, అవే విషయాలు మన ముందున్నాయని ప్రారంభ సభలో మాట్లాడుకున్నాం. ఈ దేశంలో ఉన్నటువంటి అర్థవలస, అర్థ భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించటం కోసం వర్గ పోరాటాలను మరింత ముందుకు తీసుకుపోవటం కోసం, రైతు రక్షణ కోసం, రైతు పండించే పంటకు కనీస మద్దతు ధర కోసం, వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపన కోసం, రైతు ఆత్మహత్యలు నివారించడం కోసం ఈ మహాసభను జరుపుకుంటున్నాం. దానిలో భాగంగా ఉదయం ప్రారంభ సభలో రైతుల కష్టాలను, కౌలు రైతుల బాధల్ని, గిరిజనుల కష్టాలను, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను, రైతుకూలీల సమస్యలను తెలియజేశారు. అలాగే వందలాది మంది కళాకారులు పాటల రూపంలోనూ, రేల, కిందిరి, డప్పు నృత్యాల రూపంలోనూ ప్రజల్ని ఉత్తేజ పరిచారు. ఇప్పుడు దేశంలో, రాష్ట్రంలో ఉన్నటువంటి పరిస్థితులను మరొక్కసారి మననం చేసుకుని వివరించుకోవాలి. అట్లాగే ఐక్య పోరాటాల్ని, ఐక్య సంఘాల్ని ఏర్పాటు చేసుకుని ప్రధానంగా ఆ రైతు సమస్యలు ఎట్లా పరిష్కారం చేసుకోవాలి అనే ఆలోచనతో మనం ఈ బహిరంగ సభను నిర్వహించుకుంటున్నాం. ఈ బహిరంగ సభకు వివిధ రాష్ట్రాల నుంచి, రాష్ట్రంలోని రైతు నాయకులు, కార్మిక నాయకులందరూ కూడా ఈ రోజున మాట్లాడటానికి ఈ మీటింగ్‌కు వచ్చారు. కావున ఈ మీటింగ్‌లో చెప్పే విషయలను పరిశీలించి, ప్రజలను మరింత ముందుకు తీసుకెళ్ళటానికి వందలాది మంది గిరిజన, గిరిజనేతర, రైతుకూలీ, రైతాంగ కార్యకర్తలందరూ కృషి చేయాలని తెలియజేస్తున్నాను. ఈ రోజు ప్రారంభ సభలో మన కేంద్ర నాయకులు సుబోధ్ మిత్రా గారు మన అందరి ముందు రైతాంగ సంక్షోభం అనేది ఉంది. ఈ సంక్షోభానికి ఆ రోజు సాగిన పోరాటాలు ఏవైతే ఉన్నాయో, 1929లో సహజానంద సరస్వతి నాయకత్వాన సాగినటువంటి, కొమ్మారెడ్డి సత్యనారాయణ గారి నాయకత్వాన సాగినటువంటి, ఆంధ్ర రాష్ట్రంలో సాగినటువంటి జమీందారీ, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, తెలంగాణ పోరాటాలు ప్రపంచ రైతు కూలీలకు ఆదర్శంగా ఉన్నాయి. ఆనాటి నుంచి ఈనాటి వరకు అవే సమస్యల గురించి చర్చించుకుంటున్నాం. పై పోరాటాలను పంజాబ్ రైతాంగం ఆదర్శంగా తీసుకుని సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వన ఉద్యమిస్తుంది. ఆ ఉద్యమంలో మన రైతుకూలీ సంఘం కూడా ఇతర రైతు సంఘాలతో కలిసి ఒక ప్రముఖ పాత్ర వహిస్తుంది. కావున కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక, దుర్మార్గమైన విధానాలకు వ్యతిరేకంగా చేపడుతున్న పోరాటాలకు, ఉద్యమాలకు ఈ మహాసభను స్ఫూర్తిగా తీసుకుని నాయకత్వం వహించడానికి ముందుకు రావాలి. దానిలో భాగంగా ఇప్పుడు ఈ బహిరంగ సభను నిర్వహించుకుంటున్నాం.

## కా॥ సింహాద్రి ఝాన్సీ,

రాష్ట్ర అధ్యక్షులు, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)



అధ్యక్షా! వేదిక మీదున్న వివిధ ప్రజా సంఘాల నాయకులకు, ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ సంఘ నాయకులకు, ఈ సభకు విచ్చేసిన ప్రజానీకానికి, ఏలురు పట్టణ ప్రజానీకానికి రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) తరపున మొట్టమొదట నా అభినందనలు తెలియజేస్తున్నాను. ఈరోజు మహాసభలో భాగంగా జరుపుకొన్నటువంటి ప్రారంభ సభకు సంబంధించిన విషయాలను కా॥ నాగరాజు గారు మీ ముందుంచారు.

ఈ సభ జరగటానికి గల రాజకీయ నేపథ్యం దేశంలో, రాష్ట్రంలో రైతాంగం చుట్టూ ఉన్న పరిస్థితులను ఒక్కసారి మనం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. ఒక్క విషయం వేము ఆలోచిస్తున్నది,

చెబుతున్నది ఏంటంటే? రైతు కూలీ సమస్య, వ్యవసాయరంగ సమస్య అంటే కేవలం రైతులు, రైతు కూలీలకు, వ్యవసాయ దారులకు సంబంధించిన సమస్య మాత్రమే కాదు. వారికి ప్రధానమైనప్పటికీ కూడా, వ్యవసాయ రంగ సమస్య అనేది సమాజానికి, దేశ ఆర్థిక, రాజకీయ పరిస్థితికి సంబంధించిన విషయం అనేది మొట్టమొదట మనం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే గతంలో జరిగిన రైతు రక్షణ యాత్ర గానీ; భారత, ఆంధ్ర దేశంలో జరిగిన జమీందారీ వ్యతిరేక పోరాటాలు, తెలంగాణ, శ్రీకాకుళ పోరాటాలు, ఏజెన్సీ ఉద్యమాలు వీటన్నింటినీ కనుక మనం గుర్తు చేసుకుంటే తప్పకుండా ఆ ఉద్యమాలు దేశంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఈ పాలకులు ఎటువైపు? పీడితుల వైపు ఉంటున్నారా? లేకపోతే సామ్రాజ్యవాదుల వైపా? ఫ్యూడల్ శక్తులుగా ఉండి సమాజం అంతటినీ కూడా తమ గుప్పిట్లో పెట్టుకోవటానికి ఆ శక్తుల వైపు ఉంటున్నారా అన్న విషయం ఒక చర్చనీయాంశంగాను, ప్రశ్నగానూ వస్తూనే ఉంది.

2017 తరువాత, 2019 నవంబరు నుంచి సంయుక్త కిసాన్ మోర్చా ఉత్తర భారతదేశంలో పంజాబ్, హర్యానాలో ప్రారంభమయిన రైతాంగ సమస్యలకు సంబంధించిన విషయాలను తీసుకుంటే కేంద్రంలో ఉన్న ప్రభుత్వం ఆనాడు మొట్ట మొదట 2019 జూన్‌లో ఒక ఆర్డినెన్స్‌ను పాస్ చేసింది. ఈ ఆర్డినెన్స్ మూడు వ్యవసాయ చట్టాలకు సంబంధించినది. మొదటిది మద్దతు ధర ప్రభుత్వానికి సంబంధంలేదని, రెండవది ఒకే రాజ్యం, ఒకే పద్ధతి క్రింద ఏ మారుమూల ప్రాంతాల్లోనైనా ఉన్న రైతులైనా సరే, తాము పండించిన పంటను మార్కెట్లో ఎక్కడైనా, ఎంతకైనా అమ్ముకోవచ్చు అనే విషయానికి సంబంధించినది. రైతులు దేశం నలుమూలల్లో ఎక్కడన్నా అమ్ముకోవచ్చు అనే దుర్మార్గమైన చట్టాన్ని ఆర్డినెన్స్ రూపంలో కేంద్ర పాలకులు నాడు చేసారు. అదొక్కటే కాదు, మద్దతు ధరకు మాకు సంబంధం లేదు. కానీ రకరకాల పన్నులు, మీరు కట్టాలని చెప్పి ఇదంతా కూడా ప్రజానీకం పేరుతో వాళ్లు చేసిన రకరకాల విన్యాసాలుగానే చూడవలసి ఉంటుంది. గత వ్యవసాయ చట్టాల స్థానంలో ఆ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చారు. ఆర్డినెన్స్ తర్వాత కనీసం వాళ్లు చెప్తున్నటు వంటి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఏ మాత్రం ప్రజాస్వామ్య పద్ధతులు వారి పరిధిలో కూడా ఏమీ పాటించకుండా హఠాత్తుగా 3 నల్ల చట్టాలను తీసుకొచ్చారు. ఆ నల్ల చట్టాలు రైతాంగానికి చాలా అన్యాయమైనవి, వ్యతిరేకమైనవి, సామ్రాజ్యవాదులకు, కార్పొరేట్ సంస్థలకు మాత్రం అనుకూలమైనవి అనేది దేశమంతా గ్రహించింది. దీనికి వ్యతిరేకంగా పంజాబ్, హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్ర నుంచి ప్రారంభమయిన ఉద్యమం మొత్తం దక్షిణ భారతదేశంలో ఉన్న అన్ని ప్రాంతాలకు ఈ ఉద్యమం విస్తరించింది. మోడీ ఈ నల్ల చట్టాలను తేవడానికి ముఖ్య ఉద్దేశ్యము రైతుకి వ్యతిరేకంగా, కార్పొరేట్లకి అనుకూలంగా చేస్తున్న చట్టాలివి అని ఆందోళన చెందిన రైతాంగమంతా ఢిల్లీలో ఉండి ఒక సంవత్సరం కాలంపాటు వర్షాన్ని, ఎండను, చలిని సైతం లెక్కచేయకుండా నిరంతరం అక్కడే ఉండి, ఈ చట్టాలు ఉపసంహరించుకుంటారా, లేదా? వీటిని ఉపసంహరించకపోతే మేము సహించేది లేదు, భరించింది లేదు అని లక్షల మంది రైతులు రోడ్ల మీదకొచ్చి ప్రశ్నించినపుడు, హఠాత్తుగా ఎన్నికల సందర్భంగా మాత్రం మోడీకి గుర్తుకొచ్చింది. తాత్కాలికంగా ఈ నల్ల చట్టాలను రద్దు చేసి, మరింత కొత్త చట్టాలను తీసుకొస్తానని ప్రకటించాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ చట్టం తీసుకురాబోతున్నాడు, మద్దతు ధరకు సంబంధించిన విషయం ఏమిటి? గిట్టుబాటుకు సంబంధించి లక్షలాదిమంది ప్రజలు భారతదేశంలో మోడీకి వ్యతిరేకంగా నువ్వు చేస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలు సరైనవి కావు. ఇవి కేవలం కార్పొరేట్ సంస్థలకు, సామ్రాజ్యవాదులకు అనుకూలమైనవి అని ఎంతోమంది రైతులు, రైతుకూలీలు, మేధావులు ఇంకా ఎంతోమంది ప్రశ్నించినప్పటికీ కూడా ఆగలేదు. అంతటితో ఆగకుండా మళ్లీ సహజ వనరులుగా ఉండేటువంటి అటవీ సంపదను, అడవులను కొల్లగొట్టడం కోసం అటవీ సంరక్షణ సవరణ చట్టం చేసారు. ఈ చట్టం చేయడానికి వీల్లేదు, ఇది పర్యావరణానికి, సంపదకు చాలా నష్టమని ఐఏఎస్ ఆఫీసర్లుందరూ విజ్ఞప్తి చేసారు. ఆ విజ్ఞప్తిని పాలకులు ఏ మాత్రం పట్టించుకోకుండా మేము వీటిన్నింటిని లెక్కచేయం, పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు, సామ్రాజ్యవాదులకు అనుకూలమైన వాళ్ళమే తప్ప మీ గోడు వినిపించుకోము. మీకు ఏమీ చెయ్యం అనే వైఖరిని పదే పదే అవలంబిస్తూ వచ్చారు. మోడీ ఏ విధంగా వీటిని చేస్తున్నాడు? వీటి ప్రధాన ఉద్దేశ్యాలేంటి? అనేది ప్రజలకు అర్థమై, దేశంలో వ్యతిరేకత పెరిగింది. ప్రజాస్వామ్యమని చెప్పుకుంటూ, ఆ ప్రజాస్యామ్య ఎన్నికల తంతులో ఎన్ని డబ్బులు పంచారో, ఎంత సారాను ఏరులుగా పారించారో, ఏం చేస్తున్నారో అనేదంతా మనకి తెలిసినప్పటికీ కూడా ఉత్తర భారతదేశంలో నరేంద్ర మోడీ 400కు పైగా సీట్లు వస్తాయని ఊహించుకున్నాడు. కానీ ఆ వేడి మోడీకి ఎంతోకొంత తగలక తప్పలేదు. ఇది మొత్తం వ్యవసాయరంగానికి సంబంధించిన విషయాల్లో ఒక రైతు కదిలితే అదొక సామాజిక సమస్య తరువాత రాజకీయ సమస్యగా ఎలా మారుతోందో అనేటువంటి విషయాలు గనుక వరుసగా పరిశీలిస్తే మనకర్థమౌతుంది.

అయితే నరేంద్రమోడీ, చంద్రబాబు నాయుడు చెట్టాపట్టాలేసుకుని అధికారం లోకి వచ్చారు. వాళ్ళిద్దరూ పట్టాభిషేకం చేసుకున్న సందర్భంలో కూడా ఈ రైతాంగ చట్టాల గురించి ఏం చేస్తున్నారు అని చెప్పి మన రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రశ్నించలేదు. ఏం చేయబోతున్నాం అనే పద్ధతుల్లో మోడీ నుంచి కూడా ఆ ప్రస్తావన లేకుండా పోయింది. మన రాష్ట్రానికి సంబంధించిన దాంట్లో రాజధాని సమస్య గానీ, విశాఖ ఉక్కుకు సంబంధించిన సమస్య గానీ, పోలవరానికి సంబంధించిన సమస్యగానీ, మిగిలిన ఏ సమస్యలనూ కూడా ప్రస్తావించకుండా కేవలం పథకాలు, నగదు బదిలీ వంటి విషయాల చుట్టూ తిప్పుకుంటూ ప్రజల్ని మరోసారి మాయ చేయటానికి ఈ ప్రభుత్వాలు పూనుకుంటు

న్నారు. రైతాంగానికి కానీ కావాల్సింది రైతు భరోసాలాంటి పథకాలేమీ కాదు. కానీ కేంద్రంలో ఉండేటువంటి నరేంద్రమోడీ, రాష్ట్రంలో ఉన్న చంద్రబాబు నాయుడు ఇంతకు ముందు అధికారంలో ఉన్న పాలకులు అందరూ కలిసి, ఇక్కడున్న వందల ఎకరాల భూములన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు, కార్పొరేట్ వ్యవసాయం, కంపెనీ వ్యవసాయం అనే పద్ధతుల్లో వారి భూములను కబ్జా చేస్తున్నారు. వ్యవసాయరంగంలో అనేక రకాల మార్పులు తీసుకొచ్చి రైతులు, రైతు కూలీలకు భూమి లేకుండా మాయం చేస్తూ వేల ఎకరాల భూములు వాళ్ళ కబంధ హస్తాల్లోకి తీసుకున్నటువంటి పరిస్థితిని ఈ రోజు మనం చూస్తున్నాం. అందుకనే రైతులు, మధ్యతరగతి రైతులు ఎక్కడ సంక్షోభానికి గురయ్యారు? ఎందుకు అప్పుల పాలవుతున్నారు? ఏం చేయాలి? 3 ఎకరాల ఉన్న రైతు జీవన పరిస్థితి ఏమిటి? పోలవరం నిర్వాసితులకు సంబంధించిన సమస్య ఏమిటి? అడవిలో అటవీ సంరక్షణ సవరణ చట్టం కనుక తీసుకునివస్తే గిరిజనుల పరిస్థితి ఏంటి అని వీటన్నింటికీ ప్రజలు ఆందోళన పడుతుంటే, వారి ఆందోళనలకు ఎక్కడా సమాధానం లేదు. ఏం చేయాలో కూడా వాళ్ళ ముందు ఏమీ లేనటువంటి పరిస్థితే మనకు కనిపిస్తుంది. ఈ పాలకుల ముందు ఉన్నది ఒకేఒక్కటి కార్పొరేట్ సంస్థలకు ఏ విధంగా దోచిపెట్టాలి, ఏ విధంగా అప్పులు రద్దు చేయాలి. తక్కువ వడ్డీలకు డబ్బులు ఎలా ఇవ్వాలి అనేదే. రైతాంగానికి సంబంధించిన సమస్యలపై ఏమీ చేయడానికి సిద్ధంగాలేరు అనే విషయం మనకు స్పష్టంగా అర్థమవుతుంది. ఇది మనం అర్థం చేసుకోవడమే కాదు. దేశంలో, రాష్ట్రంలో ఆలోచనాపరులందరూ కూడా వ్యవసాయ రంగాన్ని పాలకులు ఏ విధంగా మింగి వేస్తున్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా ఏ విధంగా చేస్తున్నారు అనే విషయం చాలా స్పష్టంగానే అర్థమవుతుంది. మనం ఏం చేయాలి? ఒక వ్యక్తిగా, సంఘంగా ఏం చేస్తాం? దీని ముందున్న కర్తవ్యాలు ఏమిటి, అనేటువంటి మీద చాలా మంది మేధావులు సభలోకి వచ్చి మాట్లాడారు. రైతులు, కూలీల సమస్యలపై ఏం చర్చించబోతున్నారు, రైతుకూలీ సంఘంగా ఏం చేయబోతున్నారు అనే ఆందోళనతో, ఆవేదనతో మన ముందు మాట్లాడారు.

మనం చర్చకు పెట్టిన అనేక సమస్యల్ని తీసుకొని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులుగా ఉండేటువంటి మాజీ వ్యవసాయ శాఖమంత్రి వడ్డే శోభానాద్రీశ్వరరావు గారు, ఐఏఎస్‌గా రిజైన్ చేసి వి.వి.లక్ష్మీనారాయణ గారు ఆంధ్ర ప్రదేశ్‌లో గానీ, భారతదేశంలో ఉన్న నిరుద్యోగ సమస్యలను, ఇతర సమస్యలను చర్చించటం కోసం ఆ మేధావులందరూ కూడా మన సభకు వస్తున్న విషయం మనం గుర్తు పెట్టుకోవాలి. అందుకని రెండవరోజు జరిగే మహాసభకు ఆలోచించే వాళ్ళందరీ భాగస్వామ్యం కూడా తీసుకొని ఏం చేయాలి? ఈ సమస్య కేవలం వ్యవసాయ కూలీల, రైతుల సమస్యలే కాదు. ఈ సమస్య మొత్తం సమాజానికి సంబంధించినది. కనుక ఈ సమస్యను పరిష్కరించుకోవాలంటే రైతు కూలీలతో కలవాలి. మేధావులు, యువకులు, విద్యార్థులు అందరూ ముందుకు వచ్చి ఏమిటీ ఈ వ్యవసాయరంగ సంక్షోభాన్ని పరిష్కరిస్తారా? లేదా? లేకపోతే మేం ఉద్యమించాల్సిన అవసరం ఉంది. మీ సంగతి ఏమిటి అనే పద్ధతుల్లోనే మన ఉద్యమాలు ఈ పాలకులను ప్రశ్నించాల్సిన వైపుగా ఉండాల్సిన అవసరం ఉంటుంది తప్ప మరొక మార్గం లేదు. కనుక ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలి. ఏవైతే చట్టాలు చేసారో, భూసంస్కరణ, 1/70 చట్టం, భూ గరిష్ట పరిమితి వంటి చట్టాలను తుంగలో తొక్కేసి లక్షల ఎకరాలను కార్పొరేటు కంపెనీలకు ఎలా ఇస్తున్నారు అనే ప్రశ్న మనందరికీ వస్తూనే ఉంది. కనుక వీటన్నింటినీ మనం చర్చించుకోవాలన్నా, ఆలోచించాలన్నా తప్పకుండా ఒక అవగాహన కలిగినటువంటి రైతుకూలీ సంఘంలాంటి సంఘాలు తప్పకుండా ఉండాలి. మన మీద చాలా బరువైనటువంటి కర్తవ్యాన్ని తీసుకెళ్లటం కోసం మేము ఏం చేయాలి, ఏ విధంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. ఎంతమందిని కలుపుకుని వెళ్లాలి అనే పరిస్థితుల్లో వాళ్ళందరినీ చైతన్యవంతులు చేసి ఒక ఉద్యమంవైపు దృష్టి మళ్లించటం కోసం, ఉద్యమంలో వాళ్లందరినీ సమీకరించటం కోసం రైతుకూలీ సంఘంగా అనేక రకాల పద్ధతుల్లో కార్యక్రమాలు మేము చేస్తూ అందులో భాగంగానే ఈ మహాసభను కూడా జరుపుకుంటున్నాం.

ఉమ్మడి పశ్చిమగోదావరికి సంబంధించిన దాంట్లో, ఆ ఏజెన్సీ ఏరియాల్లో రొయ్యలు, చేపల చెరువులు ఉన్నాయి. 1940లో కమ్యూనిస్టు జమీందారు హోత రామ చంద్రమూర్తికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పోరాటం చేసింది. అతను ఇంకా భూములు కలిగి ఉన్నాడు. ప్రజల మీద ఇంకా దాడులు, దౌర్జన్యాలు సాగుతున్నాయి. మా ఉద్యమంగా 1997లో హోత రామ చంద్రమూర్తికి వ్యతిరేకంగా పోరాటం చేసిన దాంట్లో కారం పార్వతి అమరులయ్యారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు మేము అనేక రూపాల్లో నీకు ఈ భూమి మీద హక్కు లేదు. ఆ భూమి ప్రజలదే, ఆ భూమి గిరిజనులదే, వాళ్ళకే చెందుతుంది, మళ్లీ స్వాధీనపర్చుకొని అనుభవిస్తారు అనే నినాదంతో పశ్చిమ గోదావరి జిల్లాలో హోత రామ చంద్రమూర్తికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాం.

అదేవిధంగా తూర్పు, పశ్చిమ గోదావరికి జిల్లాలకు సంబంధించిన దాంట్లో పోలవరం ప్రాజెక్టు అనేది అందరికీ తెలిసిందే. ప్రాజెక్టు ఒక ఎత్తు అయితే, ప్రాజెక్టుకు సంబంధించిన పునరావాసం అనేది ఇంకా పెద్ద సమస్య. సుమారు 5 లక్షలమంది గిరిజనులు, గిరిజనేతర పేదలందరూ పునరావాసానికి బలయ్యారు. ఇప్పటివరకు ఈ పాలకులు నూటికి 80 శాతం మందికి కూడ పునరావాసం కల్పించలేని పరిస్థితి. ప్రభుత్వాలు ఎన్ని మారినా ప్రశ్న ఒక్కటే. మొట్టమొదట పునరావాసానికి సంబంధించిన దాంట్లో గిరిజనులకు చెల్లించవలసిన డబ్బులు, భూమికి భూమి ఇవ్వాల్సిందే, గిరిజనులను అడవి నుంచి గెంటివేయడానికి వీల్లేదు. గిరిజనులు సమాజం కోసం వాళ్లు ఉన్నటు వంటి ఇళ్లు, వాకిలి అన్నీ వదిలేసుకుని వస్తే వాళ్లని భిక్షగాళ్ళుగా మార్చేటువంటి హక్కు

మీకు ఎక్కడ ఉందనేదే మన ప్రశ్న. కనుక సరైన పునరావాసానికి, మద్దతు ధరకు, ఇంకా అనేక రైతాంగ సమస్యలకు పరిష్కారం కావాలి తప్ప. రైతు భరోసా, నగదు బదిలీ పథకాలతో ఈ సమస్యలు ఏవీ పరిష్కారం కావు. ఈ సమస్యల పరిష్కారం కావాలంటే రైతుకూలీలుగా మనం అందరినీ కలుపుకొని, ప్రజాస్వామిక వాదుల్ని కలుపుకొని ఉద్యమించాల్సిన అవసరం ఉంది. ఇదే మన ముందున్న కర్తవ్యం. ఆ కర్తవ్యంలో భాగంగా ఈ రోజు ఈ మహాసభలను జరుపుకుంటున్నాం. కనుక ఈ మహాసభలకు ఈ ఏలూరులో ఉండే పట్టణవాసులు, అనేక మంది అభ్యుదయవాదులు, ఎంతోమంది మనకు సహకరించారు. వారందరికీ కూడా మేం పేరుపేరునా ధన్యవాదాలు చెబుతూ, ఈ మహాసభను విజయవంతం చేసుకొని అనేక కర్తవ్యాలను ముందుకు తీసుకుని మొత్తం రాష్ట్రమంతా ఉద్యమించాల్సిన అవసరం బాధ్యత మాకు ఉందని తెలియజేస్తూ నేను ముగిస్తున్నాను.

## కా॥ ప్రసాదన్న

ఏఐకెఎంకెఎస్ నాయకులు, తెలంగాణ



అక్కలకు, అన్నలకు అందరికీ నా నమస్కారాలు, ఈ మహాసభలను విజయవంతం చేసుకోవటం కోసం ప్రారంభ సభ జరుపుకోవటం, ర్యాలీలో పాల్గొనటం జరిగింది. రైతు సమస్యల మీద, కర్తవ్యాల గురించి కా॥ ఝాన్సీ గారు ముందు వివరించారు. ముఖ్యంగా ఈ భారతదేశాన్ని అర్ధవలస, అర్ధ భూస్వామ్య దేశంగా ఉందని మనం మొదటి నుంచి చెప్పుకుంటున్నాం. ఈ దేశంలో ప్రధానమైన సమస్య వ్యవసాయ రంగం. భూమి లేకపోవడం అనేది మౌలికమైన సమస్య. ఈ సమస్యల పరిష్కారం కోసం, భూమి, భుక్తి, సమాజ మార్పు కోసం జరిగే ఈ యొక్క పోరాటాన్ని గత 5 దశాబ్దాలుగా ఉద్యమాలు కొనసాగిస్తూ రావడం జరిగింది. అనేక రూపాల్లో ఈ పోరాటాలు కొనసాగు తున్నాయి. అయినప్పటికీ కూడా ఈ రోజుకీ గత 75 సంవత్సరాలుగా ఈ పాలకులు కేంద్రంలోగానీ, రాష్ట్రంలోగానీ ఏ పార్టీ అయినా, ప్రభుత్వామయినా అధికారంలోకి వచ్చినా కూడా ప్రజల యొక్క మౌలిక సమస్యలు పరిష్కరింపబడట్లేదు. ఇప్పటికీ మనం వ్యవసాయం గురించి, వ్యవసాయ సంక్షోభాల, రాజకీయ సంక్షోభాల గురించి, ఆర్థిక సంక్షోభాల గురించి మనం ఇవాళ మాట్లాడుకుంటున్నాం. ఇప్పుడున్న పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు, మన దేశంలోని పెద్ద పెద్ద బడాబాబులకు ఈ పాలకవర్గాలు, ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాళ్ళకు అనుకూలమైన విధానాలను రూపొందించి, ఆ విధానాల అమలు కోసమే పనిచేస్తున్నాయే తప్ప వ్యవసాయ, రైతాంగ, కౌలు రైతుల, కార్మికుల, సమాజంలో ఉన్న అనేక సెక్షన్‌లో ఉన్న ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు? వారి మౌలిక సమస్యలేంటి? వాటి పరిష్కారాలేంటి అనేది పాలకులు ఆలోచించే స్థితిలో లేరు. ఎంతసేపూ ఈ దేశంలో ఉన్న సంపదలను ఎలా మూటగట్టుకొని దోచుకునిపోదామా, సంపదను ఇంకా ఇంకా పోగు చేయాలి అనే వైఖరితో పాలకులు పెద్ద పెద్ద సంస్థలకు చెందినవారు ఉన్నారు. భారతదేశం మొత్తంగా చూసినట్లయితే భూస్వాములు, పెట్టుబడి దారుల, నయా భూస్వాముల చేతుల్లోనే మెజార్టీ భూములు ఉన్నాయి. సంపదంతా వాళ్ళ గుప్పెట్లో పెట్టుకున్న పరిస్థితి ఉంది. నూటికి 90 శాతం మందికి తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఇతర సౌకర్యాలు లేనటువంటి స్థితి ఇప్పటికీ కొనసాగు తుందని మన అందరికీ తెలిసినదే.

మన దేశంలో ఎక్కడ చూసినా కల్తీ అనేది విపరీతంగా కొనసాగుతున్నది. మనం తినే ప్రతి పదార్థంలో, ఆహారంలో కల్తీ అనేది కోకొల్లలుగా ఉంది. ఈ కల్తీని మధ్యవర్తులుగా ఉండే దళారులు చేస్తున్నారు. ఈ కల్తీ అనేది ఆహారం పండించే రైతులు చేస్తున్నారా? చేయట్లేదు. రైతులు స్వచ్ఛమైన పంటలు పండించి అందిస్తున్నపుడు మధ్య దళారులు, ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికారులు కుమ్మక్కయి కల్తీరాయుళ్ళను అరికట్టడంలో పూర్తిగా విఫలం చెందుతున్న పరిస్థితిని చూస్తున్నాం. మరోప్రక్కన విత్తనాలు, ఎరువులు ఏవైతే ఉన్నాయో వీటిని ఒకప్పుడు మన ప్రజలే తయారు చేసుకునేవారు. కానీ వీటిని బహుళజాతి కంపెనీలకు అప్పజెప్పడంతో కల్తీ ఎరువులు, పురుగు మందులు పెరుగుతున్నాయి. కల్తీ అయిన ఉత్పత్తులను పెద్దఎత్తున ధరలు పెంచి అమ్మడం వలన రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. దిగుబడులు తగ్గుతున్నాయి. ఇంకో పక్కన గిట్టుబాటు ధరలేక, పంటలు చేతికి రాక, అకాల వర్షాలు గానీ, అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ప్రభుత్వాలు, రైతులకు కనీసం ఎలాంటి నష్టపరిహారం కూడా చెల్లించకుండా ఎవరిమానాన వాళ్ళను వదిలేసి చోద్యం చూస్తున్నాయి. ఇంకా రైతు, కార్మిక, ఆదివాసీ ప్రజలకు వ్యతిరేకమైన చట్టాలను తీసుకువచ్చి వారి మీద బలవంతంగా రుద్ది దోచుకోవడానికి, దోచిపెట్టడానికి ఈ పాలకవర్గ పార్టీలన్నీ ఒకే దారిలో కొనసాగుతున్నాయి. అందుకనే ఇవాళ దోపిడీకి, అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటాలు చేస్తూ, రైతుల పట్ల, కూలీల, శ్రమజీవుల పట్ల మన పార్టీ వారి మధ్య నిరంతరం ఉండి పనిచేయాల్సిన, మేలుకొల్పాల్సిన, చైతన్యపరచాల్సిన అవసరం ఉంది. ఆ రకంగా మనం ఎదుర్కొంటున్న సమస్యలకు ఉద్యమాలే పరిష్కారం తప్ప మరొక మార్గం లేదని జనంలోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉంది. ఇవాళ రైతుకూలీ సంఘంగానీ, ఇతర సంఘాలుగానీ అందరూ పని చేయాల్సిన

అవసరం ఉంది. అందుకని సరైనటువంటి మార్గంలో, సరైన దిశగా ప్రజల్ని చైతన్యపరిచి, సరైన మార్గంలో పోరాటాలు నిర్మించుకొని ఆ పోరాటంలోనే ఈ సమస్యల పరిష్కారానికి మార్గం ఉందని తెలియజేస్తూ, మనమందరం ఆ దారిలో నడవాలి. ఈ రైతుకూలీ సంఘాన్ని బలోపేతం చేసుకోవడానికి అందరం కంకణం కట్టుకొని జనం మధ్య ఉండి పనిచేయడం ద్వారానే ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలియజేస్తూ నేను మరొక్కసారి మీకందరికీ లాల్‌సలామ్ తెలియజేస్తూ ముగిస్తున్నాను.

## కా॥ అశోక్ బైఠా,

ఏఐకెఎంకెఎస్ నాయకులు, బీహార్



కామ్రేడ్స్, మహాసభలకు విచ్చేసిన అశేష ప్రజలకు, రైతుకూలీ సంఘం నాయకులకు, కార్యకర్తలందరికీ విప్లవాభి వందనాలు. నాకు తెలిసి ఆంధ్రప్రదేశ్‌కి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నూతన ఆర్థిక సరళీకృత విధానాలు అమలుపరచడంతో మన్మోహన్ సింగ్, చంద్రబాబు నాయుడు గురించి దేశంలో, విదేశాల్లోనూ పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అప్పటి నుండి ఆంధ్రాలోనూ, తరువాత ఏర్పడ్డ తెలంగాణాలోనూ ప్రభుత్వాలు మారాయి తప్ప, ప్రజల బ్రతుకులు మారలేదు. తెలుగు రాష్ట్రాల్లో ఏమీ అభివృద్ధి జరగలేదు. 1950 సంపూర్ణ స్వాతంత్ర్యంగా ప్రకటించుకున్నా తరువాత నుండి అధికారాన్ని వెలగబెట్టిన పార్టీలు ప్రజలను వంచించాయి, ద్రోహం చేశాయి. పారిశ్రామిక వేత్తలకు కోట్లాది రూపాయల ఋణాలు ఇచ్చి, భూములు, నీరు, కరెంటు వంటి మౌలిక సదుపాయాలన్నీ ఉచితంగా కల్పించి వారిని ధనవంతులుగా, కోటీశ్వరులుగా, కుబేరులుగా ప్రభుత్వాలు మార్చాయి. పేదరికాన్ని, ఆకలిని అంతం చేస్తామని చెప్పిన పాలకులు నేడు మరింత పేదరికాన్ని, ఆకలి మరింతగా పెంచారు.

కేంద్రంలో, రాష్ట్రంలో వున్న జాతీయ పార్టీలు, రాష్ట్రాల్లో వున్న ప్రాంతీయ, కుల ప్రాతిపదికన ఏర్పడిన పార్టీలన్నీ, మతం పేరుతో ఏర్పడ్డ బిజెపి పార్టీకానీ సంపన్న వర్గాల, దళారీ పెట్టుబడిదారుల, భూస్వాముల ప్రయోజనాలను నెరవేరుస్తూ వస్తున్నాయి. వచ్చినప్పుడు కులం పేరిట, మతం పేరిట ఓట్లను పొంది అధికారాన్ని చేజిక్కించుకొని తిరిగి ప్రజలపైనే స్వారీ చేస్తున్నారు. పేదవాళ్ళపై దమనకాండను, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. మనం ఎన్నికల్లో ఒకరిని ఓడించి అదే వర్గానికి చెందిన మరొక పార్టీని గెలిపిస్తాం. ఈ ఆటను గత 75 సం॥గా మనం చూస్తూనే వున్నాం. ఈ పార్టీలన్నీ ఒక నాణానికి చెందిన రెండు ముఖాలు. ఈ పాలక పార్టీల నుండి మనం ఏమీ ఆశించలేము. అన్నం పెట్టండి, మీరు చేసిన భూసంస్కరణల చట్టాన్ని అమలు చేయండి, ఉపాధి కల్పించండి అని మనం అడిగితే మనపై లాఠీలను, తుపాకీలను ప్రయోగిస్తున్నారు.

పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా వున్నప్పుడు తీసుకొచ్చిన నూతన ఆర్థిక సరళీకృత విధానాలు, గాట్ ఒప్పందాలను, ఆ తరువాత వచ్చిన అటల్ బిహారీ వాజ్‌పేయ్, మన్మోహన్ సింగ్ నుండి నరేంద్ర మోడీ వరకు అనే విధానాలను అమలు చేస్తూ వస్తున్నారు. ఇప్పుడు నరేంద్ర మోడీ మొత్తం దేశాన్నే అమ్మేస్తున్నాడు. ప్రభుత్వరంగ సంస్థలను, ఖనిజాలను ఇంకా అమ్మడానికి ఏవి మిగిలివుంటే వాటన్నిటినీ అమ్మేస్తున్నాడు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులకీ వడ్డీలు కట్టడానికే బడ్జెట్‌లో ఎక్కువ భాగం సరిపోతుంది. మన బడ్జెట్ కంటే అప్పులు ఎక్కువ అవుతున్నాయి. నూతన ఆర్థిక సరళీకృత విధానాలను అమలు చేయవద్దని, ఈ విధానాల వల్ల దేశంలో సంక్షోభం తీవ్రంగా పెరిగిపోతున్నదని కేంద్ర రిజర్వు బ్యాంకు ప్రభుత్వానికి హెచ్చరించినా పాలకులు పట్టించుకోవట్లేదు.

వ్యవసాయ రంగంలో నేడు తీవ్రమైన సంక్షోభం నెలకొనివుంది. వ్యవసాయానికి అయ్యే పెట్టుబడులు ఎక్కువయ్యాయి. రైతులకు గిట్టుబాటు ధర లభించక అప్పుల పాలౌతున్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీ సరిహద్దుల్లో ఒక సంవత్సరంపైగా రైతాంగం పోరాడటంతో, 750 మంది అమరులైతే మోడీ మూడు చట్టాలను రద్దు చేసాడు. కాని రైతాంగం యొక్క ముఖ్యమైన కనీస మద్దతు ధరల చట్టం గురించి మోడీ మాట్లాడటం లేదు. రైతాంగం పండిస్తున్న అన్నిరకాల (వరి, గోధుమ, పత్తి, మొక్కజొన్న, మొ॥) పంటలకు పెడుతున్న పెట్టుబడులకు తగ్గట్టుగా గిట్టుబాటు ధర కల్పించాలి. ఆ వైపుగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టని ఫలితంగా రైతులు అప్పుల పాలౌతున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎస్‌కెఎం నాయకత్వాన గిట్టుబాటు ధరల చట్టం కోసం రైతాంగం పెద్ద పోరాటానికి సిద్ధమౌతున్నారు.

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ యొక్క పొగరు, గర్వాన్ని ప్రజలు ఓడించారు. 400 పైగా సీట్ల వస్తాయని, తిరిగి తమకే ప్రజలు పట్టం కడతారని చేసిన నరేంద్రమోడీకి బుద్ధి చెప్పారు. మోడీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన 272 సీట్లను ఇవ్వకుండా, కూటమి శక్తులతో ప్రభుత్వాన్నే ఏర్పాటు చేసే విధంగా ప్రజలు గుణపాఠం చెప్పారు. నరేంద్రమోడీ నిరంకుశత్వం, దోపిడీ, దౌర్జన్యాలు చెల్లవని ప్రజలు హెచ్చరించారు. ఎవరైనా నిరంకుశ విధానాలు చేపడితే మట్టిలో కలిసిపోవాల్సిందేనని చరిత్ర ఋజువు చేస్తున్నది.

పాలకులు సంస్కరణవాద విధానాల వలలో ప్రజల్ని బంధిస్తున్నారు. ఇందిరా ఆవాస్ యోజన, ఈ ప్రతి మనిషికి కిలో

బియ్యం, పెన్షన్ లాంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారు. ఈ 75 సం॥ కాలంలో ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల వల్ల ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కారం కాలేదు. కష్టపడి పండించే రైతుకు గిట్టుబాటు ధర లభించడం లేదు. వస్తువులను ఉత్పత్తి చేస్తున్న కార్మికుడి యొక్క శ్రమకు తగ్గ వేతనం లభించడం లేదు. ఎప్పుడైతే దున్నే వాడికి భూమి దక్కుతుందో, శ్రమకు తగ్గ వేతనం దొరుకుతుందో, అందరికి పని కల్పించబడుతుందో అప్పటి వరకు పేదరికం, ఆకలి సమస్యలు సమసిపోవు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల చేతుల్లో బందీగా వున్న భూమి కోసం పెద్దఎత్తున పోరాటాన్నీ తీవ్రతరం చేయాల్సి వుంది. పాలకులు చేసిన ప్రజా అనుకుల చట్టాల అమలుకై పోరాడాలి. ప్రభుత్వ అధికార యంత్రాగం సంపన్నవర్గాల ప్రయోజనాలను నెరవేరుస్తూ కమీషన్లు దండుకుంటున్నారు. న్యాయస్థానాలు కూడా సంపన్న వర్గాలకే న్యాయం చేస్తున్నాయి. పేదవాడికి అన్యాయం చేస్తున్నాయి. వీటన్నిటికీ వ్యతిరేకంగా పోరాడి మన హక్కుల్ని సాధించుకోవడం కోసం పెద్దఎత్తున పోరాడాల్సిన అవసరం వుందని తెలియజేస్తూ ముగిస్తున్నాను.

**కా॥ జె.కిషోర్ బాబు,**

రాష్ట్ర కార్యదర్శి, ఏఐఎఫ్‌టియు (న్యూ)



సభకు నమస్కారం, ఇవాళ జరిగిన ప్రదర్శనలో నేను కూడా పాల్గొన్నాను. అక్కడక్కడా షాపు యజమానులు, పట్టణ ప్రజలు అంతా మన ప్రదర్శనను ఒక్కసారిగా ఆశ్చర్యంగా చూసారు. ఎందుకంటే కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడిపోయిందని, ఎర్రజెండా హవా వెనక్కిపోయిందని చెప్పి ప్రచారం బాగా జరుగుతున్న వాతావరణం మధ్య ఇన్ని వేలమంది ఎర్రజెండాలు పుచ్చుకుని ఏలూరు పట్టణంలో ఊరేగింపు జరపడం చూసి కొంతమంది బయటి వాళ్ళు ఆశ్చర్యంతో ఏ ఊరి నుంచి వచ్చారు. మీరంతా ఎందుకు అని అడగడం చూసాను. అంటే ఒక ఉద్యమానికి సంబంధించిన ప్రభావం, ఆలోచన పెరగడానికి ఈ రాష్ట్ర మహాసభల సందర్భంగా జరిగిన ఊరేగింపు చాలా ఉపయోగపడింది. అయితే పాలకులు బిర్యానీ పొట్లాలిచ్చి, ఛార్జీలిచ్చీ, బస్సులు పెట్టి, పనులు మానేసి మీటింగ్‌లు జరుపుతున్న వాతావరణంలో తమంతట తాము చద్దికట్టుకొని తమ ఊర్ల నుంచి బయలుదేరి ఈ మహాసభలకు వచ్చారు. ఎవరో నెడితేనో ఏదో ప్రయోజనాల కోసం తీసుకొస్తే జరుగుతున్న మీటింగ్ కాదిది. వాళ్ళు స్వంత సమస్యల పరిష్కారం కోసం, గ్రామాల్లో తమ సమస్యల పరిష్కారం కోసం సంఘాలు పెట్టుకుని ఆర్గనైజ్ అయ్యే క్రమంలోనే రాష్ట్రంలో నలుమూలల నుంచి ఆ సంఘానికి సంబంధించిన ప్రతినిధులుగా ఈరోజు ఈ మహాసభలకు మీరందరూ కూడా హాజరయ్యారు. అయితే నేను ఈ మహాసభల ప్రచార కృషిలో కొంత తిరిగాను. ఆ తిరిగిన సందర్భంలో మనం రైతుకూలీ సంఘంగా, ఏఐఎఫ్‌టియు (న్యూ)గా ఏ రాజకీయ అంచనాకైతే వచ్చామో, ఏ మార్పు అయితే ఈ దేశంలో జరగాలని కోరుకుంటున్నామో, దానికి సంబంధించిన విషయాలు ఈ ప్రచార క్రమంలో ఇంకాకొన్ని నాకు నిర్ధారణ అయ్యాయి. ఎందుకంటే ప్రచార క్రమంలో మొక్కజొన్న కంపెనీలు కొన్ని తారసపడ్డాయి. స్థానికంగా రైతుల దగ్గర విత్తనం సేకరించి ప్రాసెస్ చేసి మార్కెట్లో అమ్ముతున్నారేమో అని అనుకున్నాం. కానీ వాళ్లు చెప్పిందేమిటంటే మేము ఆడిస్తున్నది మాకోసం, స్థానికంగా ఉండే మా కంపెనీల కోసం కాదు. కార్గిల్‌వాడి కోసం, సింజెంటా కోసం, అట్లాంటా వాడి కోసమని చెప్పారు. ఈ పేర్లన్నీ అమెరికాకు సంబంధించిన విత్తన కంపెనీలు. మన దగ్గర రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన విత్తనాలతో కంపెనీలు ఇక్కడ మనుగడ సాగిస్తున్న పరిస్థితి ఉంది. దూబచెర్లలో జీడిపిక్కల ఫ్యాక్టరీ తగిలింది. ఈ ఫ్యాక్టరీకి దగ్గర్లో పంట ఏమైనా ఉందా అని అడిగాను. ఇక్కడ పంట రాదు. దక్షిణాఫ్రికా నుంచి దిగుమతి చేసుకున్న జీడిపిక్కల్ని మేము ఆడిస్తున్నాం అని చెప్పారు. మినపప్పు కూడా మలేషియా, బర్మా నుంచి వస్తున్న వాటిని ఆడిస్తున్నామని చెప్పారు. అలాగే కృష్ణపట్నం పోర్టు దగ్గర 4, 5 ఫ్యాక్టరీలు వచ్చాయి. ఆ ఫ్యాక్టరీలన్నీ విదేశాల నుంచి క్రూడ్ పామాయిల్‌ను దిగుమతి చేసి ప్రాసెస్ చేసి ప్యాకెట్లలో వేసి మనకు అమ్ముతున్నారు. ఈ జిల్లాలో పామాయిల్ పంట ఉంది. నిజానికి రైతుకు ప్రోత్సాహమిస్తే పామాయిల్ పంట బ్రహ్మాండంగా పండడానికి కావాల్సినంత నేలలు ఉన్నాయి. కానీ ప్రభుత్వం దానికి తోడ్పడకుండా 155 లక్షల కోట్ల రూపాయలు పెట్టి విదేశాల నుంచి మన వంట గదుల్లోకి ప్యాకెట్లను పంపుతున్నారు. మినుములు విదేశాల నుంచి ఈ దేశానికి దిగుమతి కావాలా, జీడిపిక్కలు మన దేశంలో మనం పండించుకోలేమా, అలాగే తిరుమల పాల డైరీకి వెళ్లినప్పుడు వాళ్ళు చెప్పినది స్థానికంగా ఉన్న వాళ్ళు ఈ ఫ్యాక్టరీని నడిపారు. ఇప్పుడిది ఫ్రాన్స్ వాళ్ళ చేతుల్లోకి వెళ్లిందని చెప్పారు. ఈ పాల కంపెనీ కూడా పాల ఉత్పత్తులుగా మార్చే టెక్నాలజీ ఇక్కడున్న పెట్టుబడిదారులకు లేదా, ఈ రంగంలో కూడా ఫ్రాన్స్ వాళ్ళను అనుమతించాలా? అందువల్ల సామ్రాజ్య వాదుల కబంధహస్తాల నుంచి రైతుల్ని, రైతు కూలీలను, వ్యవసాయాన్ని రక్షించుకోవాలని ఈ నినాదంలో ఇది అక్షరాలా అడుగడుగునా ఈ జిల్లాలో నేను చూస్తున్నటువంటి, మాట్లాడిన వాళ్ల ద్వారా నాకు అర్థమైంది. వ్యవసాయం ఎవరి చేతిలో ఉంది? ఎందుకు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు? ఎందుకని పొలాల్లో పని

చేయకుండా పొలాలను పడావుగా పెట్టి ఇతర చిన్నబడ్డీ కొట్టు పెట్టుకొనైనా బతుకుదాం అనే దగ్గరకు రైతు కుటుంబాలు ఎందుకు వచ్చాయి? అంటే పాలకులు వ్యవసాయాన్ని గిట్టుబాటు కాకుండా చేయడానికి, వ్యవసాయానికి ఇవ్వాల్సిన మద్దతు ధర ఇవ్వకుండా చేయడానికి ఒక ప్రభుత్వం నవరత్నాలని, మరొక ప్రభుత్వం సూపర్ సిక్స్‌లని మాయ చేసి, జనాలకి డబ్బులేసి అధికారంలోకి రావడం ఎలా అనేది పాలకుల ఎజెండా ఉంది తప్ప నిజానికి ఈ దేశంలో ఉన్న వ్యవసాయాన్ని నిలబెట్టి ఈ దేశంలో వ్యవసాయాధార పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించి మన కాళ్ళ మీద మనం నిలబడడానికి అటూ కార్మిక వర్గం, రైతాంగం తమకు సంబంధించిన శ్రమశక్తి మీద తమ జీవనం నిబ్బరంగా సాగించు కోగలుగుతాం అనే ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చే స్థితిలో ఈ పాలక పక్షాలేవీ లేవు. అది బిజెపి, వైసిపి, కాంగ్రెస్, టిడిపి వంటి ఈ పాలక పక్షాలన్నీ దోపిడీ తానులో ముక్కలే తప్ప మరొకటి కాదు అని ఎప్పటినుంచో అనుకుంటూ ఉన్నాం. అందువల్ల అడుగడుగునా రోజు రోజుకీ మన చుట్టూ ఉన్న వాతావరణం అంతా కూడా సామ్రాజ్యవాదులకు ఈ దేశాన్ని తాకట్టు పెట్టటానికి, వాళ్ళ దగ్గరి నుంచి అప్పులు తెచ్చుకోవడం ద్వారా ఖజానాను నడిపించుకోవడానికి ఎందుకంటే ఆంధ్ర రాష్ట్రంలో ఈ రోజు 2 లక్షల కోట్ల రూ॥లపై చిలుకు బడ్జెట్ ఉంటే వాళ్ళు చెప్పినట్టుగా 60 వేల కోట్లు సంవత్సరానికి అప్పులకు వడ్డీల కింద శిస్తుల కింద కట్టల్సిన పరిస్థితి ఉందని. ఈ రకంగా ఉంటే వాళ్ళు రోడ్లు ఎప్పుడు వేస్తారు? చదువులేం చెప్తారు? వైద్యం ఏం చేస్తారు? ప్రజల అవసరాలను ఎట్లా తీర్చగలుగుతారు? అందువల్ల మనం ఆ ముఖ్యమంత్రి వస్తేనో, లేదా ప్రధానమంత్రి వస్తేనో సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పి రైతుకూలీ సంఘం ఎఐఎఫ్‌టియు(న్యూ)గా మేము అనుకోవడం లేదు. దోపిడీ పాలకవర్గాల చేతుల్లో నుంచి రైతాంగం, కార్మికవర్గాల చేతుల్లోకి అధికారాన్ని గుంజు కోగలిగినప్పుడే విప్లవం ద్వారా సమూలమైన ఒక మార్పుని తేగలుగుతాం అనే అభిప్రాయంతోటి మనమందరం ఉన్నాం. కలిసి ఉద్యమాలు సాగించడం ద్వారా ఈ దేశంలో ఉన్న దోపిడీ వ్యవస్థను కూలుద్దాం, ఆ రకమైన ప్రయత్నంలో రైతుకూలీ సంఘంతోటి ఎఐఎఫ్‌టియు (న్యూ) చేయి చేయి కలిపి, భుజం భుజం కలిపి పోరాడుతుందని చెబుతూ ఈ అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు.

## కా॥ డి.వర్మ,

రాష్ట్ర సహాయ కార్యదర్శి, రై.కూ.సం (ఆం.ప్ర)



అధ్యక్షులు, వేదిక మీదున్న వివిధ ప్రజాసంఘాల నాయకులు, వేదిక ముందు కూర్చున్న రైతుకూలీ సంఘం, ఇతర సంఘాలకు సంబంధించిన సభ్యులందరికీ ముందుగా అభినందనలు.

పాలకులు మారుతున్నా వ్యవసాయ రంగ సంక్షోభం పెరుగుతూనే ఉంది. రైతు వ్యతిరేక విధానాలు అమలు జరుగుతూనే ఉన్నాయి. రైతు చేతిలో ఈ రోజు వ్యవసాయం లేదు. కంపెనీల చేతుల్లోకి వెళ్ళి పోయింది. అమెరికాలో ఉన్న విత్తన కంపెనీలు, ఎరువుల కంపెనీలు, భారతదేశ వ్యవసాయరంగంలో వస్తున్న సంపదను దోచుకెళ్తున్నటువంటి పరిస్థితుల్లో మనం ఉన్నాం. కనీస మద్దతు ధర చట్టం చేయమని మనం పోరాటం చేస్తున్నాము. అదే సందర్భంలో డబ్ల్యుటిఒ నుండి మనం వైదొలగకుండా, సామ్రాజ్యవాదుల చెర నుండి మనం బయటకురాకుండా ఇవాళ వ్యవసాయరంగ సంక్షోభం నుండి బయటపడే పరిస్థితి లేదు. ఇది ఖచ్చితంగా అందరు ఆలోచించాల్సిన పరిస్థితి. వ్యవసాయరంగాన్ని, రైతులను మేము అధికారంలోకివస్తే వాళ్ల జీవితాలు మార్చేస్తాను అని అనేక వాగ్దానాలు చేసి పదే పదే సార్లు ఎన్నికవుతున్న పాలకులు వ్యవసాయరంగాన్ని నిలువునా ముంచుతున్న అలాగే భారతదేశంలో నిరుద్యోగ సమస్యను పెంచుతూ రోజుకీ ఇంకా పేదరికంలోకి నెట్టడానికి పాలకులు అనుసరిస్తున్న విధానాలే ప్రధాన సమస్యగా ఉంది. దీన్ని అందరం కూడా ఆలోచించి భవిష్యత్తులో మరింత ఈ ఉద్యమాలను తీసుకెళ్లకపోతే మన రైతు మిగలడు, వ్యవసాయం మిగలదు. భారతదేశంలో పేద ప్రజలందరికీ ఆహారం పరిస్థితి లేదు. ఇతర దేశాల మీద ఆధారపడాల్సిన పరిస్థితి రేపు రాబోతూ ఉంది. అందులో భాగంగానే పాలకుల విధానాలు చూస్తూ ఉంటే మనం ఖచ్చితంగా మరింత ఐక్య ఉద్యమాలకు వెళ్లాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఈ మహాసభలు జరుపుకుంటున్నాం. పాలకులు మళ్లీ రాష్ట్రంలోను, కేంద్రంలోను ప్రభుత్వాలు మారినా విధానాల్లో ఏమీ మార్పు ఉండదు. ఆనాడు బాబొస్తే జాబు గ్యారంటీ అని టిడిపి ప్రభుత్వం చెప్పింది. వైఎస్ఆర్ పార్టీ మేం అధికారంలో కొస్తే సంవత్సరానికి లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. మరలా అవే నినాదాలతోటి ప్రస్తుతం మళ్లీ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చారు తప్ప విధానాల పరంగా ఎటువంటి మార్పు జరగటం లేదు. ఈ దేశం ఖచ్చితంగా అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థగా కొనసాగుతూ ఉంది. ఈ వ్యవస్థలను కూలదొయ్యకుండా, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయకుండా ఈ దేశంలో ప్రజల జీవితాలు మారవు అనేటువంటి అవగాహనతోటి మన రైతుకూలీ సంఘం హక్కుల కోసం పని చేస్తుంది. రేపు జరిగే 'వ్యవసాయరంగ సంక్షోభం–పాలకుల విధానాలు' అన్నదానిలో,

4 అంశాల మీద సదస్సు నిర్వహిస్తున్నాం. దానికి కూడా తగిన స్థాయిలో ఏలూరు పట్టణంలో ఉన్న మేధావివర్గం హాజరు కావాలని కోరుతూ ఇంతటితో నేను ముగిస్తున్నాను.

## కా॥ సి.విజయ,

**రాష్ట్ర అధ్యక్షులు, స్త్రీ విముక్తి సంఘటన**



రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభల సందర్భంగా జరుగుతున్న ఈ బహిరంగ సభకు, అధ్యక్షత వహిస్తున్న కా॥ నాగరాజు గారు, వేదికమీదున్న రైతుకూలీ సంఘం నాయకులు, ఇతర ప్రజాసంఘాల వారికి, ఈ బహిరంగ సభకు హాజరయిన రైతులు, రైతు కూలీలకు, ఏలూరు పట్టణ ప్రజానీకానికి అందరికీ కూడా స్త్రీ విముక్తి సంఘటన తరపున ముందుగా విప్లవాభినందనలు తెలియచేస్తున్నాను.

మిత్రులారా! ఏలూరు పట్టణంలో రైతు కూలీ సంఘం ప్రారంభ సభను, ప్రదర్శనను విజయవంతంగా జరుపుకొని, ఈ రోజు ఈ బహిరంగ సభను నిర్వహిస్తున్నది. ముందు జరిగే ప్రతినిధుల సభలో ఉద్యమాలను, పోరాటాల్ని ముందుకు తీసుకు పోవటానికి, రైతు కూలీలను సంఘటితం చేయడానికి ఒక సరైనటువంటి చర్చలు సాగించి, సరైన నిర్ణయాలను తీసుకొని ఈ మహాసభలను సంపూర్తిగా విజయవంతం చేయాలని చెప్పి స్త్రీ విముక్తి సంఘటన తరపున నేను బలంగా ఆకాంక్షిస్తున్నాను.

ఇవాళ రైతులకు సంబంధించిన సమస్య అనగానే, ప్రారంభ సభలో మాట్లాడిన మల్లిఖార్జున రెడ్డిగారు చెప్పిన ఒక ఉక్కపోతలో ఎలా ఉన్నాం మనము అనేటువంటిది. ప్రస్తుతం సరిగ్గా రైతుకున్నటువంటి పరిస్థితి అదే. రైతు వ్యవసాయాన్ని చేయకుండా చేస్తే గిట్టుబాటు కాదు, ఏం చేయాలి అనేది దిక్కుతోచని పరిస్థితి ఇవాళ రైతాంగం ముందు ఉంది. వ్యవసాయంలో నారు పోయటం, విత్తనాలకు దగ్గర నుంచి ప్రతిదీ సమస్యగానే ఉంది. ఇవాళ విత్తనాలకు సంబంధించి మన దేశంలో ఉన్నవారెవరికీ కూడా వాటి మీద అదుపులేదు. మొత్తం సామ్రాజ్యవాద కంపెనీల యొక్క అధీనంలో ఉన్నాయి. పోనీ పూర్తిగా అలాగే ఉన్నాయంటే ఇక్కడ జరిగే కల్తీల మీద కూడా ఇక్కడున్న పాలకులకు గానీ, అధికారులకు ఎవరికీ వాటి మీద అదుపులేదు. కాబట్టి ఇవాళ కేవలం కల్తీ విత్తనాల వలన ఆత్మహత్యలు చేసుకునే రైతాంగం కూడా ఉన్నారు. పంట పండుతుంది. దాని తరువాత సొమ్ము చేసుకుందాం, మన కుటుంబా అవసరాలు తీర్చుకుందాము అనే దశలో అసలు పూర్తిగా ఏమాత్రం దిగుబడి లేకుండా ఊరికే పైరు అలా పెరిగిపోతున్న దశలో అనేకమంది రైతాంగం ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి ఉంది. దీనికి పాలకుల దగ్గర ఏవిధమైన జవాబుదారీతనం అనేది లేదు. ఈరోజు కల్తీ విత్తనాలను అరికట్టగలిగే పరిస్థితి లేదు. అలాగే వ్యవసాయానికి సంబంధించి అన్ని రకాలైన పనుల మీద, ఇంకా వేటిమీద కూడా చెయ్యాలనే చిత్తశుద్ధి ఈ పాలకులకు లేదు. మొత్తంగా ఇవాళ సామ్రాజ్యవాదులకు కల్తీ విత్తనాల, ఎరువుల కంపెనీలకు అనుకూలమైన విధానాలను మాత్రమే అవలంభిస్తున్న పరిస్థితి ఉంది. మరి దీన్ని పర్యవసానాలు ఎవరి మీద ఉంటున్నాయి అని చూస్తే ప్రధానంగా రైతాంగ కుటుంబాలకు సంబంధించిన మహిళలు దీనికి ఎక్కువ బాధితులుగా ఉన్నారనేది కాదనలేని వాస్తవం. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే, ఆ కుటుంబ భారాన్ని మోస్తున్నదెవరు? ఒంటరి మహిళలుగా ఉండి కుటుంబ భారాన్ని మోస్తున్నది మహిళలే. అంటే అప్పటికే ఉన్న అప్పుల భారం, మళ్లీ వ్యవసాయం కోసం అప్పులు చేయాల్సిన అవసరం, పిల్లల్ని పోషించాల్సిన బాధ, ఒంటరిగా ఇవన్నీ సాకటం అనేది సమాజంలో ఒంటరి మహిళల కున్నటువంటి ఒక అభద్రత. ఇవన్నీ వారి జీవితాన్ని ఎలా మారుస్తున్నాయి అనేది కూడా మనం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

అలాగే ప్రారంభసభలో మాట్లాడిన మనోరమ గారు ఒక మాట అన్నారు. మొత్తం మహిళ్ళందరూ వితంతువులయిపోతారు అని అన్నారు. ఎందుకని అని అంటే ఇవాళ అనుసరిస్తున్న మద్యం విధానం ఫలితంగా ఎంతమంది అర్థాయుష్కులు అవుతున్నారు. అనారోగ్యం పాలవుతున్నారు. యాక్సిడెంట్లల బారినపడుతున్నారు, అలాగే చిన్నచిన్న విషయాలకే ఒత్తిడికిలోనయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితి ఉంది. ఇవాళ మద్యం వలన జరుగుతున్నది అని అనేక సర్వేల్లో తేలింది. కానీ పాలకులు ఎందుకని దాని పట్ల సరైన విధానాలను అవలంభించ లేకపోతున్నారు.

ఈ మధ్య జరిగిన ఎన్నికల్లో మొన్నటిదాక ఉన్న ప్రభుత్వం పోయి, కొత్తగా ప్రభుత్వం వచ్చింది. కాబట్టి ఇక బ్రహ్మాండంగా జరుగుతుంది అని కొంతమంది మాట్లాడుతూ ఉన్నారు. కానీ ఇప్పుడు కొత్తగా వచ్చిన ఇదే ప్రభుత్వం ఇంతకుముందు కూడా ఉంది. అప్పుడూ కూడా ప్రజలు దానికి వ్యతిరేకంగా ఓట్లు వేసారు. ఇప్పుడు కూడా గత ప్రభుత్వానికీ వ్యతిరేకంగా ఓట్లు వేసారు. కానీ ఎప్పటికీ కూడా ప్రజల ముందున్న కర్తవ్యం ఒక్కటే. ప్రజలకు సమస్యలు ఉన్నాయి. ఆ సమస్యల మీద పోరాడాల్సిన అవసరం ఉంది. ఇవి మా సమస్యలు మీరు ఏం చేస్తారు అని పాలకుల్ని నిలదీయాల్సిన అవసరం ఉంది. ఇవాళ వచ్చిన కొత్త ప్రభుత్వం దానికంతట అదిగా మొత్తం మన సమస్యల్ని పరిష్కరిస్తుంది అని అనుకుంటే అది మన అమాయకత్వమే అవుతుంది. ఈ పాలకులని మనం నిలదీయాల్సిన అవసరం ఉంది. ఈ మూడు వ్యవసాయ చట్టాలను

కేంద్రప్రభుత్వం చేసినప్పుడు కనీసం వైసిపి, టిడిపి ప్రభుత్వాలు రెండు కూడా వాటిని అసలు వ్యతిరేకించడం చేయనేలేదు. మోడీకి అనుకూలంగా వాళ్ళు ఓటువేసిన పరిస్థితి ఉంది. ఇవాళ రైతాంగం ఎదుర్కొంటున్న ఈ సమస్యల్ని, ఇతర ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల్ని ఈ ప్రభుత్వాలు పరిష్కరిస్తాయని వాటి నుంచి ఆశించలేము. కాబట్టి మన ముందున్న మార్గం ఒక్కటే, మన సమస్యల్ని పాలకుల దృష్టికి తీసుకెళ్లి పాలకుల్ని నిలదీయాల్సిన అవసరం మనకి ఎప్పుడూ ఉంటుంది. కాబట్టి మన సమస్యల పరిష్కారం కోసం పోరాడటం తప్ప మరొక మార్గం లేదు అని తెలియజేస్తూ, ఈ మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ముగిస్తున్నాను.

**కా॥ కుంజం రామారావు,**

జిల్లా నాయకులు, ఏజెన్సీ గిరిజన సంఘం, ఉమ్మడి పశ్చిమగోదావరి



కామేడ్స్! అధ్యక్షా! ఈ రోజు ఏలూరు పట్టణంలో జరుగుతున్న రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా అనేక జిల్లాల నుంచి వచ్చిన నాయకులు, పశ్చిమగోదావరి జిల్లాలో 2 సం॥రాల క్రితం ఆలోచించుకోలేని వాళ్ళు కూడా సమస్య తీవ్రతను బట్టి సమస్యలు పరిష్కారం చేసుకోవటం కోసం వాళ్ళు వచ్చారు. ఎందుకంటే పశ్చిమ గోదావరి ఏజెన్సీ ప్రాంతాల్లో భూమి సమస్య ప్రధానంగా ముందు ఉన్నప్పుడు అనేక మంది అనేక కష్టాలు, ఇబ్బందులు, ఒక పూట తింటే మరోపూట తిండిలేని పరిస్థితి ఉండేది. ఇటువంటి పరిస్థితుల్లో ఉద్యమాల ప్రభావంతోటి భూస్వాములు ఆక్రమించిన భూముల్ని స్వాధీనపరుచుకుని నెమ్మదిగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో, కొంత ఆత్మగౌరవంతో బతుకుతున్న పరిస్థితి నుంచి మరలా 2004లో పోలవరం ప్రాజెక్టు అనేది వచ్చింది. ఈ పోలవరం ప్రాజెక్టు రావడమనేది గిరిజన ప్రాంతాల్లో వారి జీవితాలు మరింత నికృష్టంగా జీవించే పరిస్థితికి నెట్టబడింది. ఎందుకంటే పోలవరం ప్రాజెక్టు అనేది సమగ్ర శాస్త్రీయ పునరావాసం అనేటువంటిది చేయలేదు. చేయకపోగా ప్రజలు వాళ్ళ సమస్యల్ని, సమగ్ర శాస్త్రీయంగా వారు కోరుకున్న ప్రాంతాల్ని ఎన్నుకొని మాట్లాడుకోవటానికి అవకాశమే లేకుండా చేసి, పాలకులు మూకుమ్మడిగా వాళ్ళ కిష్టమైన పద్ధతుల్లో వేరు వేరు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు ఏర్పాటు చేసారు. ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో భూములు తగిన సాగుకు అనుకూలంగా లేవు. అక్కడ గంపగుత్తగా కింద కొన్నారు తప్ప, మన భూములను చూడడానికి అవకాశం లేని పరిస్థితుల్లో కొండలు, రాళ్లు, పనికిరాని భూములను కొనుగోలు చేసారు. మారుతున్న పరిస్థితుల్లో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినప్పుడు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పారు. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చినపుడు కూడా ఇదే మాట చెప్పింది. ఈనాడు టిడిపి ప్రభుత్వం వచ్చినప్పుడు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ ముందు పునరావాసం పూర్తిచేయకుండానే గోదావరికి అడ్డంగా గట్టుపోసి రాష్ట్రంలో ఉన్న ప్రజానీకం ముందు ప్రాజెక్టుని కట్టిస్తున్నటు, మళ్లీ అధికారంలోకి వస్తే పునరావాసం ఇవ్వకుండా తొలగించాలి అనేదాంతో ప్రయత్నం చేశాడు. ఈ సమయంలో వైసిపి ప్రభుత్వం అధికారంల్లోకి వచ్చిన తరువాత స్పెషల్ ఆఫీసర్లను కొంతమందిని నియయంచారు తప్ప, వాళ్ళు కూడా గ్రామాలకు వెళ్లి పరిశీలించి తగిన పునరావాసం గానీ, సమగ్రంగా పరిశీలించడం వంటిదేమీ చేయలేదు. చేయకపోగా 2020, 2021 ఆ ప్రాంతాల్లో వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు పోలవరం ప్రాజెక్టులో నీరు నిలుపుదల చేసి చుట్టూ ఉన్న గ్రామాల్లో ప్రజలు అక్కడ ఉండటానికి అవకాశం లేకుండా వెళ్ళిపోవాల్సిన పరిస్థితి వచ్చింది. మీరు ముందు ఇక్కడ నుంచి వెళ్తే అన్ని సమస్యలు పరిష్కారం చేస్తాం అన్నారు తప్ప, అందరూ వెళ్ళాక పట్టించుకోలేదు. ప్రజలకు నీరు లేవు, సరైన ఇళ్లు, భూములు ఇప్పటికీ లేవు. వైసిపి వెళ్లిపోయి తరువాత టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసిపి గవర్నమెంటును పరీక్షించటమే తప్ప, మీరు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేదు అని ఒకరి మీద ఒకరు పోటీపడి ఉంటున్నారేగానీ, పాత మాటలు తప్ప కొత్త మాటలు మాట్లాడే పరిస్థితి లేదు. ఈ రోజు భూములివ్వలేని చాలా మంది తిరిగి తమ పాత గ్రామాలకు వెళ్లిపోతామన్నవారిని ఫారెస్టు డిపార్టుమెంట్ వారు అడ్డుకొని ఇది నేషనల్ పార్కు కింద మీరు రాసిచ్చారు. కాబట్టి మీరు వెనక్కి రావటానికి, వ్యవసాయం చేయడానికి లేదు అని చెప్తున్నారు. అక్కడి ప్రజలు ఏంటంటే మా బ్రతుకేంటి ? ఏమైనాగానీ చావో రేవో తేల్చుకుంటామని చెప్పి మళ్లీ వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితులు ఇవాళ కనిపిస్తుంది. ఈ పాలకులు గిరిజనులకు భూములివ్వలేదు. నిర్వాసితులకు పూర్తి పునరావాసం ఇవ్వలేదు. కనీసం వారిని పట్టించుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వాలు లేవు. నిన్న వచ్చిన బులిటెన్‌లో అల్లూరి సీతారామరాజు మొట్ట మొదట ఎలాంటి పోరాటాలు చేసాడో, ఇవాళ అటువంటి పోరాటాల స్ఫూర్తిని మనం అందుకొని పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన విషయాలను కూడా ఆ స్ఫూర్తితోటి పోరాడాల్సిన అవసరం ఉందని ఆ బులిటెన్‌లో ఉంది. ఈరోజు సభలో అనేకమంది మన కామ్రేడ్స్ మాట్లాడిన విషయాలన్నీ పరిశీలిస్తే వ్యవసాయ రైతాంగ గానీ, పోలవరం నిర్వాసితులకు గానీ, అడవుల సంబంధించిన విషయాలుగానీ ప్రజలందరూ వాళ్ళ యొక్క హక్కుల్ని వారు నిలబెట్టుకోవటంలో, వాళ్ల జీవన

పరిస్థితులను నిర్దేశించుకోవాల్సిన అవసరం ఉంది తప్ప, ఈ పాలకులు చెప్పేటువంటి మాటలన్నీ వట్టి మోసపూరిత అబద్ధాలు, ఎవరూ కూడా దాన్ని నమ్మడానికి లేదు అని చెప్పి మన కామ్రేడ్స్ అందరూ అనేక విషయాలు మాట్లాడారు. కాబట్టి ఇవాళ ఏలూరు పట్టణంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభ జరుపుకుంటున్నామంటే, మనము మొట్టమొదట నుండి పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన విషయాలను సమగ్రంగా, శాస్త్రీయ పునరావాసం జరిగే విధంగా ఏ విధమైన ఆలోచనలను కలిగిస్తున్నాం అనే విషయాన్ని ఈ ఏలూరు పట్టణంలో చెప్పాల్సిన అవసరం మనకు వచ్చింది. కాబట్టి ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను, దుర్మార్గాలను అర్థం చేసుకొని, కొత్త గ్రామాల నుంచి వచ్చిన కామ్రేడ్స్ అందరూ కూడా మరింత ఐక్యమయ్యి, అందరం కూడా సంఘటితంగా పోరాడాలని, పోరాడుతారు అని చెప్పి ఈ సందర్భంగా తెలియజేస్తూ ముగిస్తున్నాను.

# నీరు

**- చల్లపల్లి స్వరూప రాణి**

నీరు పల్లమెరిగినట్టే
నీరు ఊరికీ వాడకీ మధ్య
తరాల పోరునెరుగు
బావి పళ్ళెం అంచున
ఇగిరిపోని నీటి చెమ్మ లాంటి
అంటరానితనాన్నెరుగు
నీటికి సమస్తమూ తెలుసు
సమరయ స్త్రీకీ యూదుడైన క్రీస్తుకు
మధ్య
జాతి భేధమే కాదు
నాలుకీ తోలుకీ మధ్య
ఉపజాతి భేధమూ తెలుసు
కడివెడు నీరు తోడుకునే హక్కు లేక
శూద్రులొచ్చేదాకా
ఖాళీ బిందెతో
బావి గట్టు వద్ద
పడిగాపులు పడ్డ
పంచమ ఆవేదన తెలుసు
కుండ ఎత్తి దూరంగా నీళ్లు పోసినవాడు
మీది మీది కొచ్చి తాకినప్పుడు
వాడ పిల్ల పొందిన అవమానం తెలుసు
చెరువు నీళ్లు పాడు చెయ్యొద్దని
కమ్మదొరల అహంకారాన్ని
బిందెతో అడ్డుకున్న
కారంచేడు సువార్తమ్మ
ధర్మాగ్రహం తెలుసు
ఈ నీరు యుగయుగాల
సామాజిక దుర్నీతికి
సజీవ సాక్షిగా నిలిచింది
ఈ నీటిని చూసినప్పుడల్లా
గొంతు తడుపుకోడానికి
గుక్కెడు నీళ్ల కోసం
రోజంతా పరితపించిన
మా వాడ గుర్తుకొస్తుంది
మాకు నీరంటే హెచ్2ఓ మాత్రమే కాదు
మాకు నీరంటే మహోద్యమం
మహద్ చెరువు పోరాటం
నీటి బొట్టంటే
జన్మజన్మల కన్నీటి వూట
ఒకే ఒక్క నీటి బొట్టు కోసం
మేం చేసిన యుద్ధాల్లో
రక్తం ఏరులై పారింది గానీ
నీటి చెలమ మాత్రం మాకు దక్కలేదు
ఈ నీటిని చూసినప్పుడు
ఊళ్లో వాళ్లు రెండు పూటలా
ఒంటారా స్నానం చేస్తే
మేం వారానికొకసారి
పండగంత సంబరంగా
నీళ్ళు పోసుకోవడం జ్ఞాపకమొస్తుంది
ఈ నీటిని చూస్తే
చిన్నప్పుడు
మేం కోసెడు దూరం నడిచెళ్లి
కాలువలో నీళ్లు ముంచుకుని
మెడ నరాలు తెగిపోయేలా
బిందెలు మోసుకు రావడం
గుర్తుకొస్తుంది
కడివెడు నీళ్ల కోసం
మాలపల్లి తాటాకు గుడిసెలన్నీ
నిలువునా దహించుకుపోవడం
గుర్తుకొస్తుంది
నీరంటే మాటలా మరి!
ఇదెంత ప్రాణాధారమో
అంత ప్రాణ సంకటం!
ఎండిన గొంతులు తడపటానికి
మొరాయించిన నీరు
సముద్రమ్మీద నుంచి సునామీ కెరటమై
ఊళ్లకు ఊళ్ళను మింగేసిన
మృత్యుజలం
బడుగు బతుకుల్తో
ఇది ఆడిన నాటకాలు అన్నీ ఇన్నీ కావు
ఒక్కోసారి ఊళ్లను
ఎడారి బీళ్ళను చేస్తూ
ఇంకోసారి ఉప్పెనై ముంచేస్తూ
ఊరికీ వాడకీ మధ్య
రాష్ట్రాలకూ రాష్ట్రాలకూ మధ్య
కార్చిచ్చు రగిలిస్తూ
నెత్తుటి యేర్లు పారిస్తూ
తను మాత్రం ఏమీ ఎరగనట్టు
ఏ బిస్లరీ బాటిల్లోనో
చల్లగా సేదదీరుతుంది
మాతో ఇన్ని సర్కస్ ఫీట్లు చేయించిన
మా ఊర బావి నీరు
చాప కింద నీరులా
చెప్పా పెట్టకుండా
పెప్సీ వాడి సీసాలో దూరి
నయగారాలు పోతుంది
మినరల్ వాటర్ గా పేరు మార్చుకొని
కోలాహలం చేస్తుంది
ఇప్పుడు జలమంటే
మంచినీళ్ల ప్రాయం కాదు
మల్టీ నేషనల్ మార్కెట్ సరుకు
నీటికి సమస్తమూ తెలుసు
అన్నీ జలంలోనే ఉన్నాయిష! ★

## 'వ్యవసాయరంగ సంక్షోభం - పాలకుల విధానాలు - మన కర్తవ్యాలు'పై సదస్సు

# ప్రారంభోపన్యాసం

**శ్రీ వడ్డే శోభనాద్రీశ్వర రావు,** మాజీ వ్యవసాయ శాఖమంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా, రాష్ట్ర కన్వీనర్



'వ్యవసాయరంగ సంక్షోభం-పాలకుల విధానాలు- మన కర్తవ్యాలు' అన్న అంశంపై క్లుప్తంగా మాట్లాడటానికి మీ ముందుకు రావటం జరిగింది. మీలో చాలా మంది, మనమందరం దాదాపు 2018 నుండి రైతులకు స్వామినాథన్ కమిషన్ సూచించినట్లుగా సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50% కలిపి చట్టబద్ధ మద్దతు ధర ఇవ్వాలి, ఒక్క పర్యాయం రైతులకు రుణమాఫీ చెయ్యాలి, పార్లమెంటులో రైతు రుణ ఉపశమన చట్టం చెయ్యాలి అని మనం డిమాండ్ చేస్తూ వచ్చిన విషయం మీకందరకూ తెలిసినదే. మన డిమాండ్లు చాలావరకు దాదాపు ఫలప్రదమయ్యే దశలో, సామెత చెప్పినట్లు నోటిదాకా వచ్చినది జారిపోయిన చందంగా జరిగిన దాన్ని రైతులంతా గమనించే ఉంటారు. అందువల్ల అత్యంత న్యాయసమ్మతమైన మన డిమాండ్లను సాధించే వరకు కూడా అల్లూరి సీతారామరాజు గారు ఆ రోజుల్లో ఏవిధంగా రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్యవాదుల మీద పోరాటం చేశారో, చరిత్ర సృష్టించారో, అలాగే రైతాంగం కూడా రాబోయే రోజుల్లో తిరిగి మన డిమాండ్లను సాధించుకుని, వ్యవసాయం అనేది గిట్టుబాటు అయ్యేవిధంగా వ్యవసాయం మీద ఆధారపడిన రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు సగర్వంగా, తల ఎత్తుకుని సమాజంలో గౌరవప్రదమైన పౌరులుగా తిరగగలిగిన పరిస్థితి కోసం మనందరం కూడా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఆ సందర్భంగానే సోదరీమణి ఝాన్సీ గారు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఈ విషయంపై మీరు క్లుప్తంగా మాట్లాడాలి శోభనాద్రీశ్వరరావు గారు అని పిలవగానే వస్తానని చెప్పాను. కొద్దిగా ఆరోగ్యం ఇబ్బంది పెట్టినా ఆవిడ మాటను తోసివేయలేక రావడం జరిగింది. నా ప్రయత్నం నేను చేస్తాను.

మనందరం అర్థం చేసుకోవలసిందేమంటే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి కూడా దురదృష్టవశాత్తు పాలకులు వ్యవసాయానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎక్కువమంది ప్రజలకు జీవనాధారం వ్యవసాయమే. దేశానికి ఆహార భద్రత కల్పించవలసింది వ్యవసాయం, ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నది వ్యవసాయం, పరిశ్రమల చక్రాలు తిరగటానికి అవసరమైన వ్యవసాయోత్పత్తులకు ఆధారం కూడా వ్యవసాయమే. అయినా దీని పట్ల సరైన ఆదరణ చూపలేదు.

మొదట్లోనే 1948లోనే పారిశ్రామిక విధానాన్ని ప్రకటించారు. ఐదారు పర్యాయాలు ఆ పారిశ్రామిక విధానాన్ని సవరించారు. కానీ 52 సంవత్సరాల తర్వాత 2000 సం॥లో వ్యవసాయ విధానం అనే దాన్ని అధికారికంగా ప్రకటించారు. అట్లాగే వ్యవసాయంలో ఉన్న ప్రజలకు సరైన ఆదాయం వచ్చేట్లు చెయ్యాలి అనే ప్రయత్నం జరగలేదు. దాని మూలంగానే సరైన ధరలు లేక దాదాపు ప్రతిరోజూ 2 వేల మంది రైతులు వ్యవసాయాన్ని వదిలివేసి ఇతర వ్యాపకాలకు మళ్ళిన సంఘటనలు జరిగాయి, ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఆ సందర్భంగానే హైదరాబాదులో ఉన్నటువంటి "టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్" ఒక అధ్యయనం చేసింది. ప్రభుత్వం ప్రకటిస్తున్న ఎం.యస్.పి ధరలు రైతులకు వాస్తవంగా అవుతున్న ఉత్పాదక ఖర్చు, గిట్టుబాటయ్యే ధరల కన్నా 38% తక్కువగా ఉంటున్నాయని ఆ సంస్థ తెలిపింది. ఆ సంస్థ లెక్కలు ప్రకారం అప్పట్లో ఏటా దాదాపు 1 లక్షా 16 వేల కోట్ల రూపాయల నష్టం భారత రైతాంగానికి జరుగుతూ ఉందని అంచనా వేసింది. ఆ తర్వాత 1996 నుండి నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితిని చూశాం. అంతే కాదు, వ్యవసాయం గిట్టుబాటు కావడం లేనందువల్ల యువతరం వ్యవసాయంలోకి వెళ్ళటానికి ఆసక్తి చూపటం లేదని, వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో ఉందని అన్ని కోణాల నుండి తెలిసిన మీదట మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ప్రఖ్యాత వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త డా॥ ఎం.ఎస్.స్వామినాథన్ గారిని అధ్యక్షునిగా, ఇటీవలే కాలం చేసిన మన సోదరుడు అతుల్ కుమార్ అంజన్, మరికొంత మందిని సభ్యులుగా పెట్టి "జాతీయ ఫార్మర్స్ కమిషన్" ఏర్పాటు చేస్తే, ఆ కమిషన్ చాలా చక్కగా పారిశ్రామిక ఉత్పత్తుల ధరలు ఎలా నిర్ణయిస్తున్నారన్నది చాలా క్షుణ్ణంగా పరిశీలించి, రైతులు సమాజంలో గౌరవంగా బ్రతకాలి అంటే రైతులకు

అవుతూ ఉన్నటువంటి సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయంపైన 50 శాతం అదనంగా కలిపి ఇస్తే అప్పుడు రైతులకు న్యాయం చేసినట్లు అవుతుంది అని చెప్పింది. 2006లో ఆ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి ఆ విధంగా రిపోర్టు చేసింది. ఆ కమిషన్‌ను నియమించిన కేంద్ర ప్రభుత్వం ఆ రిపోర్టులోని చిన్న చిన్న అంశాలు కొన్నింటిని ఆమోదించింది తప్ప ప్రధానమైన, కీలకమైన ఈ సిఫారసును ఆమోదించలేదు. చాలా బాధాకరమైన విషయం ఏంటంటే అత్యున్నతమైన చట్టసభ పార్లమెంటులో కూడా డా॥ స్వామినాథన్ కమిషన్ రిపోర్టును చర్చించలేదు అని మీకు తెలియజేస్తున్నాను. దాని వల్ల రైతాంగానికి చాలా నష్టం జరిగింది.

స్వామినాథన్ కమిషన్ రిపోర్టు ఆధారంగా ఆ రికమండేషన్స్ అమలు చేస్తామని 2014 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోడీ అనేక బహిరంగ సభల్లో చాలా స్పష్టంగా చెప్పాడు. తిరుపతిలో వెంకటేశ్వరస్వామి పాద సన్నిధిలో కూడా చెప్పాడు. కానీ, అధికారం చేపట్టిన దరిమిలా సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ఇచ్చాడు. ఏమనంటే ఇది సాధ్యపడదు, ఇలా చేస్తే ఆర్థిక వ్యవస్థ చాలా గందరగోళ పరిస్థితుల్లో పడుతుంది అని. దానిపై రైతాంగం అంతా ఆలిండియా కిసాన్ సంఘర్ష్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ మాండసోర్ ప్రాంతంలో ఆందోళన చేపట్టగా పోలీసు కాల్పుల లో నలుగురు రైతులు చనిపోయిన దరిమిలా, ఆ సమస్య పైన పోరాటం ప్రారంభించి, ఢిల్లీలో 2018లో భారీ బహిరంగ సభ నిర్వహించటం, 250 రైతు సంఘాలు దానిలో పాల్గొని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయటం జరిగింది. దానితోపాటు సాధారణంగా మా రైతులం ఎవరం అప్పులు ఎగ్గొట్టేవాళ్ళం కాదు, ఎగ్గొట్టాలని అనుకోము. కానీ కరువులు, తుఫానులు, అకాల వర్షాలు, అధిక వర్షాలు, చీడపీడలు మూలంగా పంటలు దెబ్బతిని, ఒక్కొక్కప్పుడు ధరలు అమాంతం పాతాళానికి పడిపోయి కట్టలేని పరిస్థితిలో కట్టలేకపోతున్నారు తప్ప ఎగ్గొట్టాలనే మనస్తత్వం రైతుది కాదు. అందువల్ల ఒక్కసారి రుణమాఫీ చేయండి అని అడిగినప్పటికీ కూడా మోడీ గారి చెవికెక్కలేదు అని చెప్పటానికి చాలా విచారిస్తున్నాను. అంతకు ముందు లోగడ జనతా ప్రభుత్వంలో మోతీలాల్ గారు పదివేల రూపాయల వరకు రుణాలను మాఫీ చేశారు. పదివేల కోట్లు అయింది అప్పట్లో. ఆ తర్వాత మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో 52 వేల కోట్లు రైతు రుణమాఫీ చేశాడు. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు రాష్ట్రాల స్థాయిలో కొంత రుణమాఫీ చేశారు. మొత్తం మీద ఒక లక్షా 40 వేల కోట్ల రూపాయలు వివిధ రాష్ట్రాల్లో రుణమాఫీ అయ్యాయి. కానీ నరేంద్రమోడీ నాయకత్వంలోని బిజెపి కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి మాఫీ చెయ్యలేదు. అదే బిజెపి ప్రభుత్వం పదేళ్ళలో పెద్ద పెద్ద కార్పొరేట్లు, పారిశ్రామికవేత్తలు, బడా వ్యాపారులకు 16 లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేసింది. విచిత్రం ఏమంటే బ్యాంకులే ఫలానా ఫలానా వాళ్ళ వద్ద కట్టగలిగిన స్తోమత ఉన్నా కూడా కట్టటం లేదన్నా, ఉద్దేశపూర్వక ఎగవేతదారులు విల్‌ఫుల్ డిఫాల్టర్స్ అంటారు వాళ్ళని, అట్లాంటి వాళ్ళ బాకీలు 67 వేల కోట్ల రూపాయలు మాఫీ చేశారు. ఇలా రైతాంగం పట్ల తీవ్ర నిరాదరణ, నిర్లక్ష్యం కొనసాగుతూ ఉందని మీకు తెలియజేస్తున్నా. రైతుల డిమాండ్లేమైనా అన్యాయమైనవా? కాదే! గత 35 సంవత్సరాలలో రైతులకు ప్రకటించిన ఎం.ఎస్.పిలు 22 రెట్లు పెరిగాయి. ఈ 35 ఏళ్ళలో కేంద్ర ప్రభుత్వంలో పని చేసే ఉద్యోగుల జీతభత్యాలు చూస్తే 90 నుండి 120 రెట్లు పెరిగాయి. ఆఖరుకు మనకు అవసరమైన సిమెంటు, స్టీలు, కలప, సేవలు అన్నీ కూడా 80 నుండి 100 రెట్లు పెరిగాయి. ఇవాళ కేంద్ర ప్రభుత్వం యొక్క లెక్క ప్రకారమే భారతదేశంలో ఒక రైతు కుటుంబం యొక్క సగటు నెలసరి ఆదాయం 10,420 రూపాయలు. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుంటే అది నెలకు 18,900 రూపాయలు అవుతుంది. ఏడవ వేతన కమీషన్ ఏమని చెప్పింది 'భారతదేశంలో ఒక కుటుంబం గౌరవప్రదంగా జీవించాలంటే నెలకు కనీసంగా 18 వేల రూపాయలు ఆదాయం ఉండాలి' అని. మోడీ ప్రభుత్వం కూడా 2016లో 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పింది. రెట్టింపు కాలేదు. కేవలం 30 శాతం మాత్రమే పెరిగింది. అంతేకాకుండా ఈరోజు స్వామినాథన్ కమిషన్ సూచించినట్లుగా ధరలు నిర్ణయించబడితే, (మొన్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వాళ్ళు వాగ్దానం చేశారు, ఎన్నికల ప్రణాళికలో కూడా పేర్కొన్నారు) రైతులకు చాలా మేలు జరిగేది. ఎట్లాగంటే, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఏదైతే నిర్ణయిస్తా ఉందో ఆ ధరకు వరి పంటకు ఒక క్వింటాలుకు 680 రూ॥ల అదనంగా వస్తుంది. సగటున 22 క్వింటాళ్ళు దిగుబడి అనుకుంటే ఒక ఎకరం వరి పండించిన రైతుకి 15 వేల రూపాయలు అదనంగా ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. ఆ విధంగా చెయ్యకపోవటం వల్ల భారతదేశం మొత్తం మీద వరి పండించిన రైతులకు ఎంత నష్టమో తెలుసా! 90 వేల కోట్ల రూపాయలు నష్టం జరిగింది. గోధుమ పంటను లెక్కేస్తే 30 వేల కోట్ల రూపాయలు నష్టం జరిగింది. ఎక్కువ మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నది పత్తి సాగుచేసిన వాళ్ళు, కౌలు రైతులు, బలహీన వర్గాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులు. ఆ పత్తి రైతులకు స్వామినాథన్ కమీషన్ చెప్పింది అమలైతే ఎకరానికి 12 వేల రూపాయలు అదనంగా వచ్చే అవకాశం ఉండేది. పత్తి పంటలో 70 వేల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లింది. ఇదంతా స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం ధరలు నిర్ణయించకపోవటం వల్ల. మొత్తం మీద చూస్తే అపరాలకు ఎకరానికి 7500 రూ॥ అదనంగా వస్తుంది. వేరుశెనగకు రూ॥ 14 వేల 400 అదనంగా వస్తుంది. మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఈ వెసులుబాటు కల్పించలేదు. మొన్న ఎన్నికల్లో రైతాంగం నువ్వు తప్పుకో బాబూ అని చెప్పినా, ఇండియా కూటమికి కొన్ని సీట్లు తగ్గటం మూలంగా, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మళ్ళీ 3వ పర్యాయం ప్రధానమంత్రిగా మోడీ కుర్చీ

ఎక్కాడు. ఇప్పటికైనా సంయుక్త కిసాన్ మోర్చా, భారత రైతాంగం కోరుతున్న విధంగా రైతాంగం యొక్క డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం తీర్చాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితుల్లో మనం ఎక్కడున్నాం? ఏం జరుగుతా ఉంది? ఎవరి వల్ల జరుగుతోంది అనే అవగాహన చేసుకుంటే మన కర్తవ్యం మనకు బోధపడుతుంది. మనం పోరాటానికి సిద్ధపడాలి అని మీ అందరికి మనవి చేస్తున్నా.

ఇవాళ రైతులకే కాదు, బజార్లో వ్యాపారాలు చేసుకునే వాళ్ళకు రుణాలు కావాలి, పరిశ్రమలకు రుణాలు కావాలి. మరి రైతులకు అవసరం లేదా? ఎప్పుడో మహానుభావురాలు ఇందిరాగాంధీ గారు 1971లో ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేసి ప్రభుత్వరంగంలోకి తీసుకుంటే, అంతకు ముందుకన్నా రైతులకు, చిన్నచిన్న పరిశ్రమలకు, కుటీర పరిశ్రమలకు కొంతమేరకు రుణాలు వస్తున్న మాట యదార్థమే. కానీ ఎక్కువ డబ్బు ఎవరికి వెళ్తోంది, బడా బాబులకు. భారతదేశం మొత్తం మీద ఉన్న 19 కోట్ల రైతు కుటుంబాలు కానీ, ఎరువుల షాపులు, పురుగు మందుల షాపులు, విత్తనాల షాపులు, ఆగ్రో ఇండస్ట్రీస్ వీటన్నింటికీ ఇచ్చిన రుణం కన్నా కేవలం 20 కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన రుణం ఎక్కువ. అంతకు ముందు పార్లమెంటు సభ్యునిగా పార్లమెంటులో ఏ పెద్ద పెద్ద సంస్థలు ఎంతెంత బాకీ ఉన్నారని ప్రశ్న అడిగితే తెలియపరచటానికి వీల్లేదు బ్యాంకింగ్ సీక్రెసీ యాక్ట్ ప్రకారం అని నాకే సమాధానం వచ్చిన పరిస్థితి. మొట్టమొదటి పర్యాయం ఈ దేశంలో ఆర్‌బిఐ గవర్నర్‌గా రఘురామ్ రాజన్ ఉండగా బయట పెట్టాడు. ముఖేష్ అంబానీకి ఎంత అప్పుందో, ఎంత కట్టాలో చెప్పాడు. దాన్ని వసూలు చేయటానికి యాక్షన్ తీసుకోవాలి అన్నాడు. కానీ మోడీగారు ఆయన్ను పంపించి వేశాడు. ప్రొఫెసర్‌గా అమెరికాకు వెళ్ళిపోయాడు ఆయన. రైతులలో 40% చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, వీళ్ళు ప్రైవేటు వ్యాపారుల వద్ద 2 రూ॥ వడ్డీకి, 3 రూ॥ వడ్డీకి అప్పు తీసుకోవలసిన పరిస్థితి. అలాంటి నేపథ్యంలో రైతు రుణ ఉపశమన చట్టం అవసరం. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ వార్మింగ్ జరుగుతా ఉంది. ఉష్ణతాపం పెరుగుతోంది. దీనివల్ల రాబోయే రోజుల్లో చాలా మార్పులు సంభవిస్తాయి. ప్రత్యేకించి మన భారతదేశంలో వరి, గోధుమ, మొక్కజొన్న లాంటి పంటలకి దిగుబడులు బాగా తగ్గుతాయి అని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తా ఉన్నారు. అదీగాక దాని తీవ్రత 'ఫ్రీక్వెన్సీ ఆఫ్ ఎమిరేషన్స్' ఎక్కువగా పెరుగుతాయి. చాలా ఎక్కువ నష్టం జరుగుతుంది. కాబట్టి దాని దుష్ఫలితాలను బాగా తగ్గించాలి అంటే ప్రభుత్వాలు తగినంత గట్టి చర్యలు తీసుకోవాలి అని హెచ్చరించినప్పటికీ కూడా, ఇప్పటికీ ఆ విధమైన చర్యలు తీసుకోని పరిస్థితే ఉంది. ఈ పరిస్థితుల్లో పంటల బీమా పథకం చాలా అవసరం. రాజీవ్‌గాంధీ ప్రభుత్వంలో మొట్టమొదటిసారి పంటల బీమా పథకం మొదలైంది. నేషనల్ అగ్రికల్చర్ క్రాప్ ఇన్సూరెన్స్ స్కీం, మాడిఫైడ్ క్రాప్ ఇన్సూరెన్స్ స్కీం వచ్చాయి. మోడీ గారి హయాంలో ఇప్పుడు ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన పథకం అమలవుతా ఉంది. అయితే ఈ పథకం వల్ల రైతాంగాని కన్నా ఆ పథకాన్ని అమలు చేస్తున్న ఇన్సూరెన్సు కంపెనీలకు ఎక్కువ లాభం వెళ్తోంది. 2016-2017 సంవత్సరానికి చూస్తే ప్రీమియం వసూలు చేసింది 22,500 కోట్ల రూపాయలు. కేంద్ర ప్రభుత్వం పదివేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు 12,500 కోట్లు మొత్తం మీద 22,500 కోట్లు ప్రీమియం వసూలు చేశారు. కానీ రైతులకు నష్ట పరిహారం ఎంత ఇచ్చారంటే 7,700 కోట్ల రూపాయలు. ఇన్సూరెన్సు కంపెనీలకు వేలకు వేల కోట్ల రూపాయలు లాభాలుగా వెళ్ళాయి. అదలా ఉంచితే, మొదటి నుంచీ కూడా ప్రీమియం భారాన్ని కేంద్రం సగం, రాష్ట్రాలు సగం భరించాలనే విధానం ఉంటూ వచ్చింది. ఇది మోడీ గారికి నచ్చలేదు. దానిని మార్చాడు. వర్షాధారిత ప్రాంతాల్లో 30 శాతం, నీటి పారుదల ఉన్న ప్రాంతంలో 25 శాతం వరకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. మిగిలినది రాష్ట్రాలే భరించాలి అని చెప్పాడు. అంటే రాష్ట్ర ప్రభుత్వాల మీద భారం పెరుగుతోంది. కాబట్టి బిజెపి పాలిత రాష్ట్రాలతో సహా 8 రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి ఫసల బీమా యోజనను తిరస్కరించాయి. ఈనాడు ఆ పథకం కొన్ని చోట్ల ఉంది, కొన్ని చోట్ల లేదు. కొన్ని రాష్ట్రాలు మేం చూస్తాం, చేస్తాం అన్నా జరగని పరిస్థితే ఉంది. ఏతావాతా తాజాగా ఏంటంటే భారతదేశం మొత్తం మీద రైతాంగంలో కేవలం 9 శాతం మంది మాత్రమే ఆ ఫసల్ బీమా పథకంలో చేరారు. 5 శాతం భూమి మాత్రమే ఇన్సూరెన్సు చెయ్యబడింది. అంటే ఎంత తక్కువ స్థాయిలో ఉందో అర్థం చేసుకోండి. మరి అటువంటప్పుడు ఈ కరువుల వల్ల, అధిక వర్షాల వల్ల కలిగే నష్టాలలో రైతు ఏమై పోవాలి. దయచేసి అందరూ ఆలోచించాలి. ప్రభుత్వాల మీద వత్తిడి తేవాలి. ప్రపంచ వాణిజ్య సంస్థకు భారత ప్రభుత్వం మన భారతదేశంలో 10 హెక్టార్లలోపు రైతులు 'రిసోర్స్ పూర్ ఫార్మర్స్, ' అంటే సరైన వనరులు లేని రైతులు అని చెప్పి నోటిఫై చేసింది. ప్రపంచ వాణిజ్య సంస్థలో మూడు రకాల సబ్సిడీలు ఉంటాయి. మూడు బాక్సులు ఉంటాయి. ఎరుపు, తెలుపు, పచ్చ. ఆ పచ్చదాంట్లో ఏముంటాయంటే సబ్సిడీలు తగ్గించాల్సిన అవసరం లేని వాటిని గ్రీన్ బాక్స్ అంటారు. అందులో ఏముంటుందంటే ఆయా దేశ ప్రభుత్వాలు చెల్లించాల్సిన ఇన్సూరెన్స్ ప్రీమియం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు యిచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ. అలాగే రైతులకు వాళ్ళ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్, ఇటువంటి వాటి మీద ఎటువంటి ఆంక్షలు లేవు. ఎంతైనా ఇచ్చుకోవచ్చు అనేది ఖచ్చితంగా ఉంది. ఆ నేపథ్యంలో మనం తప్పని సరిగా ప్రభుత్వాల పైన రాష్ట్ర ప్రభుత్వం మీద, కేంద్ర ప్రభుత్వం మీద వత్తిడి తేవాల్సింది ఏమిటంటే పంటల బీమా పథకం కింద ప్రీమియంను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలే కట్టాలి, రైతుపై ఆ భారం వేయరాదు అని. ప్రతి బడ్జెట్‌లో కూడా కేంద్ర

ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీలు, కస్టమ్స్ డ్యూటీలు, ఇన్‌కంటాక్స్, రాయితీల రూపంలో ధనిక వర్గాలకు దాదాపు లక్షన్నర నుండి 2 లక్షలకోట్ల రూపాయల పైన రాయితీలు ఇస్తోంది. అటువంటప్పుడు భారత దేశంలో నూటికి 86 మంది చిన్న, సన్నకారు రైతులు ఉన్న ఈ దేశంలో, 2 హెక్టార్లలోపే భూమి కలిగిన 90 శాతం రైతులు మనం ఈ దేశంలో ఉండే వారికి రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. మీరు ఇవ్వాలి అని గట్టిగా దెబ్బలాడాల్సిన అవసరం ఉంది.

దానితోపాటుగా మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే మాకు ధరలు గిట్టుబాటు కావడం లేదు. అనేక మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు, కాబట్టి మాకు డా॥ స్వామినాథన్ చెప్పినట్లుగా చెయ్యమని మనం ఒకపక్క అడుగుతుంటే అమెరికావాడు అంటాడు భారతదేశంలో మీరు ఇప్పటికే రైతులకు చాలా ఎక్కువగా సబ్సిడీలు ఇస్తున్నారు, అట్లా ఇవ్వటానికి వీలులేదు, దాన్ని ఆపండి అని 'డిస్ప్యూట్ సెటిల్‌మెంట్ బాడీ' అంటారు. దాని దగ్గర పిటిషన్ వేశాడు అమెరికావాడు. వాడేమంటాడంటే డబ్ల్యూటీవో ఏర్పడినప్పుడు అప్పుడు డాలరుకి రూపాయి విలువ ఎంతుందో, అది అలాగే ఉండాలంట. అప్పటికీ ఇప్పటికీ పెరిగిన ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకోకూడదంట. అలాంటి తప్పుడు లెక్కల ప్రకారంగా మీరు చాలా ఎక్కువగా వరి ధాన్యానికి, గోధుమకు సబ్సిడీ ఇచ్చేస్తున్నారు, అలా ఇవ్వటానికి వీల్లేదు అని చెప్పి అమెరికావాడు పోట్లాడుతు న్నాడక్కడ. అటువంటి పరిస్థితుల్లో భారత ప్రభుత్వం భారత రైతాంగం తరఫున ఇది సరైనది కాదు అని ఇతర వర్ధమాన దేశాలతో కూడా మాట్లాడి, చర్చించి, ఆ లెక్కకట్టే విధానంలో మార్పు తీసుకురాకపోయినట్లైతే మన భారత రైతాంగానికి, రాబోయే తరాలకు కూడా చాలా నష్టం జరుగుతుందని ఈ సందర్భంగా మీకు మనవి చేస్తున్నాను.

ఇన్సూరెన్సు తర్వాత మరొక ముఖ్య విషయం రైతులు గమనంలో ఉంచుకోవాలి. విచక్షణారహితంగా పురుగు మందులు వాడుతున్నాం. అవసరానికి మించి ఎరువులు వాడేస్తున్నారు. వాటిని తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. సాగు వ్యయాన్ని కొంత తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. పచ్చిరొట్ట ఎరువులు మొ॥ వాటిని ఉపయోగిస్తూ, మొత్తంగా ఆర్గానిక్ అనేది సాధ్యపడక పోవచ్చేమోగానీ, కొంతమేరకు వీటిని కూడా వాడుకుంటూ ఉండాలి. మినుములు అయిపోయాక అక్కడక్కడా పొట్టు మిగిలి ఉంటుంది. కౌలురైతు దాన్ని త్వరగా తగలబెట్టి, దుక్కి దున్ని ఊడుపు వేసేద్దామనుకుంటాడు గానీ, ఆ పొట్టు భూమిలో కలిస్తే భూమికి మంచిది, భూమిలో హ్యూమస్ పెరుగుతుంది, భూసారం పెరుగుతుంది అనే అవగాహన ఉండటం లేదు. వరిగడ్డి కానీ, చెరుకు ఆకు గానీ, జొన్న, మొక్కజొన్న కాడలు అటువంటివన్నీ కూడా భూమిలో కలిపి దున్నినప్పుడు భూసారం పెరుగుతుంది, దిగుబడులు పెరుగుతాయి, వ్యవసాయోత్పత్తుల నాణ్యత కూడా పెరుగుతుంది. దానిని దృష్టిలో పెట్టుకోవాల్సిందిగా రైతాంగానికి మనవి చేస్తున్నాను.

వ్యవసాయానికి ప్రధానంగా కావాల్సింది నీరు. కానీ దురదృష్టమేమంటే మనకు స్వతంత్రం వచ్చాక పాలకులు వ్యవసాయరంగంపై సరైన దృష్టి సారించాలా. ఒక్క మొదటి పంచవర్ష ప్రణాళికలో 27 శాతం పెట్టారు ఇరిగేషన్ అండ్ పవర్‌కి. కానీ తర్వాత రానురానూ తగ్గి మధ్యలో 10 శాతం, 11 శాతానికి వెళ్ళి ఇప్పుడు చివరకు ఎంతకు చేరిందంటే 5.8 శాతానికి వెళ్ళింది. దాని మూలంగానే అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులు పదేళ్ళు, పదిహేనేళ్ళుగా అలాగే కొనసాగుతూ వస్తున్న పరిస్థితి ఉంది. 2014 దాకా 1950 నించి చూసుకుంటే 1853 ప్రాజెక్టులు మొదలుపెడితే 1233 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి కొనసాగుతూనే ఉన్నాయి. మోడీ వచ్చిన తర్వాత అంతకు ముందు నుండీ కొనసాగుతూ ఉన్న ప్రాజెక్టులను 'ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన' 'యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రాం' కింద పూర్తి చేసేస్తాం అన్నారు. దానిలో కూడా 3వ వంతు తప్ప మిగిలినవి నేటికీ పూర్తి కాని పరిస్థితే ఉంది. ఎందుకు చెబుతున్నానంటే వ్యవసాయంలో నీటి సరఫరా ఉంటేనే కరువు కారణంగా రైతులు దెబ్బతినే పరిస్థితి ఉండదు, ఉత్పత్తి పెరుగుతుంది. వ్యవసాయ కూలీలకు ఎక్కువ పని దినాలు దొరుకుతాయి. కనుక తప్పనిసరిగా నీటిపారుదలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. కానీ కొన్ని పరిస్థితులు చూసినప్పుడు చాలా బాధేస్తుంది. వేదికపై నాపక్కనే డా॥ కొల్లా రాజమోహన్ గారున్నారు. నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడుగా ఆయన కృష్ణా నది నుండి గుంటూరు ఛానెల్‌ను పరుచూరు దాకా పొడిగించండి అని ఎన్నో ఏళ్ళుగా ప్రయత్నం చేస్తున్నారు. కలెక్టర్లకు, ప్రభుత్వాలకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పాలకులకు ఇది ప్రాధాన్యంగా కనపడటం లేదు. కానీ, అవసరం లేకపోయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారికి సంబంధించిన బైపాస్ రోడ్డు వేయటానికి వాళ్ళు డబ్బు పెట్టాల్సిన దానికి మన రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చకానికి ప్లేట్లో పెట్టి మరీ 238 కోట్ల రూపాయలు సమర్పించింది. ఇది ఎంతో బాధాకరమైన విషయం. ఆ 238 కోట్లు పెట్టి పరుచూరు వరకు గుంటూరు ఛానల్‌ను పొడిగించినట్లైతే కొన్ని లక్షలమందికి త్రాగునీరు, కొన్ని వేల ఎకరాలకు సాగునీరు లభించే పరిస్థితి ఉండేది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

ఈ విధంగా పరిస్థితులు ఉన్న నేపథ్యంలో తప్పనిసరిగా మన రైతాంగం కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. మనందరం కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. చాలా పొరపాట్లు చేస్తున్నారు పాలకులు. వాటిని ఎదుర్కోవాల్సిన అవసరం కూడా ఉంది. చాలాకాలంగా మేము, రైతుకూలీ సంఘం, ఇతర రైతు సంఘాలు కలిసి పనిచేస్తున్నాం.

ప్రత్యేకించి ఆదివాసులకు ప్రభుత్వాలు చాలా ద్రోహం చేస్తున్నాయి. వాళ్ళ మనుగడకు, అస్తిత్వానికి, వాళ్ళ భూములకు అపకారం చేసే చట్టాలు వచ్చాయి. అటువంటి చట్టాలు చేసిన కేంద్ర

ప్రభుత్వాన్ని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థిస్తున్నాయి. సామాన్య ప్రజలకు అపకారం చేసి, ఎవరో కొద్దిమంది కార్పొరేట్లకు మేలు చేసే పద్ధతులను మార్పు చేసే దిశగా ఒక మార్పురావాల్సిన అవసరం ఉంది. దాని కొరకు మనందరం ఒత్తిడి తేవాలి. ఈరోజు మీడియా కూడా ఎక్కువ భాగం కార్పొరేట్ల చేతుల్లో ఉండటం మూలంగా సామాన్య ప్రజలకు జరుగుతున్న నష్టాలపై సరైన ఫోకస్ పెట్టటం లేదు. అధికారంలో ఉన్న వాళ్ళు పచ్చి అబద్ధాలను, అసంబద్ధమైన విషయాలను చెబుతూ ఉన్నా పెద్ద పెద్ద బాక్సులు కట్టి, అక్షరం పొల్లు పోకుండా వ్రాస్తున్న పరిస్థితులను మనం దృష్టిలో పెట్టుకుంటే, మన ముందు చాలా గురుతరమైన బాధ్యత ఉంది అని చెప్పి మీ అందరికీ సవినయంగా మనవి చేస్తున్నాను. ఇంకా చెప్పవలసిన విషయాలు కొన్ని ఉన్నప్పటికీ ఇప్పటికే చాలా సమయం తీసుకున్నాను, ఇంకా మాట్లాడవలసిన వాళ్ళు చాలా మంది ఉన్నారు. ఈ నాలుగు మాటలూ చెప్పే అవకాశం, నేను ముందే పేర్కొన్న మహనీయులను స్మరించుకునే అవకాశం కల్పించిన సోదరీమణి ఝాన్సీ గారికి, మీ అందరికీ కూడా ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను. నమస్కారం.

# పాలస్తీనా - పాలస్తీనా - పాలస్తీనా

మూలం : **మౌమితా ఆలం** అనువాదం : **ఉదయమిత్ర**

నేనీరోజు నిదురించేలోగా
మరి కొంతమంది శిశువుల కలలు హత్యకు గురవుతాయి
నేను వారి శవాల గుట్టల మీద నిల్చుని
యుద్ధాలాటపై ఎడతెగని వ్యాఖ్యానం వింటూనే ఉంటాను
ఇక అంతా ముగిసినట్టేనా?
బాంబులతో చరిత్ర అంతమైనట్టేనా?
మరి శవపేటికకు ఈ ఎరుపు రంగెందుకో?
మరణమే ముగింపా, కామ్రేడ్?
వారు పదే పదే వక్కాణిస్తున్నారు
తామే గెలిచామని
మళ్లీమళ్లీ ఉద్ఘోషిస్తున్నారు!
కానీ
అర్ధరాత్రి కురిసిన
బాంబుల వాన తర్వాత కూడా
శిశువులందరూ అచేతనులు కాలేదెందుకు?
గోడను ఒరుసుకుంటూ
శిథిలాల పగుళ్ళ మధ్యలోంచి
మొక్క ఒకటి తొంగి చూస్తోంది
అది మొలకా లేక మట్టి లోతుల్లోంచి
భూమి పైకి పాకుతున్న నవజాత శిశువా?
ఈ పసి ప్రాణానికి ఇంత
నమ్మకమెక్కడిది?
భూమిపై పసివాళ్లు పుడుతున్నన్నాళ్ళూ
ప్రతి రాత్రీ వర్షించే బాంబుల నడుమ కూడా
స్వప్నిస్తూనే ఉంటాయి చెట్లూ, నదులూ, సముద్రాలూ
ఆ స్వప్నానికి మరోపేరే
పాలస్తీనా- పాలస్తీనా- పాలస్తీనా ★

# ఢిల్లీ రైతు ఉద్యమం – కనీస మద్దతు ధర

**డా॥ కొల్లా రాజమోహన్,** నాయకులు, నల్లమడ రైతాంగ సమితి



భూమి కోసం, భుక్తి కోసం జరిగిన పోరాటంలో అమరజీవులైన కుంజం రాజులు, మడెం లక్ష్మయ్య, కారం పార్వతిలకు నా జోహార్లు.

కనీస మద్దతు ధర గురించి మాట్లాడమని అడిగారు. ఈ సభలో పెద్దలు నాయకులు, మేధావులు ఇంకా ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన నాయకులందరికీ నమస్కారం. అన్నిటికన్నా నాకు ఎక్కువ ఉత్తేజాన్నిచ్చిన విషయమేమంటే ఇక్కడ పెద్దలు ఎంతమంది ఉన్నారో అంతకన్నా ఎక్కువగా చిన్నవాళ్ళు, యువజనులు ఉన్నారు. ఇది చాలా సంతోషించదగ్గ విషయం, ఆహ్వానించదగ్గ విషయం.

ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం చారిత్రాత్మకమైనది. భారత స్వాతంత్రోద్యమం తర్వాత అంతమందితో, ఒక చోట, అంతకాలం జరిగిన ఉద్యమం భారతదేశంలోనే కాదు ప్రపంచంలో కూడా ఎక్కడా లేదు. దేనికోసం చేశారు? ఎవరు చేయించారు? ఎట్లా చేశారు అనేది కూడా గమనించాలి. దీనికి బీజం 2017లోనే దాదాపు 29 సంఘాలు అఖిల భారత కిసాన్ సంఘర్ష్ సమితిగా ఏర్పడి సమావేశం జరిగింది. వడ్డే శోభనాద్రీశ్వరరావు గారు, జొన్నలగడ్డ రామారావు గారు, నేను ఆ సమావేశానికి వెళ్ళాం. అక్కడ నిర్ణయించిందేమంటే వ్యవసాయానికి సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయి. అన్నిటినీ తీసుకోవటం కన్నా రెండు సమస్యల పైన కేంద్రీకరిద్దామని నిర్ణయం జరిగింది. ఒకటి, రుణవిముక్తి. ఇప్పటి వరకు ఉన్న రుణాలను ఒక్కసారి రద్దు చేయండి. రెండు, అనంతరం చేసే వ్యవసాయంలో అప్పుల పాలవ్వకుండా చూడండి. అందుకోసం కనీస మద్దతు ధరను నిర్ణయించి, దానిని అమలుపరచండి అనే డిమాండ్లతో ముందు కెళ్దామని ఆ సమావేశంలో పాల్గొన్న రైతుసంఘాలన్నీ నిర్ణయించాయి. దానికి కొనసాగింపుగా 2018 నవంబరులో ఒక పెద్ద కిసాన్ మార్చ్ జరిగింది. దానిలో కూడా మేమంతా పాల్గొన్నాం. లక్షలాది మంది రైతులు దానికి హాజరయ్యారు. పంజాబ్, హర్యానాల నుండి ఎక్కువ మంది యువకులు వచ్చారు.

మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఛలో ఢిల్లీ పిలుపుతో వేలాది మంది రైతులు ఢిల్లీకి బయలుదేరితే వాళ్ళను సరిహద్దుల్లోనే ఆపేశారు. శత్రువులతో వ్యవహరించినట్లు యంత్రాంగం వాళ్ళను అడ్డుకుంది. మామూలుగా అయితే లాఠీ ఛార్జి చేస్తారు, లేకపోతే వ్యానుల్లోకెక్కించి అరెస్టులు చేస్తారు, కేసులు పెడతారు. కానీ అలా కాకుండా రోడ్లను దిగ్బంధం చేస్తూ సిమెంటు దిమ్మలు పెట్టారు. రోడ్లపై ఇనుప మేకులు దిగేశారు. ఆందోళనకారులపై వాటర్‌గన్లు ప్రయోగించారు. పెల్లెట్లు వాడారు. వాటి వల్ల చాలా మంది గాయపడ్డారు. కళ్ళుదెబ్బ తిన్నవాళ్ళు కూడా ఉన్నారు. రబ్బరు బుల్లెట్లు పేల్చారు. ఇన్ని చేసినా గానీ పంజాబ్, హర్యానా రైతులు వెనక్కు తగ్గలేదు.

పంజాబ్ వాళ్ళంటేనే వీరోచిత వారసత్వం ఉన్నటువంటి వాళ్ళు. విప్లవ వీరుడు భగత్‌సింగ్ ఉద్భవించిన ప్రాంతం. ఆ ప్రాంతం నుండి వేలాదిమంది ఢిల్లీ సరిహద్దుల్లోకి చేరుకున్నారు. అది నవంబరు నెల చలి విపరీతంగా ఉంది. అప్పుడు భారతదేశం మొత్తం కూడా కరోనా వచ్చి అందరూ మాస్కులు ధరించి ఇళ్ళల్లోనే ఉంటూ, బయటకు రాకుండా ఉన్న కాలంలో వేలాదిమంది ట్రాక్టర్లపైన, వ్యాన్లపైన, కార్లపైన, మోటార్ సైకిళ్ళపైన ఢిల్లీ బయలుదేరారు. ఢిల్లీ పోలీసులు, హర్యానా పోలీసులు వాళ్ళను ఆపారు. కానీ ఆ రైతాంగం ఎక్కడైతే వాళ్ళను ఆపారో అక్కడే నిలబడి పోరాడారు. వాళ్ళపై డ్రోన్ల ద్వారా టియర్ గ్యాస్ వదిలారు. దాని తీవ్రత తగ్గించటానికి వీళ్ళు గాలిపటాలను ఎగరవేసి దానిని డిఫ్యూజ్ చేశారు. ఇంకా ఇలాంటివే అనేక పద్ధతుల ద్వారా వాళ్ళ మీద జరిగిన దాడులను తిప్పికొట్టారు. వాళ్ళు స్పష్టం చేసిందొకటే. మేం ఇక్కడే కూర్చుంటాం, ఇంటికెళ్ళం అన్నారు. అలాగే చేశారు కూడా. ట్రాక్టర్ల మీద టార్పాలిన్లు కట్టుకుని, కావాల్సిన సామాన్లన్నీ అందులో పెట్టుకుని, అక్కడే వండుకుని, అక్కడే తిని, అక్కడే పడుకుని దాదాపు 13 నెలలుపైగా, పోలీసులు ఎటువంటి హింసాకాండకు పాల్పడ్డా, దానిని కూడా ఎదిరించి అక్కడే రోడ్లపై జీవించిన చరిత్ర ఎక్కడా లేదు. భగత్‌సింగ్ వారసులు వాళ్ళు. గాంధీకి వారసులు వాళ్ళు. ఒక దృఢమైన పోరాటపటిమను ప్రదర్శించారు. ప్రభుత్వం వాళ్ళను మానసికంగా దెబ్బతీయటానికి అనేక కుట్రలు చేసింది. కానీ వాళ్ళెక్కడా వెనక్కు తగ్గలా. చర్చలకని పిలిచారు. అక్కడ వాళ్ళకు కేకులు పెడతాం, పలావ్ పెడతాం అని ప్రభుత్వ లాంఛనాలతో భోజనం తెస్తే,

మీ భోజనం మాకు అవసరం లేదు, మా భోజనం మేం తెచ్చుకున్నాం, అదే తింటాం అని వాళ్ళొక సాంప్రదాయాన్ని సృష్టించి, రైతుల పరువు నిలిపారు. అది ఎలాంటి పరిస్థితి అంటే కేరళ నుండి, తమిళనాడు నుండి, ఆంధ్ర నుంచి కూడా 80 ఏళ్ళు నిండిన వృద్ధుల నుండి 30 ఏళ్ళ యువకుల వరకు ఉత్తేజితులై ఢిల్లీ వెళ్ళి వాళ్ళకు సంఘీభావం తెలియజేశారు. మొత్తం భారతదేశవ్యాప్తంగా రైతాంగం, ఇతర ప్రజానీకం ఢిల్లీ వెళ్ళి సంఘీభావం తెలియజేసారు. ఆ ఉద్యమంలో చేరారు. అంతేకాదు పంజాబ్, హర్యానాల్లో ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళు, సైన్యంలో చేస్తున్నవాళ్ళు, పోలీసుల్లో చేస్తున్నవాళ్ళు సెలవులు పెట్టి కుటుంబాలతో తరలివచ్చి జాతీయోద్యమంలో పాల్గొన్నట్లుగా ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. మామూలుగా ఇలా దీర్ఘకాలం ఉద్యమాలు చేస్తున్నప్పుడు ఆహారం ప్రధానమైన సమస్యగా ఉంటుంది. మామూలుగా అయితే బాగా డబ్బులున్న వాళ్ళ దగ్గరకు వాళ్ళు వెళ్ళి స్పాన్సర్ చేయమని అడుగుతారు. అక్కడ పరిస్థితి అది కాదు. అక్కడ పాల్గొన్న వాళ్ళంతా స్వయంగా కాంట్రిబ్యూట్ చేశారు. వంటశాలలు పెట్టుకున్నారు. వచ్చిన వాళ్ళందరికీ తిండి పెట్టారు. మేం కూడా అక్కడికి వెళ్ళినప్పుడు ఆ వంటశాలల దగ్గరే రోడ్లపై కూర్చుని భోజనం చేశాం. ఈ సందర్భంగా ఆ వంటకు సంబంధించిన అనేక పనుల్లో వారంతా నిమగ్నమై పనిచేశారు. సెలబ్రిటీల దగ్గర నుండి సామాన్య ప్రజల వరకు అనేక మంది ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. ఆ ఉద్యమం అంత కాలం కొనసాగటానికి ప్రధాన కారణం వృద్ధులు నుండి యువకుల వరకు, మహిళలు, పిల్లా జెల్లా అంతా అందులో పాల్గొవటం. ఈ ఉద్యమం కారణంగానే ప్రభుత్వం చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను వాళ్ళు ఉపసంహరించుకోవలసి వచ్చింది. మామూలుగా ఉపసంహరించలా. రైతాంగానికి క్షమాపణ చెబుతూ ప్రధానమంత్రి మూడు చట్టాల ఉపసంహరణ ప్రకటన చేశాడు. ఇంత దీర్ఘకాల ఉద్యమం చేసిన తర్వాత, చారిత్రాత్మక ఉద్యమం చేసిన తర్వాత సాధించిందేమంటే రుణవిముక్తి జరిగిందా? జరగలేదు. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించమని కోరాం. అదీ జరగలేదు. కానీ ఆ చట్టాలను ఉపసంహరించేట్లు ఈ ప్రజా ఉద్యమం చేయగలిగింది. ఈ కాలంలో అక్కడ ఉద్యమిస్తున్న వారిలో 740 మంది రైతులు తమ ప్రాణాలు కోల్పోయారు. వివిధ రకాలుగా ఈ మధ్య ఫిబ్రవరి 13న వేలాది మంది ట్రాక్టర్లపై వెళ్ళి దాదాపు 200 సంఘాలు, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ వెళ్ళారు. ఇక్కడ గమనించాల్సిందేమంటే నిలకడగా, ఐక్యంగా పోరాటం సాగిస్తే ఏదైనా సాధించటం సాధ్యమేనని ఈ ఉద్యమం నిరూపించింది. రైతు సంఘాలు కలిసిన సంఘర్షణ సమితి ద్వారా ఇది సాధించబడింది. ఇక్కడ రాజకీయ పార్టీలు కలవలా. అవి ఉద్యమానికి మద్దతు తెలియజేశాయి. జరిగింది ప్రజల ఐక్యత, రైతుల ఐక్యత. ఈ బేసిస్ మీద ఆ ఉద్యమం నడిచింది.

ఇప్పుడు కనీస మద్దతు ధర గురించి మాట్లాడుకుందాం. 1944 లో గుంటూరులో మార్కెటింగ్ కమిటీకి ఎన్నికలు జరిగాయి. ఆ సంవత్సరంలోనే అఖిల భారత రైతు మహాసభ విజయవాడలో జరిగింది. అప్పుడు రైతు ఉద్యమం తీవ్రంగా సాగుతుండిన కాలం. గుంటూరు మార్కెటింగ్ కమిటీకి జరిగిన ఎన్నికల్లో రైతు సంఘం ప్రతినిధులు నలుగురు గెలిచారు. దానికి ఛైర్మన్‌గా కొల్లా వెంకయ్య గారు ఎన్నికయ్యారు. పొగాకుకు తగిన రేటు రావటం గురించి అప్పుడు చాలా ప్రయత్నం జరిగింది. తర్వాత చాలా కాలానికి టంగుటూరులో రైతులు తీవ్ర ఆందోళన చేసారు. ఆందోళనకారులపై పోలీసు కాల్పులు జరిగిన తర్వాత మాత్రమే పొగాకు బోర్డు ఏర్పాటు చేశారు. ఈ బోర్డు ఏర్పాటయిన తర్వాత పొగాకు రైతులకు ఒక రేటు దొరుకుతోంది. వేలంపాటలు జరుగుతున్నాయి. అమ్మిన వాళ్ళకు చెక్కు రూపంలో చెల్లింపులు జరుగుతున్నాయి. అంటే లోపాలు లేవని కాదు. పోరాటాల ద్వారా మాత్రమే కాటన్ కార్పొరేషన్ ఏర్పడింది. పత్తికి ఒక రేటును అది నిర్ణయిస్తుంది. అలాగే చెరుకు ఫ్యాక్టరీలు కూడా ఒక రేటుకు తక్కువగా కొనకూడదు అనేది వచ్చింది. ఇవన్నీ పోరాటాలు, ఉద్యమాల ద్వారానే సాధ్యమయ్యాయి. ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్ ఏమిటంటే ఏదైనా సమస్య ఉందంటే ఒక పెద్ద రాజకీయ నాయకుడిని పట్టుకోండి. ఎంతోకొంత ముట్టజెబితే పనైపోతుంది అనే విధంగా లాబీయింగ్ నడుస్తోంది. అది తప్పు, సరైనది కాదని మనందరం గ్రహించాలి. చిన్న సమస్య ఐనా, పెద్ద సమస్య ఐనా ప్రజల మధ్య ఉండి, ఈ ప్రజలతో కలిసి నడిచి, వారిని చైతన్యపరచి ఉద్యమాలు నిర్మించాలి. ఉద్యమాలు వస్తే తప్ప భారతదేశం బాగుపడదు.

భారతదేశం వ్యవసాయ దేశం. వ్యవసాయం సంక్షోభంలో ఉంది. దీని నుండి బయటపడాలంటే ప్రభుత్వం మెడలు వంచాలి. ఉద్యమాల ద్వారా మాత్రమే అది సాధ్యపడుతుంది. 140 కోట్ల జనాభా ఉంది మన దేశంలో ఇంత మందికి తిండి ఎక్కడ దొరుకుతుంది? చదువుకున్న కుర్రవాళ్ళందరూ అమెరికాకు వెళ్ళిపోతున్నారు, లేకపోతే బెంగుళూరు వంటి మహానగరాలకు వెళ్ళిపోతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటూ, ఎక్కువ చదువు లేకుండా, కాస్తో కూస్తో టెక్నికల్ నాలెడ్జ్ ఉన్నవాళ్ళు గల్ఫ్ దేశాలు వెళ్తున్నారు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్నారక్కడ. ఆడవాళ్ళయితే పనిమనుషులుగా కూడా వెళ్తున్నారు. గ్రామాల్లో నైపుణ్యతతో వ్యవసాయం చేసేవాళ్ళు తగ్గిపోతున్నారు. వ్యవసాయం మీద ఎవరికీ ఇంటరెస్టు ఉండటం లేదు. ఎందుకంటే వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు కాబట్టి. అదే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి, ఆ ధరకు కొంటే ఎంతో తేడా వస్తుంది. ఒక క్వింటాలు ధాన్యం ఎంఎస్‌పి చట్టం చేసి ఆ ప్రకారం గనుక కొనుగోలు జరిగితే కనీసం పదివేలరూపాయలు తేడా వస్తుంది ఎకరానికి. పదెకరాలు వ్యవసాయం చేస్తే లక్షరూపాయలు తేడా వస్తుంది. అప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దయాదాక్షిణ్యాల పేరుతో ఇచ్చే రైతు భరోసాలు అవసరమే

లేదు. ఒకళ్ళు 6 వేలు ఇస్తామంటారు. ఒకళు ్ళ 7 వేలు ఇస్తామంటారు. కనీస మద్దతు ధరను చట్టం చేస్తే రైతులే వాళ్ళకు చందా ఇవ్వగలిగే పరిస్థితిలో ఉంటారు. ఇవాళ గ్రామాల్లో వ్యవసాయం చేసేవారి సగటు వయసు 50 సం॥ల పైనే. యువకులు ఎవరూ వ్యవసాయం చేయటంలా. యంత్రాలే వ్యవసాయం పనులు చేస్తున్న పరిస్థితి ఉంది. వ్యవసాయంలో మనిషి పాత్ర తగ్గిపోతోంది. ఎందుకని ఇక్కడ గిట్టుబాటు కావటంలేదు. ఇక్కడ లాభం రావటం లేదు. అందుకని. ఎడారుల్లో వెట్టిచాకిరీ చేయటానికి గల్ఫ్ దేశాలు పోతున్నారు. అదే ఇక్కడే వ్యవసాయం కాస్తోకూస్తో లాభసాటిగా ఉంటే వాళ్ళు వలసలు పోవల్సిన పనే ఉండదు. వ్యవసాయాన్ని వదిలిపెట్టి పట్టణాలకు వలసపోయిన వారి పరిస్థితి ఘోరంగా ఉంది. అక్కడేమీ సరైన ఉద్యోగాలు లేవు. చిన్న చిన్న పనులు చేసుకోవాల్సిందే. జీవితాలు దుర్భరంగా అవటానికి వ్యవసాయం సంక్షోభంలో ఉండటమే కారణం అది లాభసాటిగా ఉంటే అమెరికా వెళ్ళాల్సిన పని లేదు, గల్ఫ్ దేశాలకు వెళ్ళాల్సిన పనిలేదు. గ్రామాల్లో ఉండే మిగులును పరిశ్రమల్లో పెట్టుకుని అభివృద్ధి చేసుకోవచ్చు.

ఇటీవలే ఎన్నికలు జరిగాయి. వాటిల్లో పవన్ కళ్యాణ్ గారు 'మట్టిలో నుంచి కస్తూరి పరిమళాలు తీసే వ్యక్తి రైతు. కడుపు నింపేవాడు రైతు. అంత గొప్ప రైతు ఈ రోజు కన్నీళ్ళు పెడుతుంటే, సమస్యలు చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏంటి? గిట్టుబాటు ధర లేదని చెప్పాల్సిన అవసరం ఏంటి? అది ప్రభుత్వాల బాధ్యత కాదా? అధికారుల బాధ్యత కాదా? దీని కోసం వాళ్ళు చెప్పుకోవాలా ? రోడ్ల మీదకు రావాలా ? అన్నం పండించే రైతుకు మనం అండగా ఉండకుండా ఉంటే ఇంకెవరికి అండగా ఉంటాం? అన్నమే లేకపోతే ఇంకేముంది? అలాంటి రైతుకు అండగా లేకుండా ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి?' అని చెప్పారు. మరి ఈ రోజు మనం ఆయనను ప్రశ్నించాలి. రైతుల సమస్యలు పరిష్కారం చేయమని ఆయనను డిమాండ్ చేయాలి. కంగనా రనౌత్ అనే బాలీవుడ్ హీరోయిన్ ఢిల్లీలో రైతుల పోరాటం జరుగుతూంటే వీళ్ళంతా అతివాదులు, విధ్వంసకులు, దేశాన్ని విడగొట్టేవాళ్ళు, ఎందుకూ పనికిరాని వాళ్ళు అక్కడ కూర్చున్నారు. మనిషికి వందరూపాయలు ఇచ్చి వాళ్ళందర్నీ అక్కడ కూర్చోబెట్టారు అని ఆవిడ వ్యాఖ్యానించింది. ఇటీవలే ఆమె చండీఘర్‌లో విమానం ఎక్కటానికి ఎయిరోపోర్టుకు వస్తే అక్కడ పనిచేసే సెక్యూరిటీ గార్డు కుల్వీందర్ కౌర్ ఆమెను ఈడ్చి లెంపకాయ కొట్టింది. బయటకు వచ్చి ఆ నటి చాలా యాగీ చేసింది. నన్ను కొడుతుందా, ఈ టెర్రరిస్టులను ఇలాగే వదిలేస్తారా, నన్ను కొడితే ఎవరూ స్పందించరా అని గోలగోల చేసింది. కుల్వీందర్ ఆమెను కొట్టగానే ఊరుకోలేదు, పెద్దగా అరిచింది. ఏమనంటే 'నేను పంజాబ్ రైతు బిడ్డను. మా అమ్మ ఢిల్లీ పోరాటంలో పాల్గొంది. అలాంటి వాళ్ళను వంద రూపాయలకు కూలికి వెళ్ళి కూర్చున్నారు అని అవమానిస్తే నేను సహించను' అంది. ఈ సంఘటన తాలూకు వీడియో వైరల్ కూడా అయింది. ఆవిడకు జేజేలు.

నాకు తెలిసిన కొన్ని విషయాలను మీతో పంచుకునేందుకు అవకాశం కల్పించిన రైతుకూలీ సంఘం వారికి ధన్యవాదాలు. నమస్తే.

---

నేనింకా నిషిద్ధ మానవుడినే
నాది బహిష్కృత శ్వాస
నా మొలకు తాటాకు చుట్టి
నా నోటికి ఉమ్మి ముంత కట్టి
నన్ను నలుగురిలో
అసహ్య మానవ జంతువుని చేసిన మనవు
నా నల్లని నుదుటి మీద బలవంతంగా
నిషిద్ధ ముద్ర వేసినప్పుడే
నా జాతంతా క్రమంగా హత్య చేయబడింది
నిన్నటి చరిత్ర బొటనవేళ్ళనే కోసింది
వర్తమానం ఐదు వేళ్ళనూ నరికేస్తుంది
మా చావుకి వెల కూడా నిర్ణయించబడుతోంది
మాకిప్పుడు కావలసింది నెత్తుటి రొక్కం కాదు
మాకేం కావాలో కోరుకునే నిర్భయ గొంతుక
కొత్త రాజ్యాంగం

**- ఎండ్లూరి సుధాకర్**

"మనుషుల్లారా... రుణపడి పోయాం
వాళ్ళ పాదాల పగుళ్ల లోంచి రాలిన
పత్తిపూల మీద నడుస్తున్న వాళ్ళం మనం
వాళ్లు వదిలేసిన ఊపిర్లని
ఉగ్గ పట్టుకొని పీల్చుకుంటున్న వాళ్ళం మనం
తారోడ్లమీద ధార కడుతున్న వాళ్ళ రక్తం
ఇంకిపోతే మన శరీరాలు పాలిపోతాయి
ఈ శీతాకాలం వాళ్ళని కొరుక్కుతింటే
మన రూపాలు చిక్కి శల్యమైపోతాయి
కొత్త చట్టం వాళ్ళని పెట్టుబడికి నంజి పెడితే
ఈ రూపాయికి అన్నం దొరకదు
మన దేహాలు... వాళ్ళ పొలాల్లో చేసిన సంతకాలు
కావాలంటే మీ హృదయాలను అడిగి చూడండి"

**- సిద్ధార్థ కట్టా**

"రుణం తీర్చుకునే పద్యం" నుండి

## ప్రొ॥ వేణుగోపాలరావు, విశ్రాంత ప్రొఫెసర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం



రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభలకు అధ్యక్షతవహించిన ఝాన్సీగారికి, పెద్దలు, గౌరవనీయులు వడ్డేశోభనాద్రీశ్వరరావు గారికి, ఇంకా డా॥ కొల్లా రాజమోహన్ గారికి, బండ్ల శ్రీనివాస్‌గారికి, హాజరయిన ప్రతినిధులు అందరికీ నా నమస్కారాలు. ఉద్యమకారులు అనేకమంది నాకు స్ఫూర్తినిచ్చిన వారు కూడా ఇక్కడ ఉన్నారు. ఏదో యూని వర్శిటీల్లో పరిశోధనలు చేసుకుంటూ కూర్చుంటే కుదరదు. సామాజికోద్యమాలలో పాలు పంచుకోవాలని నన్ను కోరిన మిత్రులు ఇక్కడ ఉన్నారు. ఇంతకు ముందు మాట్లాడిన రాజమోహన్‌గారు ఒక విషయం చెప్పారు.

ఏ మీటింగ్‌కి వెళ్ళినా 50 సంవత్సరాలు పైబడిన వాళ్ళే కనపడుతున్నారు. ఇక్కడ యువతీ యువకులు ఎక్కువగా కనబడుతున్నారు, చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. నేను కూడా ఎడ్మైర్ అవుతున్నాను. ఇది చాలా గొప్ప విషయం.

వడ్డే శోభనాద్రీశ్వరరావు గారు, రాజమోహన్‌గారు ఢిల్లీ రైతు ఉద్యమం గురించి, కనీసమద్దతు ధర గురించి, పంటల బీమా గురించి, రుణమాఫీ గురించి అనేక విషయాలు చెప్పారు. అవన్నీ అందరం అంగీకరించేవే. దాదాపు గత 24 ఏళ్ళుగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ విషయంపైనే వ్యవసాయ సంక్షోభం, దాని పూర్వాపరాలు, దాని పరిష్కారాలేమిటి అనే దానిపై చర్చిస్తూ వస్తున్నాం. ప్రభుత్వాలు మొత్తం 7 కమిషన్లు వేశాయి. వ్యవసాయరంగ సమస్యల మీద. వాటిల్లో స్వామినాథన్ కమిషన్ ఉన్నతమైనది. దాన్ని మనం ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్తూ వచ్చాం. మద్దతు ధర గురించి గానీ, రుణమాఫీ గురించి గానీ ఉద్యమాలు చేస్తూ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను రిఫర్ చేస్తూవస్తున్నాం. ఆ నివేదిక ఆరు వాల్యూమ్స్‌లో మొత్తం 20 అంశాలను ప్రధానంగా తడిమారు. వాటిల్లో అతికీలకమైనది భూమి. దాన్ని ఎవరూ కూడా పట్టుకోవడంలా. నేటికీ భూమి గురించి ఆలోచించే దశ లేదు. 2022లో వరల్డ్ ఫుడ్ పెస్ట్ అనే ప్రపంచంలో అత్యున్నతమైన అవార్డు పొందిన రతన్‌లాల్ అనే ఆయన అతి కీలకమైన ఒక అంశాన్ని చెప్పాడు. ప్రపంచవ్యాప్తంగా విత్తనం చుట్టూ తిరిగే రివల్యూషన్ అని మనం చెప్పుకునేది ఒక ఫెయిల్యూరే అన్నాడు. విత్తనం చుట్టూ విషయం నడిచింది గానీ, భూమి చుట్టూ నడవలా. సమాజం ఏ విధంగా స్త్రీని వదిలేసి పురుషుల కోణం నుండి ఎలా ఆలోచిస్తుందో, పురుషులు ఏ విధంగా ఆధిపత్యం చేస్తున్నారో అదే పరిస్థితి వ్యవసాయరంగంలో ఉంది. క్షేత్రం గురించి ఆలోచించకుండా కేవలం బీజం గురించి ఆలోచిస్తే ఎటువంటి జాతి ఉద్భవిస్తుంది? ఆ జాతి ఏ విధంగా ముందుకెళ్ళ గలుగుతుంది? అనే కీలకమైన అంశాన్ని ఆయనలేవనెత్తాడు. డా॥ స్వామినాథన్ నివేదికను సమర్పించిన తర్వాత, తానర్థం చేసుకోలేకపోయిన విషయాన్ని రతన్‌లాల్ చెప్పినందుకు అభినందించాడు. ఇప్పటి వరకు మనం ఉత్పత్తి, ఉత్పాదకత గురించి ఆలోచిస్తూ ముందుకెళ్తున్నాం. కానీ ఆ ఉత్పత్తికి మూలం భూమి. జరిగిన మోసం ఎక్కడంటే ఆంధ్రప్రదేశ్‌లో 82 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంటే, అందులో 45 లక్షల హెక్టార్లు దున్ననివాడి చేతిలో ఉంది. మత సంస్థల ఆధీనంలో ఉన్న భూములు కావచ్చు, అబ్సెంటీ ల్యాండ్ లార్డ్ భూములు కావచ్చు. వ్యవసాయం పై ఆధారపడని వారి చేతిలో భూమి ఉంది. ఈ అంశాన్ని పరిష్కరించకుండా ఎన్ని నివేదికలు సమర్పించినా, ఎన్ని అంశాలను తడిమినా, ఎన్ని మార్పులు తెచ్చినా భారతదేశంలో వ్యవసాయరంగం నిలదొక్కుకోగలదు అనుకోవటం తప్పు. శాశ్వత పరిష్కారం కావాలంటే ముందు భూమి సమస్యను పరిష్కరించండి. పెట్టుబడిదారీ దేశాల్లో కూడా భూసంస్కరణలు చేయకుండా వాళ్ళ వ్యవసాయం నిలబడి వాళ్ళు ఉత్పత్తిని బయటకు పంపే పరిస్థితి లేదు. జపాన్‌లో గానీ, ఉక్రెయిన్‌లో గానీ దున్నేవాని అజమాయిషీలో భూమి ఉంది. మనకా పరిస్థితి లేదు. దానిని కల్పించాలి. తర్వాత అంశం భూపరిరక్షణ. ఎంత సేపు భూమి నుండి లాక్కోవాలని చూడటమే తప్ప భూమికి సారాన్ని జమ వెయ్యాలి అనేది లేకపోవటం. విదేశీ కంపెనీల రసాయనిక ఎరువులు వాడేస్తున్నాం. జీరో పెట్టుబడి వ్యవసాయం చంద్రబాబునాయుడు గారు పాలేకర్ చెప్పినట్లు చేయటం మంచి దంటాడు. ఆయన 30 ఎకరాలు ఆవుల మల మూత్రాలతో సాగు చెయ్యాలంటా. 30 ఎకరాలు, ఆవులను మెయిన్‌టైన్ చేసే రైతు మనకు ఉన్నాడా? దీనికేమీ ఖర్చువదా? ఇది జీరో పెట్టుబడి వ్యవసాయమా అని అడగటంలా ఎవరూ. రైతు కేంద్రంగా భూమి కేంద్రంగా సాగు సాగితేనే ఈ వ్యవసాయం బాగుపడుతుంది. శోభనాద్రీశ్వర రావు గారు, రాజమోహన్‌గారు చెప్పిన విషయాలు కొన్ని ఉన్నాయి. తక్షణ పరిష్కారాల కోసం మనం ఆ సమస్యలపైన ఉద్యమాలు చేసుకోవచ్చు. కానీ అన్నిటికన్నా ముఖ్యమైనది భూమి. ఇవాళ చాలామంది ఎగతాళిగా మాట్లాడుతున్నారు. భూమి ఉంటే సరిపోతుందా? భూ సంస్కరణలు ఇవాళ అవసరమా? దున్నేవానికే భూమి

అనేది కాలం చెల్లింది అంటున్నారు. కానీ భూమే కీలకం. అది లేకుండా పని జరగదు. కాబట్టి మిత్రులారా భూమి కీలకమైనదని నేనటం కాదు. ప్రపంచంలోని మేధావులంతా అంటున్నారు. దానినే రతన్‌లాల్ గారు మన ముందు పెట్టాడు. కానీ ఏ ప్రభుత్వమూ దీని గురించి ఆలోచించటం లేదు. ఏదో ఎరువుల కోసం దేశీ ఆవునొకదాన్ని పెంచుకుంటే సరిపోతుంది అని గుడ్డివాదన చెయ్యటమే కానీ, అది ఏ విధంగాను విశాల ప్రజానీకం ఆచరించటానికి అనువైనది కాదు. ఈ భూమి నాది అని రైతు అనుకోవాలి. నేను చేసే పని ఉన్నతమైనది అని రైతు అనుకోవాలి. అలాంటి రైతును మనం తయారు చేసుకోవాలి. అది జరగనంత కాలం ఏదో ఈ సంస్కరణలల్లో, కమిషన్ నివేదికలు అమలుచేయటంల్లో ఈ సమస్య పరిష్కారం కాదని నేను బలంగా నమ్ముతున్నాను. స్వామినాథన్ కమిషన్ కూడా భూసంస్కరణలు అమలు చెయ్యాలనే విషయాన్ని తడిమింది. కానీ ఈ రాజకీయ వ్యవస్థలో అది జరగదనే విషయం ఆయన చెప్పలేకపోయాడు ఆయనకున్న పరిమితులవి.

భూమిపై ఎవరైతే వ్యవసాయం చేస్తారో, వారి యాజమాన్యంలోనే భూమి అనివార్యంగా ఉంటే తప్ప ఆ వ్యవసాయం ఫలవంతం కాదు అని చెప్పిన స్వామినాథన్ గారిని మనం ఒకసారి స్మరించు కోవాల్సిందే. విత్తనం చుట్టూనే మనం పరిశోధనలన్నీ తిప్పాం. విత్తనం కావాలి, అది ఏ దేశం నుండి తెచ్చుకోవాలి అని తప్ప, మన భూమిని రక్షించుకోవటానికి ఏ ప్రయత్నం చేయలేకపోయాం మనం. ఈ రోజు నిజమైన రైతులు, ఆదివాసీలు ఎవరైతే ఉన్నారో వాళ్ళ భూములను వరి రక్షించటానికి ఈ ప్రభుత్వాలు పూనుకోనంత కాలం ఈ వ్యవసాయం రక్షించబడదు. ఇది నేను చెబుతున్నది. ప్రపంచంలో ఫుడ్ అండ్ అగ్రికల్చలర్ ఆర్గనైజేషన్ (FAO) అనే సంస్థ ఉంది. వాళ్ళు చెప్పిందేమంటే ఈ సమాజంలో ఉగ్రవాదంకానీ, పేదరికంగానీ, అనేకానేక అన్నవ్యన్న పరిస్థితులు తగ్గాలంటే వ్యవసాయం చేసే పద్ధతి మారాలి అని ఆ సంస్థ ప్రకటిస్తున్నది. కానీ ఏ ప్రభుత్వమూ పట్టించుకోవటంలా. 193 దేశాలలో 65 దేశాలు పూర్తిగా వ్యవసాయం మీదే వారి ఆర్థికవిధానం ఆధారపడి ఉంది. వాళ్ళ సంస్కారం, వాళ్ళ సంస్కృతి, వారి ఔన్నత్యం దాని మీదే ఆధారపడి ఉంది. ఇటువంటి వ్యవసాయాన్ని మనం భూమి కేంద్రంగా మారిస్తే తప్ప ఈ వ్యవసాయ సమస్యలకు శాశ్వత పరిష్కారం ఉండదని నేను నమ్ముతున్నాను. మనకు గిట్టుబాటు ధర కావాల్సిందే. పంటల భీమా కావాల్సిందే. వ్యవసాయానికి నిధులు పెంచాల్సిందే. పరిశోధనలు పెరగాల్సిందే. నేను వీటినేమీ వద్దనటం లేదు. కానీ వీటన్నింటికంటే కీలకమైనది దున్నేవాని చేతిలోకి భూమి వెళ్ళటం. Thank you very much.

“మా కండలు పిండిన నెత్తురు
మీ పెండ్లికి చిలికిన అత్తరు
మా మొగాలకీ కన్నీరా
మీ మొగాలకూ పన్నీరా
మా నోట్లో ఆకలి భగభగ
మీ నోట్లో సిజర్సుభుగ భుగ
మాకీ పడిపోయిన గోడలు
మీకేడంతస్తుల మేడలు...
బాబు గారి పాకీ దొడ్లో
పట్టపగలు ఎలక్ట్రిసిటీ
పాకివాడి పూరిపాకలో
కారు మబ్బుల కటిక చీకటి
పస్తున్నామే మేమిక్కడ
మేస్తున్నారా మీరక్కడ
ఎందాకా తమకి డాబులు?
కిందకు దిగుతారా బాబులు!”

**- కరుణశ్రీ**

“నీలిమందు పంటల నాడే
నీ లాభాల కోసం పెట్టుబడి గుంజలు పాతావు
పొగాకు పంటల నాడే
గిట్టుబాటు మాయను అప్పుల తాళ్ళుగా పేని
రైతును ఆ గుంజకు కట్టివేశావు
హరిత విప్లవాల పంగనామాలు
నీకు విస్తళ్లను వడ్డిస్తూ ఉన్నాయి
మా ఏలికలను భాగం చేసుకుని
నీవు తెచ్చి పెట్టిన విత్తన పాలసీలు
ఎరువులై,తెగుళ్లయి,క్రిమిసంహారక లాభాలై
నీ నెత్తిన పాలు పోస్తూ ఉన్నాయి
రైతును అప్పుల ఊబుల్లోకి తొక్కుతూ ఉన్నాయి
మన్మోహనంగా నీవు మెరుగులు దిద్దిన
సరళీకరణల వధ్యశిల
మా గ్లోబల్ గ్రామాల రచ్చబండలపై
ఆత్మహత్యల శవ పేటికలను పేర్చుతూ ఉంది”

**- ఓ.వి.వి.ఎస్**

"పోరుమడులు"నుండి

## శ్రీ బండ్ల శ్రీనివాస రావు, మాజీ ఐఏఎస్ అధికారి



రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన 'వ్యవసాయరంగ సంక్షోభం - పాలకుల విధానాలు - మన కర్తవ్యాలు' అనే అంశంపై జరుగుతున్న సదస్సులో నేను మాట్లాడటానికి అవకాశం కల్పించిన రైతుకూలీ సంఘం వారికి ధన్యవాదాలు.

రాష్ట్రంలోను, దేశంలోను ఎన్నికలు వచ్చాయి. మళ్ళీ 5 సంవత్సరాలు వరకు దాని ఊసే ఉండదు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు రెండు సంవత్సరాలలో వస్తాయి. ఈ సందర్భంగా వివిధ పార్టీలు విడుదల చేసే మ్యానిఫెస్టోలు, చేసే హామీలు అన్నీ కూడా ఎన్నికల్లో గెలవడం కోసం మాత్రమే. ఎవరికి వారు కోట్ల రూపాయలు సంపాదించుకుంటున్నారు. ఖర్చు పెడుతున్నారు. మళ్ళీ సంపాదించుకుంటున్నారు. ఎన్నికల్లో పోటీపడతారు. కానీ, దేశంలో ఉన్న బాటమ్ (అణగారిన జనం) 50% - 60% ప్రజలలో ఈ పెద్దమార్పులు వస్తాయని నేను అనుకోవడం లేదు. రాజకీయ పార్టీల నాయకులు ప్రకటిస్తున్నాయి. కొన్ని తేలికగా ఉండేవి చేస్తారు, మిగిలిన వాటిని మాయమాటలు చెప్పి తప్పించుకుంటారు. ఇది రియాలిటి అయితే మనం ఏం చేయాలి? మళ్ళీ 5 సంవత్సరాలు దాకా ఏం చేయలేం. మనం ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని మార్చారు. కేంద్రంలో మోడీని మార్చాలనుకున్నారు. ఈ వేదికమీద ఉన్నవాళ్ళందరూ అది జరగాలని ఎంతో కష్టపడ్డారు. దేశంలో ఇంకా చాలా మంది కష్టపడ్డారు. ఇండియా ఎలయన్స్‌గానీ, సివిల్ సొసైటీస్ గానీ, లెఫ్ట్ పార్టీలు అందరూ కష్టపడ్డారు కానీ, మనం టార్గెట్‌కు దగ్గరకెళ్ళి ఆల్ అవుట్ అయ్యాం. ఇంకో 5 సంవత్సరాలు ఆయనే పరిపాలిస్తాడు. మరిమనమేం చేయాలి? అడక్కపోతే అమ్మైనా అన్నం పెట్టదంటారు కదా! మనం ఉద్యమాలు కంటిన్యూ చేయాలి. ఇంకా కొత్త కొత్త విధానాలు మనం కనుక్కోవాలి. పాలకులను, అధికారులను ప్రశ్నించే మనస్తత్వాన్ని మనం అభివృద్ధి చేసుకోవాలి. నేను కేరళలో చాలా సంవత్సరాలు పని చేసాను. అక్కడ ప్రజలకు ప్రశ్నించే మనస్తత్వం ఉంది. అందువల్లే అక్కడ పొలిటీషియన్‌లైనా, ఆఫీసర్లయినా ఒక రూలు ప్రకారం వెళ్తారు. చట్టం ప్రకారం వెళ్తారు. పబ్లిక్ ఇంట్రస్ట్ చూసుకొని వాళ్ళు ప్రవర్తిస్తారు. ఇప్పుడు కేరళలో కూడా కొంచెం తేడా వస్తోంది. లంచగొండితనం ప్రబలుతోంది. అయినా కూడా ఎన్నో సంవత్సరాలుగా భూసంస్కరణలు అమలు జరిగాయి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయి. ఆరోగ్యం బాగుంది. విద్య చాలా బాగుంది. ఇవన్నీ ఎందువల్ల అంటే జనాలు పవర్‌ఫుల్‌గా ఉన్నారక్కడ. ఇక్కడ మనం ఎమ్ఆర్ఓ ఆఫీసుకెళ్ళి అక్కడ వాళ్ళకు డబ్బులిచ్చి పని చేయించుకుని వస్తాం. మనం ప్రశ్నించటం లేదు ఎవరినీ. ఇంత లంచగొండితనం ఉన్న ఆంధ్ర రాష్ట్రంలో లంచానికి విరుద్ధంగా ఒక ఆందోళనను నేను చూడలేదు. దాదాపు 32 సంవత్సరాలుగా నేను ఈ రాష్ట్రంలో లేను. 2020లో రిటైరైనాక ఇక్కడకు వచ్చాను. ఇక్కడ కరప్షన్‌కు వ్యతిరేకంగా ఎవరూ కూడా మాట్లాడరు. ఎందుకంత భయం? ఒక రాజకీయ నాయకుడిని క్వశ్చన్ చేయడానికి చాలా భయపడతారు. వాళ్ళనొక పులిలానో, సింహంలానో చూస్తారు. ఒక ఎమ్.ఆర్.ఓ. అన్నా, ఆర్‌డిఓ అన్నా, కలెక్టర్ అన్నా ఇక్కడ జనాలకు ఎందుకంత భయమో నాకర్థం కావటం లేదు. మానసికంగా స్ట్రాంగ్‌గా ఉండాలి మనం. వాళ్ళూ మనలాంటి మనుషులే. వాళ్ళు తీసుకునే జీతం మనందరం కట్టే ట్యాక్సులు మాత్రమే. గవర్నమెంటుకి డబ్బు చెట్ల నుంచి కాయటం లేదు. మన దేశంలో భిక్షగాళ్ళు కూడా ట్యాక్స్ కడుతున్నారు. వాళ్ళకవసరమైన ఏ వస్తువులు కొనుకున్నా దాని మీద జిఎస్టీ పే చేస్తున్నారు. మనందరం పే చేసే ఈ జీఎస్టీతోనే ఈ ఆఫీసర్లుగానీ, మంత్రులు గానీ, ఎమ్మెల్యేలు గానీ, ఎంపీలు గానీ బ్రతుకుతున్నారు. వాళ్ళకు వెళ్ళే ప్రతి పైసా మన కష్టంలో నుంచే వెళ్తోంది. అటువంటప్పుడు వాళ్ళను ఎందుకు నిలదీయలేకపోతున్నాం? మనను మనం ప్రశ్నించుకోవాలి. వీళ్ళ ముందు ఎప్పటికీ సరెండర్ అవ్వకూడదు. మీరు చేసే యాజిటేషన్ కంటిన్యూ చెయ్యాలి. ఇప్పుడు యుద్ధాలు జరుగుతున్నాయి. రోడ్లు వేస్తున్నారు. పెద్ద పెద్ద బిల్డింగ్‌లు కడుతున్నారు, రైల్వేలైన్లు వేస్తున్నారు. వివిధ ప్రాజెక్టులు కడుతున్నారు. అందులో ఎంత కరప్షన్ ఉందో మీరు చదవటం మొదలుపెట్టాలి. ఒక చిన్న రోడ్డుకి 20 లక్షలు అయితే అందులో 10 లక్షలకు మించి ఖర్చుపెట్టడం లేదు. కేరళలో కూడా వందరూపాయలలో 60 రూపాయలు మాత్రమే ఖర్చువుతున్నాయి. మిగిలిన 40 రూపాయలు ఆఫీసర్లు, పొలిటీయన్లు, కాంట్రాక్టర్లు పంచుకుంటున్నారు. ఆంధ్రాలో అయితే వందరూపాయల్లో 35 రూపాయల నుండి 40 రూపాయలు వరకు మాత్రమే ఖర్చుపెడుతున్నారు. మన చేతిలో నుండి 10 రూపాయల నోటు జారిపోతే, ఎవరైనా దాన్ని తొక్కినా సరే, మన పది రూపాయల నోటు మనం తీసుకుంటాం. కానీ మనం కట్టే ట్యాక్సుల నుండి దాదాపు 50 శాతం వేరే వాళ్ళు తినేస్తున్నారు అనే విషయాన్ని మనమెందుకు గ్రహించటం లేదు? ప్రతి రోడ్డుకి ఒక ఎస్టిమేట్ ఉంటుంది. అది ఎలా ఉందో ఆర్‌టిఐ ఫైల్ చేసి మనమెందుకు

అడగటం లేదు? ఆ ఎస్టిమేట్ ప్రకారం ఇంత ఇసుక వాడాలి. ఇంత గులకరాళ్ళు వాడాలి. ఇంత తారు వాడాలి అని క్లియర్‌గా రాసి ఉంటుంది. మన గ్రామ పంచాయితీల్లోని, మన జిల్లాల్లోని ఆర్‌టిఐ ద్వారా ఫైల్ చేసి మనమెందుకు అడగటం లేదు? కాంట్రాక్టరు ఆ మెటీరియల్ ఎస్టిమేట్ ప్రకారమే వాడుతున్నారా అనేది మనమెవరం చెక్ చేయడం లేదు. మనం ఐక్యంగా ఉండాలి. గ్రూపులు గ్రూపులుగా ఏర్పడాలి. స్టూడెంట్స్‌గానీ, యువకులుగానీ, మధ్యవయస్కులుగానీ, రిటైరైనవాళ్లు గానివ్వండి, అందరూ చేయగలిగిన పని ఇది. కానీ మనం చేయటం లేదు. మనలో ఒక ఇండిఫరెన్స్ (నిర్లప్తత). మరి మనలో శక్తి అయిపోయిందో, లేకపోతే నిరాశలలో ఉన్నామో, నిస్పృహలో ఉన్నామో, అలా అయితే మన సొసైటీ ముందుకు వెళ్ళదు. మనం ఎప్పుడూ ఇలాగే ఉంటాము. ఎలక్షన్లు వస్తాయి. ఆఫీసర్లు ఉంటారు. పొలిటీషియన్లు ఉంటారు, వాళ్ళంతా కుమ్మక్కవుతారు, మన డబ్బుల మీద వాళ్ళు బ్రతుకుతారు. అంతేకాక ప్రజాసంపద మన భూమి, నీరు, ఖనిజాలు ఏదైనాగానీ వాళ్ళంతా కుమ్మక్కయి లాగేసుకుంటారు. అదంతా మన సంపదే కదా! అడవి, అడవిలో ఉండే సంపదంతా మనదే గదా! మనలో ప్రతి వాళ్ళకు దేశంలో ఉన్న సంపదపైన ఒక హక్కు ఉంది. కాని ఆ సంపదను 1శాతం, 2 శాతం ఉన్న ఆఫీసర్లు, పొలిటీషియన్లు తీసుకుపోతున్నారు. మరి మన చైతన్యం ఏమిటి? మనం ఆలోచించాలి. ప్రాక్టికల్‌గా, గ్రౌండ్ లెవెల్‌లో మనమేమైనా చేయగలిగితేనే మన భవిష్యత్తు క్రియేట్ చేసే అవకాశం మనకు వస్తుంది. అది చేయనంతకాలం, మనలో చైతన్యం లేనంతకాలం మనదేశం ముందుకు వెళ్ళదు. మనం మీటింగులు పెట్టుకుని, చప్పట్లు కొట్టుకుని వెళ్ళిపోతూనే ఉంటాము. దేశం మాత్రం మారదు. ఈ అడుగున ఉన్న 50, 60 శాతం ప్రజల జీవితాలు మారాలి అంటే కొత్తగా మనం ఆలోచించాలి, కొత్తకొత్త రివల్యూషన్స్ ఈ దేశంలో తీసుకురావాలి. 140 కోట్ల జనాభా మనది. అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ ఎంతమంది వెళ్తారండి. ఎవరు వెళ్ళగలరండి. 1960ల నుండి అమెరికాకు వెళ్తూనే ఉన్నాం మనం. తిప్పితిప్పితే అమెరికాలో మన వాళ్ళు ఉన్నది 30 లక్షల మందే. ఇతర దేశాల అంత సులువుగా మననేమీ రానివ్వటం లేదు. వివిధ కారణాలతో ఆపేస్తున్నారు. వీసా లిస్తున్నారు గదా అని స్టూడెంట్స్ వెళ్తున్నారు. ఎందువల్ల అంటే మన వల్ల యూనివర్శిటీలకు చాలా డబ్బులు వస్తాయి. అలా వెళ్ళిన వాళ్ళందరికి ఉద్యోగాలు రావటం లేదు. చాలా మంది వెనక్కు వచ్చేస్తున్నారు. ఇంకొక దేశం వెళ్ళిపోవటమనేది మనకు సొల్యూషన్ కాదు. కొంత మంది గల్ఫ్ వెళ్తారు. ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, డ్రైవర్లు, నర్సులు ఇలాంటి వాళ్ళు వెళ్తారు. 140 కోట్ల మందిని ఎవరు రానిస్తారండి? మనం ఇక్కడే మనకు ఉద్యోగాలు చూసుకోవాలి. ఇక్కడ మనం ఉత్పత్తి పెంచుకోవాలి. మన వ్యవసాయం అభివృద్ధి చెందాలి. మనం పరిశ్రమలు స్థాపించుకోవాలి. అందుకోసం మనం కష్టపడాలి. కరప్షన్ అనే దాన్ని మనం ఆపగలిగి ఉండాలి. ఇంతకన్నా ఎక్కువ చెప్పలేను. భవిష్యత్తులో నేను రైతులతోటి, రైతుసంఘాలతోటి, ఆదివాసీలతోటి కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నాను. దానికి ఇప్పుడు నేర్చుకుంటున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు అందరికీ ధన్యవాదాలు. నమస్తే.

"శత్రువులెవరో మాకు స్పష్టత ఉంది
నేడు కుర్చీలో ఉన్న నువ్వో
నిన్న కుర్చీ దిగినవాడో
రేపు కుర్చీ ఎక్కబోయే మరొకడో
మీరంతా ఆడేది కుర్చీలాటని
వాడు చెప్పినట్టల్లా ఆడే
తోలుబొమ్మలని కూడా మాకు తెలుసు
ఈ చట్టాలు పోయినా
రేపు మరొకటి మా నెత్తి మీదకి
తెస్తారని తెలుసు
ఎందుకంటే ఆట, ఆట నియమాలు
మీ చేతుల్లో లేవని మాకు అవగతమే"

**- ఐ.టి.ఆర్.వి. శివాజీ రావు**

"ఆగదు మా పోరు" నుండి

"పెట్టుబడులను మించు- రెట్టింపు వడ్డీలు
జమ చేసి వ్యాపారి -సడలగొట్టె
షేర్లు పెనాల్టీలు- చెల్లింపు తిరుగుళ్ళు
కట్టించి బ్యాంకులు -కమల గొట్టె
ధాన్యంబులను తగ్గు -ధరలకు గైకొని
కొనుగోలు బేహారి కుములగొట్టె
తికమకల్ కలిగించు- రకరకంబుల శిస్తు
విధియించి సర్కారు విదలగొట్టె
ఇన్ని దెబ్బలు దిని- మూల్గ చున్న నిన్ను
బ్లాక్ మార్కెట్ల ధరలు పై -పైకి దుమికి
ప్రాణములుదీయ దబదబ - బాదుచుండ
రాల్చకుండునె కన్నీరు - రైతుబిడ్డ"

**- ఇనగంటి పున్నయ్య చౌదరి**

"రైతు కన్నీరు" కావ్యం నుండి (1923)

# గ్రామీణ యువత – నిరుద్యోగం – వలసలు

**వి.వి. లక్ష్మీనారాయణ,** రిటైర్డ్ ఐపిఎస్, అధ్యక్షులు, జై భారత్ నేషనల్ పార్టీ



రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో ఈ రోజు "వ్యవసాయ రంగ సంక్షోభం – పాలకుల విధానాలు – మన కర్తవ్యాలు" పై ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు 'గ్రామీణ యువత – నిరుద్యోగం – వలసలు' అనే విషయంపై మాట్లాడటానికి నాకు అవకాశం ఇచ్చినందుకు రైతు కూలీ సంఘం వారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.

విషయంలోకి వెళ్ళే ముందు రెండు ఘటనలు గుర్తు చేస్తాను. రెండురోజుల క్రితం పేపర్లో వార్త. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంలో ఇద్దరు భారతీయులు చనిపోయారు. ఇంతకు ముందు కూడా ఇద్దరు భారతీయులు ఆ యుద్ధంలో చనిపోయారు. అంటే వందల మంది భారతీయ యువకులను ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి వారిని రష్యాకు తీసుకువెళ్ళి, రష్యా సైన్యంలో వారిని హెల్పర్లుగా తీసుకుంటే, మనవాళ్ళు నలుగురు చనిపోయారు. ఒకరు సూరత్ నుండి, ఒకరు పంజాబ్ నుండి, ఒకరు హైదరాబాదు నుండి వెళ్ళిన వాళ్ళు. ఇక్కడి పిల్లలు రష్యా సైన్యంలోకి వెళ్ళాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఇక్కడ ఉద్యోగాలు దొరక్క, ఉపాధి కోసం ఎక్కడికో వెళ్ళాల్సిన అవసరం వారికి ఏర్పడింది. ఇక్కడ వాళ్ళకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది. మరి వారి విధానాలు ఈ విషయంపై ఎలా ఉన్నాయో గమనించాలి. 2022లో రైల్వే వాళ్ళు 35000 నాన్–టెక్నికల్ పోస్టులను ప్రకటిస్తే దానికి ఒక కోటి 25 లక్షల మంది అభ్యర్థులు అప్లై చేశారు. ఇది నిరుద్యోగ తీవ్రతకు అద్దం పడుతుంది.

ఇంకో సంఘటన చూద్దాం. ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య యుద్ధం జరుగుతోంది. ఇజ్రాయిల్ సుమారుగా లక్ష మంది పాలస్తీనియన్లను ఉద్యోగాల నుండి తీసివేసింది. ఆ లక్ష మందిని రీప్లేస్ చేయటానికి వారు భారతదేశాన్ని అభ్యర్థించారు. భారతదేశంలో ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ మూడు రాష్ట్రాల నుండి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి ఇజ్రాయిల్‌లో ఖాళీలు భర్తీ చేయటానికి పంపిస్తున్నారు. అంటే భారతదేశ యువతకు ఇక్కడ ఉద్యోగాలు ఇవ్వకుండా ఎక్కడో యుద్ధం జరుగుతున్న ప్రాంతంలోకి పంపించడమనేది ఎంత వరకు సరైనది?

ఇంకొకటి విశాఖపట్నంలో సుమారు వందమందిని వియత్నాం దేశానికి తీసుకువెళ్ళారు. వాళ్ళకు సింగపూర్‌లో ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి, వారిని వియత్నాం తీసుకువెళ్ళి అక్కడ వారిని ఆర్థిక నేరాలు, కంప్యూటర్ల నేరాలు, సైబర్ నేరాలు చెయ్యవలసిందిగా బెదిరించి ఆ పనిలో పెట్టారు. ఈ ఉదాహరణలు నేనెందుకు చెబుతున్నానంటే యువతరం పరిస్థితి ఎలా ఉంది? వారికి చెందవలసిన ఉద్యోగాలు ఏమైపోతున్నాయి? వారికి ఉద్యోగాలు కల్పించాల్సిన పాలకులు వారి బాధ్యత నిర్వహిస్తున్నారా లేదా అనేది మనందరం ఆలోచించాలి. ఏలూరు వస్తున్నప్పుడు దారిలో నాకు అనేక ఇంజనీరింగ్ కాలేజీలు కనపడ్డాయి. అవేకాక ఇంకా ఇతర విద్యాసంస్థలు కూడా చాలా ఉన్నాయి. ఇక్కడ మాత్రమే కాదు దేశవ్యాప్తంగా. మరి ప్రతి సంవత్సరం ఆయా కాలేజీల్లో చదువు పూర్తి చేసుకుని బయటకు వస్తున్న విద్యార్థులు ఏం చేస్తున్నారని ఒకసారి మనం ఆలోచిస్తే చాలా మందికి ఉద్యోగాలు లేక, కేవలం ప్రభుత్వోద్యోగాలు మాత్రమే కాదు, ఏ ఉద్యోగాలు లేక వాళ్ళెలా జీవిస్తున్నారన్నది పెద్ద సమస్యగా మారింది. ఇప్పుడు భారతదేశంలో 18 నుండి 35 సం॥ వయసున్న యువతరాన్ని తీసుకుంటే వారిలో 24% నిరుద్యోగిత ఉంది. 20 నుండి 25 సం॥ వయసు వారిని తీసుకుంటే వారిలో 40 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారు. ఈ పరిస్థితి నుండి వారినెలా బయటకు తీసుకురావాలి అని ఆలోచించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది.

మరి ఆ ప్రభుత్వాలలో ఉన్న పాలకులు అలాంటి బాధ్యతతో ఉన్నారా అని ఆలోచిస్తే, ఇటీవలే జరిగిన ఎన్నికల గురించి ఒకసారి మాట్లాడుకుందాం. ఎన్నికల్లో నిలబడాలనుకున్న అభ్యర్థులను రాజకీయ పార్టీలు మీ దగ్గర 40 కోట్లు ఉన్నాయా, 50 కోట్లు ఉన్నాయా అని అడుగుతున్నారు. అవి ఉంటేనే సీట్లు ఇవ్వడం, వాళ్ళనే ఎన్నికల్లో నిలబెట్టటం, వాళ్ళను మనం ఎన్నుకోవటం జరుగుతోంది. ఈ విధమైన ఎన్నికల ప్రక్రియ ఉన్నప్పుడు, ఆ ఎన్నికైన వాళ్ళు ఏమాలోచిస్తారు. యువతరానికి ఉద్యోగాలివ్వటం గురించి ఆలోచిస్తారా లేక వారు పెట్టిన 50 కోట్లకు 5 రెట్లు, 10 రెట్లు ఎలా సంపాదించాలా అని ఆలోచిస్తారా? మనం ఆలోచించాలి. ప్రజాస్వామ్యంలో వాళ్ళను పాలకులుగా పంపిస్తున్నది మనమే. మన బాధ్యతను కూడా సక్రమంగా నిర్వర్తిస్తున్నామా, లేదా అన్నది కూడా ఆలోచించాలి. పేద

విద్యార్థులు, పేద యువకులు ఇంతకు ముందు చెప్పిన విధంగా రష్యాకో, వియత్నాంకో లేదా ఇజ్రాయిల్‌కో వలసలు పోతున్నారు. మరి ధనవంతులైన వాళ్ళు కూడా వలసలు పోతున్నారు. 2014 సం॥నుండి 2022 సం॥ వరకు సుమారుగా 16 లక్షల మంది ఈ దేశాన్ని వదిలి వేరే దేశాల పౌరసత్వాన్ని తీసుకున్నారు. ఒకవైపు పేదరికంతో ప్రజలు వలసలు పోతుంటే, మరోవైపు ధనవంతులు ఇంకా మంచి జీవితం కోసం దేశాన్ని వదిలి వెళ్ళిపోతున్నారు. ఇంతమంది దేశాన్ని వీడుతుంటే ఏం చేయాలన్నది ప్రభుత్వాలు ఆలోచించాలి.

ఒక ప్రత్యేక పదం గురించి మీకు ఇక్కడ చెప్పాలి. అది 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' దీన్ని ఈ మధ్య చాలా మంది వాడుతున్నారు. భారతదేశానికి బ్రహ్మాండమైన డెమోగ్రాఫిక్ డివిడెండ్ ఉందంటున్నారు. అంటే ఏమిటి? మన జనాభా పెరుగుతోంది. దానితో పాటుగా మేం పనిచేస్తాం అని చెప్పే యువత సంఖ్య కూడా పెరుగుతోంది. ఎప్పుడైతే ఈ సంఖ్య జనాభా పెరుగుదల కంటే ఎక్కువగా ఉంటుందో దాన్ని డెమోగ్రాఫిక్ డివిడెండ్ అంటాం. అంటే యువత వాళ్ళ శక్తితో పని చేయటానికి సిద్ధంగా ఉన్న దేశం అని అర్థం చేసుకోవాలి. భారతదేశంలో ఈ వ్యవస్థ 1980లో మొదలై 2040లో పూర్తి కాబోతోంది. అంటే మన దగ్గర ఉన్న సమయం ఇంకో 16 సంవత్సరాలు. 16 సంవత్సరాల తర్వాత భారతదేశం ఏం కాబోతోందంటే ముసలివాళ్ళ సంఖ్య పెరగబోతోంది. అప్పుడు ప్రభుత్వాలు వయసు మళ్ళిన వాళ్ళ గురించి బడ్జెట్‌లో కేటాయింపులు చెయ్యాలి. ఈ 16 సంవత్సరాల్లో ప్రభుత్వాలు సక్రమంగా పనిచేయకుంటే ఈ దేశం ఎప్పటికీ పేద దేశంగానే ఉండిపోతుంది.

చైనా గురించి ఒకసారి మాట్లాడుకుందాం. చైనా వాళ్ళకు సుమారు 30 సం॥ ఒక అవకాశం దొరికింది. 1985 నుండి 2015 వరకు వారికి యువతరం పెద్ద సంఖ్యలో ఉంది. వాళ్ళేం చేశారప్పుడు? ప్రపంచానికే ఒక తయారీ కేంద్రంలా, ఫ్యాక్టరీగా చైనాను మార్చేశారు. అందుకే ఏ వస్తువు కోసం మనం మార్కెట్‌కు వెళ్ళినా దాని మీద మేడిన్ చైనా అని ఉంటుంది. ఫర్నీచర్ నుండి దోమల బ్యాట్ల వరకు తయారీ వాళ్ళదే. ప్రపంచంలో ఉన్న మాన్యుఫాక్చరింగ్‌నంతా వాళ్ళ చేతిలోకి తీసుకున్నారు. భారతదేశం, చైనాల తలసరి ఆదాయం 1979లో సమానంగా ఉండేది. కానీ ఇప్పుడు చైనా తలసరి ఆదాయం మనకన్నా 5 రెట్లు ఎక్కువగా ఉంది. వాళ్ళు పెరిగిన యువతరాన్ని చక్కగా వినియోగించుకొని ప్రపంచానికే ఒక కర్మాగారంలా మారిపోయారు. మరి మనమే స్థితిలో ఉన్నాం? ఇజ్రాయిల్‌కు వెళ్ళాలా, రష్యన్ ఆర్మీలో చేరాలా లేక వియత్నాం వెళ్ళాలా అని ఆలోచిస్తున్నాం. మరి మన ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి? మనకు ఏడాదికి సుమారుగా రెండు కోట్ల ఉద్యోగాలు కావాలి. గత ఎన్నికలప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ గారు ఏం చెప్పారు, ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఇచ్చారా? మరి ఈ మధ్యే ప్రధాన మంత్రి గారి ఆర్థిక సలహాదారు ఏం చెప్పారంటే, ఉపాధి కల్పించడం ప్రభుత్వ బాధ్యత కాదని ప్రకటించారు. రెండు కోట్లు ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాళ్ళ బాధ్యత నుండి వైదొలగితే యువతరం ఎక్కడి వెళ్ళాలి? ఈ డెమోగ్రాఫిక్ డివిడెండ్‌ను 2040 లోపు మనం సక్రమంగా వినియోగించకపోతే ఏం జరుగుతుంది? చదువుకుని ఉపాధి లేని వ్యక్తి ప్రమాదకరంగా మారతాడు. అటువంటి వాళ్ళను అనేక శక్తులు సులభంగా లాగే అవకాశం ఉంటుంది. టెర్రరిజంలో గానీ, లేకుంటే డ్రగ్స్ వ్యవహారంలోకి గానీ లాగేసే అవకాశం ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో మనం చూస్తున్నాం. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఏ విధంగా వాడకంలో ఉన్నాయో, ఇంతకు ముందు గంజాయి పట్టణాల్లో మాత్రమే కనిపించేది. అది ఇప్పుడు గ్రామగ్రామానికీ విస్తరించింది. గంజాయి తీసుకునే ఆకతాయి ముఠాలను మనం రోజూ చూస్తూనే ఉన్నాం. దీనికి ప్రధానమైన కారణం ఏమంటే చదువుకుని ఉపాధి కోసం సిద్ధంగా ఉన్న వ్యక్తికి మీరు ఉపాధి కల్పించకపోతే ఇటువంటి పరిణామాలే చోటుచేసుకుంటాయి.

భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు అందరం కూడా వ్యవసాయం చేసుకుంటూ ఉండేవాళ్ళం. లేకుంటే కులవృత్తులు చేసుకునేవాళ్ళం. బార్టర్ సిస్టం ద్వారా ఇరువురూ వారివారి ఉత్పత్తులను ఇచ్చిపుచ్చుకునే వాళ్ళు. బ్రిటీషు వాళ్ళు వచ్చాక వారి దేశంలో తయారైన వస్తువులను ఇక్కడికి తీసుకురావటం మొదలు పెట్టారు. దానివల్ల మన కులవృత్తులన్నీ క్రమక్రమంగా నాశనమయ్యాయి. ఉద్యోగాలు అన్న కాన్సెప్ట్ మన దేశంలో బ్రిటీషు వాళ్ళు మొదలు పెట్టారు. క్లర్కులు, ప్రభుత్వ ఉద్యోగాలు అన్నది మొదలు పెట్టారు. అప్పటి నుండి మనం ఉద్యోగాల వేటలో పడ్డాం. స్వాతంత్ర్యం వచ్చాక పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు పెట్టారు. భిలాయ్, రూర్కెలా మొ॥ ఉక్కు ఫ్యాక్టరీలు పెట్టి వాటిల్లో ఉద్యోగాలిచ్చి ఉపాధి కల్పించటం మొదలు పెట్టాయి ప్రభుత్వాలు. ఆ తర్వాత మనందరికీ తెలిసినదే మన విశాఖ స్టీల్ ప్లాంటు. దీని వల్ల అనేక మందికి ఉపాధి దొరికింది. ఆ తర్వాత 1991లో గ్లోబలైజేషన్, లిబరలైజేషన్ అన్న కాన్సెప్ట్ మొదలైంది. ప్రపంచానికి తలుపులు తెరుస్తున్నామని చెప్పారు. అప్పటి నుండి సేవారంగం (సర్వీస్ సెక్టార్) పెరిగింది. వ్యవసాయ రంగం నుండి సేవా రంగం వరకు ఉపాధి కల్పన అన్నది ఏ విధంగా వచ్చిందనేది మనముందుంది. మరి మనం ఇప్పుడు ఏం చెయ్యాలి?

నేను మహారాష్ట్రలో 5 సం॥ పని చేశాను. ఏ హొటల్‌కు వెళ్ళినా, ఏ రెస్టారెంట్‌కు వెళ్లినా మన తెలుగు పిల్లలే కనిపించేవాళ్ళు. విశాఖపట్నం వెళ్ళి చూడండి, ఒరిస్సా వాళ్ళు ఎక్కువగా కనిపిస్తారు. వాళ్ళేం చదివారని నేను అడిగినప్పుడు, చాలా మంది గ్రాడ్యుయేట్లు, ఇంజనీరింగ్ చేసినవాళ్ళు చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అలాగే అమెజాన్, స్విగ్గీ, జుమాటోల ద్వారా మనం

ఆన్‌లైన్‌లో తెప్పించుకుంటూ ఉంటాం. అది డెలివరీ చేసే పిల్లలు కూడా అంతే. ఇంజనీరింగ్‌లు, గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు. ఇప్పుడు 'రాపిడో' వచ్చింది. స్కూటర్లు, మోర్ సైకిళ్ళపై వచ్చి మనల్ని చిన్న చిన్న ప్రయాణాల్లో వాహనాలపై దించుతారు. వాళ్ళు కూడా అంతే. చదువుకుని సరైన ఉద్యోగాల్లేక చిన్న చిన్న పనులు చేసుకుంటున్నారు. ఇదే ఈ రోజు చదువుకొన్న యువతరం పరిస్థితి. ఈ పరిస్థితుల్లో మనవేం చేయాలో ఆలోచించాలి.

మనమంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వాళ్ళం, గ్రామీణ ప్రాంతంలో ఉపాధి కల్పన గురించి మాట్లాడుకుందాం. మనం రైతులుగా పండించింది పండించినట్లు అమ్మేస్తాం. కడప ప్రాంతంలో ఎక్కువగా శెనగలు పండిస్తారు. మహారాష్ట్ర నుండి వ్యాపారులు వచ్చి అక్కడి రైతుల వద్ద నుండి శెనగలు కొనుక్కొని వెళ్తారు. మరి మహారాష్ట్ర వాళ్ళు ఆ శెనగలను ఏం చేస్తున్నారని నేను కనుక్కుంటే వాళ్ళు వాటి నుండి శెనగపిండి తయారు చేసి మళ్ళీ మనకే పంపుతున్నారు. కొబ్బరి నీళ్ళు ప్లాస్టిక్ బాటిళ్ళలో నింపి అమ్ముతున్నారు. విమానాశ్రయాల్లో 200 ఎంఎల్ బాటిల్ ధర 176 రూ॥లు. ఇవి ఎక్కడో తయారవుతున్నాయి. మరి మనం గ్రామీణ ప్రాంతాల్లో వాటినెందుకు తయారు చేయకూడదు? మన గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి చిన్నచిన్న పరిశ్రమలను మనం ఏర్పాటు చేయగలిగితే ఉపాధి ఇక్కడే దొరుకుతుంది. మన పిల్లలు బయట ప్రాంతాలకు వెళ్ళే అవసరమే ఉండదు. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉత్పత్తులు మనకు కనబడతాయి. మన ఉలవలు, మినుములు అన్నీ రైతులు దగ్గర నుండే కొనుగోలు చేస్తున్నారు. ఫలానా కంపెనీ మినపగుళ్ళు అని ఆర్భాటమైన వ్యాపార ప్రకటనలు మనం చూస్తున్నాం. మళ్ళీ వాటినే మనం కొంటున్నాం. మదనపల్లి టమాటాలకు ప్రసిద్ధి చెందింది. అక్కడి టమాటో మార్కెట్‌లో వేలం జరుగుతుంది. ఆ వేలంలో ఆటో రవాణా ఛార్జీలు కూడా రానంత రేటు పడిపోతే, ఆ రైతులు ఏం చేస్తున్నారంటే అక్కడే రోడ్డుపై పారబోస్తున్నారు. టమాటాలతో చేసే మ్యాగీ సాస్ ప్రతి ఇంటిలోను ఉండాల్సిందే, కిసాన్ కెచప్ కావాల్సిందే. కానీ అవి ఎక్కడో తయారవుతున్నాయి. వలసలు కూడా దాని వల్ల పెరుగుతున్నాయి. కాబట్టి ప్రస్తుతం ప్రభుత్వాలు నిర్వహించాల్సిన ప్రధాన కర్తవ్యం ఏమంటే గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు తీసుకురావాలి. చిన్న చిన్న పరిశ్రమలను, వ్యవసాయాధారిత పరిశ్రమలను మనం గనుక గ్రామీణ ప్రాంతాల్లో తీసుకురాగలిగితే అక్కడ ఉపాధి కల్పన జరుగుతుంది. మన యువతరం బయటకు వెళ్ళే అవసరం ఉండదు.

హైదరాబాదులో గానీ, ఇంకో నగరంలో గానీ అరగంట వర్షం పడితే టీవీ ఛానళ్ళన్నీ వచ్చేస్తాయి. 'స్విమ్మింగ్ పూల్‌ను మరిపిస్తున్న హైదరాబాద్', 'జలాశయంలా తయారైన బెంగుళూరు' అంటూ వలసల ప్రభావంతో సిటీలపైన వత్తిడి పెరిగి అక్కడుండే చెరువులు మాయమయ్యాయి. అక్కడుండే డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింది. అరగంట వాన పడితే ఆ నీళ్ళు ఎటు వెళ్ళడానికీ వీలు లేనంతగా ఆక్రమణలు పెరిగిపోయాయి. అటు పట్టణాలు ఎఫెక్ట్ అవుతున్నాయి. మరి గ్రామీణ ప్రాంతాలకు వెళ్తే కేవలం ముసలివాళ్ళు మాత్రమే గ్రామాల్లో కనిపిస్తున్నారు. ఇంతకు ముందు వాటిని 'గ్రీన్ విలేజస్' అనేవాళ్ళు. వీటిని ఇప్పుడు 'గ్రే విలేజస్' అంటున్నారు. జుట్టు నెరిసిన వాళ్ళు మాత్రమే ఇక్కడ ఉంటున్నారు. యువతరం అంతా సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారు. ఇప్పటికే అత్యధిక ప్రజలు మన దేశంలో వ్యవసాయమే వృత్తిగా జీవిస్తున్నారు. అందులో ఎక్కువగా ఉన్నవాళ్ళను తగ్గించి, గ్రామీణ ప్రాంతాలలో ఆహార పరిశ్రమలు నెలకొల్పటం ద్వారా వారిని అందులోకి ఇముడ్చుకోవాలి. ఆహారోత్పత్తులకు విలువను పెంచే ఈ పరిశ్రమలను నెలకొల్పటానికి ప్రభుత్వాలు పూనుకోవాలి. ఈ విషయాలపై అవగాహన ఉన్న వ్యక్తులు ప్రభుత్వాలలో ఉండాలి. గ్రామీణ ప్రాంతాల గురించి ఏమీ తెలియని వ్యక్తులు, వీటితో ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులు ప్రభుత్వాలలో కూర్చుని ఉంటే, వాళ్ళకు ఇవేమీ పట్టవు. గ్రామీణ ప్రాంతాలలో వలసలు నివారించాలంటే, ఉపాధి అవకాశాలు మెరుగు పడాలంటే వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పితీరాలి. చిన్న పరిశ్రమలను ఎలా నెలకొల్పాలి, డ్వాక్రా గ్రూపు మహిళలను ఎలా ఇన్వాల్వ్ చెయ్యాలి అని ఆలోచన చెయ్యాలి. చాలా మంది డ్వాక్రా మహిళలతో నేను మాట్లాడాను. వాళ్ళు చేస్తున్నది మనీ రోటేషన్, చిట్టీ లంటాం – ప్రభుత్వం చేయాల్సిందేమంటే ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకం చిన్న పరిశ్రమలను పెట్టి డ్వాక్రా గ్రూపు మహిళలకు వాటిని అప్పగించాలి. జుబేదా అనే మహిళ కర్నూలులోని డ్వాక్రా సంఘాలన్నింటినీ కలిపి 'జుబేదా పాలకోవా' అనే పాలకోవా తయారీ సంస్థను నెలకొల్పింది. అది అక్కడ చాలా ఫేమస్. చాలా మంది దాని ద్వారా ఉపాధిని, గౌరవాన్ని పొందుతున్నారు. వరంగల్ దగ్గర మొలకలూరు అనే గ్రామం ఉంది. ఆ ప్రాంతంలో విశ్వనాథరెడ్డి అనే ఆయన ఒక గ్రామీణ బ్యాంకు లాంటిది స్థాపించి, అందరికీ రుణాలిచ్చి, అక్కడున్న మహిళలు డైరీఫాం పెట్టటానికి అవకాశం కల్పించాడు. ఆ గ్రామానికి వెళ్ళి చూసినప్పుడు ఎంతో గర్వంగా అనిపించింది. ఆ మహిళలు ఎంతో అభ్యుదయ భావాలతో ఉన్నారు. ఒక్కొక్కరూ సుమారు లక్ష రూపాయల దాకా సంపాదిస్తున్నారు. వాళ్ళ పిల్లలంతా అక్కడే ఉన్నారు. ఈ విధంగా ఆలోచిస్తే తప్ప మనం గ్రామీణ యువత వలసలు పోకుండా నిరోధించలేం. మన ప్రభుత్వాలు, చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ అంతా కలిసి ఆలోచించి గ్రామాలలో కోల్డ్ స్టోరేజీలు నెలకొల్పటం, ప్రతి ఒక్కరూ ఒకే పంటను పండించకుండా క్రాప్ కాలనీలు ఏర్పాటు చేసి, ఏ రైతు ఎంత పండించాలి అన్నది నిర్ణయించి, వాటిని ఏ విధంగా ఎగుమతి చెయ్యాలో కూడా ఆలోచించాలి. ఎక్స్‌పోర్టింగ్ కూడా బ్రహ్మాండమైన ఉపాధిని

కల్పిస్తుంది. గ్రామాల్లో రైతులు డాలర్లలో సంపాదించగలగాలి. దీనికవసరమైన రవాణా సదుపాయాలు ఏర్పాటు చేయాలి. ఇవన్నీ చేసినప్పుడు ఏం జరుగుతుందంటే గ్రామాలు అద్భుతమైన అభివృద్ధి కేంద్రాలుగా మారతాయి. అప్పుడు వలసలు పోయే ప్రసక్తే ఉండదు. శ్రీకాకుళం ప్రాంతం తీసుకోండి. అక్కడ నుండి వలసలు చాలా ఎక్కువగా జరుగుతాయి. కానీ అక్కడ వంశధార, నాగావళి నదులున్నాయి. అనేక బ్యారేజీలు ఉన్నాయక్కడ. కొబ్బరి బ్రహ్మాండంగా పండుతుందక్కడ. పనస పండుతుంది. జీడిపప్పు బాగా పండుతుంది. ఏ ప్రాంతానికా ప్రాంతం చిన్న ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయటం చాలా అవసరం. ఒకసారి తమిళనాడు మోడల్ చదవండి ఎప్పుడైనా, అక్కడ ప్రతి చోటా ఒక్కొక్క ఇండస్ట్రీని ఏర్పాటు చేశారు. తమిళనాడు గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు తక్కువ. తిరుపూర్ అనే ప్రాంతాన్ని ఒకసారి మీరంతా చూడాలి. అక్కడ మనం వేసుకునే బనియన్లు, రాత్రిపూట ధరించే దుస్తులు తయారు చేస్తారు. 8 లక్షల మంది అక్కడ ఉపాధి పొందుతున్నారు. వాల్‌మార్ట్ అనేది ఉంది. ప్రపంచంలో మొత్తం అన్ని బ్రాంచీలలో కలిపి 8 లక్షల మంది ఉద్యోగులుంటే, ఒక్క తిరుపూరులోనే 8 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. కాబట్టే తమిళనాడులో వలసలు లేవు. శివకాశీ వెళ్ళండి. అక్కడ ప్రింటింగ్ జరుగుతుంది, బాణాసంచా తయారవుతుంది. అక్కడ ఉపాధి బ్రహ్మాండంగా ఉంది. ఆ తర్వాత సేలంలో స్టీల్ ఉంది. విజయంబాడి అనే చోట లెదర్ ఇండస్ట్రీ ఉంది. మొత్తం రాష్ట్రంలో ఒక్కొక్క జిల్లాను ఒక అభివృద్ధి కేంద్రంగా మార్చారు. ఇక్కడ మన రాష్ట్రంలో ఏం జరుగుతోంది? మూడు రాజధానులా, ఒక రాజధానా అని గొడవలు పడుతున్నారు. ఆ గొడవల్లో మనల్ని బిజీగా పెడుతున్నారు రాజకీయ నాయకులు. మన రాష్ట్రానికి 26 అభివృద్ధి రాజధానులు కావాలి అని ప్రతిసారీ నేను ప్రతిపాదిస్తుంటాను. ప్రతి జిల్లా ఒక అభివృద్ధి రాజధాని అవ్వాలి. అందుకే మా జైభారత్ నేషనల్ పార్టీ ఏం కోరుతోందంటే, సంవత్సరానికి ఒక్కో నియోజకవర్గానికి వంద కోట్ల రూపాయలు ఇవ్వండి. అంటే 5 సంవత్సరాలలో 500 కోట్ల రూ॥లు అక్కడ ప్రజలను నిర్ణయించుకోనివ్వండి. అక్కడ వాళ్ళకేం అభివృద్ధి కావాలో. ప్రతి గ్రామ పంచాయితీకి సంవత్సరానికి ఒక కోటి రూపాయలు ఇవ్వాలి. ఫ్యాక్టరీలు పెట్టుకుంటారా, చిన్న ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టుకుంటారా అన్నది గ్రామసభలో నిర్ణయించబడాలి. కానీ మన రాష్ట్రంలో ఏం జరుగుతోంది. ప్రతి ఫైలు ముఖ్యమంత్రి క్లియర్ చెయ్యాలి. ఎక్కడైతే వికేంద్రీకరణ జరుగుతుందో, ఎక్కడైతే 73, 74 రాజ్యాంగ సవరణలు చక్కగా అమలవుతాయో అక్కడ వలసలన్నవి ఉండవు. కేరళకు వెళ్ళి చూడండి. అక్కడ తిరగాంబుళం అనే చోట ఫ్యాక్టరీ ఉంది. ఆ ఫ్యాక్టరీ వాళ్ళు 17, 18 గ్రామ పంచాయితీలను అభివృద్ధి చేశారు. అక్కడి రాజకీయ నాయకుల్లో భయం మొదలైంది. వాళ్ళెక్కడ రాష్ట్రం మొత్తాన్ని ఆక్రమిస్తారో అని. ఆ ఫ్యాక్టరీకి అనేక సమస్యలు సృష్టిస్తే వాళ్ళిప్పుడు తెలంగాణాకు వచ్చారు. మనం అర్థం చేసుకోవాల్సింది ఈ రకమైన అభివృద్ధి వికేంద్రీకరణ జరిగితేనే వలసలను అరికట్టగలుగుతాం. ఏ గ్రామానికా గ్రామంలో అక్కడ పండేవాటిని బట్టి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టగలిగితే అక్కడ ఉపాధి దొరికి, వ్యవసాయంలో అధికంగా ఉన్న జనాభా ఈ యూనిట్లలోకి మారతారు, వలసలు లేకుండా అక్కడే ఉంటారు. ప్రొవైడింగ్ అర్బన్ అమెనిటైస్ ఇన్ రూరల్ ఏరియాస్ (PURA) అనే కాన్సెప్ట్‌నే డా॥ అబ్దుల్ కలాం గారు తీసుకు వచ్చారు. పట్టణ ప్రాంతాల్లో ఏవిధమైన మౌలిక సదుపాయాలున్నాయో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఇంటర్నెట్ సదుపాయం ఇలాంటివన్నీ గ్రామాల్లో కూడా కల్పిస్తే ఎవరు వెళ్తారు అక్కడి నుండి? ఇవి అమలు జరగటానికి రాష్ట్ర ప్రభుత్వం పైనా, కేంద్ర ప్రభుత్వం పైనా వత్తిడి తెచ్చే విధంగా రైతుకూలీ సంఘం సభ్యులు, మనందరం పనిచేయగలిగితే గ్రామాలలో అభివృద్ధి జరుగుతుంది. నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుంది, వలసలు కూడా తగ్గుతాయి. దాని కొరకు మనమందరం కలిసి కృషి చేద్దామని, సమగ్ర ప్రణాళికలు రచిద్దామని తెలియజేస్తూ నాకు తెలిసిన కొన్ని విషయాలు మీ దృష్టికి తీసుకురావటానికి అవకాశం ఇచ్చిన రైతుకూలీ సంఘం వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఎప్పుడైతే మనం సంఘటితంగా ఉంటామో, అప్పుడు సమస్యలను పరిష్కరించుకోగలమని, ఆ సంఘటిత శక్తితో ముందుకు పోదామని చెబుతూ ముగిస్తున్నాను. జైహింద్.



**2023 నవంబర్ 27, 28 తేదీలు – ఎస్‌కెఎం ధర్నా, విజయవాడ**

**కా॥ ఎ.సురేష్,** రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (PDSO)



కామ్రేడ్స్, మిత్రులారా! ఇప్పుడు గ్రామీణ యువత - నిరుద్యోగం- వలసలు అనే అంశంపై వి.వి. లక్ష్మీనారాయణ గారు వివరంగా మాట్లాడారు. ఇదే విషయంపై నాకున్న భావాలను, ఆలోచనలను మీతో పంచుకుందామనుకుంటున్నాను.

ఇటీవల కాలంలో సుమారు రెండు నెలల క్రిందట 'అగ్నిపథ్' అనే పథకానికి వ్యతిరేకంగా దేశంలో దాదాపు 14 రాష్ట్రాలలో ఉన్న యువకులంతా కూడా పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. రైళ్ళు తగుల బెట్టారు. వాళ్ళపై పోలీసులు కాల్పులు జరిపారు, అరెస్టులు చేశారు. ఆ కాల్పుల్లో తెలంగాణాకు చెందిన ఒక యువకుడు మరణించాడు కూడా. ఎందుకు ఇదంతా అంటే, 2019 నుండి ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఈ ఆర్మీలోకి ప్రధానంగా వెళు తున్నది ఎవరంటే గ్రామీణ ప్రాంత యువతే. పట్టణాల్లోను, నగరాల్లోను ఉన్నవాళ్ళు కాదు. సైన్యంలో చేరటం కోసం గ్రామీణ ప్రాంత యువత ప్రత్యేక శిక్షణ పొంది, నానారకాల కసరత్తులు చేసి, ఎంతగానో కృషి చేస్తుంటే నాలుగేళ్ళలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. 'అగ్నిపథ్' పథకంలోని దుర్మార్గమేమంటే, ఆ సర్వీసును నాలుగేళ్ళకు కుదించటం. కేంద్ర ప్రభుత్వం ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందా అన్న ఆగ్రహంతో, ఆవేదనతో సైనికోద్యోగాల కోసం వేచి ఉన్న గ్రామీణ ప్రాంత యువత ఆందోళన చేశారు. దీనిపై ప్రభుత్వం, రాజ్యం అణచివేతకు పాల్పడ్డారు. అసలీ పథకం ఏమిటి? నాలుగేళ్ళ కాలంలో 6 నెలలు ట్రైనింగ్ ఇస్తారు. $3^1/_2$ సం॥ వాళ్ళకు ఉద్యోగం ఇస్తారు. తర్వాత పది లక్షలు చేతిలో పెట్టి నువ్వేదైనా వ్యాపారం చేసుకో అని పంపించేస్తారు. ఈ నాలుగేళ్ళ తర్వాత పరిస్థితేంటనేదే యువకుల ఆగ్రహానికి ప్రధాన కారణం. ఈ ఆగ్రహంతో ఆందోళన చేసిన తర్వాత వెంటనే 'టాటా' బయటకు వచ్చి నాలుగేళ్ళ తర్వాత అగ్నిపథ్ పథకం కింద నాలుగేళ్ళ సర్వీసు పూర్తి చేసిన వాళ్ళను తమ కంపెనీలో చేర్చుకుంటానని ప్రకటించాడు. సెక్యూరిటీ గార్డులుగా చేర్చుకుంటా, మీరు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నాడు. అలాగే ఆనంద్ మహీంద్రా కూడా ఇదే విధమైన ప్రకటన చేశాడు. అంటే ఈ నాలుగేళ్ళ తర్వాత యువకులకు సెక్యూరిటీ లేని బ్రతుకు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏమీ ఉండవు. ఇవీ యువకుల ఆందోళనకు ప్రధాన కారణమైతే, వాళ్ళ ఆందోళనను చల్లార్చటానికి సెక్యూరిటీ గార్డులుగా తీసుకుంటామని ఈ పరిశ్రమాధిపతులు ప్రకటిస్తున్నారు.

ఈ ఆరు నెలల కాలంలో దేశంలో 35000 గ్రూప్-డి పోస్టులు రైల్వేల కొరకు నోటిఫికేషన్ ఇస్తే, ఒక కోటి 90 లక్షలమంది అప్లై చేశారు. దీని కొరకు నిర్వహించిన రాత పరీక్ష ప్రపంచంలోనే అతి భారీ రిక్రూట్‌మెంట్ ఎగ్జామ్‌గా పేరు గాంచింది. 35 వేల పోస్టులకు సుమారు 2 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారు. పోస్టాఫీసుల్లో 300 పోస్టులు నోటిపై చేస్తే లక్షల మంది అప్లై చేస్తున్నారు. రైల్వేల్లో బాత్రూంలు కడగటానికి, స్వీపర్లుగా పని చెయ్యటానికి కూడా సిద్ధపడుతున్నారు. గుమాస్తాలుగా పనిచేయటానికి సిద్ధపడుతున్నారు. వీటికి అర్హతలేమిటంటే 7వ తరగతి, పదవ తరగతి అయితే, అప్లై చేస్తున్నవాళ్ళు ఎవరంటే ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పిహెచ్‌డిలు, లా చదివినవాళ్ళు, ఇంజనీరింగ్ ఎంబిఏలు చేసినవాళ్ళు, ఎందుకింత వెంపర్లాడుతున్నారు వీళ్ళు? వాళ్ళు చదివిన చదువుకు గౌరవప్రదమైన ఉద్యోగాలు చేయాలి. కానీ ఈ దేశంలో ఆ అవకాశం లేదు. లేదు కాబట్టే ఏదో ఒక గవర్నమెంట్ ఉద్యోగం వస్తే చాలు అనే పరిస్థితికి ఈ రోజు యువత నెట్టబడ్డారు.

మన నగరాల్లో మీరు పరిశీలిస్తే, విపరీతంగా కోచింగ్ సెంటర్లు పెరుగుతున్నాయి. రకరకాల పోస్టులు సాధించటానికి, ఆయా పరీక్షల్లో నెగ్గటానికి కోచింగ్ సెంటర్లకు లాగబడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి చదువుకున్న యువకులు వారి చదువు పూర్తయిన తర్వాత 2సం॥, 3 సం॥, 4సం॥, 5సం॥, 10 సం॥లు రూముల్లో తినీ తినక, డబ్బుల్లేక వస్తులుండి, కోచింగ్ సెంటర్లలో చదువుతున్నారు, ఫ్రిపేరవుతున్నారు. ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందా, ఎప్పుడు ఉద్యోగం వస్తుందా అన్న దయనీయ పరిస్థితిలో ఉంటున్నారు. ఇళ్ళకు వెళ్ళటానికి వాళ్ళకు మొహం చెల్లటం లేదు. ఉద్యోగం లేకుండా తల్లిదండ్రుల వద్దకు పోలేరు, వారికి భారంగా మారలేరు. సిటీల్లో చూడండి జొమాటో వర్కర్లుగా, స్విగ్గీ వర్కర్లుగా పార్ట్‌టైం ఉద్యోగాలు చేసుకుంటూ ప్రిపేర్ అవుతున్నారు. ఆ పనులు కూడా లేని వాళ్ళు తీవ్ర నిరాశా, నిస్పృహలకు లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఊరెళ్ళి వస్తానని మిత్రులతో చెప్పి రైళ్ళ కింద పడుతున్నారు. రూముల్లో ఫ్యాన్లకు ఉరేసుకుంటున్నారు. పాయిజన్లు మింగుతున్నారు. వారికేం చేయాలో తెలియటం లేదు. వారి సమస్యకు పరిష్కారం కనబడటం లేదు. 2018 నుండి 2024 వరకు 30 వేల మంది యువకులు, చదువుకున్నవారు, ఉద్యోగాల కోసం

ప్రయత్నిస్తూ, ప్రయత్నిస్తూ ఇక మరో మార్గం లేదు, నా తల్లిదండ్రులకు భారం కాలేను, వారికి మొహం చూపించలేను అనే నిస్పృహతో, నిరాశతో ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

పోనీ నిజంగా పోస్టులేవీ లేవా? రాష్ట్రంలో $2^1/_2$ లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దేశం మొత్తంలో 60 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయటానికి సిద్ధంగా లేరు. పైగా విశాఖ స్టీలు ప్లాంటు కానివ్వండి, రైల్వేలు కానివ్వండి, పోర్టులు కానివ్వండి ఒక్కొక్క దాన్ని ప్రైవేటీ కరిస్తున్నారు. పెట్టుబడులు ఉపసంహరణ పేరుతో ఉన్న పరిశ్రమలను కుదేలు చేస్తున్నారు. వాటిని మూసివేయటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అదానీలు, అంబానీల వంటి బడా కార్పొరేట్ శక్తులకు వాటిని కట్టబెడుతున్నారు. ఇది తెలిసి చేస్తున్నదా, తెలియక చేస్తున్నదా ? ఇది దుర్మార్గం కాదా? దీని వెనుక ఏమైనా కుట్ర ఉందా? మనం ఆలోచించాలి, అర్థం చేసుకోవాలి. యువకులే ఈ దేశ భవిష్యత్తు అంటారు, యువకులే దేశాన్ని ముందుకు నడిపిస్తారని అంటారు రాజకీయ నాయకులు, పాలకులు అందరూ. కానీ ఏం జరుగుతోంది.

నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగింది కానీ, అంతకు ముందు జరిగింది కానీ ఉపాధి రహిత అభివృద్ధి మాత్రమే. గతంలో మోడీ విదేశాలకు వెళ్ళి మీరొచ్చి మా దేశంలో పెట్టుబడులు పెట్టండి, ఉద్యోగాల కల్పన జరుగుతుందని ఊదరగొట్టాడు. అమెరికా, రష్యా, జర్మనీ, సిట్జర్లాండు, ఫ్రాన్సు ఇంకా ఇతర అనేక దేశాలకు వెళ్ళి పెట్టుబడులు పెట్టండి అని ఆహ్వానించాడు. కానీ ఆ పెట్టుబడులు నిజంగా మన దేశంలో ఉద్యోగాలను కల్పిస్తున్నాయా అనేది ప్రశ్నించుకోవాలి.

విశాఖపట్నానికి సమీపంలో అచ్యుతాపురం అనే ప్రాంతంలో బ్రాండిక్స్ అనే కంపెనీ ఉంది. ఎకరం రూపాయి చొప్పున 1000 ఎకరాల భూమిని 2006లో బ్రాండిక్స్ కంపెనీ లీజుకు తీసుకుంది. ఇక్కడున్న రైతు కూలీలెవరైనా నేను వ్యవసాయం చేసుకుంటాను, నాకు ఎకరం రూపాయి చొప్పున భూమిని లీజుకివ్వండి అంటే ప్రభుత్వం ఇస్తాదా? ఇవ్వదు. కానీ మన రాష్ట్ర ప్రభుత్వం బ్రాండిక్స్ కంపెనీకి ఒకటి కాదు, రెండు కాదు 1000 ఎకరాలు ఎకరా రూపాయి చొప్పున లీజుకు ఇచ్చింది. వీరి ఒప్పందం ఏమంటే 5 సం॥ కాలంలో 60 వేల ఉద్యోగాలు మేం కల్పిస్తాం అని. పదేళ్ళ తర్వాత బ్రాండిక్స్ ఎంత ప్రగతి సాధించిందో విశాఖపట్నం అంతా పెద్ద పెద్ద ఫ్లెక్సీలు పెట్టారు. ఇవి పెట్టింది 2018, 2019 ప్రాంతంలో. ఈ ప్రాంత యువకులకు 16 వేల ఉద్యోగాలు కల్పించామని వాటిలో ప్రకటించుకున్నారు. అంటే 12 సం॥ తర్వాత 16 వేల ఉద్యోగాలు. మరి అగ్రిమెంట్‌లో ఏం చెప్పారు. 5 సం॥లలో 60 వేల ఉద్యోగాలు కల్పించాలి. కానీ 5 సం॥లలో 60 వేల ఉద్యోగాలివ్వలేకపోతే ఎకరానికి 35 లక్షల రూపాయలు ఆ భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారంగా చెల్లిస్తామన్నారు. మరి ఇచ్చారా? ఇవ్వలేదు. ఇటువంటి దగాకోరు విధానాలనే మన దేశంలోకి వచ్చిన కంపెనీలన్నీ చేస్తూ ఉన్నాయి.

మరో ఉదాహరణ 'నోకియా' 10 సం॥ క్రితం బాగా పాపులర్ అయిన బ్రాండ్ నోకియా. అది కూడా విదేశీ పెట్టుబడులలో భాగంగా ఈ దేశంలో యువకులకు ఉపాధి కల్పన చేస్తామని చెబుతూ దేశంలో అడుగు పెట్టింది. 1995లో 38 కోట్ల పెట్టుబడితో ఈ దేశంలోకి వచ్చింది. 2014 వరకు 1800 కోట్లు పెట్టుబడి పెట్టింది. వాటితో కొన్ని లక్షల కోట్లు టర్నోవర్ చేసింది. ఫిన్లాండుకు చెందిన ఆ కంపెనీ లాభాలను తన దేశానికి తరలించే క్రమంలో ఇక్కడ కట్టాల్సిన పన్నులు కట్టలేదని కేంద్ర ప్రభుత్వం, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం నోటీసులిచ్చాయి. కానీ నోకియా తన దగ్గర డబ్బులు లేవని, ససేమిరా పన్నులు కట్టనంది. కట్టాల్సిన పన్ను 21 వేల కోట్ల రూపాయలు. సుప్రీంకోర్టుకు వెళ్ళారు. కోర్టు ఏం చెప్పింది మీరు కట్టలేనంటున్నారు కాబట్టి 21 వేల కోట్లు కట్టనవసరం లేదు, 3500 కోట్లు కట్టండి, అది కూడా ఒకేసారి అవసరం లేదు ఇన్‌స్టాల్‌మెంట్లుగా కట్టండి, మూడు నాలుగు నెలలకు ఒకసారి కట్టండి అని చెప్పింది. చివరికి ఆ 3500 కోట్లు కూడా కట్టలేదు. ఈ వేళ యువకులందరికీ మైక్రోసాఫ్ట్ సిఇఓ సత్య నాదెళ్ళను ఆదర్శంగా చూపుతున్నారు. రోల్ మోడల్‌గా తీసుకోమంటున్నారు. ఇప్పుడు ఇది ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే, తమిళనాడులోని శ్రీ పెరంబూ సిటీలో నోకియా వాడికి ఒక ప్లాంటు ఉంది. ఈ నోకియా కంపెనీని మైక్రోసాఫ్ట్ వాడికి అమ్మేశాడు. అప్పటికి ఆ ప్లాంటులో 30 వేల మంది వర్కర్లు పనిచేస్తున్నారు. మీ మధ్య ఏ ఒప్పందాలు జరిగాయో మాకు తెలియదు, కానీ మా వర్కర్ల పరిస్థితి మా ఉపాధికి గ్యారంటీ ఏమిటని, ఆ వర్కర్లందరూ రోడ్డు పైకి వచ్చి ఆందోళన చేశారు. ఎవరా వర్కర్లు? నోకియా కంపెనీ అనేక ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్ళి వాళ్ళను క్యాంపస్‌లోనే రిక్రూట్ చేసుకుంది. ఆ రోజు నోకియాకి ఉన్న బ్రాండ్ ఇమేజ్‌కి, అందులో ఉద్యోగం అంటే ఉబ్బి తబ్బిబయి పోయేవాళ్ళు. ఏ గవర్నమెంట్ ఉద్యోగమూ దీని ముందు దిగదుడుపే. కానీ మారిన పరిస్థితుల్లో వాళ్ళు తమ ఉపాధి గ్యారెంటీ కొరకు ఆందోళన చేస్తే, ఈ సత్య నాదెళ్ళ ఇది ఇంకెంత మాత్రం నోకియా కాదు. మైక్రోసాఫ్ట్ దీన్ని టేకోవర్ చేసింది. కనుక మైక్రోసాఫ్ట్‌కు అవసరమైన శక్తి సామర్థ్యాలున్న వారిని కొత్తగా తీసుకుంటుందనిచెప్పి ఆ 30 వేల మందిని పక్కన పెట్టాడు.

ఇక్కడ రెండు కోణాలున్నాయి. ఒకటి ఈ దేశంలోకి పెట్టుబడులతో వచ్చిన ఫిన్లాండు కంపెనీ నోకియా ఎంతెంత సంపదలను తన దేశానికి తరలించుకుపోయింది అనేది. రెండు, అందులో పని చేసిన ఉద్యోగుల పరిస్థితి ఏమిటి అనేది. ఇదంతా కూడా ఇటువంటి సభల్లో పాల్గొనే 'మధు' అనే యువకుడు ఆలోచించి దీని లోతుపాతుల్లోకి వెళ్ళాడు. నోకియా ఫోన్ స్విచ్ ఆన్ చేయగానే వచ్చే ట్యాగ్‌లైన్ 'కనెక్టింగ్ పీపుల్' అని. అతను 'డివైడింగ్ పీపుల్' పేరుతో డాక్యుమెంటరీ తీశాడు అందులో నోకియా కంపెనీ ఎంత

పెట్టుబడి పెట్టింది, ఎంత లాభాలను విదేశాలకు తరలించింది, ఉద్యోగుల పరిస్థితి ఏమైంది అన్నవి పరిశోధించారు. అప్పుడు వెలుగులోకి వచ్చాయి.

నరేంద్రమోడీ గానీ, చంద్రబాబు నాయుడు గానీ, జగన్మోహనరెడ్డి గానీ పాలకులెవరైనా విదేశీ పెట్టుబడులు వస్తే ఉద్యోగాలు వస్తాయని ఎవరైతే నమ్మబలుకుతున్నారో వారు మనని మోసం చేస్తున్నారు. వాస్తవ పరిస్థితిలో అవి ఎటువంటి ఉపాధిని మనకు కల్పించకపోగా దేశంలోని లక్షల కోట్ల సంపదని విదేశాలకు తరలించుకుపోతున్నాయని మనం అర్థం చేసుకోవాలి.

ఇటీవలే కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 50 మంది యువకులు అక్కడికక్కడే చనిపోయారు. వాళ్ళకు చనిపోతున్నామని కూడా తెలియక ముందే నిద్రలోనే చనిపోయారు. మన రాష్ట్రానికి చెందిన వాళ్ళు కూడా అందులో ఉన్నారు. మన దేశ ప్రజలు దాదాపు కోటి మంది గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్నారు. దుబాయ్, సింగపూర్, కువైట్ ఇలాంటి ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం వాళ్ళు 8 లక్షల కోట్లు విదేశీ మారక ద్రవ్యాన్ని మన దేశానికి పంపిస్తున్నారు. నోకియా కంపెనీ 1995 నుండి 2014 వరకు పెట్టిన పెట్టుబడి 1800 కోట్లు అయితే గల్ఫ్ కార్మికులు ప్రతి సంవత్సరం దేశానికి పంపిస్తున్న విదేశీ మారక ద్రవ్యం 8 లక్షల కోట్లు. దేశానికి ఇంత ఆదాయాన్ని సమకూరుస్తున్న వీరి పట్ల ప్రభుత్వాల వైఖరి ఏమిటి? వారి భద్రత గురించి పట్టించుకుంటున్నారా? వారి ఆరోగ్యాల గురించి పట్టించుకుంటున్నారా? తమిళంలో ఒక సినిమా వైఫ్ ఆఫ్ రణసింగం వచ్చింది. అందులో ఇదే విషయాన్ని చర్చిస్తారు. పెళ్ళి చేసుకున్న ఇద్దరు యువతీ యువకులు ఇక్కడ ఏ ఉద్యోగం దొరక్క దుబాయ్ వెళ్తారు. అక్కడ పని చేస్తున్న క్రమంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆ యువకుడు చనిపోతాడు. అతని బాడీని ఇండియాకు తీసుకురావటం చుట్టూ కథ తిరుగుతుంది. నరేంద్ర మోడీ చొరవతో ఆ శవాన్ని ఇండియాకు తీసుకువచ్చినట్లు చూపిస్తారు. అంతిమ సంస్కారాల సమయంలో ఆ శవం చేయిపట్టుకుని చూస్తే అతనికి ఉండాల్సిన పుట్టుమచ్చ ఆ చేతి మీద ఉండదు. ఆ శవం ఆ యువకుడిదేనని వాళ్ళ తల్లిదండ్రులు ఏడుస్తారు, బంధువులు ఏడుస్తారు, గ్రామస్తులు ఏడుస్తారు. కానీ ఏదో ఒక బాడీని తీసుకువచ్చి అది ఆ యువకుడిదేనని నమ్మించేట్లుగా చేశారని చివరలో తెలుస్తుంది. ఎక్కడైతే అగ్ని ప్రమాదం జరిగిందో ఆ ప్రాంతంలో ఉన్న సముద్రంలో అతని బాడీ తేలుతూ ఉండటాన్ని చివరగా ఆ సినిమాలో చూపిస్తారు. అంటే మన దేశానికి చెందిన కారిక్కుల పరిస్థితులు ఎలా ఉన్నాయి, వాళ్ళ భద్రత పట్ల మన ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు ఏమిటి అనేది మనం ఆలోచించాలి, అర్థం చేసుకోవాలి. అలాగే కోవిడ్ కాలంలో కోట్లాది మంది వలస కార్మికులు వివిధ రాష్ట్రాలలో పని చేస్తున్నవారు, తమ తమ గ్రామాలకు తిరిగి వెళ్ళారు. గ్రామాలలో ఏమీలేదు, వట్టిబోయాయి అని అందరూ అనుకుంటున్న పరిస్థితుల్లో మళ్ళీ ఆ గ్రామాలే ఆ వలస కారిక్కులందరినీ అక్కున చేర్చుకున్నాయి. ఇలా వచ్చిన వాళ్ళు దాదాపు 14 కోట్ల మంది నగరాల్లో కూడా ఉపాధి తమకు లభించక 2022, 2023 సంవత్సరాలలో 5 కోట్ల మంది వలస కార్మికులు గ్రామాలకు వెనక్కు వచ్చేసిన పరిస్థితి. ఇక్కడ మనం గమనించినట్లైతే ఉపాధికి, ఉద్యోగాలకు, ఆర్థిక వ్యవస్థకు సంబంధం ఉంది. మన దేశం ప్రధానంగా వ్యవసాయ ప్రధాన దేశం. మెజారిటీ ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి బ్రతుకుతున్న వాళ్ళు. పులిని చూసి నక్క వాత బెట్టుకున్నట్లు, ఇండస్ట్రీల వైపో, సాఫ్ట్‌వేర్ వైపో పరుగులు పెట్టినా అభివృద్ధి సాగదు. ఒకవేళ సాగినట్లు కనిపించినా అది ఉపాధి రహిత అభివృద్ధి మాత్రమే అవుతుంది. కనుక వ్యవసాయాన్ని అభివృద్ధి చేయకుండా, వ్యవసాయంలో స్వావలంబన సాధించకుండా సరైన ఉపాధిని పొందలేం. కార్పొరేట్ శక్తులు, బహుళజాతి కంపెనీలు, సామ్రాజ్యవాదులకు అనుకూలంగా, వారికి లాభాలు వచ్చే విధంగా గత 75 సం॥లుగా పాలకులు విధానాలు అమలు చేస్తూ వస్తున్నారు. వ్యవసాయాన్ని ధ్వంసం చేశారు. ఈ విధానాల ఫలితంగానే రైతులు, కార్మికులు, విద్యార్థులు అందరూ నష్టపోతున్నారు. ఆర్థిక వ్యవస్థను సరైన గాడిలో పెట్టుకున్నప్పుడే, మన వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకున్నప్పుడు మాత్రమే సరైన ఉపాధిని పొందగలుగుతాం. దాని కొరకు ఎన్నో పోరాటాలు చేయాల్సి ఉంది. రైతులు, రైతుకూలీలు, కార్మికులు, గిరిజన ప్రజలు తమ తమ మౌలిక సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్నారు. ఉపాధి కోసం, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువకులు కూడా ఆ పోరాటాలు మనకు సంబంధం లేనివి అని అనుకోకుండా, ఉపాధి కోసం తాము చేస్తున్న పోరాటాలను, కార్మిక, కర్షక పోరాటాలతో మమేకం చేసినప్పుడు మాత్రమే నిరుద్యోగ సమస్యకు పరిష్కార మార్గం ఏర్పడుతుంది. ఆ దిశగా విద్యార్థి – యువకులు, రైతులు, కార్మికులతో భుజం భుజం కలిపి పోరాడుతారని ఆశిస్తూ ముగిస్తున్నాను.

ఎవరు ఏడవగలరు
మరొకడి కోసం?
అంత శక్తి ఎవడుకుంది?
నీకోసం ఏడ్చే వాడికి నీవు రుణగ్రస్తుడివి
మార్క్సు కు ఈ శతాబ్దపు
అన్నార్తులందరూ రుణగ్రస్తులు”

**- గుంటూరు శేషేంద్ర శర్మ**

# భూమి సమస్య – సామాజిక న్యాయం

**శ్రీ వై.కోటేశ్వరరావు,** సీనియర్ న్యాయవాది, నాయకులు, దళిత బహుజన మహాసభ

ఈ సెషన్‌కు అధ్యక్షత వహిస్తున్న సునీత గారికి, రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ గారికి, వేదిక మీద, వేదిక క్రింద ఉన్న మిత్రులందరికీ ధన్యవాదాలు. ఈ సభలో చాలా క్వాలిటేటివ్ ఆడియన్స్ ఉన్నారు. ఆలోచించగలిగినవాళ్ళు, ఆలోచింప జేసేవాళ్ళు, ఆలోచనతో ఆగిపోకుండా కార్యాచరణ సాగిస్తున్న వాళ్ళు, త్యాగాలు, చేస్తున్న వాళ్ళు, అనేక ఇబ్బందులు పడుతూ కష్టకాలంలో ఎదురీదుతున్న వాళ్ళు ఎర్రజెండాను సుదీర్ఘకాలంగా మోస్తున్న వాళ్ళు, ఈ సమాజం మారాలి, మారి తీరాలి అని అంకిత భావంతో, కృత నిశ్చయంతో, వెనుదిరిగి చూడకుండా కార్యోన్ముఖులుగా ముందుకు కదులుతున్న కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, యువతీ యువకులు వీరందరి మధ్య నా అభిప్రాయాలను ప్రకటించే అవకాశం కల్గించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు.

'భూమి సమస్య – సామాజిక న్యాయం' అన్న అంశంపై నేను అర్థం చేసుకున్న మార్క్సిజం మేరకు, అంబేద్కర్, పూలే, నారాయణగురు మొ॥ సాంఘిక విప్లవకారుల బోధనలు, కార్యాచరణ నేనర్థం చేసుకున్న మేరకు మీ ముందుంచే ప్రయత్నం చేస్తాను.

వ్యవసాయ సంక్షోభం చాలా కీలకమైన అంశం. దేశంలోని ఆర్థిక సంక్షోభంలో ఇది అంతర్భాగం. భూమి సమస్య, అందులో ఇమిడి ఉన్న సామాజిక న్యాయం కూడా విశాలమైన దేశ ఆర్థిక, సామాజిక పరిస్థితిలో అంతర్భాగం కనుక ఈ అంశానికి పరిమితమై నా అభిప్రాయాలు వ్యక్తం చేస్తాను. మీరు అంగీకరించకపోతే విభేదించండి. ఫర్వాలేదు.

భూమి– ఒక సమస్యగా ఎందుకు మారింది ? ప్రకృతి సహజమైన భూమి సమస్యగా మారడమే ఒక విచిత్రం, ఒక విడ్డూరం. కానీ ఎందుకు సమస్యగా మారింది ? భూమి ఒక ఉత్పత్తి సాధనం. అది ఒక శక్తి (పవర్), ఒక గౌరవం, ఒక అవసరం. ఇంత విశాలమైన భూమిలో, భూమి సమస్య ఎందుకుండాలి? భూమిపై వ్యవసాయం చేయవచ్చు. అందులో నుండి ఖనిజాలు తీసుకోవచ్చు. పారిశ్రామికంగా ఉపయోగించుకోవచ్చు, భవన నిర్మాణానికి ఉపయోగించుకోవచ్చు. అది ఒక గొప్ప వనరు. ఎప్పుడైతే దానిపై మానవ అవసరాలు ఉత్పత్తి చేయటానికి అవకాశం కలిగిందో భూమి ప్రాధాన్యత పెరిగింది. క్రమక్రమంగా వ్యవసాయంలో అభివృద్ధి సాధించే కొలదీ ఆ వ్యవసాయం చేసే మనిషి అవసరాలు తీర్చటం కన్నా అధికంగా ఉత్పత్తి చేసే అవకాశం వచ్చింది. దీనివల్ల రెండు పరిణామాలు జరిగాయి. ఒకటి, శ్రమను తగ్గించుకోవచ్చు అంత కష్ట పడనక్కరలేదు. రెండు, తానసలు ఉత్పత్తిలో పాల్గొనకుండానే పక్కవాడు చేసిన ఉత్పత్తిని సొంతం చేసుకోవచ్చు. వాస్తవానికి మొదటి పరిణామం జరిగితే అది సోషలిజం, అది కమ్యూనిజం. కానీ అది జరగకుండా భూమి మీద వ్యక్తిగత యాజమాన్యాన్ని తీసుకువచ్చే ప్రయత్నమేదైతే చేశారో, తన ఉత్పత్తి తనది కాకుండా పరాయీకరణ చెందిందో, అక్కడే దోపిడీ వ్యవస్థ ప్రారంభమైంది. కొందరు చేసిన ఉత్పత్తి మరికొందరు ఉత్పత్తిలో పాల్గొనకుండానే అనుభవించే అవకాశం వచ్చింది. కాబట్టి భూమిపై వ్యక్తిగత యాజమాన్యం పెరిగింది. ఇది ఉత్పత్తి అభివృద్ధి క్రమంలోనే వచ్చింది. వ్యక్తిగత ఆస్తి ఉనికిలోకి వచ్చాక అందరిదీ అయిన భూమి, అందరిదీ అయిన గాలి, అందరిదీ అయిన నీరు కొందరిదిగా మారిపోయిన ఒక వ్యవస్థ రావటం వల్లనే, అది సరైనదేనని దానిని పరిరక్షించాలని ఒక రాజ్యాంగ వ్యవస్థ అవసరం ఏర్పడింది. దానిని సమర్థించటానికి ఒక భావజాలం వచ్చింది.



ఇది భూమి సమస్యకు కారణం. ఈ పరిణామమే జరగకపోతే భూమి సమస్య లేదు. (Private ownership of land is the root cause of land problems) భూమి మీద వ్యక్తిగత యాజమాన్య హక్కులు రావటం, వాటిని రాజ్యం పరిరక్షించటం, దాని కవసరమైన భావజాలం, దానికవసరమైన వ్యవస్థల నిర్మాణం ఇవన్నీ కలిసి భూమి సమస్యగా మారింది. తద్వారా వ్యవసాయ సంక్షోభం వచ్చింది. లక్ష్మీనారాయణ గారు చెప్పినట్లు నిరుద్యోగ సమస్య వచ్చింది. సురేష్ గారు కూడా నిరుద్యోగ సమస్య గురించి అనేక విషయాలు చెప్పారు. ఇవన్నీ దాని కొనసాగింపు. ఇక్కడ మనం ఒక స్పష్టతతో ఉండాలని మనవి చేస్తున్నా. ఇది అన్యాయం అని, ఇది తప్పు అని ఇది మారాలని సహజంగా నిజమైన ఉత్పత్తిదారులలో అభిప్రాయం ఏర్పడింది. దానిని ఎలా సమర్థించాలి? దాని కొరకు రాజ్యవ్యవస్థ ఒక్కటే సరిపోదు. ఇది సరైనదే అనే విధంగా నిజమైన ఉత్పత్తిదారులు భావించే విధంగా భావజాలాన్ని వారిలోకి ఎక్కించగలగాలి. అప్పుడు రాజ్యవ్యవస్థను ఉపయోగించకుండానే సరిపోతుంది.

అందుకనే సమాజంలో ఒక భావజాలాన్ని తీసుకువచ్చారు. దానికి మతమని పేరుపెట్టినా, ఇంకేమైనా పేరు పెట్టినా.

కాబట్టి ఉత్పత్తిదారుడు తాను చేసిన ఉత్పత్తిని తనకు కాకుండా చేసినా వ్యతిరేకించకుండా ఇది ఇంతే, ఇలాగే ఉంటుంది అనే భావజాలంలో కూరుకుపోయి ఉంటే కనుక శ్రమ చేయకుండానే ఉత్పత్తిని కైవసం చేసుకునే వాళ్ళకు సులభంగా ఉంటుంది. అణచివేతను, శ్రమ దోపిడీని నిరాటంకంగా కొనసాగించుకోవచ్చు. బానిసత్వం కన్నా బానిసత్వ భావజాలం కీలకమైనది. బానిస భావజాలం చాలా ప్రమాదకరం, బానిస మనస్తత్వం చాలా ప్రమాదకరం. దానిని బలంగా వ్యాప్తి చేశారు. దానితో ఉత్పత్తి దారులను గెలుచుకున్నారు. దానినే కొనసాగిస్తూ ఉన్నారు.

డా. డి.డి.కోశాంబి, ప్రసిద్ధ మార్క్సిస్టు చరిత్రకారుడు ఒక వ్యాఖ్య చేశాడు. "శ్రమ దోపిడీని ఎదిరించటానికి చేసే తిరుగుబాట్లపై అణచివేతను ప్రయోగించటం అనివార్యమైనప్పుడు మాత్రమే చేస్తారు. అసలు తిరుగుబాటే జరగకుండా ఉండే మానసిక భావజాలాన్ని వ్యాప్తి చేస్తే శ్రమ దోపిడీని నిరాటంకంగా కొనసాగించుకోవచ్చనుకుంటారు" అని చెప్పాడు. కనుక శ్రమ దోపిడీ చేసే వాళ్ళు రెండు అంశాలపై ఆధారపడ్డారు. ఒక వైపు రాజ్యవ్యవస్థ, మరోవైపు బానిసత్వ భావజాలం. ఈ క్రమంలో వచ్చిందే భూమి సమస్య. భూమి కలిగిన వాళ్ళలో అనేక రకాలు ఉన్నారు. పేద రైతులు, సాధారణ రైతులు, ధనిక రైతులు, జమీందార్లు, భూస్వాములు, ఇతర దేశాల్లో ఆర్థిక సంక్షోభాలు ప్రబలినప్పుడు చిన్న, సన్నకారు రైతులు భూములు కోల్పోయి కూలీలుగా మారారు. అనేక దేశాల్లో ఇలాగే జరిగింది. ఇక్కడ కూడా అది జరిగింది. ఇంకా అదనంగా ఇక్కడ చేతివృత్తులు అనేకం ఉన్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందేకొలదీ బాగా దెబ్బతిన్నది, సంక్షోభాన్ని ఎదుర్కొన్నది ఈ చేతి వృత్తులు. ఇతర దేశాల్లో భూములు కోల్పోయిన వాళ్ళు శ్రామికులుగా మారితే, ఇండియాలో కూడా అది ఒక మేరకు జరిగినప్పటికీ ప్రధానంగా చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు, సంక్షోభంలో ఉన్నవారు వీళ్ళు ప్రధానంగా కార్మికులుగా మారారు. భారతదేశపు ప్రత్యేకత ఏమంటే ఇక్కడి శ్రామిక వర్గం చేతివృత్తులు చేసుకుంటూ ఉన్నవాళ్ళు, వాళ్ళ వృత్తుల్ని, జీవన విధానాన్ని పారిశ్రామిక అభివృద్ధి నాశనం చేస్తే "శ్రామికులుగా మారారు. వీళ్ళంతా భూమిలేని వాళ్ళు. 'వీళ్ళంతా SC, ST, BCలు. ఈ ప్రత్యేకతను" మనం అర్థం చేసుకుంటే భూమి సమస్యలు, కుల వృత్తులకు మధ్య ఉన్న సంబంధం మనకు అర్థమవుతుంది. చేతివృత్తుల గురించి మనం అర్థం చేసుకోవాలంటే వాళ్ళు కేవలం ఆర్థికంగా మాత్రమే ఆయా వృత్తులతో ముడిపడి లేరు. ఇండియాలో సృష్టించబడ్డ కులవ్యవస్థలో వీరొక భాగం. చేతివృత్తులు అన్ని దేశాలల్లోనూ ఉన్నాయి. ఇంగ్లాండుకు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త ఆడం స్మిత్ తన 'జాతుల సంపద' అనే గ్రంథంలో పని విభజన గురించి రాస్తూ పని విభజన ప్రపంచమంతా ఉంది. కానీ ఇండియా మినహా మిగిలిన ప్రపంచంలో నేత మనిషి ఉన్నాడు. కానీ పద్మశాలీ లేదు. క్షురకుడు ఉన్నాడు, కానీ మంగలి లేదు. వడ్రంగి ఉన్నాడు, కంసాలి లేదు. అక్కడున్న ప్రతి వృత్తికీ ఇక్కడ కులం ఆపాదించబడింది. ఇదీ భారతదేశ ప్రత్యేకత. ఎవరైతే చేతివృత్తుల కులాలుగా ఉన్నారో వాళ్ళకు భూములు లేవు. చేతివృత్తులు కాని వారందరికీ భూములున్నాయన్నది నా ఉద్దేశం కాదు. వారిలోనూ భూమి లేని వారున్నారు. కులాలుగా విభజించబడిన ఈ సమాజంలో చేతివృత్తుల కులాలకు భూములు లేవు, వృత్తులు పోయాక వారు పారిశ్రామిక కార్మికులుగా మారారు. అలా మారినప్పుడు కులం ధ్వంసం కాలేదు. వృత్తులు పోయినప్పటికీ వాళ్ళు దాన్ని మోసుకొచ్చారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రత్యేకత ఏమంటే దానికి అడ్డువచ్చిన ప్రతిదాన్నీ అది నరుక్కుంటూ వెళ్తుంది. అలాంటి కుత్తుకలు కోసుకుంటూ వెళ్ళే పెట్టుబడిదారీ విధానం, ఇండియాలో కులం కుత్తుక నరకలేదు కదా, పైగా కొనసాగించింది. చాలా తెలివిగా కులాన్ని యధాతథంగా స్వీకరించింది. ఎందుకంటే ఈ నిమ్నకులాలలో న్యూనతా భావం ఉంది. నేను తక్కువ కులం వాడిని, నా బ్రతుకు ఇంతే, నా కన్నా అగ్రకులాల వాళ్ళు అధికులు అనే భావజాలం బలంగా నాటుకుపోయి ఉంది. పెట్టుబడిదారీ విధానపు శ్రమ దోపిడీకి ఇది అత్యంత అనుకులమైన భావజాలం. అది శ్రమదోపిడీపై తిరుగుబాటు చేయనివ్వదు. అలా భూస్వామ్య వ్యవస్థలోనే కాక, పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ దోపిడీ కొనసాగటానికి కులవ్యవస్థ దోహదపడింది. దోపిడీ శక్తులతో సర్దుకుపోవటానికి, సామరస్యంగా ఉండటానికి కులవ్యవస్థ దోహదపడిందని డి.డి.కోశాంబి చెబుతాడు. భారతదేశంలో జరిగిన పారిశ్రామికాభివృద్ధిని పరిశీలిస్తే ఎవరైతే గ్రామీణ ప్రాంతంలో భూములు కలిగి ఉన్నారో, ఆ భూస్వామ్య వర్గం భూముల ద్వారా భూమిలేని వారిని శ్రమ దోపిడీ చేసి కూడబెట్టిన అదనపు విలువను వడ్డీ వ్యాపారం, పెట్టుబడి వ్యాపారం చేసుకుంటూ చేసుకుంటూ వాళ్ళే పట్నాలకు వచ్చి పెట్టుబడులు పెట్టి పరిశ్రమాధిపతులుగా మారారు. వాళ్ళు కులాన్నీ మోసుకువచ్చారు. చేతివృత్తులు కోల్పోయి కార్మికులుగా మారిన వాళ్ళు కూడా కులాన్ని మోసుకు వచ్చారు. కులాన్ని కొనసాగించారు.

'పరస్పర విరుద్ధ శక్తుల సంఘర్షణే మార్పుకి, అభివృద్ధికి మూలం' అని మార్క్సిజం చెబుతుంది. ఈ వర్గ సంఘర్షణ జరగటానికి కులం అనేది ఆటంకంగా మారింది. పెట్టుబడిదారీ వర్గానికి కులవ్యవస్థ ఉపయోగకరంగా ఉంది. అందుకే అది ఆ వ్యవస్థను ధ్వంసం చేయకుండా రాజీపడింది. బ్రిటీష్ వాళ్ళు కూడా వాళ్ళకేమీ కులవ్యవస్థ గురించిన పట్టింపు లేకపోయినప్పటికీ వాళ్ళు ఆధారపడింది గ్రామీణ ప్రాంత ఆధిపత్యశక్తులపైన, మునసబులు, కరణాలు పైన ఆధారపడ్డారు. కులవ్యవస్థను ధ్వంసం చేయాలనే ఆలోచన వైపు వాళ్ళు పోలేదు. వాళ్ళు దానిని

వాడుకున్నారు. వారికది ఉపయోగకరంగా ఉంది. భూస్వామ్య వర్గం కులవ్యవస్థ నుపయోగించుకుని శ్రమ దోపిడీ చేసి బలపడిందనుకుంటే మరి పెట్టుబడిదారీ వర్గం దానిని నాశనం చేయాలి కదా! కానీ అది వారికీ ఉపయోగకరంగా ఉంది. అందుకని అది కుల వ్యవస్థను ధ్వంసం చేయకుండా రాజీపడింది. వాస్తవానికి భూస్వాములుగా ఏ కులాలకు చెందిన వారున్నారో వారే పెట్టుబడిదారులుగా మారారు. ఈ సామాజికాంశాన్ని సక్రమంగా అర్థం చేసుకోవాలి.

భారత రాజ్యాంగంలో సోషల్ జస్టిస్ గురించి రాశారు. పొలిటికల్ జస్టిస్, ఎకనామికల్ జస్టిస్ గురించి రాశారు. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా పెట్టారు. కానీ వాటినమలు జరపకుండా, మౌలింగా ఉన్న వ్యవస్థను జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్న క్రమంలో ఒక పెద్ద కమ్యూనిస్టు ఉద్యమం ఈ దేశంలో వచ్చింది. మహత్తరమైన కమ్యూనిస్టు ఉద్యమం. ఎంతగా అంటే 'సోషలిజం' అనే అంశాన్ని ప్రతివాళ్ళు మాట్లాడాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ భావనతో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన భూమి లేని వాళ్ళు భూమి కొరకు పోరాటాలు మొదలుపెట్టారు. 'దున్నేవానికే భూమి' అనే అద్భుత నినాదాన్ని కమ్యూనిస్టు ఉద్యమం తీసుకువచ్చిన తర్వాత, మహారాష్ట్రలో దళిత పాంథర్స్ కూడా భూమి సమస్యను లేవనెత్తారు. భూమి లేని వాళ్ళకు భూమి ఇవ్వాలనే నినాదం, భూ పంపిణీ అనేది అనివార్యంగా ముందుకు వచ్చింది. పాలకవర్గాలు కూడా దీనిని మాట్లాడవలసిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఆ నినాదాన్ని జాగ్రత్తగా ప్రచారం చేస్తూ కూడా, దానిని సక్రమంగా అమలు జరపకుండా పాలకవర్గాలు మాయలతో, కుతంత్రాలతో భూసంస్కరణలు అంటూ కౌలుదారులు అంటూ, మరికొన్ని సంస్కరణల పేరుతో కాలయాపన చేస్తూ వచ్చారు. అయినప్పటికీ భూమి లేని వర్గానికి భూమి దక్కాలని, కొద్దిమంది చేతిలో కేంద్రీకృతం కారాదు అనే భావన వివిధ ఉద్యమాల ఫలితంగా బలంగా ముందుకు వచ్చింది. దీని ఫలితంగానే ఎవరైతే భూమిలేని సామాజిక కులాలున్నాయో వారికీ భూములు దక్కాలనే ఉద్యమం ముందుకు వచ్చింది. ఈ క్రమం కొంతకాలం సాగింది. దీనిని అర్థం చేసుకున్న పాలకవర్గాలు దీనిని కేవలం నినాదంగా మార్చటం మాత్రమే కాక ఎవరైతే బి.సి. కులాలుగా ఉన్నారో, ఎవరి చేతుల్లో భూములు లేవో వారిని పక్కన పెట్టటంతో వ్యవసాయ సంక్షోభం ఏర్పడింది. కొన్ని లెక్కలు ఏం చెబుతున్నాయంటే పెద్ద రైతులు కూలీలను పెట్టి సాగు చేయించినప్పుడు ఎకరానికి వచ్చిన దిగుబడి కన్నా, చిన్న, సన్నకారు రైతులు ఎకరం, రెండెకరాలు, మూడు ఎకరాలు ఉన్న రైతులు కుటుంబం మొత్తం శ్రమించి సాగు చేసినప్పుడు వచ్చిన దిగుబడి అధికంగా ఉందని అంటే intensive cultivation. Intensive cultivation వల్ల ఉత్పత్తి పెరుగుతుంది. ఇతర దేశాల మీద ఆధారపడే పరిస్థితి తగ్గుతుంది. సంపద పెరుగుతుంది. జాతీయదాయం పెరుగుతుంది. అయినప్పటికీ కూడా దానిని అమలు జరపడం లేదు. ఇవాళ వ్యవసాయ సంక్షోభానికి మూలం ఏమిటి? ఆర్థిక సంక్షోభంలో వ్యవసాయ సంక్షోభం యొక్క పాత్ర చాలా ఎక్కువ కదా. మరి ఎందుకని రకరకాల సంస్కరణలనీ, అవని, ఇవని చెబుతూ కాలక్షేపం చేస్తున్నారు తప్ప వ్యవసాయాన్ని అభివృద్ధి చేసే విధంగా పొలంపై నిజంగా శ్రమించి సాగు చేస్తున్న వారికి భూమిని చెందనీయటం లేదు, ఉత్పత్తి పెరిగినా కూడా? ఎందుకంటే ఆధిపత్యం పోతుంది, రాజకీయాధిపత్యం పోతుంది. ఆర్థిక ఆధిపత్యం పోతుంది కాబట్టి, దున్నేవానికి భూమి దక్కక పోవటానికి, వ్యవసాయ రంగ సంక్షోభం రావటానికి, తద్వారా ఆర్థిక సంక్షోభం పెరగటానికి రాజ్యాంగం మూల కారణం కాదు. శ్రమ దోపిడీ, పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడటం, కార్పొరేట్ విధానాలను కాపాడటం. కాబట్టి వ్యవసాయ సంక్షోభానికి మూలం ప్రభుత్వాలు అమలు చేసే ఆర్థిక విధానాల్లో ఉంది. ప్రభుత్వాలు అమలు చేసే రాజకీయ విధానాల్లో ఉంది. ఈ ఆర్థిక, రాజకీయ విధానాలు మారకుండా వ్యవసాయ సంక్షోభం పరిష్కారం కాదు. తద్వారా వచ్చిన ఆర్థిక సంక్షోభం పరిష్కారం కాదు. కాకపోయినప్పటికీ వారి ప్రయోజనాల కోసం ఈ వ్యవస్థనిలా కాపాడుతూ తూతూ మంత్రంగా ఏవో సంస్కరణలు చేసినట్లుగా మభ్యపెడుతున్నారు. ఎమర్జెన్సీ కాలంలో అంత పెద్ద నియంతృత్వాన్ని చేసిన ఇందిరాగాంధీ కూడా ల్యాండ్ సీలింగ్ యాక్ట్ తెచ్చింది. ఎందుకు తెచ్చింది. డెబ్భైలలో నక్సల్బరీ, శ్రీకాకుళం ఉద్యమాల ఫలితంగా భూమి సమస్య ప్రధానమైనదిగా ముందుకు వచ్చింది. ఈ రాష్ట్రంలో భూసంస్కరణల చట్టం ప్రవేశపెట్టారు. కానీ అమలు చేశారా? ఇది ప్రధానమైనది. భూమి సమస్య సారాంశంలో ఆర్థిక సమస్య, రాజకీయ సమస్య, రాజ్యాధికార సమస్య. దీనికి సామాజిక న్యాయాన్ని లింక్ చేసి మనం ఆలోచిస్తే, నేనిందాక మనవి చేసినట్లుగా ఎవరైతే చేతివృత్తుల వారు భూమికి దూరంగా ఉన్నారో, వారు చేసే వృత్తులన్నీ కూడా కులవ్యవస్థతో ముడిపడి ఉన్న కారణం చేత భూమిలేని వారుగా మిగిలిపోయారు, కూలీలుగా మారిపోయారు, ఈ వ్యవస్థలో సామాజిక న్యాయం జరగలేదు. ఒకప్పుడు సోషలిజం మారుమోగినట్లు ఈ రోజు సామాజిక న్యాయం మారుమోగుతుంది. ఇక్కడ సామాజిక న్యాయం గురించి మనం కొంచెం అర్థం చేసుకోవాలి. కుల వ్యవస్థ లేదనుకుంటే గొడవే లేదు. కానీ, ఉన్నదని అంగీకరిస్తే దాని లక్షణాలు, పరిణామాలు, దుష్ఫలితాలు అన్ని రంగాలలో అది ఏరకంగా పరిభ్రమిస్తోందో, ప్రభావాన్ని చూపుతోందో అర్థం చేసుకున్నప్పుడు, ఈ దొంతరలుగా ఉన్న కులవ్యవస్థలో సమన్యాయం జరగాలంటే సామాజిక న్యాయం జరగాలి. అంటే కులాలుగా విభేదించబడి ఉన్న సమాజంలో ఏ కులాలకైతే ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం జరగలేదో, ఆయా కులాలకు అది జరగాలి అంటే ప్రత్యేక దృష్టి అవసరం. రిజర్వేషన్లు పెట్టారు. కమ్యూనిస్టు ఉద్యమంపై ఒక విమర్శ కూడా ఉంది.

దున్నేవానికే భూమి అన్నారు. దున్నే వాళ్ళందరూ సమానం కాదు కదా! దున్నేవాళ్ళలో కూడా కులాలున్నాయి కదా! వాళ్ళల్లో అగ్రకులాల వాళ్ళున్నారు. అణచబడ్డ కులాల వాళ్ళున్నారు. ఒక వంద ఎకరాలు భూమి లేని వాళ్ళకు పంచటానికి పూనుకుంటే ఆ భూమి లేని వాళ్ళందరూ ఒక కులానికి చెందిన వాళ్ళు కాదు. భూమి లేని వాళ్ళు కూడా అసమానులుగా ఉన్నారు. అసమానులను సమానులుగా చూడవచ్చా? వాళ్ళు సమానులు కానప్పుడు 'దున్నేవానికే భూమి' అన్నప్పుడు ఏదున్నేవానికి భూమి? అణచబడ్డ కులాలకా లేక సమాజంలో ఆధిపత్యం వహిస్తున్న కులాలకు చెందిన వాళ్ళకా? ఈ తేడా మనం చూడాలా, వద్దా? సామాజిక న్యాయం అనే అంశం వచ్చినప్పుడు ఈ తేడా చూడాల్సి వస్తుంది. కులాల వారీగా సమాజం విడివడి ఉంది కాబట్టే రిజర్వేషన్లు తెచ్చారు. లేకపోతే అసలు రిజర్వేషన్లు ఎందుకు? రాజ్యాంగంలో ఎందుకు పొందుపరిచారు?.

9 మంది న్యాయమూర్తులు తీర్పు చెప్పిన ఇంద్రసాహ్నీ కేసులో సుప్రీంకోర్టులో, కులవ్యవస్థ ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వచ్చా, లేదా? మండల కమిషన్ 27 శాతం ఓబిసిలకు రిజర్వేషన్లు ఇవ్వాలని చెప్పింది. ఓబిసిలెవరు అందరూ మనుషులే కదా! మనుషులందరూ సమానమే కదా వాళ్ళకెందుకు 27 శాతం ఇవ్వాలి అని సుప్రీంకోర్టులో ఛాలెంజ్ చేశారు. 9 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం కూర్చుని చర్చించింది. కులం ప్రాతిపదికగా రిజర్వేషన్లు ఇవ్వకూడదు, పేదరికం ప్రాతిపదికగా ఉండాలి. అనేది పిటిషనర్ల వాదన. అప్పుడు సుప్రీంకోర్టు పేదలందరూ సమానం కాదంది. 'మేం కూటికి పేదలం కానీ కులానికి కాదు' అని ప్రబలంగా అనుకునే సమాజం మనది. అహంకారం అది. పేదలందరూ సమానులు కాదు, ఉద్యోగులందరూ సమానులు కాదు. బిచ్చగాళ్ళు కూడా సమానం కాదు. ఉపాదానం ఇయ్యమని బ్రాహ్మడు వస్తాడు. దానికి దానం అని పేరు పెడతాడు. ఈ విభేదాలు ఉన్నప్పుడు కులం ప్రాతిపదికగా రిజర్వేషన్లు కరక్టే అని ఇంద్ర సాహ్నీ కేసులో సుప్రీంకోర్టులో 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పు చెప్పింది. అంటే అది కుల వ్యవస్థను గమనించింది. మన కమ్యూనిస్టు ఉద్యమంలో కూడా అంతకు ముందు లేనటువంటి ఒక గుర్తింపు, స్పృహ వచ్చాయి. 'కుల వివక్షతా పోరాట సమితి' పెట్టారు. 'కుల నిర్మూలనా పోరాట సమితి' పెట్టారు. 'దళిత హక్కుల పోరాట సమితి' పెట్టారు. మనవాళ్ళు కూడా ఆ రకమైన ఆలోచన చేస్తా ఉన్నారు. వాస్తవ పరిస్థితి దానికి దారి తీస్తా ఉంది. కనుక, ఇప్పుడు సమాజంలో మార్పును కోరే మనం శ్రమదోపిడీతో పాటు సామాజికాంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. లేకుంటే కారంచేడు జరిగి ఉండేది కాదు, చుండూరు జరిగి ఉండేది కాదు. నీరుకొండ, పదిరి కుప్పం, వేంపెంట జరిగి ఉండేవి కావు. ఇది ఒక వాస్తవం, ఒక వైరుధ్యం. దాన్ని ఎలా పరిష్కారం చేసుకోవాలి అనేది రైతుకూలీ సంఘం కూడా ఆలోచించాలి. వాస్తవికత ఆధారంగా మనం ముందుకెళ్ళాలి. మార్క్సిస్టులుగా మనం గుర్తించకపోతే మరెవరు గుర్తిస్తారు. అలాంటి వాస్తవికతను గుర్తించి ముందుకు వెళ్ళే దమ్ము, ధైర్యం, ధీరత్వం మార్క్సిస్టులకే ఉంటుంది. వాస్తవాన్ని ఎదుర్కొంటూ దాన్నెలా పరిష్కరించాలో ఆలోచించి, పోరాడే దిశగా రైతుకూలీ సంఘం ముందుకు వెళుతుందని ఆశిస్తున్నాను.

ఇంకో చిన్న విషయం రైతుకూలీ సంఘం అనే పేరు మీద కూడా చిన్న సందిగ్ధత. రైతులు, కూలీలు ఒకటి కాదు. వారి మధ్య ఒక చిన్న వైరుధ్యం ఉంది. రైతు భూమిపై వ్యవసాయం చేస్తాడు, చేయించు కుంటాడు. కూలీలు మాత్రం కూలీలే. వీళ్ళిద్దరూ ఒక సంఘంలో ఉండొచ్చా అనేది ఆలోచించాలి. వ్యవసాయ కార్మిక సంఘం అన్నారు. అది కరెక్టే. అంటే పొలంలో పని చేసే కార్మికులు. రైతులు, కూలీలు ఒకే సంఘంలో ఉండొచ్చా, అది శాస్త్రీయమేనా అనేది ఆలోచించాలి. అంతేకాదు రైతుల్లో ఉండే కులాలు వేరు. కూలీల్లో ఉండే కులాలు వేరు. కులాల మధ్య వైరుధ్యాలు ఉన్నప్పుడు, అణచివేతలు ఉన్నప్పుడు అవి రెండూ ఒక సంఘంలో ఉండొచ్చా అన్నది మనం పరిశీలించాలి. రైతు అంతో ఇంతో కూలీ ఇచ్చి పని చేయించుకుంటాడు కాబట్టి, అతను దోపిడీదారు అని నేను అననుగానీ, రైతుకి, కూలీకి ఉండే వైరుధ్యం ఎలాగు ఉంటుంది. కాబట్టి ఈ ఇరువురూ ఒక సంఘంలో ఉండొచ్చా అన్నది మీరు పరిశీలించాలని ఒక ప్రశ్నగా మీ ముందుంచుతున్నాను. నా అభిప్రాయాలను మీతో పంచుకునే అవకాశం కలిగించినందుకు రైతుకూలీ సంఘం వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రైతుకూలీ సంఘం ఇంకా అభివృద్ధి చెందాలని, ముందుకు సాగాలని ఆశిస్తూ వర్ధిల్లాలి, రైతుకూలీ సంఘం, వర్ధిల్లాలి రైతుకూలీ సంఘం.

"నింగి లోపల లేవు ఎల్లలు
నీరధిని కనరావు ఎల్లలు
ఎందుకీ ధరణీ తలమ్మున
ఇరుకు వాడలు ఇనుప గోడలు
అన్ని జాతులకొకే సూర్యుడు
అన్ని నేలల కొకే చంద్రుడు
అయినచో జాత్యహంకారము
ఆటవిక తత్వము కాదా?"

**- సి. నారాయణ రెడ్డి**

## కా॥ సింహాద్రి ఝాన్సీ, రాష్ట్ర అధ్యక్షులు, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర)



అధ్యక్షా, కామ్రేడ్స్! ఈ రోజు మనం చర్చించుకుంటున్న అంశం భూమి సమస్య-సామాజిక న్యాయం. ఈ అంశం మీద మిత్రులు శ్రీ వై.కోటేశ్వరరావుగారు చాలా విషయాలు మాట్లాడారు. అలాగే రైతుకూలీ సంఘంగా పెట్టుకోవటంలో తనకున్న సందేహాన్ని వెలిబుచ్చారు. మనం ప్రధానంగా తీసుకోవాల్సినది, మనం ఉన్నటువంటి వ్యవస్థ ఏమిటనేది. మన అవగాహన ప్రకారం ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా ఇక్కడ పెద్ద ఎత్తున ఒక పోరాటం జరగలేదు. పెట్టుబడిదారీ విధానం అనేటువంటిది ఆ క్రమంలో రాలేదు. మన దేశంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత ఫ్యూడలిజం శక్తుల మీద ఆధారపడి సామ్రాజ్యవాదులు అభివృద్ధి అయ్యారు. కనుక ఇక్కడ భారతదేశంలో ఇది ఒక ప్రత్యేకమైనటువంటి పరిస్థితి. అదే విధంగా వై. కోటేశ్వరరావుగారు ఒక విషయం చెప్పారు. సమాజంలో చాలా కులాలు ఉన్నాయనే మాట ప్రస్తావించారు. కులాలు ఉన్నాయన్నది చాలా వాస్తవం. కులాల్లో కూడా సమానతలు లేవు. అగ్రకులంగా చెప్పుకుంటున్న వాళ్ళలో కూడా పేదలు ఉన్నారు, అగ్రకులంగా ఉండేటు వంటి వాళ్ళలో ఎక్కువ మంది సంపద మీద ఎక్కువ పట్టుకలిగిన వారు ఉన్నారు. దళితులలో సంపద ఎక్కువగా కలిగిన వారి సంఖ్య చాలా తక్కువ ఉంది. ఎక్కువ మంది దళితులే నిరుపేదలుగా ఉన్నారు. అయితే ఈ సమాజం యొక్క స్వభావాన్ని అర్థం చేసుకుని కుల సమస్యల స్వభావం ఏమిటి, పరిష్కారం ఏమిటి అనేది ఆలోచించాలి. కులం విషయంలో ఉండే సమస్యలను, అంతరాలను ఎలా పరిష్కరించుకోవాలి అనే దగ్గరే పెద్ద ఎత్తున గందరగోళం, అయోమయం ఏర్పడుతున్న పరిస్థితి ఉంది. ఒక విషయం వాస్తవంగా మనమందరం అంగీకరించేది, సమాజంలో కులాలు ఉన్నాయి. కులాల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. కులాల మధ్య ఉన్న వ్యత్యాసాలను ఈ రోజు పాలకవర్గాలు చక్కగా తమ స్వార్థ రాజకీయాల కోసం, ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు. కాబట్టి పాలకవర్గాలు చెబుతున్నట్టు, బయట ప్రచారం జరుగుతున్నట్టు ఒక కులము కూడా ఒక రాజకీయ పార్టీకి కట్టుబడిలేనటువంటి పరిస్థితిని ఈ ఎన్నికలలో చూస్తున్నాం. ప్రతి కులంలోను 2,3 పార్టీలు ఉన్నాయే తప్ప, వాస్తవంగా అక్కడ కింద ఎవరైతే శ్రమ చేస్తున్నారో వాళ్ళకు భూమిమీదగాని, ఉత్పత్తి సాధనాల మీద కాని, దాని ఫలితాలపై హక్కులేకుండా చేసి శ్రమ జీవులకు ఆత్మగౌరవం అనే సమస్య ప్రధాన సమస్యగా ఉంది. దీన్ని రకరకాల పద్ధతుల్లో ఈ రోజు దోపిడీవర్గాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించటం కోసం సమాజాన్ని అస్తవ్యస్తం చేసి, విచ్ఛిన్నం చేస్తూ, అసలు ఎవరు ఎటువైపు, ఏమిటి అనేది తెలియనీయకుండా గందరగోళాలు చేస్తూ, అసలు మౌలికమైన సమస్యల వైపు పేదలను, దళితులని, కింద కులాలుగా బీసీలను, వీరందరినీ ఐక్యం కానివ్వకుండా రకరకాలైన గందరగోళాలను సృష్టిసున్న పరిస్థితిని మనం చూస్తున్నాం. ఈ పరిస్థితుల్లో గ్రామాల్లో ఉన్న పరిస్థితేంటి? కులాల మధ్య ఉండే అంతరాలను ఏ విధంగా మనం అర్థం చేసుకోవాలి? ఏ విధంగా మనం మాట్లాడుకోవాలి? ప్రజలను సమీకరించేటప్పుడు మనకు కష్టమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. మొత్తం ఈ సమాజంలో ఉన్న దళితుల్ని, పేదల్ని, అందరినీ ఆర్గనైజ్ చేసుకోవటం కోసం వారి మీద ప్రధానంగా సాగుతున్న దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా సంపద మీద ప్రజలందరికి పట్టుకావాలనే దానికోసం పోరాటం చేయాలని చెప్పి కమ్యూనిస్టులుగా, మార్క్సిస్టు అవగాహనతో ఉన్న మనం పని చేస్తున్నప్పుడు మనకు చాలా సమస్యలు, ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కనుకనే ఈ సమస్యల మీద లోతుకెళ్ళి అవగాహన చేసుకుని మాట్లాడాలి అని అనుకున్నప్పుడు అసలు మన భారతదేశం యొక్క వర్గస్వభావం ఏమిటి? బ్రిటీష్‌వాడు మన దేశానికి వచ్చినప్పుడు ఇక్కడున్నటువంటి విధానాలు ఏమిటి? ఆసియా ఉత్పత్తి విధానం ఏమిటి? కులాలు, వృత్తులు ఎలా పుట్టాయి? వృత్తుల నుంచి కులాలుగా ఎలా మారాయి? ఆ తర్వాత ఈ కులాలు ప్రస్తుతం క్రమంగా రూపాంతరం చెందుతూ మొత్తంగా ఈ భారతదేశంలో సంపదను సృష్టిస్తున్న శ్రమజీవులు, కష్టజీవులు ఉత్పత్తి సాధనాల నుంచి, ఉత్పత్తి విధానాల నుంచి ఏ విధంగా గెంటివేయబడుతున్నారు అనే విషయాన్ని మనం చాలా స్పష్టంగా అర్థం చేసుకుని కింద స్థాయిలో ఉన్న ప్రజలందరి దగ్గరికీ వెళ్ళి, రైతుకూలీ సంఘం చెబుతున్నటువంటి దున్నేవానికి భూమి హక్కు అనే నినాదాన్ని వాస్తవ రూపంలో తీసుకు వెళ్ళాల్సిన అవసరం ఉంది. ఈ రోజు చాలా మంది మన భావజాలానికి వ్యతిరేకంగా ఉన్నవాళ్ళు దున్నేవానికి భూమి అంటే అసలు భూమి ఎక్కడుంది? ఎవరికి ఇవ్వాలి? ఇప్పుడు దున్నేదంతా కార్పొరేట్లకే కదా అని చెబుతున్నారు. పాలకులు చేసిన భూసంస్కరణ చట్టం, 1/70 చట్టం, భూపరిమితి, భూగరిష్ట పరిమితి వంటి చట్టాలన్నీ అమలు చేయాలని, ఎవరైతే ప్రధాన ఉత్పత్తి సాధనంగా, భూమి మీద ఆధారపడి జీవిస్తున్నారో వాళ్ళకు పంచాలి అని మనం డిమాండ్ చేస్తుంటే, ఎక్కడుంది భూమి? భూమే లేదు అని చెబుతున్నటువంటి వాళ్ళు ఈ రోజు

ప్రజలను మాయచేసి వ్యవసాయాన్నంతా సంక్షోభంలో పడవేసి ఇక రైతుకు పంట పండించుకునే అవకాశం లేకుండా కేవలం ఆ భూమిని అమ్ముకుని అక్కడి నుంచి వెళ్ళిపోయే పరిస్థితిని సృష్టిస్తున్నారు. ఆ భూముల్నే ఈ రోజు ఒక రకంగా కార్పోరేటు కంపెనీలుగాని, పెద్దపెద్దవాళ్ళుగాని, విదేశాల్లో ఉండి డబ్బులు సంపాదించుకున్నవాళ్లు వచ్చి భూములు కొనుక్కుంటున్నారు అంటే, ఎక్కడిది వాళ్ళకంత సంపద? ఇంతకు ముందు గతంలో 40, 50 సంవత్సరాల క్రితం వ్యవసాయం మీద ఆధారపడి బ్రతికేవాళ్ళలో వాళ్ళకున్న కొంత ఉత్పత్తి మీద ఆదాయంతో, కొంత అప్పులు చేసి ఒక ఎకరం, రెండెకరాల భూమిని కొనుక్కునే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు భారత దేశంలో ఏమూలకెళ్ళి చూసినా, వ్యవసాయం మీద ఆధారపడి జీవించే ఏ రైతు కూడా ఒక్క ఎకరం కూడా భూమి కొనుక్కోలేని పరిస్థితి ఉంది అంటే, దానికి కారణం ప్రధానంగా వ్యవసాయరంగ సంక్షోభమే. అంటే ఇక్కడున్నటువంటి ఫ్యూడల్ శక్తులమీద, వారితో కుమ్మక్కయి సామ్రాజ్యవాదులు మొత్తం మన భారతదేశంలో ఉన్నటువంటి వ్యవసాయరంగాన్నంతా ఛిన్నాభిన్నం చేసి అతలాకుతలం చేసినటువంటి ఫలితంగానే ఈ రోజు చాలా అస్తవ్యస్తంగా ఉన్న ఈ వ్యవస్థను చూస్తున్నాం. ఆ వ్యవస్థలో దోపిడీ పాలకవర్గాలు మన మధ్య, పేదల మధ్య, గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణాల్లో జీవిస్తున్న పేదల మధ్య రకరకాలుగా విభేధాలు సృష్టిస్తూ ఐక్యం కాకుండా విడగొట్టే పరిస్థితి మనం చూస్తున్నాం.

కనుక ఈ రోజు మనముందున్న కర్తవ్యం ఏమిటి? ఈ శక్తులు ఎలా మనల్ని దోపిడీ చేస్తున్నాయి? ఈ దోపిడీని మనం ఎలా తిప్పికొట్టాలి, ఆ దోపిడీకి వ్యతిరేకంగా ఈ రోజు పోరాటాలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వ్యవసాయాన్ని కాపాడుకోవటం, దానిమీద ఆధారపడటం, వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవటం అనేది మన మీద ముఖ్యమైన కర్తవ్యంగా ఉంది. ఈ కర్తవ్యం వదిలేసి ఎక్కడెక్కడో ఎవరికిష్టమైన నినాదాలు వారు ఇస్తుంటే, ఆ నినాదాల వెనుక మనం కొట్టుకొని వెళ్ళిపోతుంటే మనం ఈ రోజు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదలను, వ్యవసాయరంగంలో వస్తున్న సంక్షోభాలను తిప్పికొట్టడం కోసం మనముందు సరైన ఆయుధాలు ఉండవు. కనుక మొట్ట మొదట భారతదేశంలో ఉండే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఏమిటి? భూమి సమస్య ఏమిటి? భూమి మీద ఆధారపడి ఉన్న కుల సమస్య ఏమిటి? కులాల మధ్య అంతరాలేమిటి? ఈ కులాల మధ్య ఉండే అంతరాలను సృష్టిస్తున్నది ఎవరు అని చెప్పి మనం మూలాల్లోకి వెళ్ళాలి. ఎక్కడైతే మనం పని చేస్తామో అక్కడే మనకు సమాధానం దొరుకుతుంది. రైతుకూలీ సంఘంగా మనకు అనుభవం ఉంది. ఆ అనుభవాలను ఈ సందర్భంగా మనం గుర్తుచేసుకోవటం మంచిది.

మొదటిది మనం ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో, గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్నప్పుడు అక్కడి చిన్న చిన్న కులాల మధ్య ఉండే అంతరాలను మనం వర్గపోరాటంగా ఇష్యూ తీసుకున్న తర్వాత వాటికి వ్యతిరేకంగా వారందరినీ ఐక్యం చేయగలగుతున్నటువంటి పరిస్థితి మనకు ఉంది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విజయనగరం, దుగ్గేరుకు సంబంధించిన మన పోరాట అనుభవాలను, అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో దళితుల మీద జరుగుతున్న దాడుల్ని ఎవరు ఖండిస్తున్నారు? వాటికి వ్యతిరేకంగా ఎవరు పోరాటాలు చేస్తున్నారనే విషయాలను మనం పరిశీలించుకోవాలి. దళితుల మీద దాడులు చేయటం, వాళ్ళను బుజ్జగించడం, డబ్బులిచ్చి మాయ చేయటం, నోరు మూయించటం వంటివన్నీ ఈ రోజు పాలకవర్గాలు చేస్తున్నపని. కానీ ఒక చైతన్యంతో సాగుతున్న ఉద్యమాల్లో వాళ్ళు ఏ కులమైనాగాని, ఎవరైనాగాని ఆ దళితుల మీద జరుగుతున్న దాడుల్ని ఖండించే చైతన్యాన్ని, ఆ పురోగతిని మనం అందిస్తున్నాం. రైతుకూలీ సంఘంగా ఈ పనిని చేస్తున్నాం అనే విషయాన్ని గర్వంగా మనం చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. ఉదా॥కు 2012లో లక్ష్మింపేటలో జరిగిన సంఘటనలో 5 గురిని చంపేసారు, 12 మందిని కాళ్ళు, చేతులు విరగొట్టారు. లక్ష్మింపేటలో దాడులకు గురయ్యినవారందరికీ అనేక సంఘాలు వచ్చి వారికి నష్టపరిహారం అని చెప్పి రకరకాలుగా చేసి డబ్బులిచ్చారు. కానీ ఇంతవరకు కూడా ఆ కేసు ఏమైందో తెలియదు. ప్రత్యేక కోర్టులు కూడా ఏమైనాయో తెలియదు. కానీ నిలకడగా లక్ష్మింపేట దళితుల మీద దాడులు చేసింది ఎవరు? వాళ్ళను శిక్షించాలి, వాళ్ళ యొక్క దాడులను అరికట్టాలి, ఆపాలి అని చెప్పి అప్పటినుంచి ఈ నాటి వరకు నిరంతరంగా మనం పోరాడుతూ ఉంటే ఎవరైతే ఆ దాడులకు నాయకత్వం వహించారో, ఆ వర్గాలన్నీ ఈ రోజు అధికారంలోకి ఏ పార్టీవస్తే ఆ పార్టీవైపుకే వాళ్ళు మొగ్గు చూపుతున్నారు తప్ప, నిజంగా నిలబడిన బాధితుల తరుపున నిలబడినవాళ్ళు లేరు. మనం గనుక కలబోసుకుంటే మన ముందు చాలా అనుభవాలు ఉన్నాయి. ఈ అనుభవాలు మనకు ఇంకా సరిపోవు. ఇంకా మరింత ముందుకు వెళ్ళాలి. ముందుకు వెళ్ళాలి అంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పరిస్థితుల్లో మనం ఎలా చేయాలి? ఏవిధంగా పేద ప్రజలను ఆర్గనైజ్ చేయాలి. కులాల అంతరాలు పోవాలంటే వర్గ ఉద్యమాలు తప్ప మరొక మార్గంలేదు అనే ఒక అనుభవంతోటి, శాస్త్రీయ దృక్పథం కలిగి ఉన్న మనం పోరాటంవైపుకి పయనించవలసిన అవసరం ఉంది. అటు వైపుకే పయనించవలసిన అవసరం ఉంది. అటువైపుకే తప్పకుండా ఆలోచిస్తాం. కోటేశ్వరరావుగారు తమ సందేశాన్ని వివరంగా చెప్పారు. అందులో కొన్ని సూచనలు కూడా చేసారు. తప్పకుండా మీ అభిప్రాయాల్ని, సూచనలను తీసుకుని రైతుకూలీ సంఘంగా మేము ఉద్యమాలను ముందుకు తీసుకెళ్ళడం కోసం మీ అందరి యొక్క సహాయ సహకారాలను తీసుకుంటామని చెబుతూ ఈ సభాముఖంగా వారికి మరొక్కసారి ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

# ఇతర సోదర సంస్థల, ప్రజాసంఘాల ప్రతినిధుల సందేశాలు

## కా॥ వై.కేశవరావు,

రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం



ఝాన్సీ గారు, వేదిక మీద ఉన్న నాయకులు, మహాసభకు హాజరైన సోదరీ, సోదరులకు, మీరు జరుపుకున్నటువంటి మహాసభ చర్చలు, నిర్ణయాలు జయప్రదంగా కావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున ఆకాంక్షిస్తున్నాను.

మనం ఈ మహాసభ జరుగుతున్న టువంటి నేపథ్యాన్ని ఒకసారి నేను గుర్తుచేస్తాను. కొమ్మారెడ్డి సత్యనారాయణ గారు, చలసాని వాసుదేవరావు గారి ప్రాంగణం అని దీనికి పేరు పెట్టారు. బహుశా వారు ఇద్దరు పోరాటం జరిపే నాటికి మనమెవరం పుట్టిలేము. ఆ ఇద్దరు నాయకులు ఒక మహా పాదయాత్ర నడిపారు. ఇచ్ఛాపురం నుండి తడ వరకు. చూసే వాళ్ళకు అది పాదయాత్రే. కానీ అది ఒక 15 సం॥లపాటు రాష్ట్రంలోను, దేశంలోను ఉన్నటువంటి జమిందారీ వ్యవస్థను కూకటివేళ్ళతో పెకిలించడానికి ఇది దారితీసింది. అటువంటి వారిని స్మరించు కుంటూ మహాసభ జరుపుకోవటం ముదావం.

రెండో అంశం. మన రైతు సంఘాలు సం॥ల బట్టి ఒక ఉద్యమాన్ని నిర్వహించాం. దేశంలో వ్యవసాయరంగం సంక్షోభంలో ఉంది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి స్వామినాథన్ గారు కొన్ని సూచనలు చేశారు. ఆ సూచనలో భాగంగా మద్దతు ధర చట్టాన్ని చేస్తానని హామీనిచ్చింది ప్రభుత్వం. ఆ హామిని అమలు పరచమని పోరాటాన్ని ప్రారంభించాం. 2017లో నవంబరులో 110 రైతు సంఘాలు కలిపి ఢిల్లీలో సదస్సు జరిపాం. ఆ సదస్సులో పోరాటానికి పిలుపినిచ్చాం. ఆ పోరాటాన్ని సహించలేని ప్రభుత్వం, అప్పటికే ఆ చట్టాన్ని చేయలేమని వ్రాతపూర్వకంగా కోర్టులో ప్రభుత్వం చెప్పింది. అసలు మొత్తం భూమిని, వ్యవసాయాన్ని కట్టబెట్టేందుకు ప్రభుత్వం మూడు చట్టాలను తీసుకొచ్చింది. ఏ సంఘాలైతే మద్దతు ధర చట్టం కోసం పోరాడుతున్నాయో, ఆ పోరాటం కాస్తా చట్టాలను రద్దు చేయమనే వైపుగా మలుపుతీసుకొంది. ఆ మలుపులో 110 సంఘాలు కాస్తా, 240 నుండి 540 సంఘాలు ఏకమైనాయి ఈ దేశంలో పోరాటం చేశాయి. ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా కలున్తున్నాం, అటువంటి ఐక్యపోరాటం ఇటీవల జరిగింది. ఆ పోరాటంలో మనమందరం ప్రత్యక్షంగా పాల్గొన్నటువంటి వాళ్లం. ఆ పోరాట వివరాలన్ని నేను మీకు చెప్పక్కర్లేదు. సామ దాన భేద దండోపాయాలన్నీ ప్రయోగించింది ప్రభుత్వం. అయినప్పటికీ 13 మాసాల అనంతరం చట్టాలను రద్దు చేసింది. రద్దు చేసినప్పటికీ మనం కోరిన చట్టాలను చేయటానికి సిద్ధపడటం లేదు. వ్రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయటానికి సిద్ధమవ్వలేదు. సిద్ధం కాకుండా 26 మందితో కమిటీని వేసింది. ఎవరా కమిటీ అంటే, ఎవరైతే ఆ చట్టాలను రూపొందించారో, అంబానీ, అదానీ పిఎలతో కలిపి 26 మందితో కమిటీ వేసి, మీ సంఘాల నుంచి కూడా ముగ్గురు ప్రతినిధులను ఇవ్వండని అడిగింది. అంటే ఎంత కుట్రపూరితంగా వ్యవహరించిందో మనకు అర్థమయ్యింది. కుదరదు అని చెప్పి, మళ్లా పోరాటాన్ని ప్రారంభం చేశాం. ఈ పోరాటం మరింత దీర్ఘకాలం సాగించాల్సిన పోరాటం. కారణం స్వామినాథన్ గారు ఒక మద్దతు ధర గురించే చెప్పలేదు అందులో. ఆయన చేసిన 11 రికమెండేషన్స్‌లో 7వ సూచన మద్దతు ధరలు గురించి. ఆయన చేసిన మొట్టమొదటి సూచన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం మీద ఆధారపడే ప్రతి కుటుంబానికి నీటివసతి కలిగినటు వంటి ఒక ఎకరా భూమిని ఇవ్వాలి. భూమిని ఇవ్వడంతో ఆ కుటుంబం పంటలు పండించో, లేదా పశుపోషణ ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకోగలుగుతుంది. మిగిలిన సమయం భూస్వాముల దగ్గర కూలీ పనులు లేదా ఇతర పనులు ద్వారా మరికొంత ఆదాయాన్ని సమకూర్చు కోగలుగుతుంది. భారతదేశంలో వ్యవసాయం మనుగడ సాగాలంటే, దేశంలో ఉన్నటువంటి అట్టడుగున ఉన్న వర్గాలు నిలబడాలంటే ఈ పని చేయాలని ఆయన చెప్పాడు. భూస్వామ్య విధానాన్ని రద్దు చేయమని చెప్పలేదు లేదా మనలాగా దున్నేవానికే భూమి ఇవ్వమని చెప్పలేదు. ఆయన స్పష్టంగా చెప్పింది వ్యవసాయం మీద ఆధారపడే ప్రతి కుటుంబానికి నీటివసతి కలిగిన ఒక ఎకరం భూమి ఇవ్వాలి. దాంట్లో జీవనానికి, పనులు చేసుకోవటానికి అవసరమైన ఆర్థిక సహాయం కూడా చేయాలని చెప్పాడు. ఇది మొట్టమొదటిది, దాని దాకా మనం ఇంకా వెళ్ళలేదు. ఎందుకంటే ఈ 540 సంఘాలన్నీ కూడా మద్దతు ధరలు పోతే ఎట్లా, మార్కెట్లు లేకపోతే ఎట్లా, కొనేవాడే లేకపోతే అమ్ముకోలేం గదా అని. మద్దతు ధరల చట్టం పెట్టినపుడే వివాదం చెలరేగింది ఆనాడు. మద్దతు ధరలు ఎలా ఉండాలనే చర్చ వచ్చింది దాదాపు 50 ఏళ్ళకు పూర్వమే. మద్దతు ధరలు ఎట్లా వుండాలి, రైతుకు పెట్టుబడే వస్తే ఎట్లా రైతుకు మిగలాలి కదా, అనే చర్చ వచ్చింది. రెండు, రెండున్నర ఎకరాలు ఉన్న రైతు పండిన పంటలో పెట్టుబడి పోగా, ఆ కుటుంబం ఏడాదిపాటు బ్రతకడానికి అవసరమైన ఆదాయం

పంటను అమ్ముకుంటే రావాలని చెపితే, ఆనాటి పాలకులు ఆవులించారు. అది సాధ్యం కాదు, ఒక చట్టం చేస్తాం, పెట్టిన పెట్టుబడే వచ్చేలా, మేము కనీస మద్దతు ధరల చట్టం చేస్తాం, అది రాకపోతే మేం ఆదుకుంటాం అని చెప్పారు. ఆ చట్టం కూడా అమలు చేయని స్థితి వచ్చేసరికి రైతాంగం అప్పులు పాలై, సంక్షోభంలో కూరుకుపోతే అప్పుడు కమీషన్ వేశారు. ఆ కమీషన్ సూచనలలో దేన్నీ కూడా అమలుచేయక పోయేసరికి పోరాటం ప్రారంభమయ్యింది. ఆ పోరాటం ఆగి ఉన్నదిప్పుడు, ఏమిటా విరామం? హామీ ఇచ్చినప్పుడు విరామం వచ్చింది. హామీ ఇచ్చి అమలుజరపలేదు కాబట్టే 2023 ఢిల్లీలో ఒక సదస్సు జరిపి పోరాటాన్ని ప్రారంభించాం. ఇప్పుడు ఎన్నికల కారణంగా మరలా విరామం వచ్చింది. ఒక చిన్న గుడ్డిలో మెల్లలాగా, ఒక చిన్న మెరుగైన పరిస్థితి వచ్చింది, అది ఏమిటంటే సింగిల్ లార్జెస్ట్ పార్టీ ఉంటే వాళ్ళు ఇష్టమొచ్చినట్లు చేయడానికి వీలు లేకుండా మైనారిటీ గవర్నమెంట్ వచ్చింది. ఇష్టమొచ్చినట్లు చేసే పరిస్థితి కొంచెం స్లో డౌన్ అయ్యింది అంతే, అంతవరకే మనం గమనంలో ఉంచుకోవాలి.

ఇప్పుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వచ్చింది. అసెంబ్లీలో అందరూ మద్దతు ఇచ్చారు. అసెంబ్లీలో లేకపోయిన వామ పక్షాలు బయట ఉండే వ్యతిరేకించినాయి. సంతకం రద్దయిపోయింది అంటున్నారు, సంతకం పెడితే రద్దవ్వదు. ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు కూడా మన ఉద్యమం సాగుతున్న కాలంలో చట్టాలను త్రిప్పికొట్టిన సమయంలో, మరొకరకంగా భూములను లాక్కొవడానికి చేసిన చట్టమే ఇది. దానికనుగుణంగా ఎన్ని చట్టాలను మర్చారు. పోరంబోకు భూముల చట్టం, రోడ్లు, రైల్లు మార్గాలకు ఇరువైపులా ప్రాజెక్టులు కట్టడానికి 500 మీటర్లలోపు 9 కోట్ల ఎకరాల భూములను రిజర్వు చేసి ఉంచారు. సిఆర్ఈజెడ్‌లో 500 మీటర్లకు మరో 500 మీటర్లలోపు మీరు ఏం కట్టడానికి లేదు మేం లాక్కుంటాం అని చెప్పి రిజర్వులో పెట్టారు. ఈ రకంగా 15 కోట్ల ఎకరాల భూములను రిజర్వులో పెట్టారు. అందుకని ఈ పాలకులు వెనక్కి తగ్గలేదు. ఎన్నికలు పూర్తయిన మూడవ రోజునే ఒక ప్రకటన వచ్చింది. ఏమిటిది? 52 డిపార్టుమెంట్లలో వ్యవసాయాన్ని కూడా కలిపి అంబానీ, అదానీల యొక్క ఉద్యోగులను సలహాదారులుగా నియమించడం కోసం. భారతదేశంలో ప్రభుత్వ సంస్థలన్నీ ఎవరి చెప్పుచేతల్లో నడుస్తున్నాయంటే, 52 సంస్థలు అంబానీ, అదానీల సలహాదారులతో నడుస్తున్నాయి, ఇది మనం మర్చిపోకూడదు. అందుకనే అంతర్గంగా ప్రమాదం పెరిగింది. మరింత గట్టి ఐక్య పోరాటాలకు సిద్ధమవ్వాల్సిన సమయం ఆసన్నమయ్యింది. కొంచెం విరామం దక్కవచ్చు, మరింత కూడదీసుకునే సమయం మనం తీసుకోవాలి. వాళ్ళు కూడా కూడదీసుకొని సమయం కోసం చూస్తున్నారు. అందువల్ల రాబోయే కాలంలో 540 సంఘాలకు పోటీగా, ఒక్క బిజెపి పార్టీయే 90 సంఘాలను రిజిస్టర్ చేసింది ఈ కాలంలో. రిజిస్టర్ చేసి, వాళ్ళతోటి సమావేశం పెట్టి, ఈ 540 సంఘాలలో ఉన్న కొంతమందిని పిలిచింది. అలాగే ఎస్‌కెఎంకు పోటీగా ఎస్‌కెఎం అని పెడితే మనవాళ్లు అడ్డుతగిలితే ఎస్‌కెఎంకు బ్రాకెట్‌లో ఏదో అక్షరం పెట్టారు. అంటే మనకు పోటీ వ్యవస్థను నిర్మించి మనల్ని దెబ్బకొట్టేందుకు చూస్తున్నాయి ఈ పాలక వర్గాలు. అందువల్ల రాబోయే కాలంలో 540 సంఘాలకు పోటీగా ఒక్క బిజెపి పార్టీమే 90 సంఘాలను రిజిష్టర్ చేసింది. ఈ కాలంలో చేసి వాళ్ళతోటి సమావేశం పెట్టి 540 సంఘాలు ఉన్న కొంతమందిని పిలిచింది అంటే పోటి ఏదైతే ఎస్‌కెఎమ్ ఉన్నదో దానికి పోటీగా మరొకొన్ని సంఘాలను కలిపి ఎస్‌కెఎంకు వ్యతిరేకంగా నడపాలని టిడిపి ప్రభుత్వం చూస్తున్నది.

అందువల్ల పాలకవర్గాలు ఈ భారతదేశంలో వ్యవసాయాన్ని రైతాంగ వ్యవసాయం నుంచి కార్పొరేటు వ్యవసాయంగా మార్చాలనే కృత నిశ్చయంతో ఉంది. ఆ నిశ్చయానికి అడ్డుపడి భారతదేశంలో వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. మరొక అంశం చెప్పారు స్వామినాథన్ గారు, భూమిస్తే కుదరదు, మద్దతు ధర చట్టం చేస్తే కుదరదు, పెరిగే కుటుంబంలో తల్లిదండ్రులకి బిడ్డలు అందుతారు. ఆ బిడ్డలకు మళ్ళీ బిడ్డలు అందుతారు. కుటుంబం వృద్ధిచెందుతూ ఉంటుంది. తగిన ఆదాయం పెరగాలంటే ఆయన కొన్ని హబ్స్ పెట్టాలని సూచించాడు. అంటే ఏమిటి కేవలం ప్రొడక్షనే కాదు. ఆ ప్రొడక్షన్ నుంచి ప్రాసెసింగ్, ప్రాసెసింగ్ నుంచి మార్కెటింగ్ మూడూ కల్పించేటువంటి హబ్స్ కూడా పెట్టాలని సూచించాడు. మనం డిమాండ్‌ను పాలకులు కొన్ని మాయమాటలు చెప్పడానికి అలాంటి హబ్స్ పెడతామని చెప్పారు. కానీ అవి ఎక్కడా లేవు. అందుకని ఆయన చెప్పిన వాటిని మనం ఇంకా లోతుగా చర్చించాల్సిన అవసరం ఉంది. మనం కోరుతున్న దున్నేవానికే భూమి అనే నినాదాన్ని జోడించాల్సిన అవసరం ఉంది. అందుకని రాబోయే కాలంలో మనమంతా 540 సంఘాలు, ఇంకా ఎన్ని సంఘాలు వచ్చినా అన్నిటినీ కూడదీసి సకల శక్తులు కూడదీసు కుంటే తప్ప ఆనాడు ఎక్కడో ఉండి పరిపాలించిన బ్రిటీష్ ప్రభుత్వాలు కేవలం పరిమిత బూర్జువా వర్గంతో ఉన్న ప్రభుత్వాలు. నెహ్రూగారి కాలంలో కార్పోరేటు శక్తులు లేవు. ఇంధిరాగాంధీ కాలంలో కార్పొరేటు శక్తులు లేవు. ఆనాటి బూర్జువా శక్తులు భూసంస్కరణలకు అడ్డుతగలలేదు. కాని ఇప్పుడు అలా కాదు ఏ చిన్న అంశాన్ని కూడా అంగీక రించకుండా వాళ్ళ చేతుల్లోకి తీసుకొని సలహాలిస్తున్నటువంటి కార్పొరేటు శక్తులు ఈ దేశంలో ఉన్నాయి. వాళ్ళు వెనక ఉండి నడుపుతున్నారు. నేను ఒక్క విషయం చెబుతాను. ప్రధాని మోడీ గారి ప్రమాణస్వీకారానికి ఎవరు వచ్చారో మీరు గమనించారా? ఆదానీ, అంబానీ కుటుంబం సతీసమేతంగా వచ్చి పక్కన కూర్చున్నారు. నెహ్రూగారు ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన నాడుగాని, ఇందిరాగాంధీ ప్రమాణస్వీకారం చేసిన

రోజుగాని, ఆనాడు టాటా, బిర్లాలను వారి ప్రక్కన చూడలేదు. కానీ వారి నూతన పరిణామం ఏంటంటే ప్రధానమంత్రి ప్రమాణస్వీకారానికి ఏ ఇద్దరైతే ఇలాంటి విధానాలు సూత్రధారులు, కార్పోరేటు దిగ్గజాలలో వాళ్ళే దగ్గర కూర్చొని ప్రమాణస్వీకారం చేయించారు. అంటే పాలకవర్గం భూస్వాములు, పెట్టుబడిదారులు కలిసి రాజకీయ భూస్వామ్య పార్టీలన్నీ కలిసి కార్పోరేటు శక్తులు యొక్క గుప్పిట్లో ఉన్నాయి. ఆ గుప్పిట్లను బద్దలుగొట్టాల్సిన పరిస్థితి రైతులు, కౌలుదారులు, గిరిజనులు, అట్టడుగున ఉన్న వర్గాలన్నింటి మీద ఉన్నది. ఆ వర్గాలను కూడదీయాల్సిన బాధ్యత రైతు సంఘాల మీద ఉన్నది. అందుకని పోరాడి సాధించాలి. మన పోరాటం ఆగలేదు. విరామం మాత్రమే ఉన్నది. ఆ విరామాన్నే తీసుకుని జనాలను కూడదీయాల్సిన కర్తవ్యం మన ముందున్నది. ఆ కర్తవ్యంలో భాగమే ఈ మహాసభ. ఈ మహాసభలో మనం కూలంకషంగా చర్చించాలి. పాలకవర్గాల ఎత్తుగడలను ఎదిరించే విధంగా చర్చించాలి. సమస్త శక్తులను కూడదీయాలి. చివరగా నేను చెప్పేదేమిటంటే రైతులు, కార్మికులు, గిరిజనులు, అంతా కలిస్తేనే సాధించగలం. అందుకని కార్మిక వర్గం కూడా మనతోటి పాల్గొంది. కార్మిక, కర్షక ఐక్యత సాధించడం వలన మాత్రమే ఈ దేశంలో విజయాలను సాధించగలుగుతాం. అందుకు మీ అందరు కూడా సంసిద్ధంగా ఉండాలి. మీ మహసభలు జయప్రదంగా నిర్వహించాలని రాబోయే కాలంలో మీరు, మేము ఇతర సంఘాలన్నింటినీ కూడదీసి ఈ పోరాటాన్ని విజయవంతం చేసి మన తర్వాత తరానికి, రాబోయేతరానికి మంచిని అందించాల్సిన బాధ్యత ఉంది. దానికి మీరు అందరూ కూడా ఈ మహాసభలను జయప్రదం చేస్తారని మీ చర్చలు, నిర్ణయాలు ఫలప్రదం కావాలని కోరుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన మీ అందరికీ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున అభినందనలు తెలియజేస్తున్నాను.

## కా॥ డి.హరినాథ్,

రాష్ట్ర కార్యదర్శి, అఖిల భారత కిసాన్ మహాసభ



సభకు అధ్యక్షత వహించిన ఝాన్సీగారికి, వేదిక మీదున్న నాయకులకు మీకు అందరికి అఖిల భారత కిసాన్ మహాసభ తరపున విప్లవాభివందనాలు. ఉదయం నుండి ఇప్పటివరకు కూడా అనేక అంశాల మీద ఈ రోజు చాలా విస్తృతంగా చర్చ జరిగింది. చాలా విషయాలు, చర్చించుకున్నాం. ఈ మహాసభలు కొత్త ప్రభుత్వం ఏర్పడిన సందర్భంలో ముందుగా ఇక్కడున్నటువంటి నినాదంతో నూతనంగా అధికారం చేపట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలనే కార్యక్రమంను రూపొంది ంచడంలో మీరందరూ, మీ నాయకత్వం ముందుగా ఉండటం, ఆలోచించటం మంచి పరిణామం. ఈ రోజు దేశంలో వ్యవసాయరంగ సంక్షోభం అంటేనే కౌలు రైతులు మరణాలు మనకు గుర్తొస్తాయి. ప్రస్తుతం ఉపముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన పవన్‌కళ్యాణ్ లాంటి వాళ్ళకు కూడా ఆరోజు కొన్ని సంస్థలు ఆంధ్రరాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్న కౌలురైతుల సమస్యలు తీసుకెళ్ళి, గత ప్రభుత్వంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి కౌలురైతులకు సంబంధించి గుర్తింపుకార్డుల విషయంలో రక్షిత కౌలుదారు చట్టాలనీ చాపలో చుట్టేసి యజమాని అధికారంతో కౌలు గుర్తింపుకార్డు ఇచ్చే దుస్థితికి తీసుకొస్తే ఆత్మహత్య చేసుకున్న రైతాంగం దగ్గరికి వెళ్ళి లక్ష రూపాయలు చొప్పున నష్టపరిహారం ఇచ్చి, ఎన్నో మాటలు పవన్‌కళ్యాణ్ చెప్పారు. ఈ రోజున కౌలుదారులకు కౌలు గుర్తింపు కార్డులను ఇవ్వాలని, పకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇచ్చే నష్టపరిహారాన్ని కూడా ఇవ్వాలి అని చెప్పి పవన్‌కళ్యాణ్ వంటి వాళ్ళ దగ్గర మనం డిమాండ్ చేయాలి. అలాగే ఝాన్సీగారు మాట్లాడినప్పుడు చెప్పారు, ఈ రోజు అటవీ హక్కుల చట్టాలను ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న నాన్ షెడ్యూల్ ఏరియాను షెడ్యూల్ ఏరియాగా కలపాలని చెప్పటం చాలా ఆసక్తికరమైన పరిణామం అలాగే ఆదివాసుల అటవీ హక్కుల చట్టాలను మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుగుణంగా సవరణ చట్టం చేసింది. ఇది ఎందుకు చెప్తున్నానంటే భారతదేశంలో కరోనాను అడ్డం పెట్టుకుని మోడీ 3 నిరంకుశ చట్టాలను చేశాడు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉందని, భారతదేశంలో అత్యంత ప్రజాస్వామ్యం ఉందని దేశవిదేశాల్లో చెప్పుకునే మోడీ పాలనలో 143 మంది పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేసి నిరంకుశంగా అనేక చట్టాలను రూపొందించాడు. కరోనాలో వ్యవసాయ చట్టాల విషయం కానీ, కార్మిక చట్టాల సవరణలో జరిగిన దుర్మార్గమైన చర్యలను పార్లమెంటరీ సభ్యులు ప్రశ్నించడానికి అవకాశమే లేకుండా చేసి ఆ చట్టాల్నే ఆమోదింపచేసుకుంటే, భారతదేశ చరిత్రలోనే పార్లమెంటల్‌లో చేసిన చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలలు పాటు రోడ్లపైకి వచ్చిచేసిన పోరాటాల ఫలితంగా సాక్షాత్తు ప్రధానమంత్రి దిగివచ్చి ఆ చట్టాలను ఉపసంహరించుకుంటాము అని చెప్పాల్సిన పరిస్థితిని భారతదేశ రైతాంగం చేయగలిగింది. ఆ పోరాటాలే కాకుండా జియోటవర్‌ని కూడా తగలబెట్టి సామ్రాజ్య వాదానికి, పెట్టుబడిదారులకు వ్యవసాయాన్ని ధారాదత్తం చేయాలనుకున్న మోడీని నిలువరించిన శక్తి రైతాంగానికి ఉంది. ఈ రైతాంగం ఉద్యమంలో మనమందరం పాల్గొని ఆంధ్ర రాష్ట్రంలోఉద్యమాన్ని

ముందుకు తీసుకెళ్ళటంలో కృషి చేశాం. ఇదే పశ్చిమగోదావరి జిల్లాలో కాంటూరులో విద్యుత్ ఉద్యమాల్లో ప్రాణాలు అర్పించిన ఘటన అదే విధంగా దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమం ఒక స్ఫూర్తిని ఇచ్చింది.

దేశవ్యాప్తంగా ఉపా చట్టం తెచ్చారు. అరవింద్ దయాల్ మా మహాసభలకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో సంపదని ఇద్దరు అమ్ముతున్నారు. ఇద్దరు కొంటున్నారు. వాళ్ళిద్దరూ గుజరాత్‌కి సంబంధించిన వారే ఆ రోజు ఈస్ట్ ఇండియా కంపెనీకి వచ్చి దోచుకుంటే ఈ రోజు రెస్ట్ ఇండియా పేరుతో అదానీ, అంబానీలకు మోడీ, అమిత్‌షాలు ఆర్థిక సంపదను అమ్ముతుంటే మనం చూస్తూ ఊరుకుంటామా? మన కళ్ళముందే నేరం జరుగుతుంటే చూస్తూ ఊరుకున్నామంటే మనమూ నేరస్తులమే. భవిష్యత్తుతరం మనల్ని ప్రశ్నిస్తే మనం సమాధానం చెప్పగలగాలి. ఈరోజు భారతదేశ సంపదను దోచుకుపోయే వాళ్ళకి 16 లక్షలకోట్ల రూపాయలు రాయితీలు ఇచ్చిన మోడీ ప్రభుత్వం రైతులకు మాత్రం ఋణ విముక్తి చట్టం తీసుకురమ్మంటే తీసుకురావడానికి మోడీ గారు సిద్ధంగాలేదు. ఎమ్.ఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సు ప్రకారం రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలంటే ఆ గిట్టుబాటు ధర కల్పించడానికి సిద్ధంగా లేరు. ఇప్పుడు వచ్చిన ముఖ్యమంత్రి వ్యవసాయం దండగ అని చెప్పిన వాడే. మెట్ట ప్రాంతం మీద ఉన్న వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్లు పెట్టడానికి ఆనాడు జగన్మోహన్‌రెడ్డి జివో 22 తీసుకువచ్చాడు. రాయలసీమలో చాలామంది స్మార్ట్ మీటర్లు మాకు వద్దు అని వీధుల్లోకి వచ్చి పోరాటం చేస్తున్నారు. మీ మహాసభ రాష్ట్రంలో ఉన్న రైతాంగ సమస్యల మీద, కార్యక్రమం తీసుకోవాలి. భవిష్యత్తులో కేంద్రంలో జరుగుతున్న రైతాంగ ఉద్యమంలో మనం చేయి చేయి కలిపి, అలానే మీరు చేస్తున్న ఉద్యమాలలో మేము పాల్గొంటామని తెలియజేస్తూ మీరు నాకు ఇచ్చిన అవకాశానికి ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

## కా॥ ఆదినారాయణ రెడ్డి,

**రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు**



మిత్రులారా! ఈ మహాసభల్లో చాలా విషయాలు మాట్లాడుకుంటున్నాం. ఆ విషయాలు ఎంత సహజంగా ఉన్నాయో అందరికీ అర్థమైంది. ఈ సభకు నేను రాయలసీమ అభివృద్ధి కమిటీ తరపున వచ్చాను నా ముందు మాట్లాడిన మాధవరెడ్డిగారు, నేను ప్రక్కప్రక్క జిల్లాల వాళ్ళం. వారు మేము పంచుకున్నది తుంగభద్ర నీరు మీద మా పోరాటం. అయితే రాయలసీమ గురించి తెలియని చేదునిజాలు చాలా ఉన్నాయి. రైతుకూలీ సంఘానికి ఈ విషయాలు తెలుసు. ఇక్కడ వచ్చిన ప్రతినిధులకు, మేధావులకు మరుగున పడిన సత్యాలను కొన్ని మీ ముందు ఉంచాలనుకుంటున్నాను.

రాయలసీమలో వ్యవసాయరంగ సంక్షోభానికి కారణం సాగునీరు. వడ్డే శోభనాద్రీశ్వర రావు చెప్పారు. ఆ నీరు మాకు కన్నీరు అయింది అని అన్నారు. రాయలసీమ అంటేనే రాళ్ళ సీమ, కొంతమంది అనార్కులు రౌడీలసీమ అని ఒక అపఖ్యాతి ఉంది. అదంతా తప్పు. రాయలసీమ ప్రజలు గురించి మాట్లాడుతూ ఒకే ఒక మాట వచ్చింది, అనంతపురం జిల్లాలో వలసలు పోతూ బిచ్చగాళ్ళు ఉన్నారని, అదే అనంతపురం జిల్లాలో వందల సంఖ్యలో సోదరీమణులు వేశ్య వాటికలలో ఉన్నారని చెప్పడానికి చింతిస్తున్నాను. నిజంగా చాలా దుర్భరమైన పరిస్థితి మాది. వలసలు విషయానికి వస్తే మాది కర్నూలు జిల్లా. మాది పశ్చిమ ప్రాంతం. అక్కడ ఉన్నంత వలసలు ఎక్కడా లేవు అని చెప్పి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు మా ప్రాంతాన్ని గుర్తించి ఇది ఏజెన్సీ ప్రాంతం కన్నా వెనుకబడింది అని చెప్తూ ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ ఏజెన్సీ అని ఒక నామమాత్రపు జివోని చేసాడు. ఈ రోజు మాట్లాడుకున్న విషయాల్లో ప్రధానమైన అంశం చెప్పారు. ఈ ప్రాంతంలో భూమిలేని ప్రతి పేదలకు ఒక ఎకరం చొప్పున పంచుతానని చెప్పి జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఆదోని మహాసభలో చెప్పాడు. కాని ఒక్క ఎకరం ఒక్కరికి కూడా ఇవ్వని పరిస్థితి ఉంది అంటే ఈ పాలకులు మీద మనకు ఏవిధమైన భ్రమలు లేవు. అయినా ఆ భ్రమలు ఉండకూడదు. అయినా సరే నేను ఈ సభలో ఒకటే గుర్తు చేస్తున్నాను. రాయలసీమ అనేటువంటిది మద్రాసు ఏజెన్సీలో ఉండగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోరినప్పుడు శ్రీబాగ్ ఒప్పందం అనే ఒక ఒడంబడిక జరిగింది. ఆ ఒడంబడికలో రాయలసీమ ప్రాంతం వారు, అదే విధంగా సర్కార్లు కోస్తా అనేవారు. అది మద్రాసు నగరంలో రామేశ్వరంలోని కాశీలో శ్రీబాగ్‌లో జరిగింది. కాబట్టి దాన్ని శ్రీబాగ్ ఒడంబడిక అన్నారు. అందులో మొట్టమొదటి అంశం కృష్ణానదీ జలాలు రాయలసీమ అవసరాలు తీరిన తర్వాతనే వేరే ప్రాంతాలకు పోవాలి. రాష్ట్రం ఏర్పడితే హైకోర్టు గాని, రాజధాని గాని ఏది ఇవ్వాలో అది ఇవ్వాలని 1953లో మా కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రంలో అనే విషయం చరిత్రలో రాయబడింది. తర్వాత ప్రయాణాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు భాగాలుగా అయిన తర్వాత హైదారాబాద్ పోవడం, అప్పుడు కర్నూలు రాజధానిగా ఉండాలని అడగలేని అసమర్థ పాలకుల యొక్క పరిస్థితిని చరిత్ర మనకు చెబుతుంది. తెలంగాణ ఎందుకు విడిపోయింది.

ఎందుకు కలిసి ఉండలేదు అనేది ఏదైనా కూడా చరిత్రలో ఉంది. 2014లో ఈ తెలంగాణ, ఆంధ్ర రెండు రాష్ట్రాలుగా విడిపోయాయి. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ఏదైతే చేసారో, అందులో చెప్పినటువంటిది. బిజెపికి సంబంధించిన మహానుభావుడు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అన్నాడు.

మోడీగారు ఇప్పటికి ప్రత్యేక హోదా ఇవ్వలేదు. ప్రత్యేక హూదా కోసం పోరాటం చేసిన చంద్రబాబునాయుడు బయటకొచ్చిన కూడా సాధించలేకపోయారు. తర్వాత వచ్చిన జగన్ కూడా ఏమీ చేయలేకపోయాడు. ప్రత్యేక హోదా ఆ రకంగా మిగిలిపోతే మా రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్నారు. కానీ ఇవ్వలేదు. కాబట్టి వీటన్నిటి నేపథ్యంలో ఇప్పుడు ముఖ్యంగా కృష్ణానది, సిద్ధేశ్వరం కట్టాలని చెప్పి మనం 2016లో మే 31వ తారీఖున దాదాపు 40 వేలమందితో కలిసి ఒక మహాయాత్ర జరిపాము. అప్పుడున్న ప్రభుత్వం చేయకపోగా తర్వాత వచ్చిన ప్రభుత్వం కూడా చేయకపోగా మళ్ళీ మేము జూన్ 10వ తేదీన సభను జరుపుకున్నాం. మేము సిద్ధేశ్వరం కట్టాలి, కృష్ణా జలాలను మళ్ళించాలి. పోలవరం నిర్మాణం జరిగిన తర్వాత కృష్ణానదికి మళ్ళించే గోదావరి జలాలను మళ్ళించి మాకు శ్రీశైలం నీళ్ళు ఇవ్వాలని చెప్పి మేము అడుగుతున్నాము. అదే విధంగా రాయలసీమకు కృష్ణా జలాలను ఇచ్చి రాయలసీమ భూములను తడపాలని చెప్పినందుకు మేము గర్వంగా చెప్తున్నాము. ఆయన ఎన్.టి.ఆర్ గారి యొక్క చొరవతో హంద్రీ-నీవా, గాలేరునగరి, తెలుగుగంగ ఈ మూడు 80 వ దశకంలో వస్తే ఇప్పటికీ అవి ఎక్కడేసిన గొంగళి అక్కడే ఉన్నాయి. కాబట్టి రాయలసీమవాసిగా, కర్నూలు జిల్లా వాసిగా కృష్ణాజిలాల్లో మాకు న్యాయమైన వాటా కావాలి. ఆ న్యాయమైన వాటా ప్రజల హక్కు, ఆ ప్రజల హక్కుతో పాటు వ్యవసాయ సంక్షోభానికి కారణమైన పరిస్థితులలో మార్పుతేవాలి. ఈ డిమాండ్స్ ఎజెండాలో నేరుగా లేకపోయినా దీనికి ముడిపడి ఉంది. కాబట్టి ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం మా సమస్యల పట్ల సానుకూలంగా వారి యొక్క సంఘీభావాన్ని ప్రకటించాలని కోరుతూ అందరికీ ఈ అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు.

## కా॥ మరీదు ప్రసాద్,

**రాష్ట్ర కన్వీనర్, ఆల్ ఇండియా కిసాన్ సంఘటన**




మహాసభలకు విచ్చేసిన రైతుకూలీలకు, వేదికను అలంకరించిన అధ్యక్ష వర్గానికి ఆల్ ఇండియా కిసాన్ సంఘటన తరపున అభినందనలు తెలియజేస్తున్నాను. మిత్రులారా! ఈ రోజు దేశంలో, రాష్ట్రంలో ఉన్న వ్యవసాయరంగ పరిస్థితి, రైతు కూలీల పరిస్థితుల మీద అనేక అంశాల పై వక్తలు వివరించారు. ప్రత్యేకంగా ఆ అంశాలజోలికి పోకుండా, ఈ రోజు దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వాన సమారు 500 రైతు సంఘాలు ఏ విధంగా ఐతే పోరాటం చేసి, ఈ దేశంలో బిజెపి ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకువచ్చిన నల్ల చట్టాలను ఐక్య సంఘంగా ఏర్పడి వాటిని ఎలా తిప్పికొట్టారో మీ అందరికి తెలుసు. ఏ రైతుకూలీ కూడా ఒక ఎమ్‌పి అభ్యర్ధిగా లేనప్పటికీ, పార్లమెంటులో ప్రజాప్రతినిధులగా అవకాశం లేకపోయినప్పటికీ ఐక్యసంఘాల పోరాటాలు ద్వారా ఆ రైతాంగ నల్లచట్టాలను మనం తిప్పికొట్టగలిగాం. ఏ పార్లమెంటులో అయితే ఆ నల్లచట్టాలను తీసుకొచ్చారో అదే పార్లమెంటులో మళ్ళీ ఆ నల్లచట్టాలను రద్దుచేసిన పరిస్థితిని తీసుకొచ్చాం. అలానే ఆంధ్రప్రదేశ్‌లో ఇవాళ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చింది. బిజెపి ప్రమోట్ చేసిన నీతి ఆయోగ్ ఈ చట్టాన్ని రూపాంతరం చేయిస్తే, దాన్ని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసింది. నేడు కొత్తగా అధికారంలోకి వచ్చిన టిడిపి, బిజెపి, జనసేన కూటమి ఈ చట్టాన్ని రద్దు చేసామని ప్రకటించారు. మళ్ళీ అదే పార్లమెంటులో పెట్టి చర్చించాలి, పూర్తిగా ఆ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి – జీవో పాస్ చేయాలి. ఇవన్నీ ఇంకా జరగకుండానే కేవలం కంటితుడుపు చర్యలుగా రద్దు చేసినంత మాత్రాన ఈ చట్టం అమలు కాకుండా ఉంటుందని మనం అనుకోవడానికి వీల్లేదు. రాబోయే రోజుల్లో రైతులకు, పేదలకు, సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా వారికి ఇబ్బందికరమైన అంశాల పట్ల చట్టాలను తీసుకొస్తే సంఘటిత ఉద్యమాల ద్వారా మనం ఎదుర్కొనవలసిన అవసరం ఉంది. ఆంధ్ర రాష్ట్రంలో గాని, దేశంలో గాని, రైతాంగ పోరాటాలు సంయుక్తంగా చేయటం వల్లే పాలకులను మనం ఎదుర్కోగలిగాం. కాబట్టి రాబోయే రోజుల్లో కూడా రైతుకూలీ సంఘం, ఇతర అనేక సంఘాలు కేశవరావుగారు చెప్పినట్లు సుమారు 48 సంఘాలు రాష్ట్రంలో ఆంధ్ర రైతుసంఘాల సమన్వయ సమితిగా ఐక్యంగా పోరాటాలు చేస్తున్నాం. ఈ ఉద్యమాలను భవిష్యత్తులో కొనసాగిద్దామని, రైతు కూలీ సంఘానికి మా ఆల్ ఇండియా కిసాన్ సంఘటన చేయూతగా ఉంటుందని, సంఘీభావంగా ఉంటుందని తెలియజేస్తూ ఈ అవకాశమిచ్చిన మిత్రులందరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

# కా॥ వి. వెంకటేశ్వర్లు,

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం



సభా అధ్యక్షులు! వేదిక మీదున్న అతిరథ మహారథులు అనేక ఉద్యమాల్లో రాటుతేలిన వ్యక్తులందరికీ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అదే విధంగా ఈ మహాసభకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన సోదరీ సోదరులకు, పిల్లలకు వివిధ ప్రజాసంఘాలు, ఉద్యమాల్లో ఉన్నటువంటి వారందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ మహాసభలను చూస్తుంటే, మొన్న వచ్చిన పేపర్‌లో ఈ దేశంలో ఎర్రజెండా ఉందా అని కార్టూన్ వేసి ఉంది. ఆ కార్టూన్ పక్కన మరో ఆయన మార్క్స్ కొటేషన్ ఒకటి రాశాడు. అది ఏంటంటే, ఈ దేశంలో ఎర్రజెండాను రూపుమాపే వాళ్ళందరూ అంతం అయిపోయారు తప్ప ఈ ఎర్రజెండా మాత్రం దోపిడీ ఉన్నంత కాలం ఉంటుంది అని దీన్ని చూసిన తర్వాత చాలా ఉత్సాహం వేసింది. ఎర్రజెండా అసలు పడనివాళ్ళు, జయరామ్ రమేష్ అనే అతన్ని మీరందరూ చూసే ఉంటారు. అతను ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీలో పెద్దనాయకుడు. ఎవరో కొంతమంది విలేకరులు ఇలా అడిగారు. ఏమయ్యా ఈ దేశంలో ఎర్రజెండాకు భవిష్యత్తు ఉందా? అని అడిగారు. ఆయన ఏమన్నాడంటే ఎర్రజెండా లేకపోతే ఈ దేశానికి భవిష్యత్తు ఉందా అని నేను ఆలోచిస్తున్నాను అని ఆయన చెప్పాడు. ఎందుకు ఈ మాట చెబుతున్నానంటే, ఈ రోజు దేశానికి, ఈ దేశంలో ఉన్న దుర్మార్గమైన మతోన్మాద బిజెపి విధానాలకు వ్యతిరేకంగా నాలుగు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చింది ఈ బిజెపి ప్రభుత్వం. అదే విధంగా కార్మికులను అణచివేయడానికి వాళ్ళకున్న చట్టాలనంతా మరో బ్రిటీష్ సామ్రాజ్యవాద దేశాన్ని తలదన్నేలా చట్టాలను తీసుకొచ్చింది. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడింది ఎవరు? పంజాబ్ రైతులు, రైతాంగ ఉద్యమాలు అన్నీ చేశారని చెప్పారు. కానీ మోడీకి తెలుసు. మోడీ పార్లమెంటులో మాట్లాడుతూ ఏమన్నాడంటే, ఈ విధానాలకు వ్యతిరేకంగా రైతులు పోరాడుతున్న మాట వాస్తవం, కానీ ఈ పోరాటం వెనుక ఏదో శక్తి ఉంది అన్నాడు. ఆయనే చెప్పాడు ఈ పోరాటం వెనుక ఉన్న శక్తి ఏదంటే అది ఎర్రజెండా, కమ్యూనిస్టులు అని చెప్పాడు. అంటే ఈ రోజు ఈ మతోన్మాద బిజెపిని ఓడించడానికి దేశవ్యాపితంగా ఎర్రజెండాకు బలం లేకపోవచ్చు, పార్లమెంటులో స్థానం లేకపోవచ్చు. కానీ ఈ ఆంధ్ర రాష్ట్రంలో బిజెపి, దాని మిత్రుల్ని, దేశవ్యాపితంగా బిజెపిని ఓడించడానికి చేసిన రైతాంగ ఉద్యమంలో ఉన్న నలుగురు వ్యక్తులయినా, నలుగురు శక్తులయినా ఈ రాష్ట్రంలో నీళ్ళు తాగించిన చరిత్ర ఈ ఉద్యమానికి ఉంది అనడానికి అంతకంటే సంకేతం మరొకటి లేదు. కాబట్టి ఎర్రజెండా పని అయిపోలేదు. ఎర్రజెండా నిత్యం తళతళలాడుతుంటుంది. అది నిత్యం యవ్వనమైనది. ఎర్రజెండా తిరుగులేదు. అలాంటి మహాసభలో పిలిచి ఒక చోటికి వచ్చినందుకు ఈ ఆనందం నాకు మామూలుగా లేదు. ఎందుకంటే వ్యవసాయ కార్మిక సంఘం మహాసభకు పిలిచినా మనోళ్ళు వస్తామని రాలేదు. మేము రాలేదు 40 ఏళ్ళ కాలంలో మొట్టమొదట ఈ మహాసభకు వచ్చి ఇక్కడ మాట్లాడుతున్నందుకు నాకే మాటలు రావట్లేదు. ఎందుకంటే ఒక మంచి భవిష్యత్తు మనముందు కనిపిస్తుంది. మొన్న ఎన్నికల్లో నేను కూడా వ్యవసాయ కార్మిక సంఘంగా సపోర్టు చేస్తూ లోతా రామారావు గారి కోసం పనిచేశాను. అందులో మనవాళ్ళు వచ్చారు. కోటయ్యగారు మనముందు లేరు. కోటయ్యగారు మనకున్న అనుబంధం చాలా గొప్పది. ఎన్నికలకు వచ్చి ఆ ఎన్నికల్లో ఒక్కొక్క అభ్యర్థి ఎంత ఖర్చు పెట్టారో మీకు చెప్పాల్సిన అవసరం లేదు. నేను విజయవాడలో ఉంటాను, మంగళగిరిలో పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులు మేమున్న కాలనీకి వచ్చారు. వైసిపివాళ్ళు ఓటుకు 4000 ఇచ్చారు. తెలుగుదేశంవాళ్ళు ఓటుకు 4000 ఇచ్చారు. మా ఇంటి పక్కన ఒక కుటుంబంలో ఆరు మంది సభ్యులు ఉన్నారు. ఆ ఇంట్లో ఆరు మందికి, ఓటుకి 4 వేలు అయితే, టిడిపి, వైసిపి ఇచ్చిన ఒకరికి మొత్తం 8 వేలు అవుతుంది. అదే ఆరు మందికి ఓటుకి 8 వేలు చొప్పున అయితే మొత్తం కలిపి 48 వేలు అవుతుంది. అందరికీ దగ్గరికొస్తూ మా ఇంటికి కూడా ఇవ్వడానికి వస్తుంటే వాళ్ళే అన్నారంట వాళ్ళకొద్దయ్యా వాళ్ళు కమ్యూనిస్టులు వాళ్ళకెందుకిస్తారు అన్నారు. ఆ సమయంలో ఒక టీచరు ఊర్లో లేదు. వాళ్ల కుటుంబం బాధపడిందంట అయ్యో మన ఇంట్లో 4 ఓట్లు 32 వేలు కోల్పోయామే అని. ఎందుకీ మాట చెబుతున్నానంటే ఓటుకి 8 వేలు, 10 వేలు ఇస్తూ కార్పొరేటు ఎన్నికలుగా మారుతున్న ఈ సమాజంలో రంపచోడవరంలో ఎర్రజెండా పోటీ చేస్తే, ఎర్రజెండాలో ఉన్న అన్ని కమ్యూనిస్టు పార్టీలు, రైతుకూలీ సంఘాలు, గిరిజన సంఘాలు ఏకమై ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా 22 వేల ఓట్లు వచ్చాయి అని అంటే అది ఎర్రజెండా యొక్క చరిత్ర, దాని యొక్క పోరాట ఫలితమే. మన రైతుకూలీ సంఘం, గిరిజన సంఘం కొండమొదలులో ఒక మీటింగ్ పెట్టారు. దానికి శోభనాద్రీశ్వరరావుగారు, ఝాన్సీగారు, శ్రీనివాసరావుగారు వచ్చారు. ఇలాంటి మీటింగ్ పెట్టాలంటే 5 లక్షలు కావాలండీ అని వైసిపివాళ్ళు అంటున్నారట. నేను మనవాళ్ళని అడిగా టెంట్‌కి ఎంత ఖర్చవుతుందని, వాళ్ళన్నారు ఎందుకు కామ్రేడ్ మన రాష్ట్రంలో ఉద్యమాలు చేస్తున్నాం. కదా ప్రతి ఉద్యమంలో అందరం

కొద్ది కొద్దిగా వేసుకుని పోరాటం చేస్తున్నాం. మీరు ఇవ్వాల్సిన అవసరం లేదు అన్నటువంటి ఆదర్శమైనది ఈ ఎర్రజెండా. మరి ఇలాంటి వాళ్ళమంతా ఒకచోటుకి వచ్చామంటే ఇంతకంటే మరొక ఆనందం ఏముంటుంది. మార్క్స్ చెప్పినట్టు, ఎర్రజెండా ముందుకొచ్చిన రోజే మన పేదల పండగలు అంటారే అటువంటి పేదల పండగలు ఇలాంటివి. ఈ రోజు దేశంలో ఉన్న బిజెపి నిన్నా, మొన్న జరిగిన దూకుడు వేరు, ఇప్పుడు వేరు. నిన్నటి దాకా రామాలయం కట్టిస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం, హిందూ రాజ్యాన్ని తీసుకొస్తాం అని చెప్పిన మోడీ అదే రాజ్యాంగాన్ని పట్టుకొని పార్లమెంటులో మొక్కుతూ తిరిగాడు. ఆ మొక్కటానికి కారణం ఎవరు? మనము, మన పోరాటాలు, దానికి ఉన్న విషపు నాగుకు ఉన్న కోరలు పీకటానికి ఈ ఉద్యమం ముందుకు వచ్చింది. ఇప్పుడు తుమ్మితే ఊడిపోయే ముక్కులాగా ఉంది. ఆ ఊడిపోయే ముక్కుని కూడా అవసరమైతే భూతాపానికి తొక్కడానికి మనమంతా ఐక్యం కావాల్సిన అవసరం రానున్న కాలంలో మరింత అవసరం పెరిగింది. ఆ ఉత్సాహం కూడా మనకొచ్చింది. భూమి గురించి వేణుగోపాలరావు గారు మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే భూహక్కుల చట్టంపైన రద్దు చేస్తూ సంతకం పెట్టాడు. కాని మనవాళ్ళు కూడా కొంతమంది అనుకున్న వాళ్ళూ ఉన్నారు. ఇది చంద్రబాబు చేతిలో లేదు. ఈ దేశంలో ఉన్న కోట్లాది ఎకరాలు అమెరికా సామ్రాజ్యవాదం చేతుల్లో ఉన్న కార్పొరేటు శక్తులకు ఈ దేశంలో ఉన్న భూమిని, అన్ని రకాల సరుకును కార్పొరేట్లు ఎలా అయితే కొనుక్కొని తీసుకెళ్తారో భూమిని కూడా ఒక సరుకుగా మార్చి, ఆ భూమిని అడ్డంకులు లేకుండా, చట్టాలు లేకుండా, రైతులకు నష్టపరిహారం లేకుండా దాని మీద ఆధారపడి జీవిస్తున్న శ్రామికులకు, వ్యవసాయ కార్మికులకు నష్టపరిహారం చెల్లించకుండా భూమిని కొల్లగొట్టడానికి సరుకుగా కొనడానికి మార్చినదే ఆ చట్టం. ఈ చట్టం చంద్రబాబు నాయుడు రద్దు చేస్తామని చెప్పినా ఇంకొక ఆరు నెలలకు మోడీ ఆ చట్టం లేకపోతే నీ సంగతి తేలుస్తానంటాడు. ఆయన నీ సంగతి తేలుస్తాడా, ఆయన దిగిపోతాడా. మన మీద పోరాటం కీలకంగా ఉంది. అందుకోసమే రానున్న కాలంలో మరిన్ని పోరాటాలు ముందుకొస్తున్నాయి. ఈ రోజు ప్రమాదం ముంచుకొచ్చింది. అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న అతివల హక్కుల చట్టానికి ఈ రోజు ప్రమాదం ముంచుకొచ్చింది. కాని మోడీ అంటాడు. కడపలో బిజెపి నాయకుడు వచ్చి ప్రెస్‌మీట్ పెట్టాడు. అక్కడ సిగ్గు ఎగ్గు లేకుండా ఏం చెప్పాడంటే, అక్కడ 'కలివి' కోడి అని ఒక జాతికి చెందిన కోడి ఉందంట. ఈ కలివి కోడి దేశంలో ఈ ప్రాంతంలో మాత్రమే ఉంది. ఈ కలివి కోడి అంతరించిపోతుంది. అందుకోసమే ఈ గ్రామంలో ఉన్న ప్రజల్ని, చుట్టూతా ఉన్న 5 గ్రామాల ప్రజల్ని ఖాళీ చేయాలని చెప్పాడు. అంటే కలివి కోడిని కాపాడుకోవటానికి 5 వేల కుటుంబాల్ని ఖాళీ చేయిస్తారంట. అందుకని నరేంద్ర మోడీ ఏమంటున్నాడంటే ఈ దేశంలో వన్యప్రాణుల్ని కాపాడాలి, అందుకనే అటవీ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని చూస్తున్నాడు. ఇది వన్యప్రాణుల్ని కాపాడటానికి కాదు. ఈ దేశ సంపదను, మైనింగ్‌ను అదానీ, అంబానీకి కట్టబెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాడు. అటవీ హక్కుల చట్టం కాపాడటానికి మరొక మహా ఉద్యమం చేయాల్సిన అవసరం మనముందు ఉందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుర్తుచేస్తుంది. అదే విధంగా మొన్నటిదాకా జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు అనేక పోరాటాలతో, ఉద్యమాలతో సాధించుకున్న భూముల్ని అసైన్డ్ భూములు ఈ రాష్ట్రంలో 30 లక్షలు ఉంటే ఆ భూములకు హక్కులు కావాలని మనం పోరాడుతుంటే జగన్ మోహన్‌రెడ్డి అసైన్డ్ చట్టాన్ని సవరించి, ఆ భూములు ఎవరైతే భూస్వాములు ఆక్రమించుకున్నారో వాళ్ళకు రెగ్యులరేషన్ చెయ్యడానికి ఆ చట్టాన్ని సవరించారు. ఏలూరు నుంచి 12 కిలోమీటర్ల దూరంలో దోసిపాడు అనే గ్రామం ఉంది. అనేక సంవత్సరాలుగా దళితులకు ఇచ్చిన 200 ఎకరాల అసైన్డ్‌మెంట్ భూమిని ఎక్కడెక్కడో ఉన్న పెట్టుబడిదారులు, భూస్వాములు ఆక్రమించుకుంటే వాళ్ళకు రెగ్యులరేషన్ చేయడానికి వాళ్ళకు కట్టబెట్టడానికి ఈ ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నాయి. అందుకోసమే బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్టు కార్మికశక్తి పెరగాలన్నా, ప్రజల కొనుగోలు శక్తి పెరగాలన్నా భూపంపిణీ ద్వారానే సాధ్యమవుతుంది. అందుకోసం అంబేద్కర్ భూమి పెన్సిలిన్ ఇంజక్షన్ అన్నాడు. పెన్సిలిన్ ఇంజక్షన్ అంటే సర్వరోగ నివారిణీ – అన్నీ జబ్బులు పరిష్కారం కావాలంటే భూసమస్య పరిష్కారం కావాలి. భూసమస్య పరిష్కారమయితేనే పేదరిక నిర్మూలన జరుగుతుంది. పేదరిక నిర్మూలన జరిగితే దేశ అభివృద్ధి జరుగుతుంది. అదానీ, అంబానీలకు పెరిగితే దేశం అభివృద్ధి కాదు. అసమానతలు పెరుగుతాయి. చంద్రబాబు నాయుడు ఒక మాట చెప్పాడు. నేను వెల్త్ సృష్టిస్తాను, దాన్ని పంపిణీ చేస్తాను అన్నాడు. అంటే సంపద సృష్టిస్తాడంట, సంపద పంపిణీ చేస్తాడట. ఎవరికి పంపిణీ చేస్తాడో తెలియదు. కాబట్టి రానున్నకాలంలో మనముందు ప్రధానమైన కర్తవ్యం మరొక భూపోరాటానికి, అటవీ హక్కుల రక్షణ చట్టం కోసం, గిట్టుబాటు ధరల కోసం, సన్న, చిన్నకారు రైతుల హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం మనముందు చాలా ఉంది. ఆ పోరాటంలో మన మధ్య ఎన్ని విధానాలు పక్కన ఉన్నా మన హక్కుల కోసం వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతుకూలీ సంఘాలు, రైతు సంఘాలు, ఇంకా అనేక సంఘాలు ఏకమై కార్మిక సంఘాల సహకారంతో ఈ దేశంలో మహా ఉద్యమం నిర్మించడానికి మనమంతా పూనుకోవాలి. అందులో భాగంగానే మన రాష్ట్రంలో ఒక మహా ఉద్యమాన్ని, మరో తెలంగాణా సాయుధ పోరాటంలాంటి, తెభాగ పోరాటంలాంటి మరొక మహా భూ ఉద్యమానికి శ్రీకారం చుట్టడానికి ఈ మహాసభ నాంది కావాలని తెలియజేస్తూ, ఈ సందేశం ఇవ్వడానికి పిలిచినందుకు మరోసారి హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

## కా॥ కె.వి.వి.ప్రసాద్,

అంధ్రప్రదేశ్ రైతుసంఘం



రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభల సందర్భంగా వ్యవసాయరంగ సంక్షోభం, పర్యవసానాలు అనే అంశం మీద జరుగుతున్న ఈ చర్చావేదికలో పాల్గొన్న పెద్దలకు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుండి ఈ మహాసభకు హాజరయిన అనేకమంది ప్రముఖులు, కార్యకర్తలు అందరికీ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పక్షాన అభినందనలు తెలియజేస్తున్నాను.

మిత్రులారా! నిన్ననే ఎన్నికలు అయిపోయాయి. మనమందరం ఈ ఎన్నికల్లో కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం మూడోసారి గద్దెనెక్కకూడదు, ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలి అనే లక్ష్యంతో అనేక సంవత్సరాలుగా ఆందోళన కొనసాగిస్తున్నాం. 750 మంది రైతులు తమ ప్రాణాల్ని పణంగా పెట్టి రైతాంగం, చారిత్రాత్మకమైన ఉద్యమాన్ని నిర్మించారు. అదేవిధంగా ప్రతి సందర్భంలో మనవాళ్ళు మన పోరాటాలకి దిక్సూచిగా నిలుస్తూ ఇవాళ వేదికకు పేరు పెట్టిన చలసాని వాసుదేవరావు గారు కావచ్చు, సత్యనారయణమూర్తి గారు కావచ్చు. మనకు ఆదర్శంగా ప్రతి సందర్భంలో మనం ఏమాత్రం వెనకడుగు వేయకుండా అనేక మంది గిరిజన రైతుల పోరాటాలు మనల్ని ఎప్పుడు ముందుకు తీసుకు వెళ్ళేటువంటి క్రమంలో వారందరూ అశువులు బాసిన వారందరికీ ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పక్షాన జోహార్లు అర్పిస్తున్నారు.

మన సంఘం వారు విశాఖపట్నంలో పెట్టినటువంటి ఒక సదస్సుకి నేను హాజరయ్యాను. గిరిజన ఆదివాసీ హక్కుల కోసం జరిగినటువంటి సదస్సు. ఆ సదస్సుకి చాలా మంది బ్రహ్మాండంగా వేలాదిమంది అనేక రాష్ట్రాల నుంచి హాజరయ్యారు. మంచి తీర్మానాలు చేసుకున్నాం. అనేక భవిష్యత్తు కార్యాచరణ మనవాళ్ళు నిర్ణయించారు. ఇవాళ ఎన్నికలు అయిపోయిన తర్వాత మనం ఆశించిన ఫలితాలు రాలేదు. నరేంద్రమోడీ ఇంటికి పోతాడని భావించాం. ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పడుతుందిలే, ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని మనలో ఎక్కువ మందిమి అనుకున్నాం. కానీ జరిగినది కొద్ది తేడాతో మళ్ళీ నరేంద్ర మోడీ వచ్చాడు, ఒక రకంగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, మన ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి కలిసి వీరిద్దరూ పిల్లర్స్‌గా నిలబడి ఇవాళ ఏదైతే మతోన్మాదానికి బీజం వేసిన ఆర్ఎస్ఎస్ అధినేత భగవత్ నరేంద్రమోడీ ప్రభుత్వం సరైన విధానాలను అమలు చేయడం లేదని అంటున్నాడు. ఇవాళ ఆయనకి ఎందుకు గుర్తొచ్చిందో అర్థం కావట్లేదు. నరేంద్ర మోడీని ఆడుతున్నాడని మనమందరం అభిప్రాయ పడుతున్నాం. కాని జరుగుతున్నదేమిటి? ఇప్పటిదాకా జరిగినదేమిటి. మణిపూర్‌లో మారణహోమం జరుగుతుంటే భగవత్ గారికి కనపడలేదు. 13 మాసాలు 3 చట్టాలను రద్దు చేయాలని మన రైతులు 750 మంది చనిపోయి సంవత్సరంపాటు సాగిన మహోద్యమం సందర్భంగా మన మీద మారణకాండ సృష్టిస్తే అది భగవత్ గారికి కనపడలేదు. ఈ దేశంలో కార్మికవర్గం సాధించుకున్న చట్టాలను రద్దు చేస్తే, మత ఉన్మాదం పేరిట ఇతర మతాల మీద దాడులకు పూనుకుంటే భగవత్ గారికి కనపడలేదు. ఇవాళ భగవత్ గారు గ్లిజరిన్ కన్నీళ్లు కారుస్తున్నాడు. అందరూ ఆలోచన చేయాలి. మిత్రులారా! మన అందరం కూడా ఈ మతోన్మాద ఆర్ఎస్ఎస్, బిజెపి కూటమిని దాని యొక్క మార్గాన్ని నిరోధించడానికి తప్పనిసరిగా పోరాటాలు సాగించాలి. గతంలో కూడా మనం అనేక పోరాటాలు భూసంస్కరణలు సాధించుకున్నా, బ్యాంకులు జాతీయకరణ చేసుకున్నా ఇవాళ అనేక పోరాటాలు మనం ఎర్రజెండా నాయకత్వాన సాధించుకున్నవే అందువల్ల ఇవాళ రైతు సంఘం కావచ్చు, రైతుకూలీ సంఘాలు కావచ్చు. మనమందరం ఐక్యంగా ముందుకు పోవాలి. ఎర్రజెండాను ఒక మహోన్నతమైనటువంటి కీర్తి ప్రతిష్టత వైపు తీసుకెళ్లాలి. ఆ రకంగా ఈ జెండాను ముందుకు తీసుకెళ్ళటం ద్వారా మన రైతాంగ సమస్యలు, ఆదివాసీల సమస్యలు, రైతుకూలీల సమస్యలు. కార్మికవర్గ ఐక్యత, రైతు ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని భావిస్తూ ఈ మహాసభ అందుకు అనుగుణమయిన పద్ధతుల్లో తీర్మానాలు చేసి భవిష్యత్తు కార్యాచరణకి ముందుకు సాగాలని విజ్ఞప్తి చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

## కా॥ బండి వెంకటేశ్వర రావు,

రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వ్యవసాయ కార్మిక సంఘం



సోదరి సోదరులారా! ఈ రోజు, రేపు, ఎల్లుండి ఏలూరు నగరంలో ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా ఉదయం జరిగిన ప్రారంభ సభగానీ, ఈ బహిరంగసభకు ముందు జరిగిన ప్రదర్శనగానీ, బహిరంగ సభ ప్రారంభంలోని చిన్నారి కళాకారులు ప్రదర్శించిన నృత్యరూపకాలు ఈ నగర ప్రజల్ని, ఈ మహాసభకు హాజరయిన అతిధుల్ని, అందర్ని విశేషంగా విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం కావాలని మనస్పూర్తిగా కోరుకుంటూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. నా ముందు మాట్లాడిన నాయకులు భారతదేశం లోనూ, రాష్ట్రం లోనూ స్వాతంత్ర్యం వచ్చి 75 సం॥రాల కాలంలో రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యల్ని వ్యవసాయరంగం ఇప్పటికీ ఏ విధంగా సంక్షోభంలో ఉందో తెలియజేస్తూ, గతం నుండి నేటి వరకు మన రాష్ట్రాన్ని, దేశాన్ని పాలిస్తున్న పాలకులు వ్యవసాయ రంగం పట్ల, రైతాంగం పట్ల, రైతాంగంపై ఆధారపడి జీవిస్తున్న గ్రామీణ ప్రజలు, రైతు కూలీలు, కార్మికులు, పేదల సమస్యల పట్ల పరిష్కారానికి, అభివృద్ధికి ఏ విధంగా దోహదపలేదో అన్నీ క్లుప్తంగా వివరించారు. రానున్న కాలంలో ఈ భారతదేశంలో, రాష్ట్రంలో వ్యవసాయం అభివృద్ధి చెందాలన్నా, రైతాంగం బాగుండాలన్నా వ్యవసాయ కూలీలు సామాజికంగా అభివృద్ధిచెందాలన్నా ఈ యొక్క ప్రభుత్వ పాలకులలో మార్పు రావలసిన ఆవశ్యకత ఉంది. 2014, 19లో ఎన్నికలలో అధికారం రాకముందు నరేంద్రమోడీ నాకు అధికారం ఇస్తే స్వామినాథన్ కమీషన్ సిఫారసులను అమలు చేసి, రైతాంగంలో ఉన్న ఆత్మహత్యలను నివారణ చేస్తూ వ్యవసాయ రంగాన్ని ఈ భారతదేశంలో ముందుకి తీసుకువెళ్తానని చెప్పి అనేక హామిలిచ్చి, ఆ హామీలను అమలు చేయలేకపోవడమే కాకుండా 2019 చివరలో 3 వ్యవసాయ నల్ల చట్టాలు తెచ్చి రైతాంగాన్ని మరింత ఆత్మహత్యలకు పురిగొల్పేందుకు ప్రయత్నిం చేసాడు. దాని మీద భారతదేశవ్యాప్తంగా కార్మిక, ప్రజాసంఘాలు పెద్దఎత్తున ఉద్యమాలు చేసి 750 మంది రైతులు చనిపోయిన తర్వాత ఆ 3 వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసారుకానీ, ఆ సందర్భంగా ఇచ్చిన హామీలను నేటివరకు మోడీ ప్రభుత్వం అమలు చేయలేదు. రైతులకు సంబంధించిన గిట్టుబాటు ధరను ప్రకటించలేదు. ఆ యొక్క ఉద్యమం సందర్భంగా చనిపోయిన రైతులకు కనీసం నష్టపరిహారం చెల్లించలేదు. రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదు. పూర్తి మెజార్టీ రాకపోయినా ప్రస్తుతం మళ్లీ నరేంద్రమోడీ ప్రధానమంత్రి అయ్యారు. నరేంద్రమోడీ ఈ రైతాంగానికి ఇచ్చిన హామీల అమలు చేయటం కోసం రైతాంగ సమస్యల పరిష్కరం కోసం, రైతుకూలీల పరిష్కారం కోసం ఏమాత్రం సరైన నిర్ణయాలు చేయడానికి, రాష్ట్రంలో అధికారంలోకి టిడిపి ప్రభుత్వం కేంద్రం మీద, మోడీ మీద ఒత్తిడి చేయాల్సిన ఆవశ్యకత ఉంది. అదే సందర్భంలో మన ఉభయ జిల్లాలకు సంబంధించిన పోలవరం ప్రాజెక్ట నిర్మాణానికి సుమారు 4 నుంచి 5 లక్షలమంది గిరిజనులు, గిరిజనేతర ప్రజలు, నిర్వాసితులు అనేక త్యాగాలు చేసి వారి ఇళ్లను, భూముల్ని కోల్పోవడం జరిగింది. నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడంలో గత 15 సం॥రాలుగా మన రాష్ట్రాన్ని పాలిస్తున్న పాలకులు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. ఈ పోలవరం ప్రాజెక్టుని జాతీయ ప్రాజెక్టుగా 2014లో కేంద్ర మోడీ ప్రభుత్వం అంటే కాంగ్రెస్ పార్టీ ప్రకటించినప్పటికీ ప్రాజెక్టు నిర్మాణంలో పాటు, నిర్వాసితుల సమస్య పరిష్కారం చేయటంలో పూర్తిగా విఫలం చెందాడు. ఆ సందర్భంగా నిర్వాసితులకు న్యాయం చేయటం కోసం మన యొక్క రైతుకూలీ సంఘం రాష్ట్రమహాసభలో సరైన నిర్ణయం చేయాలని, రానున్న కాలంలో ఒక్క రైతుకూలీ సంఘమే కాకుండా భారతదేశంలో, రాష్ట్రంలో 3 వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఏ విధంగా సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఐక్య ఉద్యమాలు నిర్వహించామో అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ, రైతు కూలీల, కార్మిక, ప్రజావ్యతిరేక సమస్యల మీద పెద్ద ఎత్తున ఉద్యమం చేయటం కోసం ఈ రైతుకూలీ రాష్ట్ర మహాసభలో సరైన నిర్ణయాలు చేసి ఐక్య ఉద్యమాలకు నాందిపలికే విధంగా మీ యొక్క రాష్ట్ర మహాసభలు జయప్రదం కావాలని కోరుకుంటూ, ఈ అవకాశాన్ని ఇచ్చిన అందరికీ ధన్యవాదాలు జేస్తున్నాను.

**కా॥ కె. శ్రీనివాస్,**

జిల్లా కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఏలూరు



అందరికీ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున ముందుగా హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభను విజయవంతం కావాలని చెప్పి రైతు సంఘం తరపున ఆకాంక్షిస్తున్నాను. పెద్దలు చాలామంది ముందు మాట్లాడారు. ఈ రోజు వ్యవసాయం సంక్షోభంలో ఉంది. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు. రైతు ఇవాళ క్షోభిస్తూ ఉంటే పాలకులు పట్టించుకునే పరిస్థితి లేదు. అందుకనే ఈ రోజు మనం రైతు గెలవాలి, వ్యవసాయం నిలవాలి అని చెప్పి కేంద్ర మోడీ ప్రభుత్వం తీసులువచ్చిన 3 వ్యవసాయ నల్ల చట్టాలకు

వ్యతిరేకంగా మనం పోరాటం చేసాం. నరహంతకుడు నియంత మోడీతోనే క్షమాపణ చెప్పించిన ఏకైక ఉద్యమం ఈ దేశంలో ఏదైనా ఉందంటే అది రైతు ఉద్యమం అని గర్వకారణంగా చెప్పుకోవచ్చు. వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసారు. కానీ దాని ప్రభావం పోలేదు. ఈనాడు మళ్లీ మోడీ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని ఖచ్చితంగా మీరు ఏదైతే లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలు ఏవైతే ఉన్నాయో, మీరు మద్దతు ధర గ్యారంటీ చట్టం తీసుకొస్తారా? లేదా అని చెప్పి మళ్లీ మన పోరాటాన్ని కొనసాగించాల్సిన సమయం ఉంది. అంతే కాకుండా వ్యవసాయ పంపు సెంట్లకు మీటర్లు పెడుతున్నారు. మరి ఆ చట్టాన్ని ఉపసంహరించుకుంటారా? లేదా అడగాల్సిన అవసరం ఉంది. ఇవాళ ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో అమరులైన కుటుంబాలకి పరిహారం ఇవ్వాలని తిరుగుతూ ఉన్నాం. కనీసం ఆ కుటుంబాలని పట్టించుకునే దిక్కు లేదు. కాబట్టి ఢిల్లీ రైతాంగ ఉద్యమ సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోసం మళ్లీ మన పోరాటాన్ని కొనసాగించాలి. మన రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం లేండ్ టైటిలింగ్‌ఎక్ట్‌ను రద్దు చేసాం, సంతకం పెట్టాం అని చెప్పారు. ఇదొక్కటే కాదు ఈ రాష్ట్రంలో చాలా రైతాంగ సమస్యలు ఉన్నాయి, వాటన్నింటికీ కూడా పరిష్కారం మీరు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని చెప్పి మనం డిమాండ్ చేయాల్సిన అవసరం ఉంది. ఈ రోజు ప్రాజెక్టుని పూర్తి చేస్తామని చెప్తున్నారు. మనం అడుగుతున్నది ఒకటే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేముందు నిర్వాసితులకు సమస్యలు పరిష్కారం చేయాలి. దీని మీద కుంజం రామారావు గారు చాలా మంది విషయాలు చెప్పారు. నిర్వాసితుల కాలనీలో ఒక మనిషి చనిపోతే పూడ్చతేదీనికి కూడా స్థలంలేని పరిస్థితి, పునరావాస కాలనీల్లో స్మసానం లేదు. కాబట్టి పునరావాస సమస్యలు పరిష్కారం' చేయకుండా, పరిహారం చెల్లించకుండా పోలవరం ప్రాజెక్టుని మీరు ఎలా పూర్తి చేస్తారు అని చెప్పి మనం ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. ఇవాళ మరోక ముఖ్యమైన సమస్య మన ముందు ఉంది. ఇవాళ కౌలు రైతులు, వ్యవసాయం చేస్తున్నది, పెట్టుబడితున్నది కౌలురైతే నష్టపోతున్నది ఆత్మహత్య చేసుకుకవంతున్నది కూడా కౌలు రైతు. అలాంటి కౌలు రైతులను ఆదుకునే దాని కోసం ఈ ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుంది? ఇవాళ గొప్పగా చెప్పారు రైతు భరోసా పెట్టుబడిసాయం అని. గత ప్రభుత్వం భూయజమానులకు ధారాదత్తం చేసింది. ఈ ప్రభుత్వం కూడా భూయజమానులకే ధారాదత్తం చేస్తుందా? లేదా కౌలు రైతులను అదుకుంటుందా లేదా? అని మనం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది. కాబట్టి రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభల్లో ఈ సమస్యల మీద తీర్మానం చేసి భవిష్యత్తులో ఐక్య ఉద్యమాల ద్వారా మన సమస్యల పరిష్కరం కోసం రైతులు, రైతు కూలీలు ఐక్యంగా ఉద్యమించాలని ఆకాంక్షిస్తూ మీ అందరికీ నమస్కారులు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

**'ప్రకృతిలో భాగంగానే మనిషి మనుగడ సాగిస్తున్నాడు. కాబట్టి ప్రకృతి మనిషి దేహమే. మానవజాతి అంతరించి పోకుండా ఉండాలంటే మనిషి ప్రకృతితో నిరంతరం సంభాషిస్తూ ఉండాలి. సంబంధం కలిగి ఉండాలి. మనిషి భౌతిక, మానసిక జీవితం ప్రకృతితో ముడిపడి ఉంటుందని అంటున్నామంటే ప్రకృతి తనతో తాను ముడిపడి ఉందని అర్థం, ఎందుకంటే మనిషి ప్రకృతిలో భాగమే'.**

★ ★ ★ ★ ★

**'చేప' సారాంశం నీటిలో దాని అస్తిత్వమే. 'మంచి నీటి చేప' సారాంశం, నదిలోని నీరు. ఒకసారి ఆ నదిని పరిశ్రమ అవసరాల కోసం వినియోగించడం మొదలు పెట్టాక, పరిశ్రమల నుండి వెలువడే రసాయనాలతో, వ్యర్థ పదార్థాలతో, మరపడవలతో ఆ నది కలుషితం అయిన తర్వాత, లేదా ఆ నది నీటిని వేరే అవసరాల కోసం పక్కకు మళ్లించిన తర్వాత చేప అస్తిత్వానికి అవసరమైన మాధ్యమం లేకుండా పోతుంది. అంటే చేప తన అస్తిత్వాన్ని కోల్పోతుంది'.**

**- 'పర్యావరణం'పై మార్క్స్**

# ఇతర రాష్ట్రాల ప్రతినిధుల సందేశాలు


## కా॥ అలోక్ ముఖర్జీ,

పశ్చిమ బెంగాల్ పీడిత ప్రజా ఉద్యమ నాయకులు




కా్రమేడ్స్! రైతుకూలీ సంఘం మహాసభలకు వచ్చిన మిత్రులందరికీ మొట్టమొదటగా నా అభినందనలు తెలియజేస్తున్నాను. నేను మీతో మాట్లాడబోయే ముందు ముఖ్యమైన విషయం ఒకటి చెప్పదలచుకున్నాను. ఈ మహాసభల సందర్భంగా ఇక్కడ ప్రదర్శించిన అల్లూరి సీతారామరాజు బుర్రకథ నన్ను చాలా ఆకట్టుకుంది. బుర్రకథ వేసిన ముగ్గురి కామ్రేడ్స్ యొక్క హావభావాలనీ గాని, మాట్లాడిన విధానం గానీ నన్ను చాలా ఆశ్చర్యానికి, ఉత్తేజానికి గురిచేసాయి. ఎక్కడా కూడా వాళ్ళ హావాభావాలలో ఏ బెదురు బెరుకూ లేకుండా వేసిన ఆ ముగ్గురు కామ్రేడ్స్ని అభినందిస్తున్నాను. ఆ ముగ్గురు కామ్రేడ్స్ గిరిజన ప్రాంతం నుంచి వచ్చారని తెలుసుకున్నప్పుడు అది మరింత ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని కలిగించింది.

కామ్రేడ్స్! బ్రిటీష్వాడు ఈ దేశానికి వచ్చిన తర్వాత ఈస్ట్ ఇండియా కంపెనీ నెలకొల్పిన తర్వాత వ్యవసాయంలో వాళ్ళు తీసుకువచ్చిన విధానాలు, దానికి సంబంధించిన విషయాలు ఇక్కడ పేర్కొనవలసి ఉంది. ఇప్పుడు వాటికి సంబంధించిన పోరాటాలేంటి? వివరాలేంటి; డిమాండ్స్ ఏంటనే విషయాలు నేను ప్రస్తావించను గాని, బ్రిటీష్వాడు మన దేశ అధికారంలోకి వచ్చిన తర్వాత రైత్వారీ విధానంలో తీసుకువచ్చిన మార్పులు ఏమిటి? అనే విషయాలను మనం పరిశీలనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. వలస దేశాల్లో సామ్రాజ్యవాదులు అక్కడున్నటువంటి భూమి సమస్య మీద, రైతాంగ పద్ధతుల్లో ఏ విధమైన మార్పులు తీసుకొచ్చి పెట్టారో ఆ విషయాలన్నింటినీ కూడా ఒకసారి మనం మాట్లాడుకోవాల్సి ఉంది. ఆనాడు బ్రిటీష్వాడు చేసిన దుర్మార్గమైన పాలనకు వ్యతిరేకంగా భారతదేశంలో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్లో రైతాంగ పోరాటాలు, గిరిజనులకు సంబంధించిన అనేక తిరుగుబాట్లు ఇక్కడ జరిగాయి. తెలంగాణ ఏరియాకు సంబంధించి ఆనాడు నైజాం నవాబుకు వ్యతిరేకంగా జరిగినటువంటి సాయుధ పోరాటం కూడా ముఖ్యమైనది మరియు కీలకమైనది. ఆ సందర్భంగా ఆంధ్ర ప్రాంతం, తెలంగాణ ప్రాంతం మరియు కర్నాటకలో ఉండే కొంత ప్రాంతాన్ని కలిపి ఆంధ్రప్రదేశ్ స్టేట్గా 1956లో డిక్లేర్ అయిన విషయం మనం దృష్టిలో పెట్టుకోవాలి. ఆనాడు ఆ విధంగా ఆంధ్రప్రదేశ్ని డిక్లేర్ చేసిన పద్ధతుల్లో ఆ రోజు పాలకులు చెప్పినదేమిటంటే, తెలుగు మాట్లాడే ప్రజలందరినీ కూడా ఒకే రాష్ట్రంగా తీసుకొంటున్నామని చెప్పారు. ఇది ప్రజలందరి కోసమని చెప్పారు. కానీ వాస్తవం అది కాదు. అక్కడ వాళ్ళు చేసినదేమిటంటే పాలకవర్గాలు ఎవరైతే పరిపాలిస్తున్నారో వాళ్ళ యొక్క ఇంట్రస్ట్లని, వాళ్ళ యొక్క ఆసక్తులను ముందుకు తీసుకెళ్ళటం కోసమే ఆ విధమైన చర్యలను చేసారు. ఆ పరిణామం అలా ఉండగా బీహార్లోనూ, గుజరాత్లోనూ, మహారాష్ట్ర లోనూ రైతాంగ ఉద్యమాలు ఉవ్వెత్తున లేచాయి. ఆ పరిస్థితుల్లో అధికార మార్పిడి తర్వాత నెహ్రూ పాలకులకు జమీందారీ విధానంలో కొన్ని మార్పులు తీసుకురాక తప్పలేదు. అయితే ప్రజలకు అనుకూలమైనటువంటి మౌలికమైన మార్పులు పాలకవర్గాలు చేయలేదు. కానీ జమీందారీ విధానానికి వ్యతిరేకంగా కొన్ని కొన్ని మార్పులు మాత్రం నామమాత్రంగా చేయవలసిన పరిస్థితి, ఆవశ్యకత ఆ ఉద్యమాల ద్వారా వచ్చాయి. అక్కడ జరిగిన మార్పు ఏమిటంటే జమీందారీ వ్యవస్థ అనేది రద్దు అయింది. కానీ జాగీర్దార్లు వచ్చారు. జమీందార్లకు సంబంధించిన వాళ్ళంతా ఆ రోజు అగ్రకులాలకు సంబంధించిన వాళ్ళు, కాని జాగీర్దార్లకు సంబంధించిన దాంట్లో బిసిలకు, అగ్రకులాలకు సంబంధించిన వాళ్ళు ఉన్నారు.

కానీ ఆ యొక్క మార్పులతోటి భారతదేశంలో ఉండే రైతాంగం ఏ మాత్రం సంతృప్తిగాలేరు. నెహ్రూ చేసిన భూసంస్కరణలు గాని, భూసంబంధాలకు సంబంధించిన మార్పుల్ని ప్రజలు ఏవీ కూడా పూర్తిగా స్వీకరించలేకపోయారు. దాని నుంచి తర్వాత అనేక రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో రైతాంగ ఉద్యమాలు పెద్ద ఎత్తున వచ్చాయి అనే విషయాన్ని మనం పరిగణనలోకి తీసుకోవాలి. దీని నుండి పాలకవర్గాలు ఏం చేసాయంటే తప్పని పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతాల్లో, భారతదేశంలో ఉన్న నార్త్ ఈస్ట్లో కొన్ని ప్రాంతాలను షెడ్యూల్ ఏరియాగా ప్రకటించక తప్పలేదు. పైపైన మార్పులు మాకు అవసరం లేదు, మౌలికమైన మార్పులు మాత్రమే కావాలి, భూమి పంపిణీ అందరికీ సాగాలి అనేటువంటి పరిస్థితుల్లోనే అనేక ప్రాంతాల్లో ఉద్యమాలు వచ్చాయి. ప్రజలు పాలకులు చేసిన పైపైన మార్పులతో వాళ్ళు ఏమాత్రం సంతృప్తి చెందలేదు. ఇక్కడ రెండు విషయాలు అయితే జరిగాయి. ఎక్కడైతే భూసంస్కరణల్లో భూపరిమితి అని చెప్పారో అక్కడి నుంచి భూస్వాముల దగ్గర ఉండే

భూముల్ని తీసుకుని పేద ప్రజలకు పంపిణీ చేయడం అనేది సక్రమంగా జరగలేదు. అదే సందర్భంగా ట్రైబల్ ఏరియాను షెడ్యూల్ ఏరియాగా ప్రకటించినప్పటికీ కూడా అక్కడున్నటు వంటి భూమి మీద హక్కును పూర్తిగా గిరిజనులకే అన్నప్పటికి కూడా అక్కడి గ్రామీణ ప్రాంతాల్లో భూమిలో ఎవరైతే పేదరైతులు పండిస్తున్నారో వాళ్ళ దగ్గరి నుంచి రకరకాల పద్ధతుల్లో పేదరైతులను దోపిడీ చేస్తూనే ఉన్నారు. పేద ప్రజలు, గిరిజనులు, రైతులు కష్టపడి పంటలు పండించినా, సరైన పద్ధతుల్లో మార్కెటింగ్ గాని, గిట్టుబాటు ధర వంటివేవీ పాలకులు కల్పించలేకపోయారు. ఈ విధానాలన్నీ సామ్రాజ్యవాదులకు అనుకూలంగా, పెద్ద దళారీ బడా బూర్జువాలకు అనుకూలంగా సాగిన విధానాలే తప్ప ప్రజలకు అనుకూలంగా జరిగినవి కావు. ఆ తర్వాత పాలకులు ప్రజల్ని సంతృప్తి పరచలేక(హై హీల్డింగ్) ఎక్కువగా పంట పండే విధానాలను తీసుకువచ్చారు. ఈ పరిస్థితుల్లో హై హీల్డింగ్ తీసుకురావటం పేరుతో మొత్తం సామ్రాజ్యవాదులకు అనుకూలంగా ఎరువులు, పురుగు మందులు, ట్రాక్టర్లు వంటివన్నీ వ్యవసాయంలో వాళ్ళు ఉపయోగించారు. పంట పండించడం అనేది రైతాంగానికి సంబంధించినదే అయినా కూడా రైతు కష్టపడి పండించిన పంటలు, లాభాలు అన్నీ కూడా సామ్రాజ్యవాదులకు, కంపెనీలకు వెళ్ళిపోయాయి అన్న విషయం మనం గుర్తించాల్సి ఉంది. ఈ అధిక ఉత్పత్తి పేరుతోటి సామ్రాజ్యవాదులు చేస్తున్న ఈ మోసాల్ని రైతాంగం అర్థం చేసుకోవటానికి కొంత సమయం పట్టింది. ఇవి అక్కడక్కడా రైతాంగ తిరుగుబాట్లకు దారితీసాయి. దాంట్లో భాగంగానే పశ్చిమ బెంగాల్ నక్సల్‌బరీలోనూ, ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం ఏజెన్సీలోనూ, అనేక ప్రాంతాల్లో రైతాంగం ప్రత్యేకించి గిరిజన రైతాంగం పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాట్లు చేసారు. ఇక పాలకులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రత్యేక ఆర్థిక మండలి అనే ఒక మార్పు తీసుకొచ్చారు. ఈ ప్రత్యేక ఆర్థిక మండలికి సంబంధించిన దాంటో శ్రీకాకుళంలోని సోంపేట ఏరియాలో జరిగిన తిరుగుబాటులో ఇద్దరు కామ్రేడ్స్ పోలీసుకాల్పులకు గురై మరణించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలన్నీ (ఎల్‌పిజి) లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ వలన కూడా చాలా మార్పులు వచ్చాయి.

బ్రిటీష్‌వాడు మన దేశంలోకి వచ్చినప్పుడు 1883లో ల్యాండ్ అలైనేషన్ యాక్ట్ అనే దాన్ని తీసుకొచ్చాడు. అంటే ప్రభుత్వానికి అవసరమైతే ప్రభుత్వం కోరుకుంటే రైతాంగం దగ్గర ఉన్న ఎలాంటి భూమినైనా సరే ఆక్రమించుకోవటానికి, తీసుకోవటానికి అధికారం ఉంటుంది అనే చట్టాన్ని చేసాడు. అధికార మార్పిడి జరిగిన తర్వాత ఈ చట్టంలో మార్పు తీసుకొచ్చి ప్రభుత్వం యొక్క మిలటరీ అవసరాల కోసం, పోలీసు అవసరాల కోసం ఎక్కడైనా ఏ భూమినైనా తీసుకోవచ్చనే విధంగా చేశారు. ఈ ల్యాండ్ అలైనేషన్ యాక్ట్ ప్రకారం మౌలికమైన మార్పులు హైవే రోడ్లుకు గానీ, ప్రాజెక్టులకు గానీ, ప్రభుత్వం ఏది కట్టాలనుకున్నాగానీ రైతాంగం దగ్గర నుంచి ఏ రకంగానైనా సరే భూములన్నీ లాక్కునే అధికారాన్ని ఆ చట్టం ద్వారా వాళ్ళు చేసారు. ఎంతటి భూమినైనా సరే పాలకులు లాక్కునే అధికారాన్ని ఈ చట్టం ద్వారా పొంది నిత్యవసరాల పేరుతో వాటిని కంపెనీలకు, ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతూ వస్తున్నారు. అభివృద్ధి అనే పేరుతో చాలా ప్రాంతాల్లో భూమిని లాక్కున్నారు. అది ఎవరి కోసం, ఎందుకోసం అనేటువంటి విషయం పాలకవర్గాలు, పాలకులు నిర్ణయించుకునే దాని ప్రకారం ఉంటుంది. కానీ, ప్రజల ప్రయోజనాలను బట్టి కాదు. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణమనే పేరుతోటి వాళ్ళు చాలా భూములు లాక్కున్నారు. దానికి వ్యతిరేకంగా మనం ఒక ఆందోళన చేస్తున్నాం. ఇక అటవీ సంరక్షణ చట్టానికి సంబంధించిన విషయాల్లో మనం చూసుకుంటే గవర్నమెంటు దానికి సవరణ చట్టం తీసుకొచ్చింది. ఆ చట్టం ప్రకారం అడవులలో నివసించేటువంటి గిరిజనులకు భూమి మీద, ఆ ప్రాంతాల్లో ఉన్న ప్రకృతి మీద కానీ ఏ విధమైన హక్కులు లేకుండా వాటిని లాక్కోవటానికే తీసుకువచ్చిన చట్టం ఇది. ఈ చట్టానికి వ్యతిరేకంగా నాకు తెలిసిన మేరకు ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాంతాల్లోనూ, ఇతర రాష్ట్రాలలోనూ పెద్ద ఎత్తున పాలక వర్గాలకు వ్యతిరేకంగా ఒక ప్రతిఘటన ప్రజల నుంచి వస్తున్నది. ఈ భూముల మీద, అడవుల మీద హక్కు మాకే వుండాలి అనే ఒక ప్రతిఘటన భారతదేశంలో వస్తున్నది. ఈ ప్రతిఘటన అనేటువంటిది భూస్వామ్య వర్గాల్లో ఉండే వాళ్ళకి, పెద్ద పెద్ద బడా బూర్జువా వర్గానికి, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సాగించాల్సిన పోరాటం. ఈ పోరాటం చాలా కష్టమైనటువంటిది. ఆంధ్ర దేశంలోనే కాకుండా, పక్క రాష్ట్రం ఒరిస్సాలో టాటాలు, బిర్లాలు, జిందాల్‌లకు వ్యతిరేకంగా అక్కడ గిరిజనులు కదులుతున్నారు. అక్కడ సుమారు 15మంది పైగా గిరిజనులు హత్యకు గురికాబడ్డారు. కనుక వీటన్నింటికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున మనం పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. ఇదే మన ముందున్న కర్తవ్యం. ధన్యవాదాలు తెలియజేస్తూ కామ్రేడ్స్ అందరికీ రెడ్‌శాల్యూట్స్.

**కా॥ శంభు మహతో,**

ఏఐకెఎంకెఎస్ నాయకులు, జార్ఖండ్



ఈ రాష్ట్రమహాసభలకు మిగిలిన ప్రాంతాల నుండి వచ్చినటువంటి వారందరికీ విప్లవాభినందనలు. మొత్తం కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు ఇక్కడ ఉన్న సంపదను దోచుకునే క్రమంలో ఫ్యూడల్ వ్యవస్థను అభివృద్ధి చేసే క్రమంలో దేశంలో ఉన్న రైతాంగం బాగుపడకూడదు, మిగిలిన

కష్టజీవులు బాగుపడకూడదు. ఎందుకు అంటే వారు బాగుపడితే భూస్వాములు, పెట్టుబడిదారులు నష్టపోతారు కనుక. ఉద్దేశపూరితంగా కొన్ని ప్రాంతాలను వారి గుప్పిట్లో ఉంచుకుంటున్నారు. ఎందుకంటే చౌక కూలీలు దొరికే ప్రాంతాలు కావాలి, ,చౌకగా పంటలు కావాలి. కాబట్టి అలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసి గుప్పిట్లో ఉంచుకుంటున్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు ఏవో కొన్ని తప్ప మిగిలిన అన్ని రంగాలను ప్రైవేటుపరం చేస్తున్నారు. ఇప్పుడు మనమందరం రైతుకూలీలమే కాకుండా కార్మికవర్గాన్ని కూడా కలుపుకుని పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సిన అవసరం ఉంది అని తెలియజేస్తూ మీ అందరికీ మరొక్కసారి విప్లవాభినందనలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

## కా॥ సుశీలన్,

ఏఐకెఎంకెఎస్ నాయకులు, కేరళ

రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్రమహాసభల సందర్భంగా రాష్ట్ర నాయకులకు, కార్యకర్తలు అందరికీ రైతుకూలీసంఘం, మా కేరళ రాష్ట్రం తరపున అభినందనలు తెలియజేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాలు కేరళ రాష్ట్రాన్ని, అలాగే మొత్తం భారతదేశాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేశాయి. కేరళ వ్యవసాయకంగాను, పారిశ్రామికంగానూ కూడా అభివృద్ధిలో వెనుకబడి ఉంది. కానీ మూడవ రంగంగా సేవారంగం ఉద్భవించి వ్యవసాయరంగానికి చెందిన కేటాయింపులన్నీ సర్వీసురంగంలోకి మళ్ళించబడుతున్నాయి. సిపిఐ(ఎం) నాయకత్వాన గల ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 9 సంవత్సరాల కాలంలో 110 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అవి ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వ్యవసాయ భూములు పరిరక్షించటానికి ప్రభుత్వం ఏ విధమైన చర్యలు చేపట్టకపోగా రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నది. వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం ఇతర మార్గాల వైపు మళ్ళుతున్నారు. దీనికి వ్యతిరేకంగా మేము కేరళ రైతుకూలీ సంఘంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నాము. ఇది క్లుప్తంగా కేరళలోని పరిస్థితి. రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఆశిస్తున్నాను. మరోసారి అందరికీ విప్లవాభివందనాలు.

## కా॥ గుణాలన్,

ఏఐకెఎంకెఎస్ నాయకులు, తమిళనాడు



ఎఐకెఎంకెఎస్ అనుబంధ సంస్థ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) మూడు రోజుల మహాసభలలో మొదటిరోజు జరిగిన ప్రారంభసభ, ఊరేగింపు, బహిరంగ సభ ఉత్తేజభరితంగా సాగాయి. రెండవరోజు జరిగిన 'వ్యవసాయ రంగ సంక్షోభం – పాలకుల విధానాలు–మన కర్తవ్యాలు' అంశంపై జరిగిన సదస్సు కూడా విజయవంతంగా జరిగింది. ఈ రెండు రోజులలో కళాకారులు పాడిన పాటలు, ప్రదర్శించిన నృత్యాలు, నృత్యరూపకం, బుర్రకథ ఎంతో ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. ఏలూరు పట్టణ ప్రజానీకంపై ఈ మహాసభలు విశేష ప్రభావాన్ని పడవేశాయనటంలో సందేహమే లేదు. ఈ రోజు జరుగనున్న ప్రతినిధుల సభ కూడా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. నిర్దిష్ట సమస్యల ప్రాతిపదికగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రజా ఉద్యమాలలో పని చేస్తున్న వాళ్ళకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. ఈ రోజు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే వ్యవసాయ రంగంలో సంక్షోభానికి కారణం. తమిళనాడులో కూడా రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారిని వారి సమస్యలపై కదిలించి, చైతన్యపరచి, పోరాటాలకు సిద్ధపరచాలి. ఈ క్రమంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) మహాసభలు మాకెంతో స్ఫూర్తి దాయకంగా నిలుస్తాయనటంలో సందేహం లేదు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) మరింత అభివృద్ధి చెందాలని, మరిన్ని ప్రజా ఉద్యమాలను, రైతాంగ ఉద్యమాలను నిర్మించాలని తమిళనాడు ఎఐకెఎంకెఎస్ తరపున ఆకాంక్షిస్తున్నాను. నాకీ అవకాశం కల్పించిన అందరికీ ధన్యవాదాలు.

## కా॥ మాధవరెడ్డి,

రాష్ట్ర అధ్యక్షుడు, కర్ణాటక రాజ్య రైతు సంఘ (హసిరుసెనే)



అధ్యక్ష, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కామ్రేడ్స్ అందరికీ కర్ణాటక రైతు రాజ్య సంఘం తరపున అభినందనలు తెలియజేస్తున్నాను. కర్ణాటక బ్యాంకులో రైతులు తీసుకున్న అప్పులకు వడ్డీ తగ్గించాలంటూ గత రెండున్నర సంవత్సరాల నుండి మేము పోరాటం

చేస్తున్నాం. ఈ పోరాటంలో వందలాదిమంది పాల్గొంటూ, అనేక రూపాలలో నిరసనలు తెలియజేస్తూ ఉన్నాం. అయినప్పటికీ మా రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అప్పులకు వడ్డీని రద్దు చేయడానికి నిర్ణయం తీసుకోలేదు. మా కర్ణాటక రాష్ట్రంలో 31 జిల్లాలు ఉన్నాయి. అందులో 22 జిల్లాల్లో రైతాంగానికి 75 లక్షల కుటుంబాలకుగాను 54 లక్షల కుంటుంబాలకి అప్పు ఇచ్చారు. కేవలం 26 కోట్లు మాత్రమే అప్పు ఇచ్చారు. రాష్ట్రంలోగానీ, కేంద్రంలో గానీ రైతాంగానికి ఉచితాలు, పథకాలు ఇస్తామని వాగ్దానాలు చేస్తున్నారు. కానీ మేము కోరుకుంటున్న దేమంటే మాకు ఏ ఉచితాలు వద్దు. మాకు గిట్టుబాటు ధర లభిస్తే చాలు మాకు ఏ ఉచితాలు అవసరం లేదని మేము చెప్తున్నాం. గుంటూరులో మిర్చికి ఏ విధంగా డిమాండ్ ఉందో, మా కర్ణాటకలో కూడా బ్యాడగి మిర్చి యార్డుకు ఒక రోజుకు 5 లక్షల సంచులు వస్తాయి, ఆ రైతుకి గిట్టుబాటు ధర రూ॥20 వేల చొప్పున రావాల్సి ఉంది. కానీ అక్కడి అధికారులు రూ॥10 వేలకి మాత్రమే కొనడం జరుగుతుంది. దీనిపై కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణా నుంచి వచ్చిన రైతాంగం ఆందోళనకు దిగారు. ఆ రోజు 26 మంది మీద అబద్ధపు కేసులు పెట్టారు. ఈ కేసులు అన్యాయం, ఈ కేసులు విరమించమని ఏ పాలక పార్టీలు ఖండించలేదు. ఆదోని, మహబూబ్‌నగర్, బళ్ళారి ప్రాంతాలలో రైతాంగంపై ఈ కేసులు బనాయించారు. అయితే వీరందరిపై బెయిల్ తీసుకొని విడుదల చేయటానికి మా కర్ణాటక రైతు సంఘం కృషి చేసింది. కానీ రైతాంగం మీద ఎంతో ప్రేమ చూపిస్తున్నామన్న ప్రభుత్వం కేసులు ఉపసంహరించలేదు. అన్యాయం అని ఏ ప్రభుత్వం మాట్లాడటం లేదు. పాలకులు రైతాంగం మీద మీరు పోరాటం చేయవల్సిన అవసరం లేదని ప్రకటిస్తున్నారు. రైతాంగానికి 26 కోట్ల అప్పు ఉంది. 54 లక్షల కుటుంబాలకు అప్పుల రద్దు అంటూ మూడున్నర లక్షల కుటుంబాలు కర్ణాటక గ్రామీణ బ్యాంకు ముందు 9 నెలలు ధర్నా చేసాం. పోరాటం ఇంకా సాగుతుంది. 3 లక్షలు అప్పు తీసుకున్న రైతు 29 లక్షలు వడ్డీ కట్టాలని రైతులకి నోటీసులు ఇవ్వడం అన్యాయం, ఒక లక్ష తీసుకుంటే 10 లక్షల వడ్డీ వేశారు. ఉదయం వడ్డే శోభనాద్రీశ్వర రావు గారు మాట్లాడుతూ ప్రతి రైతుకు వడ్డీలేని, గ్యారంటీ లేని అప్పు లక్ష రూపాయిలకు ఇవ్వాలని చట్టం చేసారు. కానీ ఆ చట్టం అమలు కావటం లేదని చెప్పారు. సరిగ్గా ఇదే పరిస్థితి మా కర్ణాటకలో ఇప్పుడు సాగుతా ఉన్నది. అందుకే వడ్డీలని రద్దు చేసి అసలు మాత్రమే కడతామని మా రైతులు చేస్తున్న ఆందోళన. ఒక్కొక్క బ్యాంకు రైతాంగం తీసుకున్న అప్పుపై వడ్డీ రేట్లు పెంచుతున్నారు. కానీ మనం ఏఐకెఎంకెఎస్ తరపున అఖిల భారత స్థాయిలో రైతాంగానికి ఏ బ్యాంకులో అయిన ఒకే విధంగా వడ్డీ రేటు ఉండాలని మనం పోరాటం చేయాలని ఈ వేదిక నుండి మనం తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మేము కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా కర్ణాటకలో 450 కి.మీ వందలాదిమంది రైతాంగాన్ని కలుపుకొని పాదయాత్ర చేసాము. ఈ పాదయాత్ర మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుండి కూడా రైతు సంఘం నాయకులు వచ్చి ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ పాదయాత్రలో లక్ష కరపత్రాలు వేసి ఇంటింటికి విస్తృతమైన ప్రచారం చేసాము. మా కర్ణాటక రాజ్య రైతు సంఘం తరపున "ఆరంభ" అనే పత్రికను కన్నడలో తీసుకోస్తున్నాం. ఆ పత్రికను ఈ రోజు ఇక్కడ వేదిక మీద మీ అందరి ముందు విడుదల చేయడం మాకు సంతోషంగా ఉంది. మూడు సంచికలను ఆవిష్కరించాము. ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం మాకు ఎంతో ఉంది. పోరాటం ద్వారానే చైతన్యవంతం చేయగలుగుతాం. బిజెపి ప్రభుత్వం కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పుడే మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన సాగించింది. అప్పుడు కాంగ్రెస్ ప్రతిపక్ష నాయకులుగా ఉన్న ఇప్పటి ముఖ్యమంత్రి రైతాంగానికి మద్ధతు ధర కల్పిస్తామని ప్రకటించారు. ఎన్నికల్లో బిజెపి ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు మద్ధతు ధర ప్రకటించలేదు. ఎన్నికల్లో చేసిన తమ వాగ్దానాలు నిలబెట్టుకొని రైతాంగానికి సహాయపడే వైఖరిలో ఈ పాలకులు కూడా లేరని మాకు అర్ధమౌతున్నది. ఒక లక్ష రూపాయలు అప్పు తీసుకున్న రైతుకి 10 లక్షల వడ్డీతో కలిపి 11 లక్షలు కట్టవలసి వస్తుంది. ఇదికాక రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా రైతులకు రుణాలు ఇచ్చే సందర్భంగా కొన్ని నియమాలు ప్రకటించిందని చెబుతున్నారు. ఆ నియమాలు ఏంటో మనకు అర్థం కావు. రహస్యంగా ఉంచి రైతాంగాన్ని అప్పులపాలు చేస్తున్నారు. ఇంత వరకు అప్పులను రద్దు చేయలేదని, దాని కోసం పోరాటం చేస్తామని ముందే తెలియ జేస్తున్నాను. అలాగే ఒకరుకొకరు మన పోరాటాలకు మద్ధతుగా నిలబడుతూ ముందుకు సాగుదామని తెలుపుతూ ముగిస్తున్నాను.

**కా॥ నిరాకర్,**

చాషీమూలియా ఆదివాసీ సంఘం, ఒడిషా



కామ్రేడ్స్! రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభలకు వచ్చి అనేక విషయాలను తెలుసుకున్నాను, నేర్చుకున్నాను. ఈ రోజు మాకు ఒరిస్సాలో ఒక ప్రత్యేకమైన పరిస్థితి ఉంది. అది ఏంటంటే ఒరిస్సాకు సంబంధించిన ద్రౌపది ముర్ము రాష్ట్రపతిగా ఉన్నారు. ఇప్పుడు కొత్తగా ఈ ఎన్నికలు తర్వాత నరేంద్రమోడీ ఒరిస్సా ప్రాంతం నుంచి మరలా ఒక ఆదివాసీని ముఖ్యమంత్రిగా చేసాడు. ఎందుకు ఈ విధంగా ఆదివాసీలను ముఖ్యమంత్రిగా తీసుకురావటం, దేశానికి రాష్ట్రపతిగా తయారుచేయటం అంటే అది కావాలనే అడవుల్లో ఉండే ఖనిజ సంపదలను, సహజ సంపదలను అన్నింటినీ దోచుకు పోవటం కోసమే ఈ కుట్రపూరితమైన పనులు చేస్తున్నారు. కనుక ఆ సంపదంతా అటుపోతూ ఉంటే ఒరిస్సాలో ఉన్న అనేకమంది ఆదివాసీలు, రైతుకూలీలు అందరూ పనిలేక, కూలీలేక, భూమిలేక ఎక్కడెక్కడికో వలస పోతున్న పరిస్థితి ఉంది. ఇది మా ఒరిస్సాకు సంబంధించిన ప్రత్యేకమైన పరిస్థితి. ఒరిస్సా ప్రభుత్వం ఎంత కుట్రపూరితంగా ఉంది అంటే నన్ను 5సంవత్సరాలు జైలులో పెట్టింది. అయినా నేను ఆ నిర్బంధానికి భయపడలేదు. నిర్బదానికి నిలబడే మొత్తం ఈ రోజు అక్కడున్నటువంటి గంజాం, గజపతి నగరంలో ఉన్న సమస్యలను, ఒరిస్సా రాష్ట్రంలో ఉన్న అనేక రకాల సమస్యల మీద మేము చాషీమూలియా సంఘంగా అక్కడ పని చేస్తున్నాం. చాషీమూలియా సంఘంలో ఉన్న మా కామ్రేడ్స్ చాలా మంది మీద కేసులు పెట్టారు. ఒక కామ్రేడ్ అయితే సంవత్సరన్న రపైనే జైల్లో ఉన్నారు. ఇంకా కేసులు నడుస్తూనే ఉన్నాయి. అయినా కూడా మేము ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పాలకులు చేసేటు వంటి కుట్రలకు మేము లొంగే పరిస్థితే లేదు. కనుక ఈ రోజు మన అందరి ముందు ఉన్న విషయం ఏంటంటే మనకు పోరాటం తప్ప, సంఘర్షణ తప్ప మరొక మార్గం లేదు. ఆ మార్గంలోనే మనం వెళ్ళాల్సిన అవసరం ఉంది. అలాగే ఈ మహాసభలు విజయవంతం కావాలని కోరుకుంటూ ముగిస్తున్నాను.

## కా॥ షిండే సంజయ్,

మహారాష్ట్ర నాయకులు



కామ్రేడ్స్, ప్రభుత్వాలు చేపట్టిన ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలు, అలాగే డబ్ల్యూటివోలో భారత ప్రభుత్వం చేరిన తర్వాత వ్యవసాయరంగంలో సంక్షోభం మరింత పెరిగింది. వ్యవసాయ రంగంలో రైతాంగం, ఆత్మహత్యలు బాగా పెరిగాయి. అలాగే వ్యవసాయరంగంలో సామ్రాజ్యవాద కంపెనీల యొక్క దోపిడీ తీవ్రంగా పెరిగింది. మహారాష్ట్రలో పండించిన పంటలు ఏవైతే ఉన్నాయో ఆ పంటలు యొక్క ధరలు 20 సంవత్సరాల క్రితం నుండి పెసరపప్పు గానీ, సోయాబీన్ వంటి పంటల యొక్క ధరలు ఒక 100 రూపాయలు పెరిగాయే తప్ప మరొక రకంగా లేవు. ఈ రకంగా మహరాష్ట్రలో రైతాంగం తీవ్రంగా ఇబ్బందిపడుతున్నది. అట్లాగే జిఎస్‌టి కూడా సమస్యగా మారింది. అందుకని మహరాష్ట్రలో ఉన్న ఆజాసి ప్రాంతంలో కూడా పెద్ద పోరాటం జరుగుతుంది. ఆ ప్రాంతంలో భూములను 1/70 చట్టపరిధిలో ఉన్న భూముల్ని గిరిజనేతర ప్రజలకు ప్రభుత్వం ఇచ్చి వేసింది. దానిపై అక్కడి ఆదివాసీలు మేము చాలా కాలంగా పోరాటం సాగిస్తున్నాము. అందుకని ఏది ఏమైనప్పటికీ భవిష్యత్తులో మొత్తం భూమి సమస్య కోసం మనం అందరం ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. ఈ మహాసభలు విలువైన టువంటి అనుభవాల్ని, పాఠాల్ని ఇచ్చిందని తెలియజేస్తూ ముగిస్తున్నాను.

## కా॥ ప్రవీణ్, కిసాన్ ఏక్తా కేంద్ర, ఢిల్లీ



రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభల్ని ఒక ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహిస్తున్నటువంటి మీకందరికీ, రైతుకూలీ సంఘానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అలాగే మొత్తం ఢిల్లీ నుంచే కాకుండా ఉత్తర భారత రైతాంగం నుంచి కూడా ఈ మహాసభలకి నా అభినందనాలు తెలిజేస్తున్నాను. మొత్తం ఈ రోజు కేంద్ర ప్రభుత్వం రైతాంగం చేతుల్లో ఉన్న వ్యవసాయ భూమిని సామ్రాజ్య వాదులకు అప్పగిస్తున్నటువంటి పరిస్థితి ఈ రోజు మన దేశంలో ఉంది. అలాగే రైతాంగానికి ఇవ్వాల్సిన గిట్టుబాటు ధరకి సంబంధించిన దాంట్లో ఏ పంటకి కూడా కల్పించడం లేదు. 1991లో సామ్రాజ్య వాదులతో చేసుకున్న ఒప్పందాల వల్ల వ్యవసాయరంగం అనేది ఇంకా తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయి ఉంది. అదే విధంగా భగత్‌సింగ్ ఏదైతే చెప్పాడో, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపిచ్చాడో అదే అక్షరాల సత్యంగా ఉంది. దాన్ని ముందుకు తీసుకువెళాల్సిన అవసరం ఉంది. అలాగే జర్మనీ, ఫ్రాన్స్‌లోను ఈ రోజు, అనేక దేశాల్లోను ప్రజలు

సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా అక్కడ ఉన్న ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాలకు రోడ్లపైకి వస్తున్న పరిస్థితి ఉంది. కాబట్టి ఆ స్ఫూర్తితోటి మరింతగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెవెళ్లాల్సిన అవసరం ఉంది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు ముందుకు తీసుకువెళ్ళాలి, భూమి సమస్యలను కూడా ముందుకు తీసుకోవెళ్ళాల్సిన అవసరం ఉంది అని చెబుతూ ముగిస్తున్నాను.

## కా॥ హర్‌దేవ్ సింగ్ సంధు,

**కిర్తి కిసాన్ యూనియన్ (పంజాబ్)**

కీర్తి కిసాన్ యూనియన్ పంజాబ్ (AIKMKS అనుబంధం) తరపున నేను హర్‌దే సింగ్ సంధు రైతు కూలీ సంగం ఎపి నిర్వహిస్తున్న మహాసభకి హాజరు కావడానికి ఆహ్వానం అందుకోవడం సంతోషంగా భావిస్తున్నాను.

సామ్రాజ్యవాదం నుండి రైతాంగం తమను తాము ఎలా రక్షించుకోవాలో, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ఎలా జయప్రదం చేయాలో, దానిపై దేశంలోని, ప్రపంచంలోని శ్రామిక ప్రజానీకం ఆలోచిస్తున్న సమయంలో ఈ మహాసభ జరుగుతుంది. అందుకే దీనికి ప్రాముఖ్యత ఉంది. నేను లేక, మా ప్రతినిధి బృందం మహాసభలో పాల్గొనాలని కోరుకున్నాము. కానీ మా పంజాబ్ సమస్యల కారణంగా మేము పాల్గొన లేకపోతున్నందుకు చింతిస్తున్నాము. మహాసభ విజయవంత మవ్వాలని, కొత్త కార్యవర్గం ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలను ముందుకు నడిపిస్తుందని ఆశిస్తున్నాము.

> ‘భూమి-ప్రకృతితో మానవుల సంబంధాలు ఒక హేతుబద్ధమైన పద్ధతిలో (సమ సమాజంలో -అను) పునఃనిర్మించబడిన తరువాత బానిసత్వ వ్యవస్థ మాదిరిగానో, భూస్వామ్య పెత్తందారీ విధానం మాదిరిగానో, వ్యక్తిగత ఆస్తి అనే అర్థంలేని ప్రాతిపదికనో కాకుండా.... మనిషికి, భూమికి మధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది. ఎందుకంటే ఈ వ్యవస్థలో భూమి సరుకుగా పరగిణించబడదు గనుక!
>
> **- ‘పర్యావరణం’పై మార్క్స్**


*With Best Compliments From....*

K. Siva
Managing Partner

GST No : 37ACIFS3627H1ZW

50th ANNIVERSARY 1974-2024

98483 65601(Siva)
87909 45909 (Factory)
98661 70851(NNR)

SASIREKHA AGENCIES

Manufacturers of : Industrial & Medical Oxygen Gas
Carbondioxide ($CO_2$)



Welding Rods, Welding Accessories
Gas Cutting Equipments, Bolts & Nuts



Plot No. 214 & 215, Industrial Growth Centre, GUNDLAPALLI.
Regd. Off : D.No. 37-1-165(11), Guntur Road, ONGOLE - 523 002.

# సోదర సంఘాల ప్రతినిధుల సందేశాలు


## కా॥ గణేష్ పండా,

రాష్ట్ర అధ్యక్షులు, ఎఐఎఫ్‌టియు (న్యూ)




రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన ప్రతినిధులకు, వేదికపై ఉన్న అధ్యక్షవర్గానికి ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర కార్యవర్గం తరపున నా అభినందనలు.

గత రెండు రోజులుగా ఇక్కడ అనేక విషయాలు చర్చకు వచ్చాయి. మన దేశంలో పరిస్థితి ఎలా ఉంది అని మనం చూసుకుంటే, మనది చాలా పెద్ద ప్రజాస్వామ్య దేశమని అందరూ అంటారు. మొన్ననే ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగాయని కూడా అంటారు. ప్రతి ఎన్నికల సందర్భంగా ఎకరో ఒకళ్ళు గెలిచి అధికారంలోకి వస్తారు. మిగిలిన వాళ్ళు ఓడిపోతారు. ఇది సాధారణమే. కానీ, మొన్న జరిగిన ఎన్నికల్లో ఇప్పుడు అధికారంలోకి వచ్చిన వాళ్ళు గానీ, నిన్నటి దాకా అధికారంలో ఉన్నవాళ్ళుగానీ రైతుల సమస్యలు ఏంటి, కార్మికుల సమస్యలు ఏంటి అని ఎవరూ కూడా మాట్లాడలేదు. నిరుద్యోగ సమస్య గురించి మాట్లాడలేదు. అంతే కాదు ప్రజలు ఎదుర్కొంటున్న ఏ మౌలిక సమస్యనూ వారు ప్రస్తావించలేదు. ఎన్నికలు జరిగిపోయాయి. గద్దెనెక్కిన వాళ్ళు ఎక్కేసారు. ఈ ఎన్నికల పట్ల ప్రజలకున్న భ్రమలు ఒక్కొక్కటిగా తొలిగిపోతున్నాయి. ఎవరు గెలిచినా మన కష్టాలు తీరేవికావు. కాబట్టి ఓటుకు నాలుగువేలు ఇచ్చారా, మూడువేలు ఇచ్చారా, ఈ సందర్భంగా ఎంతోకొంత డబ్బు రాబట్టుకుందామనే ఆలోచనలోనే చాలా మంది ఉన్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా వారికేమీ సంబంధం లేదనే స్థాయికి పరిస్థితి చేరిందంటే ఇక్కడ ప్రజాస్వామ్యం ఎంత దిగజారిందో మనం అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రభుత్వాల మీద ప్రజలకి ఏ మాత్రం భ్రమలు లేవు. ఎందుకంటే రైతాంగానికి ఉపయోగపడే సూచనలు కొన్నిటిని స్వామినాథన్ కమిషన్ సూచించింది. 2014 ఎన్నికల సందర్భంగా తాము గనక అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషనే సిఫారసులను తప్పకుండా అమలు చేస్తామని నరేంద్ర మోడీ వాగ్దానాలు కురిపించాడు. పదేళ్ళు అధికారంలో ఉన్నాడు. ఇప్పుడు మూడవసారి కూడా అధికారంలోకి వచ్చాడు. కానీ తాను చేసిన వాగ్దానాల గురించి మాట్లాడడం, వాటిని అమలు చేయడు. భారతదేశానికి స్వతంత్రం వచ్చిన నాటి నుండి పాలకులు అనేక హామీలు ఇచ్చుకుంటూ వచ్చారు. 1956లో మనకొక పారిశ్రామిక విధానం అనేదాన్ని ప్రకటించారు. 1957లో కనీస వేతనం కార్మికులకు ఎలా అమలు చేయాలి అని ఆనాటి ఉప ప్రధాని గుల్బారీలాల్ నందా నాయకత్వంలో ఒక కమిటీ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో కార్మికుడు అంటే అతని కుటుంబంతో సహా బ్రతకటానికి, ఇతర అవసరాల కోసం కనీస వేతనాన్ని అమలుచేయాలని ఒక తీర్మానం చేశారు. ఆనాటి నుండి ఈ నాటి వరకు కేంద్రంలోగానీ, రాష్ట్రాల్లోగానీ ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా, కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చినా ఎక్కడా కనీస వేతనమన్నది అమలు జరగనే లేదు. స్వాతంత్ర్యం వచ్చిందని చెబుతున్న 76 సంవత్సరాల తర్వాత కూడా నేటికీ కనీసవేతనం అమలుచెయ్యమని కార్మికులు కోరుతున్నారంటే ఎంత సిగ్గుచేటైన పరిస్థితి. కానీ ఇదే ఈ దేశపు కార్మికుల దుస్థితి కారణం. ఇక్కడే పరిపాలన సాగించిన, సాగిస్తున్న పాలకవర్గాలే అనేది స్పష్టం.

రైతాంగానికి గిట్టుబాటు ధర కావాలి. ఎవరినైనా అడగండి అది సబబేనని అంటారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చాలా ఏళ్ళకు, చాలా ఆలస్యంగా కేంద్ర ప్రభుత్వం 2006 సంవత్సరంలో గిట్టుబాటు ధర, రైతాంగం ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై డా॥ సామినాథన్ నాయకత్వాన ఒక కమిషన్ ఏర్పాటు చేసింది. వాటిని ఈ నాటికీ అమలు చేయలేదు. పైగా రైతాంగానికి, దేశ ప్రజానీకానికి ఎంతో హానికరమైన మూడు వ్యవసాయ నల్లచట్టాలను మోడీ ప్రభుత్వం చేసింది. రైతాంగం ఎంత ఆందోళన చేసినా వాటిని ఉపసంహరించబోనని భీష్మించిన మోడీ ఉత్తర భారత రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే వాటిని ఉపసంహరించుకుంటున్నానని ప్రకటించి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాడు.

మన రాష్ట్రంలో పరిస్థితి చూద్దాం. ఏలూరు పట్టణానికి సంబంధించి శ్రీకృష్ణ జూట్ మిల్లు ఉంది. ఇక్కడ సుమారు 5 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ జూట్ మిల్లు ఈ రోజు మూతపడింది. హనుమాన్ జంక్షన్‌లో ఉన్న జూట్ మిల్లు మూతపడింది. అక్కడ 3 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. అంటే ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలో రెండు జూట్ మిల్లులు మూతపడి 8 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. అంటే వాళ్ళ కుటుంబాలతో కలిపి మొత్తం సుమారు నలభైవేల మంది రోడ్డున పడ్డారు. ఇది మాత్రమే కాదు. చక్కెర మిల్లుల పరిస్థితి కూడా అదే. అన్నీ మూసివేతలే.

వ్యవసాయంలో వచ్చే ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమలు స్థాపిస్తే అభివృద్ధి జరుగుతుంది. ప్రజల జీవితాల్లో మేలైన మార్పులు వస్తాయి. కానీ ఏ రాజకీయ పార్టీకి కూడా ఇది పట్టదం లేదు. విజయనగరం జిల్లాలో 13 మిల్లులు మూతబడ్డాయి. 30 వేలమంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. జూట్ మిల్లులు మూతబడుతున్నాయి సరే, మరి జూట్ వినియోగం తగ్గిందా అంటే తగ్గలేదు. జ్యూట్ బ్యాగుల వాడకం బాగా పెరిగింది. ఎక్కడి నుంచి ఇవన్నీ వస్తున్నాయని చూస్తే ఇవి విదేశాల నుండి దిగుమతి అవుతున్నాయి. ఎఫ్‌సిఐలో కాంట్రాక్టు తీసుకుని బయట నుండి గోనెసంచులు తెప్పించి సరఫరా చేస్తున్నారు. ఇక్కడి మిల్లులు మూతబడటానికి ఇదే కారణం. పంచదార మిల్లులు మూతబడ్డాయి. ఆ కార్మికులు రోడ్డున పడ్డారు. దేశం మొత్తం మీద ఇదే పరిస్థితి. ఆయిల్ మిల్లులదీ అదే దారి. బయట నుండి సరుకు తెచ్చి రిఫైన్ చెయ్యటంతో మన ఆయిల్ మిల్లులన్నిటినీ మూతబడేశారు. కార్మికుల దుస్థితికి ప్రధాన కారణాలివే. పరిశ్రమలను అభివృద్ధి చేయాల్సింది పోయి, ఉన్నవాటిని కూడా మూసివేసి సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను నెరవేర్చే పనిలో మన దళారీ పాలకులు ఈ 76 సంవత్సరాలుగా ఈ పాలకులను మనం చూస్తూనే ఉన్నాం. వ్యసాయం అభివృద్ధి కావటం లేదు. పరిశ్రమలు అభివృద్ధి కావటం లేదు. నిరుద్యోగం పెరిగిపోతోంది. కనుక, ఇక్కడ ఒక విషయం స్పష్టం. ఈ పాలకులతో ఏ సమస్యా పరిష్కారం కాదు. కార్మికులు, కర్షకులు అందరూ కలిసి పోరాడి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయటమే మన కర్తవ్యం. అప్పుడు మాత్రమే మనమెదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. మనకు అది మినహా మరో దారి లేదు. ఇది దృష్టిలో పెట్టుకుని ఈ రైతుకూలీ సంఘం మహాసభ సరైన తీర్మానాలు చేస్తుందని, భవిష్యత్ కర్తవ్యాలు రూపొందిస్తుందని ఆశిస్తూ, నాకీ అవకాశం ఇచ్చిన వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

## కా॥ బి.అరుణ,

ప్రధాన కార్యదర్శి, జనసాహితి



సామ్రాజ్యవాద కబంద హస్తాల నుండి వ్యవసాయరంగాన్ని పరిరక్షించు కుందామని, మన సహజ సంపద పై హక్కు దేశప్రజలదే అంటూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులకి, ఇతర ప్రజాసంఘాల నాయకులకు, రైతు సంఘాల నాయకులకు, వేదిక మీదున్న పెద్దలకు అందరికీ జనసాహితి తరపున అభినందనలు. ఈ మహాసభ విజయవంతం కావాలని జనసాహితి శుభాకాంక్షలు తెలియజేస్తున్నది.

మిత్రులారా! ఈ రెండు రోజుల నుంచి వ్యవసాయరంగ సంక్షోభం గురించి చాలా విషయాలు ఇక్కడ మాట్లాడారు. వ్యవసాయ రంగంలో సంక్షోభం గురించి గిట్టుబాటు ధరను చట్టబద్ధం చేయటం గురించి అలాగే గ్రామీణ జీవన విధ్వంసం గురించి, నిరుద్యోగం గురించి, చదువుకున్న యువత ఈ రోజు నిరుద్యోగ బారినపడటం జరుగుతున్న సాంస్కృతిక సంక్షోభం గురించి కూడా ఇక్కడ మాట్లాడారు. వ్యవసాయాధారిత మన దేశంలో వ్యవసాయరంగ సంక్షోభం అంటేనే మన ప్రజా జీవిత సంక్షోభంగా ఇక్కడ మనం గుర్తించాలి. దాన్ని ఫలితంగానే ఇవాళ ప్రజల జీవితాల్లో వస్తున్న అనేక రకాలైన మార్పులు, ఇక్కడ జరుగుతున్న సాంస్కృతిక విధ్వంసం వీటన్నిటిని కూడా మనం మాట్లాడుకోవాలి, చర్చించుకోవాలి. ఈ సంక్షోభానికి కారణమైన పాలకులు విధానాల గురించి సరైన విశ్లేషణలు చేస్తూ కర్తవ్యాలను రూపొందించుకుంటూ ముందుకు సాగుతున్న రైతుకూలీ సంఘానికి జనసాహితి సంఘీభావాన్ని తెలియజేస్తున్నది.

ఈ 75 సంవత్సరాల కాలంలో ఆజాదీ కా అమృత మహోత్సవాలు నిర్వహిస్తూ పాలకులు మరొక 20 ఏళ్ళని అమృత కాలమంటూ ఆపత్కాలాన్ని ప్రకటించిన పాలకుల విధానాల్లో ఈ ప్రస్తుత కాలంలో మనము ఎటువంటి విధానాలను, ఎటువంటి సంక్షోభాలని ఎదుర్కొంటు న్నామన్నది మనందరికి కూడా గమనంలో ఉన్నది. ఇవాళ గ్రామీణ ప్రాంతాలలో కుటుంబాలన్నీ వలసల పేరుతోటి, శ్రమ దోపిడీతోటి పాలకులు పెంచి పోషిస్తున్న వైషమ్యాలతోటి ఛిన్నాభిన్న మైపోయి ఉన్నాయి. చదువుకుంటున్న పిల్లలు, విద్యార్థి యువకులు అందరూ సంస్కృతికి బలైపోతూ ఉన్నారు. పబ్‌లు, రేవ్ పార్టీలు, పోర్న్‌సైటులు రకరకాల పేర్లతో సాంస్కృతిక సంక్షోభం వెదజల్లబడుతోంది. ఈ సాంస్కృతిక సంక్షోభానికి మూలాలు వ్యవసాయరంగంలో సంక్షోభంలో ఉన్నాయి. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయన్నది మనం గమనంలో ఉంచుకోవాలి. మిత్రులారా! ఈ వర్గ సమాజం ఉన్నంతవరకు, సమాజం రెండుగా విభజింపబడి ఒకరు పీడింపబడే వాళ్ళుగా, మరొకరు పీడితులుగా కొనసాగుతున్న వర్గ సమాజం ఉన్నంత వరకు రకరకాల రూపాల్లో దోపిడీ చేయడానికి అనేక రకాలైన సంక్షోభాలను దోపిడీ వర్గాలు సృష్టిస్తున్నారు. వీటికి వ్యతిరేకంగా మేము ప్రజల సాహిత్యాన్ని సృష్టిస్తూ ముందుకు సాగుతున్నాం. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం నిర్వహిస్తున్న ఈ రాష్ట్ర మహాసభల్లో తీసుకోబోయే కర్తవ్యాలకు సంఘీభావంగా మేము కూడా నడుస్తామని చెప్తూ చివరగా పుడమికి చావు లేదు, పవనానికి చావులేదు, నీటికి చావు లేదు, ప్రజల హృదయ స్పందనకు చావులేదు. అది ఆకాశపు వాస్తవ యుగాన్ని అన్వేషిస్తుంది. ప్రజలు మరణించరు. సెలవు.

## కా॥ ఎం.లక్ష్మి,

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్త్రీ విముక్తి సంఘటన



అధ్యక్షులు, వేదిక మీదున్న రైతుకూలీ సంఘం నాయకులు, రాష్ట్రం, దేశం నలుమూలల నుంచి వచ్చిన కామ్రేడ్స్ అందరికీ స్త్రీ విముక్తి సంఘటన తరపున అభినందనలు తెలియజేస్తున్నాను.

కామ్రేడ్స్! గత రైతాంగ పోరాటాలు, ఆదివాసీ తిరుగుబాట్లు, అవి అందించిన అనుభవాలను పోరాటాల స్ఫూర్తిని, ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ, వర్గ దృక్పథంతో రైతాంగ పోరాటాల్ని, ఆదివాసీ పోరాటాల్ని కొనసాగిస్తూ, ఈ మహాసభలను ఒక ఉత్తేజపూరితమైన వాతావరణంలో జరుపుకుంటున్న రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)కు స్త్రీ విముక్తి సంఘటన తరపున అభినందనలు తెలియజేస్తున్నాను. రెండు రోజులుగా మనం వ్యవసాయరంగం ఎంత తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టబడిందో, ఈ సంక్షోభంలోకి నెట్టబడటానికి దశబ్దాలుగా పాలకులు అనుసరిస్తున్న విధానాలు ఎలా కారణమవుతున్నాయో ఇక్కడ వివరించారు. అధికారంలోకి వస్తున్న పాలకులందరూ వ్యవసాయరంగంలో అనుసరిస్తున్న భూస్వామ్య, సామ్రాజ్యవాద అనుకూల విధానాలను పర్యవసానాల గురించి ముందు మాట్లాడిన కామ్రేడ్స్ వక్తలందరూ చర్చించారు.

మనం 1991లో నూతన ఆర్థిక విధానాల ప్రవేశం తర్వాత సామ్రాజ్యవాద కంపెనీల చొరబాటు, వాటి ఆధిపత్యం ఎంత తీవ్రంగా ఉందో వాటి ఫలితాలు ఈ రోజు మనం ప్రత్యక్షంగా అనుభవిస్తున్నాం. గ్రామీణ జీవన విధ్వంసం యొక్క తీవ్రత ఫలితంగా వలసల బాట పట్టిన ఏ మనిషిని కదిలించి వారి జీవితంలో ఉన్న విషాదం, వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయి. ఆ సంక్షోభం అంతా ఈ రోజు పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న లక్షలాదిమంది వలస కూలీలను చూస్తే అర్థమవుతుంది. కిక్కిరిసిన ప్రాంతాల్లో కనీసమైన గాలీ, వెలుతురు లేనటువంటి ప్రాంతాల్లో చిన్న చిన్న గుడారాలు వేసుకుని వందలకొలదీ ఇవాళ పట్టణ ప్రాంతాల్లో చిన్న చిన్న పరిశ్రమల వద్ద బహుళజాతి కంపెనీల వద్ద, పెద్ద షాపింగ్‌మాల్స్‌లో, రకరకాల చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ, వృత్తులు చేసుకుంటూ చావలేక బతుకుతున్న జీవితాలు ఈ రోజు మనకు కనిపిస్తున్నాయి. గ్రామాలను వదిలి పెట్టడం అంత తేలికేమీ కాదు. ఎందుకంటే ఉన్న ఊరుని తమకు ఉన్నటువంటి చిన్నపాటి ఉపాధినైనా సరే వదిలిపెట్టి ఈ రోజు దుర్భరమైన జీవితాలు గడపటం వెనుక తీవ్రమైన సంక్షోభం, కడుపు కూడా నిండని దౌర్భగ్యమైన పరిస్థితి ఈ రోజు అనివార్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్ళేటువంటి పరిస్థితిని సృష్టించింది. అసంఘటిత రంగంలో వాళ్ళు నెట్టివేయబడ్డారు. ఈ అసంఘటిత రంగంలో బ్రాండిక్స్ కావచ్చు. బెంగుళూరులో ఉన్న పరిశ్రమలు కావచ్చు, మద్రాసులో ఉన్న తిరుపూర్ లాంటి ప్రాంతాల్లో పరిశ్రమలు కావచ్చు. దేశ వ్యాప్తంగా రకరకాల కంపెనీలు, జౌళి పరిశ్రమలు, బట్టలు తయారుచేసే కంపెనీలు. మన ఆంధ్రప్రదేశ్‌లో కదిరి లాంటి ప్రాంతాల్లో ప్యాంట్లు తయారుచేసే కంపెనీలలో లక్షలాది మంది మహిళలు ఈ రోజు దుర్భరమైన పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. ఆ కంపెనీలలో మహిళలనే ఎక్కువగా తీసుకుంటున్నారు. చిన్న చిన్న పిల్లల్ని, 15,16 సంవత్సరాల వయసు ఉన్నటువంటి ఆడపిల్లలు ఆ కంపెనీలలో పనిచేస్తున్నారు. వాళ్ళు 3, 4 ఏళ్ళు పనిచేసేటప్పటికి వాళ్ళ శరీరంలో ఉన్న శక్తులన్నీ ఇక ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. వాళ్ళను పీల్చిపిప్పి చేసి మళ్ళీ వాళ్ళు శ్రమ చేయడానికి వీలైనటువంటి పరిస్థితిని ఈ పాలకవర్గాలు కల్పిస్తున్నాయి. ఇదంతా ఉపాధి కల్పన, మహిళల అభివృద్ధి అని చెబుతున్నారు. ఇంతకన్నా దుర్మార్గం మరొకటి ఉంటుందా? రోజుకి 200, 300 రూపాయలు సంపాదనతో పురుషులు సంపాదన అంతా ప్రభుత్వం తీసుకొస్తున్న మద్యం విధానాల ఫలితంగా మొత్తం బ్రాందీ కొట్లకే తరలి వెళ్తుంటే తమకు వచ్చే చిన్న సంపాదనతోటి కుటుంబాలను నడుపుతూ, చావలేక బ్రతుకుతూ తమ బిడ్డల్ని ఎట్లా పెంచుకోవాలి, తమ జీవితాలు ఎలా ముందుకెళ్ళాలి, నిరంతరం అదే తపనతోటి ధ్యాసతోటి ఆ మహిళలు ఉంటున్నారు తప్ప, తమ గురించి. తమ జీవితం గురించి, ఆలోచించలేనటువంటి దౌర్భాగ్యమైన పరిస్థితుల్లో ఈ రోజు కష్టజీవులు, శ్రమజీవులు అయినా వాళ్ళు ఉన్నారు. ఈ రోజు వ్యవసాయరంగంలోనూ, పారిశ్రామిక రంగంలోనూ పాలకులు అనుసరిస్తున్న విధానాలే వీటన్నింటికీ కారణంగా ఉన్నాయి. కానీ ఏ పాలకులు కూడా ఎలక్షన్లలో గానీ, అంతకు ముందుగానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆలోచించు కోనివ్వకుండా ఎవరూ కూడా వ్యవసాయ రంగ సంక్షోభాన్ని మేం పరిష్కరిస్తాం, వ్యవసాయాధారిత పరిశ్రమలను మేము నెలకొల్పుతాం, ఈ దేశంలో చదువుకుంటున్న యువత శక్తుల్ని, నైపుణ్యాలన్నింటినీ వెలికితీసి దీన్నంతా దేశంలో సంపదలను పెంచుకోవడానికి ఉపయోగిస్తామని ఎవరూ మాట్లాడటం లేదు. ఎందుకు మాట్లాడటం లేదంటే మౌలికమైన విషయాల జోలికి

పాలకులెవ్వరూ వెళ్ళడానికి సిద్ధంగా లేరు. మన నూతన శక్తియుక్తులన్నీ, నైపుణ్యాలన్నీ వెలికితీసుకుని వస్తే వాళ్ళకు ఆలోచించే శక్తి వస్తే ఈ దోపిడీ పాలకవర్గాల యొక్క దుర్మార్గాలు, కుట్రలు అన్నీ బయటకు వస్తాయి. రాకుండా ఉండాలంటే మద్యం మత్తులో, రకరకాల డ్రగ్స్ మత్తులో ఈ రోజు యువతరాన్ని వారి శక్తియుక్తులన్నింటినీ నాశనం చేస్తున్నటువంటి పరిస్థితి ఉంది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన పాలకులు కూడా ఈ విషయాలను ఏమీ మాట్లాడ కుండా మీకు 3000 ఇస్తాం, 4000 ఇస్తామని చెప్పి నగదు బదిలీ గురించి, చిన్న చిన్న పథకాల గురించి మాట్లాడుతున్నారు తప్ప ఒక భూమి సమస్య గురించి ఒక ఎకరమో, రెండెకరాల్లో ఈ దేశంలో కష్టపడి పనిచేస్తున్న వాళ్ళందరికీ అందిస్తాము, సాగు, తాగునీళ్ళు అందిస్తాము. అందరికీ ఉచితంగా విద్య, వైద్యం అందిస్తాము అనేటువంటి మౌలికమైన విషయాల జోలికి పాలకులు వెళ్ళనటువంటి పరిస్థితి ఉంది. మనల్ని, మన వెతల్ని ఎవరు అధికారంలోకి వస్తున్నారు? వీరికంటే వాళ్ళు మేలా? లేకపోతే వాళ్ళ కంటే వీళ్ళు మేలా అనేటువంటి ఆలోచనలే తప్ప ప్రజలను పాలకవర్గాలు భూస్వామ్య శక్తులకు, ఈ రోజు ఆదానీ, అంబానీలాంటి కార్పోరేటు శక్తులకు, సామ్రాజ్యవాద దోపిడీకి అనుకూలంగా అనుసరిస్తున్న విధానాలు ఏంటి? ఆ విధానాల్లో మన శ్రమని, శ్రమశక్తుల్ని, ఖనిజ సంపదల్ని మనకున్నటు వంటి అన్ని వనరుల్ని వాళ్లు ఎలా దోచుకోవడానికి పాలకులెలా తోడ్పడు తున్నారు, వాళ్ళ విధానాలు ఎలా ఉంటున్నాయి అనే విషయాలను మనం ఆలోచించకుండా మన మెదళ్ళను మభ్యపరుస్తూ మీకు నాలుగురెట్లు ఎక్కువిస్తాం. మీరు వాటి తోటి సర్దుకోండి, మీ జీవితాలు ఇంతే, మీ ఖర్మ, రాత ఇంతే అన్నటువంటి ఆలోచనలను రేకెత్తించగలిగిన ఒక వాతావరణం కల్పిస్తున్నారు. ఎన్నికల తర్వాత ఎన్నికలు వస్తూ ఉన్నాయి. వాటి చుట్టూ కాలయాపన చేస్తూ ప్రజల మెదళ్ళను మభ్యపరస్తూ కులోన్మాదాన్ని, మతోన్మాదాన్ని రెచ్చ గొడుతున్న పాలక విధానాలకు వ్యతిరేకంగా, దోపిడీ శక్తులు వ్యవసాయ రంగంలో చేస్తున్న వ్యతిరేకంగా సుదీర్ఘమైన పోరాటాలను కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఆ క్రమంలో రైతుకూలీ సంఘం ముందుకు సాగుతూ ఉంది. ఉద్యమ వాతావరణాన్ని, ఉద్యమ చైతన్యాన్ని అందిస్తూ ఉంది. రైతుకూలీ సంఘం మహిళలను సమీక రించటంలో, ఆదివాసీ పోరాటాల్లో చాలా ముందు ఉంది. ఈ సమాజానికి ఒక స్ఫూర్తి దాయకమైన చైతన్యాన్ని అందిస్తోంది. దాన్ని అందిపుచ్చుకుని అందరం పోరాటబాటలో సాగాల్సిన అవసరం ఉంది. స్త్రీ విముక్తి సంఘటనగా రైతుకూలీ సంఘం ఉద్యమాల నుంచి స్ఫూర్తిని పొందుతూ, కలిసి నడుస్తామని చెప్పి తెలియజేస్తూ ఈ అవకాశమిచ్చిన అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

## కా॥ వి. హనుమంతరావు,

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపిడిఆర్)

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఏలూరు పట్టణంలో నిర్వహిస్తున్న మహాసభలకు హాజరైన రైతుకూలీ సంఘం నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు, పుర ప్రముఖులు, మిత్రులు, సౌహార్ద ప్రతినిధులు అందరికీ ఓపిడిఆర్ రాష్ట్ర కమిటీ పక్షాన ఉద్యమాభి నందనలు. అనివార్య కారణాల వల్ల ప్రతినిధుల సభకు హాజరు కాలేకపోతు న్నందున వ్రాతపూర్వకమైన సందేశాన్ని సభకు పంపిస్తున్నాం.

మిత్రులారా, చారిత్రకంగా ప్రగతిశీల ఉద్యమాలకు కేంద్రంగా ఉన్న ఏలూరు పట్టణంలో రైతు కూలీ సంఘం మహాసభలను నిర్వహించుకోవడం ఎంతైనా అభినందనీయమైన అంశము.

కామ్రేడ్స్, నేడు రాష్ట్రంలోనూ, దేశంలోనూ వ్యవసాయ రంగం మరియు దాని అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, చేపల పెంపకం, రొయ్యల పెంపకం, చేనేత పరిశ్రమ ఇత్యాది రంగాలు మొత్తంగా సంక్షోభంలో ఉన్నాయనే విషయం ఆయా రంగాలను గమనిస్తున్న ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. రైతులు ప్రధానంగా సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులు సాగు గిట్టుబాటుగాక రుణగ్రస్తమై పోతున్నారు. గ్రామీణ రుణ గ్రస్తత క్రమక్రమంగా పెరిగిపోతున్న విషయం ప్రభుత్వ గణంకాలే తెలియజేస్తున్నాయి. ఈ పరిస్థితులను మెరుగుపర్చకపోవడంతో రైతు నిర్లిప్తతకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్న వాస్తవం మన కళ్ళ ముందు ఉంది. వ్యవసాయ పద్ధతుల్లో ప్రభుత్వం తెచ్చిన మార్పుల ఫలితంగా సాగులో ఎరువులు, పురుగు మందుల వాడకం పెరిగిపోయింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు రైతుకు అందుబాటులో లేకుండా పోయి, ప్రభుత్వం వ్యవసాయరంగానికి ఇచ్చే రాయితీలను క్రమక్రమంగా తగ్గించి వేయడంతో రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కాకుండా పోయింది. ఇట్టి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతుకు గిట్టుబాటు ధర అందించే ప్రయత్నం చేయాలి. కానీ అలా జరగకపోగా ప్రభుత్వం రైతుల కోసం అంటూ తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు రైతు వెన్ను విరిచేవిగా ఉన్నాయి. కార్పొరేట్ రంగానికి వ్యవసాయ ఉత్పత్తులను, వ్యవసాయ భూమిని కట్టబెట్టే ప్రయత్నమే ఈ మూడు వ్యవసాయ చట్టాలు. దేశవ్యాప్తంగా ముఖ్యంగా పంజాబ్, హర్యానా ఉత్తరప్రదేశ్ రైతులు నిలకడగా సాగించిన పోరాటం వల్ల ఆ చట్టాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోక తప్పలేదు.

దేశంలో ఈనాటికి వ్యవసాయ రంగమే మెజారిటీ ప్రజానీకానికి జీవనాధారమైన రంగం. అట్టి రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ప్రభుత్వం కార్పొరేట్ పెద్దల సంపద పెంచడానికి వ్యవసాయ భూమిని, అటవీ భూగర్భ సంపదను ఆ పెద్దలకే కట్టబెట్టే విధంగా విధానాలను రూపొందిస్తున్న విషయం మన ముందున్న వాస్తవం. ఉదాహరణకు జీవవైవిధ్య (సంరక్షణ) చట్టం 2023, అటవీ (సంరక్షణ) సవరణ చట్టం

2023 మొదలైనవి పేరుకి రక్షణ చట్టాలే, కానీ అవి అడవుల్ని, ఆదివాసుల హక్కులను భక్షించే చట్టాలు. కార్పొరేట్లకు అటవీ సంపదను, భూములను దోచి పెట్టే చట్టాలు. కనుక మిత్రులారా ప్రభుత్వం తీయని మాటలతో రైతుల, ఆదివాసుల హక్కులను రక్షిస్తామని చెబుతూ వారి భూములను సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేస్తున్నది.

ఈ సమకాలీన సందర్భంలో జరుగుతున్న ఈ మహాసభలు రైతాంగం వారితో పాటు అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలు, దళితులు, ఆదివాసీలు మొదలగు ప్రజానీకం యొక్క సమస్యలపై ఫలవంతమైన చర్చను సాగిస్తుందని, సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల రక్షణకు డిమాండ్స్‌ను రూపొందించి ప్రభుత్వం పెడుతుందని ఆశిస్తున్నాను. సభలు విజయవంతంగా సాగాలని కోరుకుంటూ ఈ చిన్న సందేశం ఇచ్చే అవకాశాన్ని కల్పించిన మిత్రులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

## కా॥ ఎన్.భాస్కర్,

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నవయువసమాఖ్య



కామ్రేడ్స్! గత 2 రోజుల నుంచి కూడా ఇక్కడ ఉత్తేజకరమైన వాతావరణం ఉంది. రైతుకూలీ సంఘం ఇక్కడ రాష్ట్ర మహాసభలను జరుపుతుంది. మొన్న జరిగిన ప్రదర్శనలో ఏలూరు పట్టణమంతా ఎరుపెక్కింది. ఎవరైతే దోపిడీకి గురి కాబడుతున్నారో వారి పక్షాన ఎర్రజెండా పట్టుకుని మేమున్నామంటూ పీడిత పక్షాల కోసం కదిలివస్తున్నారా అన్నట్టు జరిగింది ఆ ప్రదర్శన. నిన్న జరిగిన చర్చావేదికలో సంక్షోభం, వ్యవసాయరంగాన్ని కార్పోరేటు శక్తులు ఎలా కబళిస్తున్నారు, విదేశీ సామ్రాజ్యవాద శక్తుల దోపిడీ ఏంటనే విషయాలుగానీ, భూమి ఎంతటి కీలకమైనది అనే చాలా ముఖ్యమైన విషయాలను ఈ మహాసభల సందర్భంగా మాట్లాడటం జరిగింది.

ఈ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్న రైతుకూలీ సంఘానికి నవయువ సమాఖ్య తరపున విప్లవాభినందనలు. ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన దేశంగా భారతదేశం ఉంది. కానీ ఈ భారతదేశంలో విద్యార్థులకు సరైన విద్యలేదు. 5 సంవత్సరాలలోపు పిల్లలు ప్రపంచంలో ఎక్కువగా మన భారత దేశంలోనే చనిపోతున్నారు. పౌష్టికాహారం అందించడంలో భాగంగా అనేక పథకాలు తీసుకొస్తున్నామని చెప్పి అనేక పథకాలు ప్రభుత్వాలు ఈ దేశంలో అధికారంలోకి వస్తున్న ప్రవేశపెడుతున్నామని చెబుతున్నా పిల్లలకు సరైన పౌష్టికాహారం లేదు. డిగ్రీలు, పీజీలు ఎన్ని చేసినాసరే సరైన ఉపాధిని కల్పించలేని, చేతకాని పాలకులు ఈ దేశంలో మనకు కనబడుతున్నారు. ప్రజల సమస్యల గురించికాని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి కాని, వారి జీవిత సమస్యల గురించి వారిని ఆలోచించనివ్వటంలేదు. మన పాలకవర్గాలు వాటిని వెనక ఉండి నడిపిస్తున్న కార్పోరేటు శక్తులు, విదేశీ సామ్రాజ్యవాదులు విద్యార్థుల్ని రకరకాల తప్పుడు దారుల్లోకి నెడుతున్న పరిస్థితి ఉంది. ఈ రోజు పబ్జీలు, ఫ్రీఫైర్ గేమ్‌ల పేరుతో ఒక రకంగా చేస్తుంటే స్నాప్‌చాట్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఇలా రకరకాల సోషల్ మీడియాల్లో ఒకరకంగా చేస్తుంటే, సినిమాల్లో నాలుగు ఫైట్లు, ముద్దుసీన్లు, చనిపోవడం లేదా విడిపోవడం వంటివన్నీ ఈ సినిమాలు చూపిస్తున్నాయి. అలాగే గ్రామాల్లో, పట్టణాల్లో ఏజెన్సీ ఏరియాలో ప్రతీఏటా గంజాయి అనేది విపరీతంగా అమ్ముతున్న పరిస్థితి. గంజాయిని సిగరెట్ల రూపంలోనూ, చిన్న చిన్న చాక్లెట్ల రూపంలో కొద్ది కొద్దిగా విద్యార్థి యువతలోకి తీసుకువెళ్తున్న పరిస్థితి ఉంది. యువతలోకి విపరీతంగా డ్రగ్స్‌ని అలవాటు చేస్తున్న పరిస్థితి ఉంది. అంటే అన్ని రూపాల్లోనూ విద్యార్థులను, యువకులను వారి సమస్యల కోసం, బతుకు పోరాటం కోసం, ఉపాధి కోసం ఆలోచించనివ్వకుండా మొద్దుబారుస్తున్న పరిస్థితి ఈ రోజు మనకు కనబడుతుంది. వారి జీవితాలు ఇలాంటి దురలవాట్లతో ఖచ్చితంగా కొట్టుకుపోతున్న పరిస్థితి ఉంది. కాబట్టి వచ్చే భవిష్యత్తు తరాలు ఏమవుతాయి అనే భయం ఈ రోజు మధ్యతరగతి మేధావుల్లో గాని, వెనుకబడిన కుటుంబాల్లో గాని అందరిలో కూడా ఆ భయం కనబడుతుంది. యువతకు సంబంధించిన దాంట్లో చూసినప్పుడు నిరుద్యోగ సమస్యను ఎన్ని పార్టీలు మారినా, ఎన్ని ప్రభుత్వాలు మారినా సరే మీకు ఉద్యోగాలు కల్పిస్తాం అని చెప్పి మాట్లాడుతున్నారు. కానీ ఈ పాలకులెవరూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించటానికి పూనుకోవటం లేదు. వారికి ఆ ఉద్దేశం కూడా లేదు. నిరాశలో కూరుకుపోయిన నిరుద్యోగ యువతరం ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితి దాపురించింది. యువత తమ సమస్యలకు కారణాలను తెలుసుకుని వాటిపై పోరాటం చేయాల్సిన చైతన్యాన్ని పెంపొందించుకోవాలి. ఆ వైపుగా మేం కృషి సాగిస్తున్నాం. రైతుకూలీ సంఘం నిర్మించే ఉద్యమాలకు సంఘీభావంగా నిలుస్తామని తెలియజేస్తూ నాకీ అవకాశం ఇచ్చిన వారికీ ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

## కా॥ ఎల్.భాను,

రాష్ట్ర కోశాధికారి, పిడిఎస్ఓ



రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన ప్రతినిధులకు, రైతుకూలీ సంఘం నాయకులకు, వేదిక మీదున్న పెద్దలకు పిడిఎస్ఓ రాష్ట్ర కమిటీ తరపున విప్లవాభినందనలు తెలియజేస్తున్నాను.

గత రెండు రోజులుగా రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా అనేక అంశాల మీద చర్చించుకుంటున్నాం. ఈ దేశపు వల్లగింజను వలిచి చూస్తే రైతు అస్థిపంజరం కనిపిస్తుంది అని అలిశెట్టి ప్రభాకర్ గారు చెప్పారు. అంటే ఈ దేశంలో రైతుల పరిస్థితి ఎలా ఉంది, సంక్షోభం ఎంత ప్రభావం చూపుతుంది అనే విషయాన్ని ఈ ఒక్క వాక్యంలో అలిశెట్టి ప్రభాకర్‌గారు చెప్పారు. ఈ దేశంలో దాదాపు 70 శాతం మంది ప్రజలు ఇంకా ఇప్పటికీ వ్యవసాయ రంగం మీదే ఆధారపడి జీవిస్తున్నారు. అలాగే ప్రపంచానికి తిండి పెట్టగల భూములు ఈ దేశంలో ఉన్నాయి. కానీ ఎలాంటి పరిస్థితుల్లో రైతులున్నారు అనే దాన్ని చూసుకుంటే 2014 నుంచి 2022 లోపు కొన్ని గణాంకాల ప్రకారం లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ విధంగా రైతులు, రైతుకూలీలు నిరంతరం వ్యవసాయం మీద ఆధారపడి, కష్టపడుతూ ఎక్కడైతే వ్యవసాయం చేస్తున్నారో ఆ భూముల్లోనే అక్కడున్న చెట్లకే ఉరివేసుకుని, పురుగుమందులను తాగి ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితుల్లో నేడు రైతులున్నారు. కానీ ఈ దేశంలో స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు గడుస్తున్నప్పటికీ, దేశంలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ మన పాలకులెవ్వరూ కూడా దాన్ని అభివృద్ధి చేయడానికి ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు వ్యవసాయరంగం నుంచి బయటకు వచ్చి పట్టణ ప్రాంతాలకు వలస వెళుతూ అక్కడ చిన్నాచితకా పనులు చేసుకుంటూ బ్రతుకుతున్న పరిస్థితి. సరైన ఆదాయం లేక వాళ్ళ పిల్లలను స్కూళ్ళకు పంపించలేక చదివించే స్థోమతలేక వాళ్ళందరూ బాలకార్మికులుగా మారుతున్నారు. ఈ దేశంలో ఉన్న 2 వేలకోట్ల మంది బాల కార్మికులలో చాలా మంది ఈ వలస కూలీల పిల్లలే 1991లో ప్రైవేటైజేషన్ యొక్క విధానాలలో భాగంగా ప్రైవేటీకరణ పెరిగిన తర్వాత మన విద్యావిధానం చూసుకుంటే ప్రధానంగా ప్రభుత్వ విద్యను అంతా నాశనం చేసి వాటికి నిధుల్ని కేటాయించకుండా, ఉపాధ్యాయుల్ని కేటాయించకుండా, మరోవైపు వీధికొక ప్రైవేటు స్కూల్‌కి, వీధికొక ప్రైవేటు కాలేజీకి పర్మిషన్ ఇచ్చిన తర్వాత వేలు లక్షల రూపాయలు ఖర్చుపెడితే తప్ప చదివించలేని పరిస్థితి తల్లిదండ్రులకు ఏర్పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో అప్పుల్లో కూరుకుపోయున్న రైతులు వాళ్ళ పిల్లల్ని చదివించలేక పరిస్థితుల్లో కార్మికులుగా పనికి పంపిస్తున్నారు. వారిని చదివించడానికి స్థోమత లేదు వారికి అలాగే వలస కార్మికుల పిల్లలే మెజార్టీగా బాలకార్మికులుగా మారుతున్నారు. వ్యవసాయంలో పరిశోధనలు జరిపి, ఆ వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి ప్రపంచం మొత్తానికి తిండి పెట్టగల స్థోమత ఈ భూమికి ప్రజలకు ఉన్నప్పటికీ వ్యవసాయ కళాశాల విద్యకు ఇక్కడి పరిశోధనలకు ఎటువంటి నిధులు కల్పించటం లేదు. మా ముందు తరం వాళ్ళు వ్యవసాయం చేసారు, మా జనరేషన్ వ్యవసాయం నుంచి దూరం వచ్చేసింది. ఇప్పుడు పుడుతున్న జనరేషన్‌కి, చిన్న పిల్లలకి అసలు వ్యవసాయం అంటేనే ఏమీ తెలియకుండా, అన్నం ఎక్కడి నుండి వస్తుంది అని అడిగితే స్టోరు నుంచి వస్తుంది అనే పరిస్థితి. వ్యవసాయం తెలియని, సంబంధంలేని పరిస్థితుల్లో వాళ్లు ఉంటున్నారు. ఈ పాలకులు వ్యవసాయ రంగాన్ని ఆ విధంగా మార్చేసారు. ఈ ప్రైవేటీకరణ విధానాలు వ్యవసాయరంగంతో పాటు విద్యారంగంలోకి చొరబడిన కారణంగా విద్యార్థులు, యువకులు, అందరూ ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేస్తే యువత కూడా ఉపాధి పొందుతుంది. దాన్ని పూర్తిగా వదిలేసారు. కానీ వీటన్నిటినీ వదిలేసి సర్వీస్ సెక్టార్‌ను పెంచుతున్నారు. కొన్ని లక్షల మంది ఇంజనీర్‌లు ప్రతి సంవత్సరం బయటకు వస్తున్నారు. కానీ వ్యవసాయానికి సంబంధించిన విద్యార్థులెవరూ బయటికి రావటంలేదు. మరి ఈ వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేయడానికి వ్యవసాయ విద్యను పునరుద్ధరించవలసిన అవసరం ఉంది. వ్యవసాయం అభివృద్ధి చెందితే యువతకు ఖచ్చితంగా ఉపాధి దొరుకుతుంది. వీటన్నిటి మీద ఖచ్చితంగా విద్యార్థులు, యువతరం పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. అలాగే రైతు సమస్యల మీద రైతు, రైతుకూలీలు, కార్మికుల బిడ్డలుగా రైతుపోరాటాలలో కలిసి నడవాల్సిన అవసరం ఉంది. 3 ఏళ్ళ క్రితం జరిగిన ఢిల్లీలో సంవత్సరం పైగా రైతులు పోరాటం చేశారు. ఇలాంటి పోరాటాల్లో విద్యార్థి, యువతరం పాలుపంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వ్యవసాయ విద్యను అభివృద్ధి చేయాలని, వీటన్నిటితో పాటు విద్యార్థులు, యువకులు రైతుకూలీ పోరాటాలలో భాగస్వాములుగా అవ్వాల్సిన అవసరం ఉంది. దీంట్లో భాగంగానే పిడిఎస్ఓగా మేము రైతుకూలీ సంఘం పోరాటాలకు సంఘీభావాన్ని తెలియజేస్తున్నామని చెబుతూ ముగిస్తున్నాను. ★

# తీర్మానాలు

**మహాసభలో అనేక సమస్యలపై తీర్మానాలను ఆమోదించటం జరిగింది. ఇక్కడ కొన్ని ముఖ్యమైన తీర్మానాలను అందిస్తున్నాం.**

## కనీస మద్దతు ధరను మించి, రైతు పంటలకు న్యాయమైన గిట్టుబాటు ధర కల్పించాలి

రైతాంగపు ఎన్నో ఆందోళనల తర్వాత కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సిఏసిపి (కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్ అండ్ ప్రైసెస్) కనీస మద్దతు ధరల విధానాన్ని... అది కూడా కేవలం 23 రకాల పంటలకు మాత్రమే (చెరకుకు ప్రకటించే ప్రోత్సాహక ధరతో కలిపి) ప్రకటిస్తూ వస్తోంది.

పంట ఉత్పత్తి ఖర్చు, గిరాకి–సరఫరా, జాతీయ అంతర్జాతీయ మార్కెట్లో ఆ పంటల ధరలు, ఆ పంటల ధరల మార్పు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై పడే భారం... వంటి ఏడు అంశాలపై ఆధారపడి మద్దతు ధరను నిర్ణయిస్తున్నామని ఈ కమిషన్ చెప్తోంది. పసుపు, మిర్చి వంటి అనేక పంటలను ఈ పరిధిలోకి ఇంకా తీసుకురాలేదు.

ఈ ప్రకటించిన మద్దతు ధరలనైనా రైతాంగానికి అందేలాగా అమలు చేసి తీరాలనే బాధ్యత ప్రభుత్వానికి లేదు. పంటలు చేతికి వచ్చే సమయానికి ప్రభుత్వము ప్రకటించే కనీస మద్దతు ధరనే... దళారీ మార్కెట్ దోపిడీ శక్తులు, గరిష్ట మార్కెట్ ధరగా ఖాయపరిచి ఎంత తక్కువకు వీలైతే అంత తక్కువకు పంటలను కొనుగోలు చేస్తూ రైతులను దగా చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా కౌలు వ్యవసాయం సాగుతోంది. సంస్థాగత రుణం అందక, రైతులు స్థానిక వడ్డీ వ్యాపారుల వద్ద ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు మొదలైనవి అప్పుగా తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. కౌలు రైతు తన అప్పు కింద, అప్పు ఇచ్చిన వ్యాపారికే వారు నిర్ణయించిన రేటు ప్రకారమే తన పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. కనీస మద్దతు ధర అనేది వీరికి అందటమే లేదు. ఇక కౌలు రైతులు భూ యజమానికి చెల్లించాల్సిన కౌలుభారము ప్రతి సంవత్సరమూ ఉంటుంది. రైతాంగం, ముఖ్యంగా కౌలు రైతాంగపు ఆత్మహత్యలకు ఈ రుణభారాలు పెరిగిపోవడం ప్రధాన కారణంగా ఉంది.

మరోవైపున పాలకులు... వ్యవసాయ ఉత్పాదకాలైన ఎరువులు, విత్తనాలు పురుగుమందులు మొదలైన వాటి ధరల నిర్ణయాన్ని బడా, బహుళజాతి కంపెనీలకు వదిలివేశారు. ప్రతి ఏటా వాటి ధరలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. రైతుల పంట ఉత్పాదక వ్యయాన్ని ఇది మరింతగా అధికం చేస్తోంది. పంట ఉత్పాదకాలను సామ్రాజ్యవాద బడా, బహుళజాతి కంపెనీల చెర నుండి విడిపించకుండా... మద్దతు ధరను ఎంతగా పెంచుకుంటూ పోయినా,రైతాంగానికి అందే ఉపశమనం అంతంత మాత్రమేనని గ్రహించాలి. మరో మాటల్లోచెప్పాలంటే... మద్దతు ధర పెంపు ద్వారా రైతాంగం పొందిన ఆదాయమంతా, తిరిగి బడా బహుళ జాతి కార్పొరేషన్లకే చేరుతుందని గమనించాలి.

ఒక పంట ఉత్పత్తి చేయడానికి అవసరమైన ఖర్చులతో పాటు... రైతు కుటుంబ శ్రమను, తిరిగి వచ్చే పంటకు కావలసిన పెట్టుబడిని కూడా సమకూర్చుకునే విధంగా ఆ పంటకు ధర నిర్ణయం జరిగితే... పంట పండించడంలో పాల్గొన్న వారంతా గౌరవప్రదమైన జీవనాదాయాన్ని, సమగ్ర వికాసాన్ని ఆ పంట ఉత్పత్తి ద్వారా పొందే విధంగా ధర నిర్ణయం జరిగితే... అది, రైతుల పంటలకు న్యాయమైన గిట్టుబాటు ధర అవుతుంది

పంట పునరుత్పత్తికి కావలసిన పెట్టుబడిని అలా ఉంచి, పెట్టిన ఉత్పత్తి ఖర్చునైనా పొందే కనీస మద్దతు ధరను సైతం రైతాంగం ఈనాడు పొందడం లేదు.

ఈ నేపథ్యంలో... రైతుల పంటలకు కనీస మద్దతు ధరనైనా సాధించుకోవడం... వారికి ఒక ఉపశమనంగా ఉంటుంది.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, కూలీల శ్రమ ఖర్చుతో కూడిన మొత్తం ఉత్పాదక ఖర్చులకు (A2), రైతు కుటుంబ శ్రమ (FL), భూమి కౌలు, ఇతర పన్నులు కలిపితే వచ్చే సమగ్ర ధర (C2)కు అదనంగా 50% జోడించి... పంటల కనీస మద్దతు ధరను (MSP) ప్రకటించాలని, దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా రైతాంగం ఆందోళన సాగిస్తోంది. న్యాయమైన ఈ రైతాంగ డిమాండ్ పరిష్కారానికి దేశవ్యాప్త రైతాంగ ఉద్యమం మరింత బలంగా, సమైక్యంగా సాగాల్సిన అవసరం ఉంది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించి అమలు చేస్తే ప్రభుత్వాలపై మోయలేని భారం పడుతుందనే పాలకుల దుర్మార్గ అసత్య ప్రచారాల్ని ఖండించాలి.

స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం (C2+50) కనీస మద్దతు ధరలను ఒక హక్కుగా సాధించుకోవడానికి రైతాంగం కదులుతూనే, న్యాయమైన గిట్టుబాటు ధరల సాధన కోసం, సామ్రాజ్యవాదుల కబంధహస్తాల నుండి వ్యవసాయ రంగాన్ని విడిపించుకునేందుకు, ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి భారత వైదొలగాలని డిమాండ్ చేస్తూ...ఇతర పీడిత వర్గాలతో కలిసి పోరాడాలని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభ పిలుపునిస్తోంది.

**అభివృద్ధి పేరుతోఆదివాసుల జీవన విధ్వంసాన్ని ఖండిద్దాం! నిర్వాసితులందరికీ శాస్త్రీయ, సమగ్ర పునరావాసాన్ని కల్పించాలని డిమాండ్ చేద్దాం!!**

గత రెండు దశాబ్దాల కాలంగా అడవులలో నివసించే ఆదివాసుల జీవన విధ్వంసం తీవ్రమవుతోంది. 2006 సంవత్సరంలో వచ్చిన 'అటవీ హక్కుల చట్టం'... తరతరాలుగా అడవులలో నివసించే ఆదివాసులను ఆక్రమణదారులుగా, నేరస్తులుగా పరిగణించింది. తగిన రుజువులు, సాక్ష్యాలు సమర్పించలేదనే కారణంగా 20 లక్షల మంది ఆదివాసులను అడవుల నుండి తొలగించాలని, 2019లో దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆదివాసుల ప్రతిఘటనతో తాత్కాలికంగా ఆ చర్య నిలిచిపోయినా, వారి మెడపై ఆ కత్తి వేలాడుతూనే ఉంది.

దీని కొనసాగింపుగా... 2023లో మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేసిన' అటవీ సంరక్షణ (సవరణ) చట్టం' ఆదివాసుల హక్కులను, వారు పోరాడి సాధించుకున్న 1/70, పీసా వంటి చట్టాలను నిరుపయోగం చేస్తోంది. అటవీగర్భాలలో నిక్షిప్తమై ఉన్న విలువైన ఖనిజ సంపద,'శక్తి' ఇంధనాల తవ్వకాల కోసం... బడా కార్పొరేట్ సంస్థలకు అడవులను ధారాళంగా పందేరం చేస్తూ, ఆదివాసుల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తోంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం దానికి కావలసిన అనుమతులు, పునరావాసం వంటి అన్నింటికీ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. అయితే, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తికాకుండానే, వేలాది ముంపు గ్రామాల ప్రజలను పాలకులు నిర్వాసితులుగా చేశారు. శాస్త్రీయ, సమగ్ర పునరావాసం కల్పించకుండానే, లక్షలాదిమంది ఆదివాసులను అడవి తల్లి ఒడి నుండి విసిరి వేశారు. కనీస సౌకర్యాలు లేని పునరావాస కాలనీలలో వారందరినీ కుక్కారు. ఇప్పటికీ లక్ష కుటుంబాలు అంటే ఐదు లక్షల మంది జీవితాలు అయోమయంగానే ఉన్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది నిర్వాసితులు స్వంత ఊళ్ళు, భూములు కోల్పోయి దయనీయంగా తయారయ్యారు. 18 ఏళ్లు నిండిన అనేకమందిని ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలుగా గుర్తించలేదు. వీరికి పునరావాస నష్టపరిహారాలేవీ అందలేదు. స్వేచ్ఛగా జీవనం సాగించే ఆదివాసులను... అడవికి, భూమికి దూరం చేసి ఆరుబయలు కారాగారంలో నిర్బంధ చౌక కూలీలుగా దిగజార్చారు.

అభివృద్ధి పేరుతో ఆదివాసుల జీవన విధ్వంసాన్ని ఖండిస్తూ, ఆదివాసుల భూమి, అడవి, ఉపాధి హక్కులను గౌరవించి అమలు చేయాలని, పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించి, ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయటంతోపాటు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన వారందరికీ సమగ్ర, శాస్త్రీయ పునరావాసం కల్పించాలని.... రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభ డిమాండ్ చేస్తోంది.

### అమెరికా సామ్రాజ్యవాదుల అండదండలతో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతి హననాన్ని ముక్తకంఠంతో ఖండిద్దాం

### తమ దేశం కోసం సర్వస్వాన్ని పణంగా పెట్టి పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు అండగా నిలుద్దాం

దశాబ్దాల కాలంగా పాలస్తీనా స్వతంత్ర దేశాన్ని కబళించడానికి అమెరికా సామ్రాజ్యవాదపు అండతో ఇజ్రాయిల్ దుర్మార్గమైన దాడులు సాగిస్తూ వస్తోంది.

2023 అక్టోబర్ మూడో తేదీన హమాస్ చేసిన దాడులను సాకుగా చూపుతూ... ఆనాటి నుండి గత ఎనిమిది నెలల కాలంగా, పాలస్తీనా ప్రజలపై, ముఖ్యంగా గాజా ప్రాంతంపై, సరిహద్దు రఫా నగరంపై ఉన్మాదపూరిత హింసాత్మక దాడులను ఎడతెరిపి లేకుండా సాగిస్తోంది. ఈ సైనిక, బాంబు దాడులలో 40 వేల మందికి పైగా పాలస్తీనా ప్రజలు, వీరిలో అత్యధికులు చిన్నారులు, మహిళలు మరణించారంటే అమెరికా మిత్ర కూటమి అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతి హనన దాడుల తీవ్రత అర్ధమవుతుంది.

ముఖ్యంగా గాజాలోని ప్రజలకు నీరు, విద్యుత్తు, ఆహారము అందకుండా మార్గాలను దిగ్బంది ఒచిఆసుపత్రులు, ప్రార్థనా స్థలాలతో సహా జనావాసాలపై ఇజ్రాయిల్ హీనమైన దాడులు సాగిస్తోంది. 23 లక్షల మంది పాలస్తీనీయులు నివసిస్తున్న గాజా ను వదిలిపెట్టి వెళ్ళమని వారిపై హింసకాండ జరుగుతోంది. ఈజిప్టు సరిహద్దు రఫా నగరం గుండా సోదర దేశాలు పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా అందించే ఆహార పదార్థాలు, అత్యవసర ఔషధాల వంటి వాటిని లోనికి రాకుండా కూడా అడ్డుకుంటుంది.

ఇజ్రాయిల్ యూదు మతోన్మాదుల క్రూరాతి క్రూరమైన అణచివేత దాడులకు, హత్యాకాండలకు వేలాదిమంది పాలస్తీనీయులు బలవుతున్నా లెక్కచేయకుండా, స్వేచ్ఛ స్వాతంత్ర్యాల కోసం, తమ మాతృభూమి విముక్తి కోసం మొక్కవోని దీక్షతో పాలస్తీనా ప్రజలు సాగిస్తున్న పోరాటం ఉత్తేజకరమైనది.

2023 అక్టోబర్ 27వ తేదీన జరిగిన ఐక్యరాజ్యసమితి అత్యవసర సర్వసభ్య సమావేశం... తక్షణమే గాజాపై దాడులు ఆపివేయాలని, తాత్కాలికంగానైనా యుద్ధాన్ని ఆపివేయాలని, గాజాలోని యుద్ధ బాధితులకు కనీస తక్షణ సహకారాన్ని అందజేయాలని... ప్రవేశపెట్టిన తీర్మానంపై ఓటింగ్‌లో పాల్గొన్న 193 దేశాలలో, 121 దేశాలు ఆ తీర్మానాన్ని ఆమోదించాయి. కాగా వ్యతిరేకించిన వారిలో అమెరికా, ఇజ్రాయిల్‌తో సహా మరి 12 చిన్న దేశాలు మాత్రమే ఉన్నాయి. మన దేశ ప్రభుత్వం, ఓటింగ్‌కు గైర్హాజరై తన అమెరికా సామ్రాజ్యవాద లొంగుబాటు విధానాలను మరోసారి చాటుకుంది.

'చావనైనా చస్తాం కానీ మా మాతృభూమిని వదిలిపోము' అని నిశ్చయాత్మకంగా పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజానీకం విస్తృతంగా కదులుతున్నారు. మధ్యాసియా అరబ్ దేశాలలోనే కాకుండా, ఐరోపాఖండంలో కెనడా-అమెరికాలలోని పలు నగరాలలో లక్షలాదిగా ప్రజలు వీధుల్లోకి వచ్చి ఇజ్రాయిల్ హత్యాకాండను, దానికి అండగా నిలుస్తున్న అమెరికా దుర్మార్గాన్ని ఎలుగెత్తి

చాటుతున్నారు. అమెరికాతో సహా ప్రపంచంలోని పలు దేశాలలోని విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు వేలాది కదిలి రోజుల తరబడి శిబిరాల ఏర్పాటు చేసుకొని పాలస్తీనాకు మద్దతుగా నిరవధిక ఆందోళనలు సాగిస్తున్నారు. పలు దేశాలలో యూదులు ఈ ప్రదర్శనలో పాల్గొని పాలస్తీనీయులకు సంఘీభావం తెలపటం విశేషం.

చమురు వనరులకు కేంద్రంగా అరబ్ దేశాల మధ్యనున్న ఇజ్రాయిల్‌ను ఒక అప్రకటిత మిలటరీ స్థావరంగా అమెరికా వాడుకుంటూ చమురు వ్యాపారంపై తన పట్టును కాపాడుకునేందుకు, తన ఆధిపత్య యుద్ధ విధానాన్ని అమలుపరుస్తుంది.

**కనుక... ఇజ్రాయిల్ దురాగతాల్ని ఖండిస్తూ..**

పాలస్తీనా భూభాగం నుండి ఇజ్రాయిల్ వైదొలగాలని, గత ఒప్పందాల ప్రకారం పాలస్తీనా స్వతంత్ర దేశంగా మనగలిగే విధంగా ప్రపంచ ప్రజానీకం ఒత్తిడి తేవాలి. న్యాయమైన పాలస్తీనా ప్రజల పోరాటాన్ని బలపరుస్తూ రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభ వారికి సంఘీభావాన్ని ప్రకటిస్తోంది.

**దళితుల, పీడితుల సామాజిక న్యాయం... భూమిపై హక్కుతో ముడిపడి ఉంది**

అర్ధవలస-అర్ధ భూస్వామ్య వ్యవస్థ గానున్న మన దేశంలో సామాజిక సమస్యను, ప్రత్యేకించి కుల సమస్యను అర్థం చేసుకోవాలంటే భూమి సమస్యను అర్థం చేసుకోవాలి. ఉత్పత్తి సాధనమైన భూమి ఈనాటికీ గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య, అగ్రకుల, పెత్తందారీ శక్తుల, అధికార రాజకీయ నాయకుల అజమాయిషీలోనే ఉందనేది నిర్వివాదం. దేశంలోని మొత్తం సాగు భూమిలో దాదాపు 30 శాతం భూమి (11 కోట్ల 25 లక్షల ఎకరాలు) ఈనాటికీ జనాభాలో పై శ్రేణిలోనున్న 4.33 శాతం సంపన్నుల చేతిలోనే కేంద్రీకృతమై ఉంది. ప్రభుత్వ భూసంస్కరణలన్నీ బూటకంగా రుజువయ్యాయి.

ఫ్యూడల్ వ్యవస్థలో భాగంగా వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న కుల వ్యవస్థను తదనంతర కాలంలో సామ్రాజ్యవాదులు తమ సాంఘిక భూమికగా చేసుకోవడంతో దేశంలో ఈనాటికీ కుల వ్యవస్థ బలంగా వేళ్ళూనుకొని ఉంది. ఈనాటికీ గ్రామాలలో కుల వివక్ష, అంటరానితనం, దళితులపై అగ్రకుల దురహంకార హంతక దాడులు, మొరటు వడ్డీ దోపిడీ, బానిసత్వ నిర్బంధ చాకిరీ, కుల మత తత్వాలు, మూఢాచారాలు, అత్యంత వెనుకబాటుతనం, ఖాప్ పంచాయతీలు, పరువు పేరిట ప్రేమికుల హత్యలు, పితృస్వామ్యం, పురుషాధిపత్యం, స్త్రీల పట్ల వివక్ష, వేధింపులు, లైంగిక అణిచివేత, గృహహింస... వంటి పలు రూపాల్లో అగ్ర కులాధిపత్య, భూస్వామ్య దోపిడీ, అణచివేతలు సాగుతున్నాయి.

మన దేశంలో దళితులు అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల్లో భూమిపై ఆధారపడి వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు ఈ భూములపై హక్కు అధికారం కలిగి ఉన్న వారంతా ప్రధానంగా అగ్రకుల పెత్తందారీ భూస్వామ్య వర్గంగా అధికార రాజకీయ పలుకుబడి కలిగిన వారుగా ఉన్నారు. కనుక గ్రామీణ ప్రాంతంలో భూస్వామ్య అగ్రకుల పెత్తందారుల ఆధిపత్యానికి, అహంకారానికి మూలమైన ప్రధాన ఉత్పత్తి సాధనమైన భూమిపై గ్రామీణ దళిత, పీడిత ప్రజానీకానికి హక్కు సాధించబడటంతోనే ఆ ప్రజానీకానికి సామాజిక న్యాయం దక్కుతుంది. గ్రామీణ మనువాద భూస్వామ్యుల పెత్తందారుల ఆయువు పట్టు అయిన భూమిపై దళిత పీడిత ప్రజానీకం హక్కు సాధించాలి. 'దున్నేవానికే భూమి' నినాదంతో, విప్లవ భూసంస్కరణలు అమలు జరిగితే, గ్రామీణ పేదలంతా ముఖ్యంగా అగ్రకుల అణిచివేతకు దోపిడీకి గురవుతున్న దళిత, వెనుకబడిన కులాల పీడితులంతా తల ఎత్తుకొని, ఆత్మగౌరవంతో జీవించగలుగుతారు.

'దున్నేవానికే భూమి' నినాదంతో అగ్రకుల పేదలతో సహా పీడిత కులాల ప్రజలందరినీ సమీకరించి సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా 3000 గ్రామాలలో ప్రజలు రాజ్యాధికారం స్థాపించుకున్నారు. పది లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసుకున్నారు. వెట్టిచాకిరీ రద్దయింది. ప్రజలు మొదటిసారిగా రెండు పూటలా అన్నం తిన్నారు. ఆత్మగౌరవంతో నిలబడ్డారు. కుల మత విభేదాలు లేకుండా కులాంతర, మతాంతర వివాహాలు, సహపంక్తి భోజనాలు సాధారణమయ్యాయి. కులం అడ్డుగోడలను అధిగమించి అగ్రకులాలలోని పేదలను ప్రజాస్వామిక స్వభావం కలవారిని పీడిత దళిత ప్రజా ఉద్యమాలలో భాగస్వాములను చేయడం ఈ ఉద్యమాల విజయానికి ఎంతో అవసరం. కుల నిర్మూలన లక్ష్యంతోటి సాగే దళితుల న్యాయమైన ప్రజాస్వామిక వాంఛలు, వర్గ ఉద్యమంలోనే నెరవేరుతాయని మనకు అనేక ఉద్యమాల అనుభవాలు తెలుపుతున్నాయి.

**వ్యవసాయ కూలీల, గ్రామీణ పేదల వలసలకు, ఉపాధి, ఉద్యోగ సమస్యకు కారణమైన... పాలకుల విధానాలపై పోరాడుదాం!**

సాగు సంక్షోభం కారణంగా, దీనిపై ఆధారపడిన వ్యవసాయ కూలీల, పేద రైతుల, గ్రామీణ పేదలందరి జీవనం దుర్భరంగా మారింది. పాలకుల విధానాల ఫలితంగా చేతివృత్తులు, చేనేత పరిశ్రమ దెబ్బ తినటం... చేపల-రొయ్యల పెంపకం, కోళ్ల పరిశ్రమ కునారిల్లుతుండడంతో, వీటిపై ఆధారపడిన శ్రామికుల ఉపాధి తరిగిపోతోంది. పేదల పాలిట వరంగా కీర్తించబడే 'గ్రామీణ ఉపాధి హామీ పథకం' పూర్తిగా అవినీతిలో కూరుకుపోయింది. అధికార పార్టీకి చెందిన క్రింది దొంతరల నాయకులకు ఫలహార పథకంగా మారిపోయింది. గ్రామాల్లో జీవనాధారం కరువై పొట్ట చేత పట్టుకొని చౌక కూలీలుగా పట్టణాలకు, గల్ఫ్ దేశాలకు, యుద్ధ రంగంలో ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసేందుకు సైతం సిద్ధపడి వెళుతుండడం... గ్రామీణ ఉపాధి హామీ పథకపు డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తోంది.

పట్టణ ప్రాంతాల్లో చదువుకున్న నిరుద్యోగుల సంఖ్య కూడా ప్రమాదకరంగా పెరుగుతోంది. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు వాటిని భర్తీ చేయడం లేదు. పాలక రాజకీయ నాయకులు అనేక మందిని యువకులను వ్యసనాలకు గురిచేసి తమ చేతిలో సాధనాలుగా వినియోగిస్తున్నారు. తాగుడు, జూదం, వ్యభిచారం వంటి దుర్లక్షణాలతోపాటుగా దిగజారిన స్మార్ట్ ఫోన్ సంస్కృతితో వీరు మరింత పతనమై సంఘ విద్రోహశక్తులుగా మారుతున్నారు.

అత్యంత శ్రమ చేస్తూ కనీస జీవనం గడపలేక నిరుద్యోగులు ఆత్మహత్యల బారిన పడుతున్నారు. ఎలాంటి నియంత్రణాలేని పని తీవ్రత వున్న గిగ్ కార్మికులుగా, రాపిడో, ఉబర్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు.

వాస్తవిక అర్థంలో 'దున్నేవానికే భూమి' నినాదంతో, విప్లవ భూ సంస్కరణలు అమలు జరిగితే గ్రామీణ పేదలంతా తలెత్తుకొని ఆత్మగౌరవంతో జీవించగలుగుతారు. వ్యవసాయానికి పాలకులు ప్రోత్సాహకాలను అందించగలిగితే, దేశంలో ఆహార ధాన్యాలతో పాటుగా చెరకు, ప్రత్తి, నూనె గింజలు తదితర వాణిజ్య పంటలు సమృద్ధిగా పండుతాయి. ఈ పంటలన్నింటికీ న్యాయమైన ధర, మార్కెట్ సౌకర్యంతో పాటు, దళారుల దోపిడీని నిలువరిస్తే, గ్రామీణ ప్రజలందరి జీవితాలు మెరుగవుతాయి. దేశీయంగా పండిన పంటలపై ఆధారపడిన వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపన జరిగితే, శ్రామికులందరికీ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఒకదానినొకటి బలపరుచుకొనే వ్యవసాయ, పారిశ్రామిక రంగాల జమిలి అభివృద్ధితో, ప్రజలందరి తలసరి ఆదాయాలు, నిజమైన ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఉత్పాదకరంగం అభివృద్ధి చెంది శారీరక, మేధో వలసలు ఆగుతాయి.

కనుక, ఉపాధి సమస్యకు, నిరుద్యోగుల సమస్యలకు కారణమైన పాలకుల విధానాలపై గ్రామీణ ప్రాంత రైతు కూలీలతో కలిసి యువత పోరాటాలకు సిద్ధం కావాలని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభ పిలుపునిస్తోంది.

## అటవీ సంరక్షణ, వన సంరక్షణ చట్టాల సవరణను వ్యతిరేకిద్దాం!

2023లో మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేసిన అటవీ (సంరక్షణ) సవరణ చట్టం ఆదివాసుల హక్కులను, వారు పోరాడి సాధించుకున్న 1/70, పీసా వంటి చట్టాలను నిరుపయోగం చేస్తోంది. అటవీ గర్భాలలో నిక్షిప్తమై ఉన్న విలువైన ఖనిజ సంపద, శక్తి ఇంధనాల తవ్వకాల కోసం బడా కార్పొరేట్ సంస్థలకు అడవులను ధారాళంగా పందేరం చేస్తూ, ఆదివాసుల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తోంది. ముఖ్యంగా దేశ సరిహద్దుకు 100 కిలోమీటర్ల లోపు వరకు ఉన్న అటవీ భూములన్నింటిని... సైనిక అవసరాలు, మైనింగ్ వాణిజ్య కార్యకలాపాల పేరిట పాలకులు యధేచ్ఛగా భూసేకరణ చేసేందుకు ఈ సవరణలు వీలు కల్పిస్తున్నాయి. ఇటీవల మణిపూర్‌లో జరిగిన మారణకాండ కూడా... అటవీ, కొండ ప్రాంతాలలోని విలువైన ఖనిజ సంపదలను కొల్లగొట్టే దానిలో భాగమే. మణిపూర్ కొండల్లో నిక్షిప్తమైన విలువైన ఖనిజవనరులను తరతరాలుగా కాపుగాస్తున్న కుకీ–నాగా జాతి ఆదివాసులను తరిమివేసి వాటిని బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టపెట్టేందుకు అధికార బిజెపి నేతృత్వంలో సాగించిన దాడులే... 2023 సంవత్సరంలో మణిపూర్‌లో జరిగిన జాతిహనన హత్యాకాండ. ఆదివాసుల జీవనాన్ని ప్రశ్నార్థకం చేస్తున్న అటవీ (సంరక్షణ), వన్యప్రాణి (సంరక్షణ) సవరణ చట్టాలను వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభ డిమాండ్ చేస్తోంది.

## కౌలు రైతులందరికీ బేషరతుగా రుణ పరిమితి కల్పించాలి!

మన రాష్ట్రంలో అత్యధిక రైతులు భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. అయితే వీరి పేరున భూమి లేకపోవడం, భూ యజమాని నుండి రాతపూర్వక కౌలు ఒప్పందం లేకపోవటం అనే సాకుతో రైతుల కందించే కనీసపాటి రుణ సదుపాయాన్ని కూడా బ్యాంకులు కౌలుదారులకు నిరాకరిస్తున్నాయి. అంతిమంగా పంట ఉత్పాదక వ్యయం పెరగటం, గిట్టుబాటు ధరలు లేకపోవడం, కౌలు భారం వంటి వాటికి తోడు, ప్రైవేటు రుణభారాలతో కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యల పాల్పడుతున్నారు. ఆత్మహత్యల బారిన పడుతున్న రైతులలో కౌలు రైతులు అధికంగా ఉండటం గమనార్హం. కనుక నిర్నిబంధంగా భూమిపై సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ బ్యాంకుల ద్వారా సంస్థాగత రుణ సౌకర్యం కల్పించాలని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. అలాగే ప్రభుత్వం తరఫున అర కొరగా అందే పంట సాయం (ఇన్‌పుట్ సబ్సిడీ), భీమా, పంట నష్టపరిహారాల వంటి వాటిని కూడా నేరుగా సాగు చేస్తున్న కౌలు రైతుకే అందించాలని ప్రభుత్వాన్ని మహాసభ డిమాండ్ చేస్తోంది.

## చిన్న, మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలి!

రాష్ట్రంలో దశాబ్దాల తరబడి అనేక చిన్న,మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టులపై అధికారంలోకి వస్తున్న పాలకులెవరూ శ్రద్ధ చూపటం లేదు. తక్కువ బడ్జెట్ కేటాయింపులతో సత్వరం పూర్తి చేయదగిన వాటిని చేపట్టకుండా లేదా చేపట్టినవాటిని శిలాఫలకాల వద్దనే ఆపి వేస్తున్నారు. దశాబ్దాల తరబడి పోలవరం వంటి భారీ ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ... ఆచరణలో చిన్న నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని గాలికి వదిలేస్తున్నారు. వంశధార –నాగావళి లింకు, వెలిగొండ,గాలేరు–నగరి, హంద్రీ – నీవా తెలుగు గంగ పథకాలను పూర్తి చేయడంతో పాటు గుంటూరు ఛానల్‌ను పరుచూరు వరకు పొడిగించాలని,పల్నాడులో వరికపూడిసెల మొదలైన చిన్న నీటి పథకాలను వెనువెంటనే చేపట్టి పూర్తి చేయాలని రైతు కూలీ సంఘం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మహాసభ డిమాండ్ చేస్తోంది.

## విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభ డిమాండ్ చేస్తోంది!

'విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు' నినాదంతో 32 మంది బలిదానంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరు దశాబ్దాల క్రితం సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను క్రమంగా ప్రైవేటీకరించడానికి, బడా కార్పొరేట్లకు ధారా దత్తం చేసే చర్యలకు కేంద్ర పాలకులు పాల్పడుతున్నారు. దాదాపు 22వేల ఎకరాలలో విస్తరించిన, వేలాదిమందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న, రెండు లక్షల కోట్ల విలువైన ఉక్కు పరిశ్రమను... కారు చౌకగా అదాని, అంబానీలకు కట్టబెట్టే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను నిరసిస్తూ పరిశ్రమ కార్మికులు నిరంతరాయ ఆందోళన సాగిస్తున్నారు.

ప్రభుత్వ రంగంలోని విశాఖ ఉక్కుపరిశ్రమకు క్యాప్టివ్ బొగ్గు గనులను కేటాయించకుండా ఇంతకాలంగా ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తూ వస్తోంది. ఇప్పటికే హిందుస్తాన్ జింక్ లిమిటెడ్, బిహెచ్ఇఎల్ వంటి సంస్థలను ప్రభుత్వం ప్రైవేటుపరం చేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, పాక్షిక ప్రైవేటీకరణ, పాక్షిక అమ్మకం మొదలైన అన్ని రూపాలలోని చర్యలను విరమించుకోవాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్‌ను కేటాయించి ప్రభుత్వ రంగంలోనే నడపాలని రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభ డిమాండ్ చేస్తోంది.

## మహిళలు, బాలికలపై లైంగిక దాడులను అరికట్టాలని మహాసభ డిమాండ్ చేస్తోంది

రాష్ట్రవ్యాప్తంగా పసిపిల్లల మొదలు వయోవృద్ధులైన మహిళల వరకు వివిధ రూపాల్లో లైంగిక దాడులు, అత్యాచారాలతో పాటు హత్యలకు గురవుతున్న సంఘటనలు రోజువారీగా వెలుగు చూస్తున్నాయి. ఒక ఘటనను మించి మరో ఘటన మరింత క్రూరంగా, అమానవీయంగా ఉంటూ సమాజ పురోగమనాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. లైంగిక దాడి లేదా అత్యాచారం జరిగిన వెంటనే దోషులను శిక్షించాలని, బాధితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేయటంతో సరిపెడుతున్నారు మినహా, మహిళలపై పెచ్చుమీరుతున్న అఘాయిత్యాలకు మూల కారణం పై పాలకులు దృష్టి సారించడం లేదు. యువతను పతనం చేస్తున్న మద్యం,మత్తుమందుల వినియోగాన్ని రూపుమాపకపోగా యువతను వాటికి వ్యసనపరులుగా మారుస్తున్నారు. విస్తరిస్తున్న సామ్రాజ్యవాద విశృంఖల స్మార్ట్ ఫోన్ సంస్కృతి, పోర్న్ కల్చర్ సమాజంలో విలువలను దారుణంగా పతనం చేస్తూ... విచక్షణ జ్ఞానాన్ని, మానవత్వాన్ని కోల్పోయేట్లు చేస్తూ... మృగాలుగా మారుస్తున్నాయి. మహిళలపై తీవ్రమౌతున్న అత్యాచారాలకు కారణమవుతున్న మద్యం, పోర్న్ కల్చర్ మొదలైన వాటిని రద్దు చేయాలని, గంజాయి తదితర మత్తుమందులను అరికట్టాలని రాష్ట్ర మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.

## కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతాంగ హక్కులపై దాడి చేయటమే కాకుండా, కార్మికులపై కూడా తమ నిరంకుశ రూపాన్ని చూపించింది. ఎన్నో సంవత్సరాల నుండి పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తూ (44 చట్టాలు) 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చింది. ఇది కార్మిక వర్గ హక్కులపై పెద్ద దాడే. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికుల హక్కులను తిరిగి నెలకొల్పాలంటూ దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు తమ నిరసనను తెలియజేశారు. 4 లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దుచేసి కార్మికుల హక్కులను పరిరక్షించాలంటూ రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభ డిమాండ్ చేస్తున్నది.

వ్యవసాయాధారిత పరిశ్రమలైన పంచదార మరియు జ్యూట్ పరిశ్రమలను మూసివేయటంతో వేలాదిమంది కార్మికులు వలస కూలీలుగా మారి గ్రామాల నుంచి దూరంగా కుటుంబాలను వదిలి పట్టణాలకు తరలిపోతున్నారు. గ్రామాలలో తమ కుటుంబాలు, పట్టణాలకు వలస వెళ్ళిన వలస కూలీలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. లక్షల మంది ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుండి వలస కూలీలు తరలిపోతున్న సంఖ్య రోజురోజుకి పెరిగి పోతున్నది. ఏ పాలకులు అధికారంలోకి వచ్చిన వలస కూలీలను అరికట్టి, తమ స్వంత గ్రామాలలోనే ఉపాధి కల్పిస్తామంటూ వాగ్దానాలు చేస్తున్నారు. కానీ ప్రతి సంవత్సరం వలసలు పెరిగిపోతూనే వున్నాయి. పట్టణాలలో వలస కూలీలు దినదిన గండంగానే మారిపోతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల గానీ, ఇంకా పని ప్రదేశాలలో జరిగే, ప్రయాణాలలో జరిగే ప్రమాదాలలో మరణిస్తున్న వారి సంఖ్య వలస కూలీలదే. రైతుకూలీ సంఘం మహాసభ వలసలను అరికట్టి, వ్యవసాయాధారిత పరిశ్రమలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నది.

## 2024 నీట్ -యూజీ పరీక్ష నిర్వహణపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

2024 మే 5న జరిగిన నీట్– యూజీ పరీక్షకు 23 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష జరగటానికి ముందు రోజే ప్రశ్నాపత్రం వెల్లడైందనే ఆరోపణలపై సుప్రీంకోర్టులో విచారణ ఒకవైపు జరుగుతుండగానే... కేంద్ర ప్రభుత్వ పరీక్షల నిర్వహణ సంస్థ సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడి రోజునే నీట్– యూజీ పరీక్ష ఫలితాలను ప్రకటించింది. వాస్తవానికి ఈ ఫలితాలను జూన్ 14న వెల్లడి చేస్తామని ప్రభుత్వం చెప్పింది. మార్కులు కూడా అనేకమందికి అసాధారణంగా రావడం పై జరిగిన విచారణలో మరిన్ని అవకతవకలు, నిర్వహణ లోపాలు, వెల్లడవుతున్నాయి. లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన వైద్య విద్య ప్రవేశ పరీక్షల్లో జరిగిన ఈ అవకతవకలు, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభ డిమాండ్ చేస్తుంది. **(తరువాయి 84వ పేజీలో)**

# రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభలను
## విజయవంతం చేయండి!
## ఆహ్వాన సంఘం విజ్ఞప్తి

*మిత్రులారా!*

రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) తన రాష్ట్ర మహాసభలను రైతు ఉద్యమాల కేంద్రంగా చరిత్రలో ప్రసిద్ధి చెందిన ఏలూరు పట్టణంలో – జూన్ 15, 16, 17 తేదీలలో నిర్వహించ బోతున్నది. ఈ మహాసభలను విజయవంతం చేయమని ఆహ్వాన సంఘంగా మేము విజ్ఞప్తి చేస్తున్నాం.

ఈనాడు గ్రామీణ జీవితం అనేక రకాలుగా విధ్వంసాలకు గురవుతున్నది. రైతు సంక్షోభం నానాటికి తీవ్రమవుతున్న స్థితిలో ఉంది. విదేశీ కార్పోరేట్ల దాడుల నుంచి వ్యవసాయాన్ని కాపాడుకోవడానికి, ఒక సమైక్య రైతాంగ ఆందోళన, నిర్మాణాల యొక్క ఆవశ్యకతను ముందుకు తేవటానికి, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఈ మహాసభలను నిర్వహిస్తున్నది.

పశ్చిమగోదావరి జిల్లా రైతాంగ ఉద్యమాలకు ఒక కేంద్రం. 1937 సంIIలో కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, చలసాని వాసుదేవరావుగార్ల నేతృత్వంలో 1500 కిలోమీటర్ల మేర, ఇచ్ఛాపురం నుంచి మద్రాస్ వరకు జరిగిన 'రైతు రక్షణ యాత్ర' చారిత్రాత్మకమైనది. రైతు రుణ విమోచన చట్టం కోసం, జమీందారీ వ్యవస్థ రద్దు కోసం సాగిన నాటి ఉద్యమం నేటికీ స్ఫూర్తిదాయకంగా ఉంది. ఎందుకంటే నేటికీ రైతు రుణ విమోచన అన్నది రైతాంగానికి దక్కలేదు. గిట్టుబాటు ధరలు లభించక పోవడం, అధిక వడ్డీల భారం అనే రెండు తిరగటి రాళ్ళ మధ్య రైతు జీవితం నలిగిపోతున్నది.

ఇది అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సంవత్సరం కూడా. ఆదివాసులపై సాగించిన అణచివేత, దోపిడీ విధానాలు వారిలో అసంతృప్తిని రగిలించి, నాడు సీతారామరాజు నాయకత్వంలో తిరుగుబాటుకు కారణమయ్యాయి. ఈ ఉద్యమాన్ని బ్రిటీష్ పాలకులు క్రూరంగా అణచి వేశారు. ఈనాడూ అటవీ సంరక్షణ చట్టం సవరణల పేర్లతో అడవులను బ్రిటీష్ వాళ్ళ లాంటి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే క్రమమే నేటికీ కొనసాగుతోంది. ఆ విధంగా జాతీయ ఉద్యమంలోని 'మన అడవులను, మన పర్యావరణాన్ని కాపాడుకునే' కర్తవ్యం ఇంకా మిగిలి ఉన్నదని సీతారామరాజు లాంటి మన్యం వీరుల అమరత్వం చాటి చెబుతూనే ఉంది.

వ్యవసాయాన్ని, ప్రజల జీవితాలను మరింత దుర్భరం చేసే మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాపితంగా రైతాంగం పోరాడి దానిని వెనక్కుగొట్టింది. మద్దతు ధర, రుణమాఫీ, తదితర అంశాలపై ఆ ఉద్యమం సాగుతుండటం హర్షణీయం.

మన ప్రాంతంలో వ్యవసాయానికి, ఉపాధికి గొప్ప అండదండలిచ్చిన వ్యవసాయ ఆధారిత పరిశ్రమలన్నీ, ప్రభుత్వాల విధానాల ఫలితంగా మూతపడి పోయినాయి. ఫలితంగా పంటల సరళి దెబ్బతినడమేకాక, వేలాదిమంది గ్రామీణ శ్రమజీవుల ఉపాధి నాశనమయ్యింది. వారంతా మహా నగరాలకు విధిలేక వలసలు పోయి, అక్కడ దైన్యమైన పరిస్థితుల్లో బ్రతకాల్సి వస్తున్నది.

ఇలా కునారిల్లిపోతున్న గ్రామాలను రక్షించుకోవడానికి, వ్యవసాయరంగంపై కార్పొరేట్, మార్కెట్ శక్తులు చేస్తున్న దాడుల నుంచి గ్రామీణ ఉత్పత్తి శక్తులను చైతన్యవంతం చేసుకోవడానికి – రైతుకూలీ ఉద్యమ శక్తులందరూ ఐక్య ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరాన్ని ముందుకు తేవడం కోసం – **రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభలు మన ఏలూరు పట్టణంలో 2024 జూన్ 15, 16, 17 తేదీలలో, ఏలూరు టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాల్ నందు జరగబోతున్నాయి.**

---

**(83వ పేజీ తరువాయి)**

**కాంచన జంగా ఎక్స్‌ప్రెస్ ప్రమాదంతో సహా.... రైల్వే ప్రమాదాలకు కారణమవుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాల్ని ఖండిస్తూ...**

17-6-24న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్ జిల్లా వద్ద రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 11 మంది ప్రయాణికులు మరణించారు, మరి అనేకమంది గాయపడ్డారు.సిగ్నలింగ్ తో సహా, రైల్వేల నిర్వహణను ప్రైవేటీకరించటం, వివిధ విభాగాలలో రైల్వే సిబ్బందిని తగ్గించడం, కొత్తగా నియామకాలు చేపట్టకపోవడం, సిబ్బందిపై అధిక పని భారం... మొదలైన పాలకుల విధానాలే తరచూ జరిగే ఈ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ప్రమాదాలు జరిగిన వెంటనే దర్యాప్తు కమిటీల ప్రకటనలు తప్ప,పరిస్థితిని మెరుగుపరిచే ఎలాంటి చర్యలూ తీసుకోకుండా పాలకులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అంతేగాక, కోవిడ్ కాలంలో రద్దుచేసిన అనేక రాయితీలను తదనంతర కాలంలోనూ పునరుద్ధరించకపోగా, పాసింజర్ రైళ్లను పెద్ద ఎత్తున తొలగించడాన్ని, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పాసింజర్ బోగీల తగ్గింపును రాష్ట్ర మహాసభ తీవ్రంగా నిరసిస్తోంది. ★

ఈ మహాసభకి ప్రముఖ రైతు ఉద్యమ నాయకులు, రైతు సంఘాల నాయకులు, సంయుక్త కిసాన్ మోర్చా, పంజాబ్ కీర్తి కిసాన్ యూనియన్ నాయకులు, బీహార్, బెంగాల్, ఒరిస్సా, జార్ఖండ్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ ఈ విధంగా 9 రాష్ట్రాల నుండి సౌహార్థ ప్రతినిధులుగా హాజర వుతున్నారు. 15వ తేదీన ప్రారంభ సభ, ప్రదర్శన, బహిరంగ సభ వేలాది మందితో జరగబోతున్నవి. 16వ తేదీన వివిధ రైతాంగ సమస్యలపై రైతు ఉద్యమ నాయకులూ, ప్రజాతంత్ర, మేధావుల అధ్వర్యంలో సదస్సు జరుగుతుంది. 17వ తేదీన సంస్థ నిర్మాణ కార్యక్రమాలు ఉంటాయి.

ఈ రీత్యా జరగబోతున్న రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర మహాసభలు విజయవంత మయ్యేందుకు అన్ని విధాలా సహకరించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానీకానికి ముఖ్యంగా ఏలూరు పట్టణ ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాము.

**ఆహ్వాన సం॥అధ్యక్షులు**

**డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య గారు**, విశ్రాంత సూపరింటెండెంట్, ప్రభుత్వ వైద్యశాల, ఏలూరు

కార్యదర్శి

**ఎం.ఎస్. నాగరాజు**, రాష్ట్ర కార్యదర్శి, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర)

కోశాధికారి

**కుంజం రామారావు**, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

సభ్యులు

**శ్రీమతి ఎర్నేని సీతాదేవి గారు**, మాజీ మంత్రివర్యులు

**ఆలపాటి నాగేశ్వరరావు గారు**, మానవత

**డాక్టర్ వై. ఆర్. కె. ప్రసాద్**, షుగర్ వ్యాధి నిపుణులు, ఏలూరు

**పి. పి. శాస్త్రి**, అడ్వకేట్, ఏలూరు

**పి.ఎస్.చందు**, అడ్వకేట్, ఏలూరు

**ఎన్. వి. సత్యనారాయణ**, అడ్వకేట్, ఏలూరు

**కాలి గంగరాజు**, అడ్వకేట్, భీమడోలు

**కోడూరు సత్యనారాయణ**, ప్రముఖ హేతువాది, ఏలూరు

**బండి వెంకటేశ్వరరావు**, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు

**కె. శ్రీనివాస్**, ఏలూరు జిల్లా కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

**పిల్లి రామకృష్ణ**, వ్యవసాయ కార్మిక సంఘం, ఏలూరు జిల్లా కార్యదర్శి

**ఆర్. లక్ష్మణరావు**, ఏలూరు జిల్లా కార్యదర్శి, ఏపీ రైతు సంఘం, నూజివీడు

**చిలువూరి రమేష్**, పూర్వ కార్పొరేటర్, ఏలూరు

**డి.వి.వి.ఎస్. వర్మ**, 'దారి దీపం' సంపాదకులు, తణుకు

**డాక్టర్ రమేష్ చంద్రబాబు**, తణుకు

**శ్రీమతి సంకు మనోరమ**, మహిళా సామాజిక ఉద్యమకారిణి

**పి. మురళి కుమార్**, వ్యవస్థాపక అధ్యక్షుడు, సామాజిక న్యాయ పోరాట సమితి, తణుకు.

**బి.ఎ. సాల్మన్‌రాజు**, ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

**ఆర్. సూర్యారావు**, మాజీ ఎమ్మెల్సీ

**ఐ. రాజగోపాల్**, ఏపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి, తణుకు

**పి.ఎన్.వి. ప్రసాద్**, ఏపిటిఎఫ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పూర్వ అధ్యక్షులు, మార్టేరు

**నంబూరి శ్రీమన్నారాయణ**, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు

**డి. సోమసుందర్**, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్, జాతీయ కార్యదర్శి తాడేపల్లిగూడెం

**లంకా కృష్ణమూర్తి**, రైతు కార్యాచరణ సమితి కార్యదర్శి, భీమవరం

**పెనుమత్స సుబ్బరాజు**, హేతువాద ఉద్యమ నాయకులు, జిన్నూరు

**ఎన్.వి.ఎస్ నాగభూషణ్**, రచయిత, పాలకొల్లు

**చింతపల్లి గురు ప్రసాద్**, సామాజిక ఉద్యమ నాయకులు, పాలమూరు

**దంగేటి రాజమణి**, సర్పంచ్, చించినాడ

**గురిపల్లి సత్యనారాయణ**, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, శృంగవృక్షం

**సోము సాయి రామకృష్ణ**, గ్రామ అభివృద్ధి కమిటీ కార్యదర్శి, శృంగవృక్షం

**షేక్ రోషన్**, అడ్వకేట్, భీమవరం

**సుంకర శేషమ్మ**, ఎడిటర్ 'జనశక్తి'

**ఇల్లా రామిరెడ్డి**, గౌరవ అధ్యక్షులు, ఏజెన్సీ గిరిజన సంఘం

**వేట్ల విజయ**, సర్పంచ్, కొండమొదలు

**సవలం రాంబాబు**, మాజీ సర్పంచ్, జిల్లెల్లగూడెం

**గంటా రామారావు**, మాజీ సర్పంచ్, పంగిడిగూడెం

**కనుమత రెడ్డి అజయ్ కుమార్**, ప్రగడవరం

**జె. కిషోర్ బాబు**, రాష్ట్ర కార్యదర్శి ఏఐఎఫ్‌టియు(న్యూ)

**యు. వీరబాబు**, రైతుకూలీసంఘం(ఆంప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

**వి. హనుమంతరావు**, ఓ.పి.డి.ఆర్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**పి. పాండురంగ వరప్రసాద్**, ఏపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి

**డాక్టర్ సి. విజయ**, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు

**మేళం భాగ్యారావు**, దళిత బహుజన ఫ్రంట్, జాతీయ ప్రధాన కార్యదర్శి

**ఎ. సురేష్**, పిడిఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**డాక్టర్ బి. అరుణ**, జనసాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**ఐనాపురపు సూర్యనారాయణ**, ఆదివాసి మహాసభ న్యాయసలహాదారు

**డి. ఆదినారాయణ**, విశాఖ స్టీలు ప్లాంటు యూనియన్ జనరల్ సెక్రటరి

**ఎన్. వేణుగోపాలరావు**, విశ్రాంత వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు

**జొన్నలగడ్డ రామారావు**, రచయిత, రైతు నాయకులు

**డాక్టర్ కొల్లా రాజమోహన్**, నల్లమడ రైతాంగ సమితి నాయకులు

**వాసిరెడ్డి కృష్ణారావు**, సమతా పార్టీ పూర్వ జాతీయ అధ్యక్షులు

**డాక్టర్ ఘంటా వెంకట్రావు**, తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు నాయకులు

**ముప్పాళ్ళ సుబ్బారావు**, భారత న్యాయవాదుల సంఘం గౌరవాధ్యక్షులు

**కె.ఎన్.వి.వి. సత్యనారాయణ (కొండ)**, జగన్నాధగిరి, అం.కోనసీమ జిల్లా

**వి. బాలకోటయ్య**, అమరావతి దళిత బహుజన జేఏసీ నాయకులు

**డాక్టర్ జి. సి. పట్టాభిరామయ్య**, దుళ్ళ, తూ.గో.జిల్లా

**సుంకర గోపాల్**, రచయిత, తాడేపల్లిగూడెం

**బొల్లినేని నాగార్జునసాగర్**, రాష్ట్ర కార్యదర్శి, అరసం

**ఎస్ కే బాషా**, జిల్లా కార్యదర్శి, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ★

## 2024 జూన్ 15, 16, 17 తేదీలలో - టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాల్-ఏలూరులో జరుగు

# రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి!

*మిత్రులారా,*

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) గత రాష్ట్ర మహాసభలను 2016 జూన్‌లో గుంటూరులో జరుపుకున్నాం. అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సంవత్సరంలో ఏలూరులో తిరిగి రాష్ట్ర మహాసభలను జరుపుకోబోతున్నాం. జిల్లాలో ఆదివాసీ పోరాటాలు, ప్రఖ్యాతిగాంచిన మొఖాసాదారుల పోరాటాలు, కాళీపట్నం రైతుల పోరాటం, చారిత్రక రైతు రక్షణ యాత్ర (ఇచ్ఛాపురం నుండి తడ) లకు నాయకత్వం వహించిన గొప్ప రైతు నాయకుల కన్నగడ్డను రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) మహాసభలకు వేదిక చేసుకుంటున్నది.

ఈ రెండు మహాసభల మధ్యకాలంలో, ముఖ్యంగా 2020-22 సంవత్సరాలలో కరోనా వైరస్ విజృంభించి లక్షలాది మంది ప్రాణాలను బలిగొన్న విషయం అందరి దృష్టిలో ఉన్నదే. సరిగ్గా ఈ కాలంలోనే మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం.... రైతాంగానికి, దేశ ప్రజానీకానికి ప్రమాదకరమైన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను ముందుకు తెచ్చింది. ఈ చట్టాల రద్దుకై దేశవ్యాప్తంగా రైతాంగం, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన సాగించారు. ముఖ్యంగా, ఢిల్లీ సరిహద్దు రహదారులనే నివాసాలుగా మలుచుకొని, 14 నెలలపాటు, అనేక ఆటంకాల నెదుర్కొంటూ రైతాంగం ఆందోళన సాగించారు. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం వ్రాతపూర్వక హామీనిచ్చినా, దానిని అమలు చేయకుండా పక్కన పెట్టింది.

ఏఐకెఎంకెఎస్ అనుబంధ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఈ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూనే... మద్దతు ధరలు, గ్రామీణ జీవన సంక్షోభం, భూముల పరాయీకరణ, వ్యవసాయ కూలీల - పేద రైతుల వలసలు, కౌలు రైతుల దురవస్థ, ఆదివాసుల జీవన విధ్వంసం.... సమగ్ర భూసంస్కరణల యొక్క ప్రాధాన్యతను చాటుతోంది. రైతుకూలీలను భూమి-భుక్తి-సామ్రాజ్యవాద దోపిడీ నుండి విముక్తి ఉద్యమంలో సమీకరిస్తూ వుంది.

**రైతాంగ-గ్రామీణ జీవన విధ్వంసం**

రైతులపై మోపుతున్న పంట ఖర్చుల భారాలను అదుపు చేయకపోవడమే కాకుండా, సాగునీరు అందించాల్సిన అవసరాన్ని పాలకులు విస్మరించారు. పంట కాలువల, మురుగునీటి వ్యవస్థల మరమ్మత్తు, నిర్వహణలకు తిలోదకాలు ఇచ్చారు. బోర్ల ద్వారా 'వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్తు' అనే హామీని అటకెక్కించారు. సాగునీటిని కూడా ఖరీదైన సరుకుగా మార్చారు. దేశవ్యాప్తంగా రెండు కోట్ల పది లక్షల వ్యవసాయ విద్యుత్తు పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించి, నామమాత్రంగా ఇచ్చే ఉచిత విద్యుత్తును కూడా ఎగవేయనున్నారు.

సెజ్‌లను ఏర్పాటు చేసి, రైతులను భూముల నుండి ఖాళీ చేయిస్తున్నారు. విశాల భూఖండాలలో కార్పొరేట్ కంపెనీలు ఇప్పటికే కాంట్రాక్టు వ్యవసాయం చేస్తూ, భూములను కోల్పోయిన రైతులనే బంధిత పాలేర్లుగా వ్యవసాయ క్షేత్రాలలో వెట్టిచాకిరీ చేయిస్తున్నాయి. మరోవైపున పాలకులు ప్రజా ప్రయోజనం పేరిట, భారీ ప్రాజెక్టుల పేరిట, అభివృద్ధి పేరిట భూములన్నింటినీ దోపిడీదారులకు కట్టబెడుతున్నారు.

దేశీయంగా పండిన పంటలపై ఆధారపడిన వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపన జరిగితే, శ్రామికులందరికీ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల జమిలి అభివృద్ధితో ప్రజలందరి తలసరి ఆదాయాలు, నిజమైన ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. కనుక, దేశ ప్రజల అవసరాలకు అనుగుణమైన స్వతంత్ర వ్యవసాయ విధాన అభివృద్ధికి... గత ఏడున్నర దశాబ్దాలుగా కేంద్రంలో, రాష్ట్రాలలో పాలన సాగిస్తున్న, భూస్వామ్య సామ్రాజ్యవాద ప్రయోజనాలకు కొమ్ముకాస్తున్న-దళారీ పాలకులే ఆటంకం అని నిర్ధారణ అవుతోంది.

**కౌలు రైతుల సమస్యలు : గ్రామీణ వలసలు**

వ్యవసాయం గిట్టుబాటు గాక, భూములను తెగనమ్ముకునే వారు కొందరైతే, మరికొందరు ఆ భూములను కౌలుకు ఇచ్చి, పట్టణాలకు తరలి వెళ్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మరే ఇతర ఉపాధి అవకాశాలు లేక, కూలి నాలి పనులు చేసుకుంటూనే, ఆశ చావక, భూమిని కౌలుకు తీసుకొని సన్న-చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు కొందరు సాగు చేసుకుంటున్నారు.

సాగు సంక్షోభంలో ఉండటంతో, దీనిపై ఆధారపడిన వ్యవసాయ కూలీల, పేదరైతుల, గ్రామీణ పేదలందరి జీవనం దుర్భరంగా మారింది. పాలకుల విధానాల ఫలితంగా చేతివృత్తులు, చేనేత పరిశ్రమ దెబ్బతినటం... చేపల - రొయ్యల పెంపకం, కోళ్ల పరిశ్రమ కునారిల్లు తుండడంతో, వీటిపై ఆధారపడిన గ్రామీణ శ్రామికుల ఉపాధి తరిగిపోతోంది. వ్యవసాయ కూలీలలో అత్యధికులుగా ఉన్న భూమి హీనులైన దళిత, వెనుకబడిన సెక్షన్లపై... గ్రామాలలో అగ్రకుల, పెత్తందారీ వర్గాల దాడులు, దౌర్జన్యాలు, మహిళలపై అత్యాచారాలు రోజువారీ వార్తలవుతున్నాయి. పేదల పాలిట వరంగా కీర్తించబడే 'గ్రామీణ ఉపాధి హామీ పథకం' పూర్తిగా అవినీతిలో కూరుకుపోయింది. పాలకవర్గ పార్టీలకు చెందిన నాయకులకు పలహార పథకంగా

మారిపోయింది. గ్రామాల్లో జీవనాధారం కరువై, పొట్ట చేత పట్టుకొని చౌక కూలీలుగా పట్టణాలకు, గల్ఫ్ దేశాలకు, యుద్ధ రంగంలో పనిచేసేందుకు సైతం సిద్ధపడి వెళుతుండడం.... గ్రామీణ ఉపాధి హామీ పథకపు డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తోంది.

**ఆదివాసుల జీవన విధ్వంసం**

గత రెండు దశాబ్దాల కాలంగా అడవులలో నివసించే ఆదివాసుల జీవన విధ్వంసం తీవ్రమవుతోంది. 2006 సంవత్సరంలో వచ్చిన 'అటవీ హక్కుల చట్టం'.... తరతరాలుగా అడవులలో నివసించే ఆదివాసులను ఆక్రమణ దారులుగా, నేరస్తులుగా పరిగణించింది. తగిన రుజువులు, సాక్ష్యాలు సమర్పించలేదనే కారణంగా 20 లక్షల మంది ఆదివాసులను అడవుల నుండి తొలగించాలని, 2019లో దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆదివాసుల ప్రతిఘటనతో తాత్కాలికంగా ఆ చర్య నిలిచిపోయినా, వారి మెడపై ఆ కత్తి వేలాడుతూనే ఉంది.

దీని కొనసాగింపుగా.... 2023లో మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేసిన 'అటవీ సంరక్షణ (సవరణ) చట్టం' ఆదివాసుల హక్కులను, వారు పోరాడి సాధించుకున్న 1/70, పీసా వంటి చట్టాలను నిరుపయోగం చేస్తోంది. అటవీ గర్భాలలో నిక్షిప్తమై ఉన్న విలువైన ఖనిజ సంపద, 'శక్తి' ఇంధనాల తవ్వకాల కోసం.... బడా కార్పొరేట్ సంస్థలకు అడవులను ధారాళంగా పందేరం చేస్తూ, ఆదివాసుల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తోంది.

మన రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తికాకుండానే, వేలాది ముంపు గ్రామాల ప్రజలను పాలకులు నిర్వాసితులుగా చేశారు. శాస్త్రీయ, సమగ్ర పునరావాసం కల్పించకుండానే, లక్షలాది మంది ఆదివాసులను అడవి తల్లి ఒడి నుండి విసిరివేశారు. కనీస సౌకర్యాలు లేని పునరావాస కాలనీలలో వారందరినీ కుక్కారు. స్వేచ్ఛగా జీవనం సాగించే ఆదివాసులను....అడవికి, భూమికి దూరం చేశారు.

***మిత్రులారా,***

గత మహాసభల నుండి ఈ కాలంలో.... మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఎస్‌కెఎం ఆధ్వర్యంలో సాగిన దీర్ఘకాల ఐక్య ఆందోళనలో భాగస్వామ్య సంఘంగా క్రియాశీలకంగా పాల్గొన్నాము. కార్మిక-రైతాంగ ఐక్యతా వశ్యకతను చాటి చెబుతూ, పలు కార్యక్రమాలు చేపట్టాం... సదస్సులు నిర్వహించాం. రైతాంగ ఆందోళనలు ప్రతిబింబిస్తూ అనేక కరపత్రాలు బుక్‌లెట్‌తోపాటు, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) బులిటెన్లను ప్రచురించాం. 2016 మహాసభల ప్రత్యేక సంచికతో పాటు, 2018 వార్షిక సంచికను ప్రచురించి రైతాంగ ప్రజానీకం మధ్యకు తీసుకువచ్చాం.

పోలవరం నిర్వాసిత గ్రామాల ప్రజలకు.... సమగ్ర, శాస్త్రీయ పునరావాసం కల్పించాలని, నిర్దిష్ట డిమాండ్లపై ఆదివాసులు అనేక ఆందోళనలు సాగించారు. భూములు కొనుగోలు చేసి ఇస్తామన్న ప్రభుత్వ ఒప్పంద అమలు కోసం ఆందోళన సాగిస్తున్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై పుస్తకం వెలువరించాము.

'అడవుల నుండి ఆదివాసులను గెంటివేసే పాలకుల కుట్రలను ఎదుర్కొందాం' అనే నినాదంతో తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాలతో కలిసి ఏఐకెఎంకెఎస్ ఆధ్వర్యంలో 2019 జూన్‌లో విశాఖలో ఆదివాసీ సదస్సు నిర్వహించాము. అటవీ సంరక్షణ (సవరణ) చట్టాన్ని నిరసిస్తూ విస్తృత ప్రచార, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాం.

రైతాంగంపై సామ్రాజ్యవాదుల పట్టును పెంచే 'ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం' (ఆర్‌సిఈపి)కి వ్యతిరేకంగా రాష్ట్ర సదస్సు నిర్వహించి, రైతాంగ ప్రజానీకాన్ని చైతన్య యుతులను చేశాం. అలాగే, కేంద్ర ప్రభుత్వ పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి విధానం, సిఏఏ, ఎన్‌ఆర్‌సిల అమలు, మైనారిటీలపై హిందూ మతతత్వ దాడులను నిరసించాం.

అనంతపురం జిల్లాలో కరువు పరిస్థితులకు కారణమైన పాలకుల విధానాలను, రాష్ట్రస్థాయి వాస్తవ సేకరణ కమిటీ ద్వారా వెల్లడి చేశాం. ఏర్పేడులో ఇసుక మాఫియా దౌర్జన్యాలను బహిరంగపరిచాం.

ఈ క్రమంలో కార్యక్రమాల అమలును సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ణయించుకునేందుకు **2024 జూన్ 15,16, 17 తేదీలలో, ఏలూరులో,** అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి నేపథ్యంలో, చారిత్రక రైతాంగ పోరాట వారసత్వ ప్రాధాన్యత గల ప్రాంతంలో.... రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నాము. కావున ఈ మహాసభలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

**విప్లవాభినందనలతో...**

**రైతుకూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్)**

**(ఏఐకెఎమ్‌కెఎస్ అనుబంధం)**

**విజయవాడ, 16-05-2024**

**కృషీవలా! నీవె కారణమవు**
**సాంఘికోత్కృష్ట సౌభాగ్య సౌఖ్యములకు**
**ఫలమనుభవించు వారు పరులు**
**నీకు గట్టం గుడువను గరవె యెక్కాలమందు**

**- దువ్వూరు రామిరెడ్డి**
"కృషీవలుడు" నుండి

With Best Compliments from..... గాంధీజీ గ్రామ స్వరాజ్యం - సహకార సంఘాలకే సాధ్యం

ఎ తరగతి బ్యాంక్ | ప్రగతి పథంలో | స్థాపితం : 1928

# ది గాంధి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి.

నెం. హెచ్.948



హెడ్ ఆఫీస్ : మ్యూజియం రోడ్, విజయవాడ-2, ఫోన్ : 0866-2433379, 2436365

## డిపాజిట్లపై వడ్డీ పొందండి

**8.50%** ఇతరులకు

**9.00%** 60 సం॥ల పైన వయస్సు సీనియర్ సిటిజన్స్‌కు

**9.25%** 80 సం॥లపైన వయస్సు సూపర్ సీనియర్‌సిటిజన్స్‌కు




| డిపాజిట్లపై వడ్డీ రేట్లు | సాధారణ పౌరులకు | సీనియర్ సిటిజన్స్‌కు | సూపర్ సీనియర్ సిటిజన్స్‌కు |
|---|---|---|---|
| 15 రోజుల నుండి 29 రోజుల వరకు | 4.50% | 4.50% | 4.50% |
| 30 రోజుల నుండి 90 రోజుల వరకు | 5.50% | 6.00% | 6.25% |
| 91 రోజుల నుండి 180 రోజుల వరకు | 6.50% | 7.00% | 7.25% |
| 181 రోజుల నుండి 1 సంవత్సరం వరకు | 7.50% | 8.00% | 8.25% |
| 1 సం॥ పైన 2 సం॥ల వరకు | 8.00% | 8.50% | 8.75% |
| 2 సం॥ పైన | 8.50% | 9.00% | 9.25% |

బంగారు నగల హామీపై ఇచ్చు ఋణములపై వడ్డీ రేట్లు

**Gold Loan @ 0.75 పై. per annum* 9%**



నూతన ఇంటి నిర్మాణం / కొనుగోలు, విద్యా ఋణములు, వ్యాపార ఋణముల పై 12% (రూ. 1.00 పై) వడ్డీ మాత్రమే

ఇతర ఋణములపై 12.50% (రూ. 1.04 పై) వడ్డీ మాత్రమే

స్థిరాస్తి తనఖాపై ఇచ్చు ఋణముల సత్వర ప్రక్రియకు కావలసిన పత్రాలు

- ఇంటి దస్తావేజు
- గత కొనుగోళ్ళకు సంబంధించిన దస్తావేజులు
- ఇటీవల ఇంటి పన్ను రసీదు
- ఇటీవల తీయించుకున్న పాస్‌పోర్ట్ ఫోటోలు-6
- జిరాక్స్ కాపీతో పాటు ఆధార్‌కార్డు, పాన్ కార్డు
- ఇంటి ఫోటోలు-2 (మ్యాక్సి సైజ్)



NEFT RTGS IMPS RuPay NACH NATIONAL AUTOMATED CLEARING HOUSE

EMI చెల్లింపు కొరకు NACH ఫారం సబ్మిట్ చేయగలరు

వ్యాపారస్తులకు ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం కలదు (ఇంటి తనఖాపై)

- సేవింగ్స్ ఖాతాపై 4% వడ్డీ ఇవ్వబడును
- సేఫ్ డిపాజిట్ లాకర్ల సౌకర్యం కలదు

విజ్ఞప్తి : డెబిట్ కార్డు నెంబర్, సివివి (CVV) పిన్ (PIN) నెంబర్, అకౌంట్ నెంబర్, ఫోన్‌కి వచ్చే ఓటీపీ (OTP) ఎవరికీ తెలియపరచరాదు చెప్పరాదు, తగు జాగ్రత్తలు తీసుకోగలరు.

మా బ్రాంచీలు:



పది దశాబ్దాలుగా సహకార రంగంలో సామాన్యులకు విశేష సేవలందిస్తున్న సహకార బ్యాంకు

- పటమట, విజయవాడ-10, ఫోన్ : 0866-2477488
- అజిత్ సింగ్‌నగర్, విజయవాడ - 15. ఫోన్ : 0866 2401388
- కొత్తపేట, విజయవాడ-1, ఫోన్ : 0866 - 2563338
- నూజివీడు, ఏలూరు జిల్లా, ఫోన్ : 08656-235305
- మైలవరం, ఎన్‌టిఆర్ జిల్లా, ఫోన్ : 08659-223393
- రామవరప్పాడు, విజయవాడ. ఫోన్ : 0866-2843338
- భవానీపురం, విజయవాడ-12, ఫోన్ : 0866 - 2411555
- సత్యనారాయణపురం, విజయవాడ-11. ఫోన్ : 0866 - 2535339
- హనుమాన్ జంక్షన్, కృష్ణాజిల్లా. ఫోన్ : 08656 - 242525
- ఉయ్యూరు, కృష్ణాజిల్లా, ఫోన్ : 08676-235379
- గుంటూరు-2, అరండల్‌పేట3/2, ఫోన్: 0863-2227900
- విశాఖపట్నం, న్యూ గాజువాక, ఫోన్ : 0891-2565656

# జిల్లా మహాసభల ఫోటోలు







అనంతపురం జిల్లా మహాసభ - ప్రదర్శన





గుంటూరు జిల్లా మహాసభ - హాజరైన ప్రజానీకం






ఉమ్మడి కృష్ణాజిల్లా మహాసభ - జెండా ఆవిష్కరణ

# జిల్లా మహాసభల ఫోటోలు







ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహాసభ - ప్రదర్శన







ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మహాసభ - ప్రదర్శన







ప్రకాశంజిల్లా మహాసభ - ప్రదర్శన

# జిల్లా మహాసభల ఫోటోలు






పార్వతీపురం జిల్లా మహాసభ - ప్రదర్శన






ఉమ్మడి నెల్లూరు జిల్లా మహాసభ - జెండా ఆవిష్కరణ







అనకాపల్లి జిల్లా మహాసభ

*With Best Compliments From*

VPR Foundation

Plot no 558, Opp to reliance trends,
Magunta layout, Nellore-3.

With Best Compliments From.....

# కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్

కేంద్ర కార్యాలయము : మచిలీపట్నం, ఫోన్ : 9866057711

ప్రాంతీయ కార్యాలయము : విజయవాడ, ఫోన్ : 9866057171

## బ్యాంకు అందిస్తున్న సేవలు

- అన్ని బ్యాంకుల కంటె సేవింగ్స్ మరియు టర్మ్ డిపాజిట్ల పై అత్యధిక వడ్డీ ఇస్తున్న బ్యాంకు.
- బ్యాంకు డిపాజిట్ల పై రూ. 5 లక్షల వరకు ఇన్సూరెన్స్ భద్రత.
- అన్ని బ్రాంచీలలో ATMల సౌకర్యం.
- ATM లేని గ్రామాలకు మొబైల్ ATM వ్యాన్ సౌకర్యం.
- ఖాతాదారులకు ATM & RUPAY డెబిట్ కార్డుల సౌకర్యం.
- మొబైల్ బ్యాంకింగ్ యాప్ ద్వారా RTGS / NEFT / IMPS సేవల సదుపాయం.
- అన్ని బ్రాంచీలలో ఖాతాదారులకు సేఫ్ డిపాజిట్ లాకర్ల సదుపాయం.

## MOBILE BANKING APPLICATION

**Step 1 :**
Open Play Store (Or)
QR COde Scanner

**Step 2 :**
Search
"Krishna DCCB A.P."

**Step 3 :**

Scan QR Code
& Download Mobile APP

## ది. 25-7-2024 నుండి డిపాజిట్ల పై చెల్లించు వడ్డీరేట్లు (సం॥నకు)

**సేవింగ్స్ డిపాజిట్ల పై - 4.00%**

**ఫిక్స్‌డ్ డిపాజిట్ల పై**

| | |
|---|---|
| 15 రోజుల నుండి 90 రోజుల వరకు | 6.25 % |
| 91 రోజుల నుండి 180 రోజుల వరకు | 6.75 % |
| 181 రోజుల నుండి 364 రోజుల వరకు | 7.25 % |
| 1 సంవత్సరము నుండి 3 సంవత్సరముల వరకు | 7.75 % |
| 3 సంవత్సరముల ఒక్కరోజు మరియు ఆపైన | 8.00 % |

సీనియర్ సిటిజన్స్‌కు 0.75%
పి.ఎ.సి.యస్.లకు 0.75%
} అదనముగా ఇవ్వబడును.

ఇతర వివరములకు మీ సమీప కృష్ణా డిసిసిబి బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.

అనుబంధం : 1

# రైతాంగ ఉద్యమ, రాజకీయ, నిర్మాణ స్ఫూర్తినందిస్తున్న రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) సావనీర్లు, వార్షిక సంచికలు

**తెలంగాణ,** నక్సలబరీ, శ్రీకాకుళం ఉద్యమాల వారసత్వపు కొనసాగింపులో భాగంగా రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో 2014 సం॥ వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగాను, తదనంతర కాలంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌లోనూ రైతాంగ ఉద్యమ నిర్మాణ కృషి సాగుతూ ఉంది. 2001లో జరిగిన రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభలలో ఎన్నికైన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి అనతి కాలంలోనే హఠాత్తుగా మరణించారు. ఆ తర్వాత జరిగిన సంఘం జనరల్ కౌన్సిల్ సమావేశంలో కామ్రేడ్ ఝాన్సీ అధ్యక్షులుగా ఎన్నికై కొనసాగుతున్నారు.

కాగా, 2001 మహాసభలో కార్యదర్శిగా ఎన్నికైన కామ్రేడ్ కోటయ్య, 2018 డిసెంబర్‌లో మరణించే వరకు ఆ బాధ్యతలను నిర్వహించారు. తదనంతరం జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో కామ్రేడ్ ఎం.ఎస్. నాగరాజు కార్యదర్శిగా ఎన్నికై కొనసాగుతున్నారు. (2024 రాష్ట్ర మహాసభలో కా॥ డి. వర్మ నూతన కార్యదర్శిగా ఎన్నికయ్యారు)

రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) నాయకత్వం-గుంటూరులో జరిపిన రాష్ట్ర మహాసభల తదనంతరం, రాష్ట్ర మహాసభల సావనీర్‌ను విడుదల చేసింది. సంఘ శ్రేణుల ఉద్యమ కార్యాచరణకు, రాజకీయ అవగాహన పెంపొందించుకునేందుకు, ఈ వరుసలోనే ఇప్పటి వరకు 2001, 2002, 2003, 2005, 2007, 2010, 2012, 2016, 2018, 2022, 2023 సంవత్సరాలలో వెలువరిస్తూ వస్తోన్న మహాసభల సావనీర్లు లేదా వార్షిక సంచికలన్నింటినీ ఒక్కసారి సింహావలోకనం చేయడం అవసరం.

❖❖❖

గుంటూరులో **2001** ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో జరిగిన రాష్ట్ర మహాసభల అనంతరం మొదటిగా **మహాసభల సావనీర్‌ను** వెలువరించారు. 110 పేజీల ఈ సావనీర్‌లో మహాసభ విశేషాలు, ఉపన్యాసాలు, తీర్మానాలతో పాటుగా.. 1990ల తర్వాత కాలంలో సంఘం ఆధ్వర్యంలో సాగిన కృషిని క్లుప్తంగా పేర్కొన్నారు.

ప్రపంచీకరణ విధానాలకు ముందస్తుగా, పీవీ నరసింహారావు ప్రధానిగా ముందుకు తెచ్చిన డంకెల్ ప్రతిపాదనలను నిరసిస్తూ... ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంకు-డబ్ల్యూటీవోలు ముఖ్యంగా వ్యవసాయరంగంపై కలిగించనున్న దుష్పరిణామాలను పేర్కొంటూ నిర్వహించిన విస్తృత ప్రచార, ఆందోళనా కార్యక్రమాలను ఈ సావనీర్‌లో సంక్షిప్తంగా పేర్కొన్నారు.

అమరులు కామ్రేడ్స్ పాతర్ల నాగయ్య - విశ్వమోహన్‌రెడ్డిల ప్రాంగణంలో ఈ మహాసభలు జరిగాయి. 2000 ఏప్రిల్ 11న బూటకపు ఎదురుకాల్పులలో రాజ్యం... రైతు కూలీ ఉద్యమ నాయకుడు కామ్రేడ్ విశ్వమోహన్ రెడ్డి, పీడిత మహిళా నాయకురాలు కామ్రేడ్ మరియమ్మలను
























హత్య గావించి సంవత్సరం అయిన నేపథ్యంలో ఈ మహాసభలు గుంటూరులో జరిగాయి.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ మాజీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ కె.రాజా రామ్‌మోహన్‌రావు ఆహ్వాన సంఘ అధ్యక్షునిగా గుంటూరులో రాష్ట్ర మహాసభలు జరిగాయి. నక్సల్బరీ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ కానూ సన్యాల్ ఈ మహాసభలలో ప్రారంభోపన్యాసం చేయడం విశేషం. ప్రజాతంత్ర మేధావి, భారత జన ఆందోళన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.డి శర్మ, వ్యవసాయ శాస్త్రవేత్త కె.ఆర్.చౌదరి, తదితర ప్రముఖులు ఈ మహాసభలలో పాల్గొని ప్రసంగించారు.

ఈ మహాసభల నిర్వహణలో విస్తృతంగా పాల్గొని కృషిచేసిన పీడిత ప్రజా ఉద్యమ నాయకుడు కామ్రేడ్ అంగడి చెన్నయ్య 2001 డిసెంబర్ ఒకటిన హత్యగావించబడ్డారు.

ఈ మహాసభల సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ విప్లవ పోరాటం, సామ్రాజ్యవాద యుద్ధ బీభత్సాలను సాంస్కృతిక సామ్రాజ్యవాద దాడులను, కార్మిక-రైతాంగ పోరాటాలను చిత్రించిన... చిత్ర కళా ప్రదర్శన ఏర్పాటు మరో విశేషం.

ఈ మహాసభలలో 'గ్రామీణ పేదలు-రైతాంగంపై రుణభారం' 'గ్రామీణ పేదల భూమి సమస్య-ప్రభుత్వ సంస్కరణలు, చట్టాలు' 'కరువు-గ్రామీణ పేదల వలసలు' ప్రధాన అంశాలుగా చర్చలు జరిగి తీర్మానాలను ఆమోదించారు.

❖❖❖

2001 మహాసభల సావనీర్ కొనసాగింపుగా **వార్షిక సంచిక-2002**ను సంఘం వెలువరించింది. ఈ సంచికలో 'వ్యవసాయ రంగ సంక్షోభం-కారణాలు-పరిష్కారాలు' అంశంపై 2002 ఏప్రిల్‌లో విశాఖలో జరిగిన రాష్ట్ర సదస్సు రిపోర్టును, గ్రామీణ రుణభారంపై నిడమర్రులో జరిగిన చర్చాగోష్టి విశేషాలను, ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగంపై నిపుణుల కమిషన్ నివేదికను అందించారు.

2002 జూలైలో జరిగిన సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ రిపోర్టుతో పాటుగా, కష్టజీవి మహిళల, గిరిజనుల, దళితుల, చేనేత కార్మికుల, ఉప్పు రైతుల, పొగాకు, పత్తి, మిర్చి, ధాన్యం, చెరకు, సుబాబుల్, జామాయిల్ రైతుల సమస్యలపై సాగించిన కార్యక్రమాలు, కరపత్రాలు అందించారు.

ఈ సంచికలో.... అనుబంధంగా, జమీందారీ విధానానికి వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమం-ముఖ్యంగా మునగాల, లింగగిరి జమీందారీ ప్రాంతాలలోని దుర్భర స్థితిగతులను వివరించే చంద్ర రాజేశ్వరరావు గారి వ్యాసం, ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన చారిత్రాత్మక రైతు రక్షణ యాత్ర పూర్వాపరాలను వివరించిన నండూరి ప్రసాదరావు గారి, పరకాల పట్టాభి రామారావు గారి వ్యాసాలు, తెలంగాణ సాయుధ పోరాట నాయకులు కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి నల్గొండ జిల్లా కోటపాడులో రజాకారు మిలిటరీపై సాగించిన సాయుధ దాడి పూర్వాపరాలపై వ్రాసిన వ్యాసం.... ఈ సంచికలో ప్రచురించారు. 'తాకట్టులో భారతదేశం'లో భాగంగా 'పీడితుల్లోకెల్లా అధమాధములు గిరిజనులు' అనే కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి గారి రచనను ఇందులో అనుబంధంగా ప్రచురించారు.

❖❖❖

దాదాపు 100 పేజీలతో వెలువడిన **వార్షిక సంచిక-2003**లో.... రాష్ట్రంలో నాటి అధికార తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో, రాష్ట్ర సంపదలను పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద శక్తులకు దోచిపెడుతూ, దీనినే

అభివృద్ధిగా, హైటెక్ పాలనగా చెప్పుకోవటాన్ని వెల్లడి చేశారు. పెరుగుతున్న వ్యవసాయ కార్మికుల, పేద రైతుల వలసలు, రుణభారం, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల మూలంగా పెరుగుతున్న ఆత్మహత్యల విషాదాన్ని నమోదు చేశారు. నీటికి కూడా మీటర్లు పెట్టి అమ్మబూనుకోవడాన్ని నిరసించారు.

ఈ సంచికలో.... 'గ్రామీణ రుణ భారం–నీటి ప్రైవేటీకరణ–విత్తనాల సమస్య' ప్రధాన అంశాలుగా హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర సదస్సు ప్రసంగ పాఠాలు అందించారు. విత్తన హక్కు రైతుదేనని, డబ్ల్యూటీవో నుండి భారత్ బయటకు రావాలని డిమాండ్ చేస్తూ ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరి, సామ్రాజ్య వాదానికి–రుణభారానికి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చిన డాక్టర్ బి.డి.శర్మల ప్రసంగాల పూర్తి పాఠాలను అందించారు. డాక్టర్ జస్వంతరావుతో పాటు డాక్టర్ పివిఆర్ భాస్కరరావు, ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య తదితరులు వివిధ అంశాలపై చేసిన ప్రసంగాల పాఠాలను అందించారు. అలాగే వ్యవసాయ రంగ సంక్షోభంపై విశాఖలో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సులో ప్రొఫెసర్ నాగేశ్వర్ పూర్తి ప్రసంగ పాఠం అందించారు.

ఈ సంచిక అనుబంధంలో.... మార్క్స్ వివరించిన 'స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ'ను వివరిస్తూ కామ్రేడ్ సి.వి. రాసిన వ్యాసాన్ని ప్రచురించారు. భారతదేశ పరిణామ క్రమంలో ఉత్పత్తి సంబంధాలు, సాంఘిక సంబంధాలలో జరుగుతూ వచ్చిన మార్పులు.... కులాలు, మతాలు, ఆవిర్భవించిన పరిస్థితుల్ని ఈ వ్యాసం వివరించింది.

అలాగే, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో జత కలిసి రైతాంగాన్ని సంఘటితపరచడం గూర్చి, రెండవ ప్రపంచ యుద్ధానంతరం రైతు పోరాటాల విజృంభణ గూర్చి కామ్రేడ్ వై.వి. కృష్ణారావు వ్రాసిన వ్యాసాన్ని ప్రచురించారు. ఆనాడు బ్రిటీష్ సామ్రాజ్య వాదం, ఫ్యూడల్ జమీందారీ వర్గం... రైతాంగాన్ని పీల్చిపిప్పి చేయడాన్ని వ్యతిరేకిస్తూ, కష్టజీవుల రాజ్యం లక్ష్యంగా సాగించిన కృషిని ఈ వ్యాసాలు వివరించాయి. చల్లపల్లి, ముక్త్యాల, మీర్జాపురం, కోలంక, పోతునూరు, కానూరు, పెండ్యాల, జిల్లెళ్లగూడెం, కుంకాల, పెంద్రాల, మందస, వెంకటగిరి... మొదలగు ప్రాంతాలలో సాగిన జమీందారీ వ్యతిరేక రైతు పోరాటాలతో పాటుగా 'రైతు దండు' ఏర్పాటును గూర్చి వివరించారు.

1971–72 సంవత్సరాలలో టివిఎన్ 'తాకట్టులో భారత దేశం'లో... ఈనాడు దళితులుగా పిలవబడుతున్న ఎస్సి, బిసి విభాగాల వ్యవసాయ కార్మికుల జీవనస్థితిగతులను గణాంక సహితంగా వివరించి, 'తెగించిన ఆగ్రహం అనివార్యం' అని పేర్కొన్న అధ్యాయాన్ని ఈ సంచికలో అనుబంధంగా అందించారు. భీమిరెడ్డి నరసింహారెడ్డి... 'భూ కేంద్రీకృతం' వ్యాసాన్ని, కష్టజీవి మహిళా ఉద్యమంలో, ప్రత్యేకంగా, తూర్పుగోదావరి జిల్లాలో కామ్రేడ్ భూపతి కమలమ్మ పాత్ర గురించి వివరిస్తూ జి.నరసింహమూర్తి వ్రాసిన వ్యాసాన్ని ప్రచురించారు. కష్టజీవులైన మహిళలు, యువత దోపిడీ శక్తులను ఎదుర్కొని వర్గ పోరాటాలలో రాటుదేలి విజ్ఞానమూర్తులైన కార్యకర్తలుగా ఎదిగిన అనుభవాలను ఈ వ్యాసంలో అందజేశారు.

'ఆసియా సోషల్ ఫోరం' సమావేశాల సందర్భంగా.... 'భూమి, ప్రజల జీవనాధారాలపై ప్రపంచీకరణ ప్రభావం' అనే శీర్షికతో, ప్రపంచీకరణ నేపథ్యంలో.. 'ఆదివాసులు–భూమి సమస్య' అనే అంశంపై, 'భారత వ్యవసాయ రంగం–ప్రభుత్వ విధానాలలో వస్తున్న మార్పుల'పై రూపొందించిన పత్రాలను ఈ సంచికలో అందించారు.

❖❖❖












**2005** జూన్‌లో అనకాపల్లిలో జరిగిన **రాష్ట్ర మహాసభల విశేషాలతో సావనీర్** దాదాపు 100 పేజీలతో వెలువడింది. రైతు కూలీ సంఘంగా గ్రామీణ ప్రాంత వర్గ సమస్యలు, వైరుధ్యాలు, గ్రామీణ పేదల ఐక్యత, ఐక్య సంఘటన నిర్మాణం లోని జటిలత్వం, వివిధ రైతు-కూలీ సంఘాల నిర్మాణాల మధ్య ఐక్య కార్యాచరణ, ఐక్యతా క్రమం... మొదలైన అంశాలలో సంఘర్షణ పడుతూ 2001 మహాసభల నుండి ఈ మహాసభల మధ్యకాలంలో సాగించిన కీలక కార్యక్రమాల వివరాలను ఈ సావనీర్లో అందించారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా, దేశభక్తియుత రైతాంగ ప్రచార వాలంటీర్ల ప్రదర్శన, ఆందోళనా కార్యక్రమాలను వివరించారు. వివిధ జిల్లాలలో జరిపిన జిల్లాస్థాయి మహాసభల విశేషాలను అందించారు. ఈ మహాసభలో 'ప్రపంచీకరణ-వ్యవసాయ రంగం', 'రైతాంగ రుణభారం-ఆత్మహత్యలు-పరిష్కారాలు', 'ఆహార భద్రత-ప్రజా పంపిణీ వ్యవస్థ', 'గిరిజనులు-భూపరాయీకరణ, ప్రాజెక్టులు-పునరావాసం' మొదలైన అంశాలపై అనేకమంది మేధావుల ప్రసంగపాఠాలు ఈ సావనీర్‌లో ఉన్నాయి.

ఈ సావనీర్‌లో అనుబంధంగా... కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు రాసిన 'నల్గొండ ప్రజల వీరోచిత పోరాటం' అనే వ్యాసంలో వర్గ దృక్పథం, ఐక్య సంఘటన దృక్పథం, సంఘటిత నిర్మాణ దృక్పథం, ప్రజా ప్రతిఘటన దృక్పథాలను అన్వయించి, ప్రజా పోరాటాలను అభివృద్ధి చేసిన అనుభవాలను వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న రైతాంగ సంక్షోభ నేపథ్యంలో నాటి ప్రభుత్వం జయతీ ఘోష్ అధ్యక్షతన నియమించిన వ్యవసాయ కమిషన్‌కు, రైతాంగ సమస్యలతో పాటుగా నిర్దిష్ట డిమాండ్లతో అందజేసిన పత్రాన్ని ప్రచురించారు.

❖❖❖

**2007 వార్షిక సంచిక** 110 పేజీలతో వెలువడింది. ఇందులో... 2007లో ఏలూరులో జరిగిన జనరల్ కౌన్సిల్లో ఆమోదించిన, 2005-07 కాలంలో సంఘం ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య కార్యకలాపాల నివేదిక, తీర్మానాలను ప్రచురించారు.

ప్రత్యేక ఆర్థిక మండళ్ళు (సెజ్)-2005 చట్టంతో పాటు, సెజ్‌ల పేరుతో, కోస్తా కారిడార్ పేరుతో ప్రజల భూములను గుంజు కోవటాన్ని నిరసిస్తూ, ఆహార పంటలను జీవ ఇంధనంగా మలచటాన్ని, దేశ సంపద అయిన గోదావరి బేసిన్ చమురు సహజవాయు నిక్షేపాలను రిలయన్స్ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని, రణస్థలంలో అణువిద్యుత్ కేంద్ర ప్రయత్నాలను నిరసిస్తూ, సద్దాం హుస్సేన్ ఉరిశిక్షను ఖండిస్తూ, ముదిగొండ కాల్పులను ఖండిస్తూ, 40 సంవత్సరాల కోరన్న, మంగన్నల అమరత్వాన్ని స్మరించుకుంటూ చేపట్టిన కార్యక్రమాలను పేర్కొన్నారు.

ప్రత్యేకించి...1857 నాటి ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామ 150 సంవత్సరాల సందర్భాన్ని స్ఫూర్తిగా తీసుకుంటూ, బ్రిటీష్ వలసవాద వ్యతిరేక పోరాటాలపై మేఘనాథ్ రాసిన వ్యాసాన్ని, అలాగే కోరన్న, మంగన్నల 40 సంవత్సరాల అమరత్వం సందర్భంగా మేఘనాథ్ రాసిన వ్యాసాన్ని ప్రచురించారు.

'వలస పాలనకు వ్యతిరేకంగా, రైతాంగ-కార్మిక పోరాటాలు-నేటికీ ప్రాధాన్యత కోల్పోని భూమి సమస్య' అంశాలపై 2007 సెప్టెంబర్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సులో డాక్టర్ బి.డి.శర్మ ప్రసంగ పాఠాన్ని అందించారు.

'చారిత్రక ప్రాధాన్యత గల తెలంగాణ పోరాటం-భూమి సమస్య' గురించి కామ్రేడ్ ఎస్.ఝాన్సీ రాసిన వ్యాసం, 'ఆహార సంక్షోభం వెనుకనున్న సామ్రాజ్యవాదుల కుతంత్రాన్ని' గురించి ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి రాసిన వ్యాసం, ఝార్ఖండ్‌లో సామ్రాజ్య వాదులు సాగిస్తున్న సహజ సంపదల దోపిడీపై కామ్రేడ్ శంభు మహతో వ్యాసం, 'అమెరికా-భారత వ్యవసాయ విజ్ఞాన చౌరవ ఒప్పందం'పై డాక్టర్ పి.జస్వంత్‌రావు వ్యాసం, అలాగే, ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, దేశవ్యాప్తంగా దళితులపై పెచ్చుమీరుతున్న దాడులు, కోస్తా కారిడార్ పేరున రైతుల భూముల కబళింపు, రిటైల్ రంగంలో బడా, బహుళ జాతి పరిశ్రమల ప్రవేశంతో పెరుగుతున్న రైతాంగ సంక్షోభం, స్థానిక జల వనరులపై ప్రపంచ బ్యాంకు పెత్తనం... తదితర అంశాలపై వ్యాసాలను ఈ సంచికలో ప్రచురించారు. విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలను ఖండిస్తూ, గంగవరం మత్స్యకారులపై పోలీసు కాల్పులను ఖండిస్తూ... సంఘం చేపట్టిన ప్రచార, ఆందోళన కార్యక్రమాలను వివరించారు.

❖❖❖

**2010** మార్చి 23న మరణించిన నక్సల్బరి ఉద్యమ నిర్మాత కామ్రేడ్ కాను సన్యాల్ ప్రాంగణంలో ఏప్రిల్ 12, 13, 14 తేదీలలో ఒంగోలులో జరిగిన సంఘ రాష్ట్ర మహాసభల అనంతరం 130 పేజీలతో **రాష్ట్ర మహాసభల సావనీర్** వెలువడింది.

శ్రీకాకుళం జిల్లా సోంపేటలో భూముల స్వాధీనాన్ని నిరసిస్తూ రైతాంగం సాగించిన ఆందోళనపై పోలీసులు కాల్పులు జరిపి ఇరువురు రైతులను బలిగొనడాన్ని ఖండిస్తూ, కనపర్తి, కోటిపాం సంతబొమ్మాళి థర్మల్ విద్యుత్ కేంద్రాలకు, రణస్థలంలో అణు విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాల విశేషాలను ఈ నివేదికలో అందించారు. ప్రభుత్వ నిర్బంధాలను, దాడులను ఎదుర్కొంటూ చాషీమూలియా ఆదివాసీ సంఘం (ఒడిశా) ఆధ్వర్యంలో కోరాపుట్ ఆదివాసీ ప్రాంతం నుండి 400 మంది గిరిజన ప్రజానీకం, కామ్రేడ్స్ అర్జున్, పైడమ్మల నాయకత్వంలో ఈ మహాసభలకు హాజరయ్యారు. కాగా, మహాసభల నుండి తిరిగి వెళ్ళిన తర్వాత ఆగస్టు 9న, కామ్రేడ్ అర్జున్‌ను మావోయిస్టులు హత్య గావించారు. దీనిని ఖండిస్తూ ఈ సావనీరులో ప్రముఖంగా ప్రస్తావించారు.

రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షులు చెరుకూరి వెంకటేశ్వర్లు గారి స్వాగతోపన్యాసంతో పాటు ప్రముఖ కథా రచయిత సింగమనేని నారాయణ గారి 'మానవ వికాసానికి మూడు గొప్ప అవసరాలైన వ్యవసాయం, విద్య, వైద్యాలను ధ్వంసం చేస్తున్న ప్రభుత్వ విధానాల'పై చేసిన ప్రసంగ పాఠాలను ఈ సంచికలో అందించారు.

2005 నుండి సంఘం నిర్వహించిన కార్యక్రమాలను క్లుప్తంగా

వివరించారు. డాక్టర్ జస్వంతరావు, డాక్టర్ బి.సూర్యసాగర్ మొదలైన మేధావులు, ప్రజాతంత్రవాదుల బరువైన ప్రసంగ వ్యాసాలను ఈ సావనీర్‌లో అందించారు.

చిత్తూరు జిల్లాలోని ప్రత్యేక ఆర్థిక మండళ్ల పరిస్థితిని, ఆ పేరిట సేకరించిన భూముల వివరాలను 'కోస్తా కారిడార్ వ్యతిరేక కమిటీ' ఆధ్వర్యంలో ఓ బృందం పరిశీలన జరిపి అందించిన నివేదికను, పోలవరం ప్రాజెక్టు మునక ప్రాంత ప్రజల పునరావాసం గురించి కె.ఆర్.చౌదరి, అమిత్ ఉపాధ్యాయ తదితరులతో కూడిన వాస్తవ సేకరణ బృందం 2008, 2009 ప్రాంతాలలో ముంపు గ్రామాలలో పర్యటించి రూపొందించిన నివేదికలను ఈ సావనీరులో ప్రచురించారు. అలాగే, రైతు-కూలీ-కార్మిక -యువజన సంఘాల ఆధ్వర్యంలో 2009లో తెలంగాణ జిల్లాలలో 'రైతాంగ ఆత్మహత్యల'పై పరిశీలన జరిపిన బృందం, 'తెలంగాణ రైతాంగ జీవనాధారాలను తోడేస్తున్న పాలకులు' పేరున రూపొందించిన నివేదికను ప్రచురించారు. అలాగే, విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలు, ప్రజా ఆందోళనల నేపథ్యంలో ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు బొజ్జా తారకం మరియు వివిధ ప్రజా సంఘాల నాయకులతో కూడిన బృందం 2009 జూన్‌లో అనంతగిరి గిరిజన గ్రామాలలో పర్యటించి రూపొందించిన నివేదికను ఈ సావనీర్‌లో అందించారు. కర్ణాటక రాష్ట్రం బళ్ళారి వద్ద నిర్మించ తలపెట్టిన విమానాశ్రయం కోసం చేపట్టిన భూ సేకరణలను నిరసిస్తూ ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి, సంఘం నాయకులు కామ్రేడ్ కె.కోటయ్య, కార్మిక నాయకులు కామ్రేడ్ పెద్దన్న తదితరుల ఆధ్వర్యంలో సమస్యను అధ్యయనం చేసి అందించిన వివరమైన నివేదికను ఈ సావనీరులో ప్రచురించారు.

ఆదిలాబాద్ జిల్లా-భైంసా, వటోలి ప్రాంతాలలో మత ఘర్షణలు-పోలీసు కాల్పులు-సజీవ దహనాలపై, సంఘం కార్యదర్శి కామ్రేడ్ కే.కోటయ్య నేతృత్వంలో పరిశీలనా బృందం వెళ్లి మొత్తం పరిస్థితిని పరిశీలించి 'భైంసా, వటోలి ఘటనలు-మతతత్వ శక్తులు విసురుతున్న సవాలు' పేరిట రూపొందించిన వివరణాత్మక నివేదికను ఈ సావనీర్‌లో అందించారు. అలాగే, 2009 జూన్ 17న పనసభద్రపై దాడి గురించి విశ్రాంత న్యాయమూర్తి డి.సత్యనారాయణ రెడ్డి, ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి తదితరుల ఆధ్వర్యంలో నిజనిర్ధారణ బృందం ఆ ప్రాంతంలో పర్యటించి వివరాలు సేకరించి రూపొందించిన నివేదికను ఈ సావనీర్‌లో ప్రచురించారు.

సావనీర్‌లో అనుబంధంగా... వీరోచిత మునగాల రైతాంగ ప్రజా ఉద్యమం గురించి టి.వెంకట్రావు రాసిన వ్యాసం ప్రచురించారు.

❖❖❖

**వార్షిక సంచిక-2012** 130 పేజీలతో వెలువడింది. ఇందులో ప్రధానంగా విశాఖపట్నంలో 2011 డిసెంబర్‌లో జరిగిన అఖిల భారత కార్మిక-రైతు కూలీ సమ్మేళనం, ఏఐకెఎంకెఎస్ అఖిల భారత సదస్సు రిపోర్టులతోపాటు, ఏఐకెఎంకెఎస్ లక్ష్య ప్రకటన కూడా ముద్రించారు. అలాగే, 2011 అక్టోబర్‌లో కాకినాడలో జరిగిన సంఘం జనరల్ కౌన్సిల్ రిపోర్టుతో పాటు తీర్మానాలను ప్రచురించారు. ఈ సందర్భంగా కాకినాడ సెజ్ బాధిత గ్రామాలలో రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర బృందం... డాక్టర్ బి.డి.శర్మ, ప్రొఫెసర్ కె.ఆర్ చౌదరి తదితరులతో కలిసి పర్యటించిన నివేదికను వెలువరించారు. కౌలు రైతుల గుర్తింపు, వారికి రుణాల సమస్యపైన 'పంట విరామం కాదు.. పోరు మార్గాన సాగాల'నే పిలుపుతో, నిరుపేదలను ప్రయోగశాల పశువులుగా (గిని పిగ్స్)గా మారుస్తున్న ఔషధ ప్రయోగాలకు వ్యతిరేకంగా, గ్రామీణ పేదలను, కౌలు రైతులను ఆందోళనలోకి సమీకరించిన కార్యక్రమాలు ఈ వార్షిక సంచికలో ఉన్నాయి.

'పెరుగుతున్న సామ్రాజ్యవాద చొరబాటుతో తీవ్రమవుతున్న వ్యవసాయ రంగ సంక్షోభం-రైతు, కూలీ, దళిత, ఆదివాసీ ప్రజల ముందున్న కర్తవ్యాలు' కేంద్ర అంశంగా 2012 డిసెంబర్‌లో విజయవాడలో జరిగిన రాష్ట్ర సదస్సులో... దళితులపై, ఆదివాసులపై అణిచివేత-కోస్టల్, పెట్రో కారిడార్లు, సెజ్‌లు-థర్మల్, అణు విద్యుత్ కేంద్రాలు- ప్రజల కర్తవ్యాలపై వక్తల ప్రసంగ పాఠాలను అందించారు.

శ్రీకాకుళం జిల్లా లక్ష్మింపేటలో, 2012 జూన్‌లో, దళితులపై కుల దురహంకార పెత్తందారులు సాగించిన దాడిపై, రైతు కూలీ సంఘం రాష్ట్ర పరిశీలన బృంద నివేదిక, బాధితుల పరామర్శతో పాటుగా లక్ష్మింపేట దాడులను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సంఘం ఆధ్వర్యంలోనూ, సంయుక్తం గాను జరిగిన కార్యక్రమాల రిపోర్టులు అందించారు.

ముఖ్యంగా... బొజ్జా తారకం కన్వీనర్‌గా, కామ్రేడ్ ఎస్.ఝాన్సీ ఒక కన్వీనర్‌గా... అనేక దళిత, ప్రజా, రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పడిన 'లక్ష్మింపేట దళిత పోరాట సంఘీభావ కమిటీ' ఢిల్లీ, హైదరాబాదులతో సహా అనేక ప్రాంతాల్లో జరిపిన, పలు కార్యక్రమాలతో పాటు, ముఖ్యంగా లక్ష్మింపేట నుండి శ్రీకాకుళం వరకు సాగించిన 'దళిత ప్రజా నిరసన యాత్ర' తదనంతరం సభా కార్యక్రమాలలో సంఘ శ్రేణులు చురుకుగా పాల్గొన్న విశేషాలను ఈ సంచికలో అందించారు.

పేదల నివాస స్థలాల కోసం... దొండపూడి, పల్నాడు ప్రాంతాల్లో దళిత, ఆదివాసుల ఆందోళనలు, ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంగా ప్రకటించాలనే ఆందోళనల రిపోర్టులు ఈ వార్షిక సంచికలో ఉన్నాయి.

ప్రత్యేకించి... ఉత్తరాంధ్రలో థర్మల్, అణువిద్యుత్ కేంద్రాల స్థాపన ప్రయత్నాలు, దాని కోసం బలవంతపు భూసేకరణ, ప్రజల-రైతుల వ్యతిరేక ఆందోళన, పోలీసుల కాల్పుల నేపథ్యంలో రైతు కూలీ సంఘం(ఆం.ప్ర), స్త్రీ విముక్తి సంఘటనల రాష్ట్ర బృందం 2010 జూలైలో ఆ ప్రాంతాల్లో పర్యటించి నివేదిక వెలువరించింది. సోంపేట, కాకరపల్లిలలో ఆందోళనకారులపై పోలీసు కాల్పులు, నలుగురు రైతుల మృతికి నిరసనగా చేపట్టిన కార్యక్రమాల రిపోర్టులు అందించారు. 2010 సెప్టెంబర్‌లో రైతు కూలీ సంఘం (ఆం.ప్ర),

ఏఐఎఫ్‌టియు(న్యూ)ల ఆధ్వర్యంలో శ్రీకాకుళం, విశాఖపట్నంలలో సదస్సులు, కోటిపాం థర్మల్ విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా... నిర్బంధాలను అధిగమిస్తూ కొనసాగుతున్న ప్రజా ఆందోళనల సంక్షిప్త రిపోర్టు అందించారు.

ఇంకా ఈ సంచికలో వరంగల్ జిల్లా ప్రజా ఆందోళనలు, అనంతపురం జిల్లా తాడిపత్రి స్టీల్ ప్లాంట్ యాజమాన్య దురాగతాలను నిరసిస్తూ సాగించిన కార్యక్రమాల రిపోర్టులు ఉన్నాయి.

రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభల సావనీర్-2001 సంచికను తొలితరం కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ పరకాల 2001 డిసెంబర్లో 'కమ్యూనిజం' పత్రికలో చేసిన సమీక్షను యధాతథంగా ఈ వార్షిక సంచికలో అందించారు.

ఈ సంచిక అనుబంధంలో... కామ్రేడ్ లెనిన్ రచించిన 'కార్మిక వర్గం-రైతాంగం' అనే వ్యాసాన్ని, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండవ సమావేశంలో వ్యవసాయక సమస్యపై కామ్రేడ్ లెనిన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని... రైతాంగ ఉద్యమ కార్యకర్తలు తమ అవగాహన పెంపొందించుకోవడం కోసం అందించారు.

❖❖❖

**2016** జూన్‌లో గుంటూరులో జరిగిన రైతు కూలీ సంఘం (ఆంప్ర) రాష్ట్ర మహాసభల విశేషాలతో 100 పేజీలతో **సావనీర్** ప్రచురించారు.

'వ్యవసాయరంగ సంక్షోభం-భూమి సమస్య-పాలకుల విధానాలు' అనే అంశంపై రైతు కూలీ సంఘం (ఆం.ప్ర), ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 2013 జూన్ 4న రాష్ట్రస్థాయి సదస్సు రిపోర్టును ఈ సావనీర్‌లో అందించారు.

రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) మరియు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం- రెండూ ప్రణాళికల ప్రాతిపదికపై చర్చించుకొని, ఒకే సంఘంగా ఐక్య మవ్వాలని నిర్ణయం జరగటం, రాష్ట్రంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2014 జూన్ నాటికి రెండు రాష్ట్రాలుగా విడివడటంతో రెండు రాష్ట్రాలలో విడివిడిగా ఐక్యతా క్రమాన్ని పూర్తిచేసి ఏఐకెఎంకెఎస్ అనుబంధంగా కొనసాగుతున్న విషయాన్ని ఇందులో వివరించారు.

వ్యవసాయ సంక్షోభం-రుణమాఫీ ఎడల పాలకుల విధానాల గురించి సరైన అవగాహన కల్పించేందుకు 2014 జులై 27, 28 తేదీలలో గుంటూరులో నిర్వహించిన రాష్ట్రసదస్సు విశేషాలను ఈ సావనీర్‌లో వివరించారు.

2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ-రెండు రాష్ట్రాలుగా విడివడటం, కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, వీరి పాలనలో సాగిన రైతాంగ, ప్రజా వ్యతిరేక సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను 2016లో రాష్ట్ర మహాసభల సందర్భంగా విస్తృత ప్రచారం చేశారు. రాష్ట్ర రాజధాని నిర్మాణం పేరిట భూ సమీకరణ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం 33 వేల ఎకరాల భూములను సేకరించటమేగాక భూ బ్యాంకులను ఏర్పాటు చేసి, రైతాంగ భూములను కబళించే ప్రయత్నాలను ఈ సావనీర్‌లో ఎండగట్టారు. భూ సమీకరణ-సేకరణ-రాజధాని ఏర్పాటుపై స్పష్టమైన వైఖరి ప్రకటిస్తూ...2015 ఏప్రిల్‌లో మంగళగిరిలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సు రిపోర్టును ఈ సావనీర్‌లో అందించారు.

మహాసభలలో భాగంగా 'వ్యవసాయ రంగంపై బిగుస్తున్న సామ్రాజ్యవాదుల పట్టు-రైతు, కూలీల కర్తవ్యాల' పై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. 'అభివృద్ధి పేరుతో భూమి నుండి, అడవి నుండి గెంటివేయబడుతున్న రైతు, కూలీలు, ఆదివాసులు - పెరిగిపోతున్న వలసలు' 'కునారిల్లిపోతున్న వ్యవసాయధారిత పరిశ్రమలు-ఉపాధి కోల్పోతున్న రైతులు, రైతు కూలీలు, కార్మికులు', 'విప్లవ భూ సంస్కరణలే పరిష్కారమని చాటి చెప్తున్న వ్యవసాయరంగ సంక్షోభం' అనే అంశాలపై వక్తల ప్రసంగాలను, తీర్మానాలను సావనీర్‌లో ప్రచురించారు.

మహాసభల ఆహ్వాన సంఘ గౌరవాధ్యక్షులు మాజీ వైస్ ఛాన్సలర్ దావులూరి రామకోటయ్య గారు మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సందేశమిచ్చారు. ఆహ్వాన సంఘ అధ్యక్షులు, నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ స్వాగతోపన్యాసం చేశారు. 2010 రాష్ట్ర మహాసభల నుండి 2016 వరకు సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యకలాపాల క్లుప్తమైన నివేదికను ఈ సావనీర్‌లో అందించారు. పోలవరం నిర్వాసిత గ్రామాల సమస్యపై సంఘం ఆధ్వర్యంలో జరిగిన విస్తారమైన కృషిని పేర్కొన్నారు. 2015 జూలైలో రాజమండ్రిలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై రాష్ట్ర సదస్సు నిర్వహించి ప్రభుత్వ పునరావాస విధానాల డొల్లతనాన్ని ఎండగట్టారు.

ప్రజాతంత్ర మేధావి, ఆదివాసుల ఆత్మబంధువు,రైతాంగ ఉద్యమ మిత్రులు డాక్టర్ బి.డి శర్మ... 2017 డిసెంబర్ 6న మరణించారు. ఆయనకు ఘన నివాళి అర్పిస్తూ విజయవాడ, విశాఖ, హైదరాబాద్‌లలో సంస్మరణ సభలు నిర్వహించి 'ఆదివాసుల ఆత్మబంధువు, రైతాంగ ఉద్యమ మిత్రులు-డాక్టర్ బి.డి శర్మ' అనే 100 పేజీల పుస్తకాన్ని ప్రచురించారు.

అలాగే, భూమి సమస్యతో ముడిపడిన దళితుల ఆత్మగౌరవ అంశాన్ని, దేశంలో నానాటికి దళితులపై పెరుగుతున్న దాడులకు, దౌర్జన్యాలకు మూలమైన వ్యవస్థ స్వభావాన్ని విశ్లేషిస్తూ 'అణచబడ్డ దళితులంతా తిరగబడండి' అనే 144 పేజీల పుస్తకాన్ని తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో వెలువరించిన విశేషాలను ఈ సావనీర్‌లో తెలిపారు.

❖❖❖

**రైతు కూలీ సంఘం (ఆంప్ర) వార్షిక సంచిక- 2018**...120 పేజీలతో వెలువరించారు. 2018 ఆగస్టులో విజయనగరంలో జరిగిన సంఘం జనరల్ కౌన్సిల్ సమావేశాల విశేషాలు, డాక్టర్ పి.జస్వంత్‌రావు, సుభోద్ మిత్రా, డాక్టర్ మర్ల సోమసుందర్‌ల ప్రసంగ వ్యాసాలు ఈ సంచికలో ఉన్నాయి. 2016 నుండి 2018 మధ్యకాలంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యమైన

కార్యకలాపాల నివేదికను కామ్రేడ్ ఝాన్సీ ఈ జనరల్ కౌన్సిల్లో ప్రవేశపెట్టారు. 'ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం' (ఆర్‌సిఇపి) పేరిట వ్యవసాయం, రైతాంగంపై సామ్రాజ్యవాదుల పట్టు బిగించే ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ రైతు-కూలీ-కార్మిక-యువజన సంఘాల ఆధ్వర్యంలో 2017 సెప్టెంబర్ విజయవాడలో జరిపిన రాష్ట్ర సదస్సు రిపోర్ట్‌తోపాటు ఈ సదస్సు ఆమోదించిన వివరణాత్మకమైన, ప్రాధాన్యత గల తీర్మానం ఈ సంచికలో ఉన్నాయి. అలాగే 'ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చరల్ మార్కెటింగ్' (ఈ-నామ్) పేరిట రైతులను, కార్మికులను, మార్కెట్ యార్డ్ హమాలీలను, చిన్న వ్యాపారులను దెబ్బతీసే, భారత వ్యవసాయ మార్కెట్‌ను కార్పొరేటీకరించే ప్రభుత్వ విధానాల్ని వ్యతిరేకిస్తూ కార్మిక-రైతాంగం నడుమ జరిపిన ప్రచార కార్యక్రమాలు ఈ సంచికలో ప్రచురించారు.

కేంద్రంలో బిజెపి పాలకులు హిందూ మతతత్వాన్ని రెచ్చగొడుతూ, కష్టజీవుల సహజీవన సంస్కృతిని విచ్ఛిన్నం చేయడాన్ని, గో పరిరక్షణ, లవ్ జిహాద్ వంటి పేర్లతో ముస్లింలపై, దళితులపై సాగిస్తున్న హంతక దాడులను నిరసిస్తూ సాగించిన కార్యక్రమాల వివరాలను అందించారు.

రాయలసీమ దుర్భర కరువు పరిస్థితులను వెల్లడి చేసేందుకు... సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ ఝాన్సీ కన్వీనర్‌గా, సూర్యసాగర్, ప్రముఖ రచయిత సింగంనేని నారాయణ, అమరులు కామ్రేడ్స్ పెద్దన్న, తిమ్మారెడ్డి, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం భాషా తదితరులు సభ్యులుగా ఒక వాస్తవ సేకరణ కమిటీ 2017 మార్చ్‌లో కదిరి, రాయదుర్గం ప్రాంతాలలో పర్యటించి, పాలకుల దుర్మార్గ నిర్లక్ష్య విధానాలను వెల్లడి చేసింది. ఈ వివరాలతో 'అనంత కరువు' పేరిట సంఘం ఒక బుక్‌లెట్‌ను ప్రచురించిన వివరాలను అందించారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, దీనిని ఎదుర్కోవటంలో సమైక్య ఉద్యమానికి ఆటంకంగా ఉన్న వివిధ సంఘాల వైఖరులను గురించి వివరించే వ్యాసం, గోదావరి డెల్టా గ్రోయిన్ల నిర్మాణంలో అవకతవకలపై... సంఘం ఆధ్వర్యంలో పరిశీలన జరిపిన అనంతరం వెలువరించిన ప్రాథమిక నివేదిక, ఇసుక మాఫియాల దోపిడీ దౌర్జన్యాలలో భాగంగా చిత్తూరు జిల్లా ఏర్పేడులో 16 మంది పైగా మృతి చెందిన ఘటనపై రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో పరిశీలన జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వెలువరించిన రిపోర్టు, చుక్కల భూములనే సాకుతో తమ సొంత భూములపై రైతుల హక్కులను నిరాకరిస్తున్న ప్రభుత్వ విధానాలపై సంఘం చొరవతో నెల్లూరు జిల్లాలో 'చుక్కల భూముల రైతాంగ ఐక్యవేదిక' సాగించిన కార్యక్రమాల వివరాలు ఈ సంచికలో ఉన్నాయి.

వార్షిక సంచిక అనుబంధంలో... చైనాలో వ్యవసాయ సంస్కరణల సందర్భంగా క్షేత్రస్థాయిలో తలెత్తిన ప్రధాన పొరపాట్లను, తీసుకోవలసిన జాగ్రత్తలను, కార్యకర్తలు పెంపొందించుకోవలసిన అవగాహనను వివరిస్తూ... జెన్ లీ పెన్ రాసిన వ్యాసాన్ని, 1965 ప్రాంతంలో వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులు, భూస్వాములు... ప్రజలపై సాగించిన దాడులు, హత్యాకాండ, బీభత్సాలని గురించి నాటి శాసనసభ పక్ష నాయకులు కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య గార్ల ప్రసంగాలను; తమ భూముల, నీటి వనరుల ఆక్రమణకు వ్యతిరేకంగా ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలలో రైతాంగం - ప్రజలు సాగిస్తున్న ఉద్యమాలను, దేశీయంగా మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద నోట్ల రద్దు, జిఎస్టిల అమలుతో ప్రజలపై, చిన్న వ్యాపారులపై, చిన్న పరిశ్రమలపై చూపిన దుష్ప్రభావాలను... ఈ సంచికలో అందించారు. కర్ణాటక రాష్ట్రం-చాగనూరు, సిరివార రైతాంగ ప్రజానీకం, 2008 సంవత్సరం నుండి తమ భూములను కాపాడుకునేందుకు సాగిస్తున్న భూ రక్షణ పోరాటానికి సంఘీభావం తెలుపుతూ, ప్రస్తుత అర్ధ ఫ్యూడల్ వ్యవస్థ స్వభావాన్ని చాటి చెబుతూ దేశవ్యాప్తంగా దళితులపై సాగుతున్న హంతక దాడులు, దౌర్జన్యాలను ఖండిస్తూ వ్రాసిన వ్యాసాలను అందించారు.

2017లో అక్టోబర్ విప్లవ శతవార్షిక సందర్భంగా, 2017లో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి శతజయంతి సందర్భంగా, 2018లో కార్ల్ మార్క్స్ ద్వి శత జయంతి సందర్భంగా ఆ మహనీయులకు నివాళులర్పిస్తూ జరిగిన పలు కార్యక్రమాలలో సంఘ శ్రేణులు భాగస్వాములయ్యారు. ఈ కాలంలోనే సంఘం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోటయ్య, సహాయ కార్యదర్శి కా॥ వై.సోనీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్స్ ముత్తిరెడ్డి శ్రీరాములు, బి.తిమ్మారెడ్డి అమరులయ్యారు. ఆ కామ్రేడ్స్‌కు ఘన నివాళులర్పిస్తూ వివిధ ప్రాంతాలలో నిర్వహించిన సంస్మరణ సభల రిపోర్టులను ఈ వార్షిక సంచికలో పేర్కొన్నారు.

❖❖❖

**2022** సంవత్సరంలో వెలువడిన **వార్షిక సంచిక** కోవిడ్ మహమ్మారి ప్రపంచ ప్రజలను కుదుపుకు గురి చేసిన భయానక పరిస్థితుల నడుమ నుండే వెలుగు చూసింది. సామ్రాజ్యవాద దేశాలు ప్రకృతి వనరులతో, తమ లాభాపేక్ష కోసం చిత్తమొచ్చిన విధంగా వ్యవహరిస్తున్న దుష్ఫలితమే కోవిడ్-19గా ఈ సంచికలో పేర్కొన్నారు. ఈ సంక్షోభ కాలంలో కోల్పోయిన, సంఘానికి ఆప్తులైన ఎందరో మేధావులు, నాయకులు, కార్యకర్తలను ఈ సంచికలో పేరుపేరునా స్మరించుకున్నారు.

సంఘ కార్యదర్శి కామ్రేడ్ కోటయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా 'తీవ్రమవుతున్న వ్యవసాయ రంగ సంక్షోభం-మన ముందున్న కర్తవ్యాలు' కేంద్ర అంశంగా 2019 డిసెంబరులో రాష్ట్ర సదస్సు రిపోర్టు, కామ్రేడ్ పి.జస్వంతరావు, ప్రొఫెసర్ గోలక్ బిహారినాథ్, విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ ఎన్. వేణుగోపాలరావు తదితరుల ప్రసంగ వ్యాసాలను ఈ సంచికలో అందించారు.

కోవిడ్ విపత్కర పరిస్థితి నేపథ్యంలోనే, మోడీ ప్రభుత్వం ముందుకు తెచ్చిన మూడు సాగు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా, 2020-21లలో దేశవ్యాప్తంగా, ప్రత్యేకించి, ఢిల్లీ సరిహద్దులలో సంవత్సర కాలం పైగా నిలిచి రైతాంగం సాగించిన

స్ఫూర్తిదాయకమైన ఆందోళన రిపోర్టులను, ఈ ఉద్యమ నిర్వహణ కమిటీకి నాయకత్వం వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చాలో ఏఐకెఎంకెఎస్ భాగస్వామ్య సంఘంగానూ, స్వతంత్రంగానూ నిర్వహించిన కార్యక్రమాల వివరాలను... ఈ వార్షిక సంచికలో ప్రధానంగా అందించారు. కర్ణాటక రైతాంగం ఏఐకెఎంకెఎస్ ఆధ్వర్యంలో 2021 మార్చి 5 నుండి 23 వరకు 442 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేసిన రిపోర్టును అందించారు. మూడు వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలం సాగిన ఆందోళన నేపథ్యంలో అనేక కరపత్రాలు, బులిటెన్లతో పాటు, బుక్‌లెట్ ప్రచురించి రైతాంగ ప్రజానీకం మధ్య సాగించిన విస్తృత ప్రచారం గురించి ఈ సావనీర్‌లో పేర్కొన్నారు.

బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం... ఆదివాసుల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తూ ముందుకు తెచ్చిన అటవీ సంరక్షణ నియమాలు- 2022ను, అటవీ సంరక్షణ చట్టానికి సవరణలను వ్యతిరేకిస్తూ సాగించిన ఆందోళన రిపోర్టులు ఈ సంచికలో ఉన్నాయి. దీనిలో భాగంగా 2019 జూన్‌లో విశాఖలో జరిపిన ఏఐకెఎంకెఎస్ సదస్సు రిపోర్టు, నల్సార్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు, కేంద్ర సమాచారశాఖ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ స్ఫూర్తిదాయకంగా చేసిన ప్రసంగపాఠంతో పాటు, ఇతర ఉపన్యాసకుల ప్రసంగ పాఠాలు దీనిలో ఉన్నాయి.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల వ్యథలు-ఆందోళనలను వివరిస్తూనే, వారు కోవిడ్ పరిస్థితుల నడుమ,2020 నవంబర్లో రంపచోడవరంలో సంఘం ఆధ్వర్యంలో సాగించిన రెండు రోజుల నిరవధిక ధర్నా రిపోర్టును, కొండమొదలు ప్రాంత నిర్వాసితులు సాధించుకున్న పునరావాస కాలనీ ఏర్పాటును ఈ సంచికలో అందించారు.

ప్రజల మధ్య చిచ్చు రేపుతూ తమ రాజకీయ ప్రయోజనాల కనుగుణంగా నదీ జలాల సమస్యను పాలకులు ఉపయోగిస్తున్న సమయంలో... 2021 డిసెంబర్‌లో, 'పాలకుల జల విధానాలు' అంశంపై బెంగళూరులో ఏఐకెఎంకెఎస్ ఆధ్వర్యంలో దక్షిణ భారత స్థాయి సెమినార్ జరిగింది. ఈ సెమినార్ కీ నోటును, తీర్మానాలను ఈ సంచికలో అందించారు.

2014 నుండి రాష్ట్ర రాజధాని సమస్యను టిడిపి, వైసిపిల నేతృత్వంలోని ప్రభుత్వాలు వాస్తవిక సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వినియోగించుకుంటున్న అంశాన్ని విశదపరుస్తూ రాజధాని అంశంపై వ్యాసాన్ని, సాగు మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుపై వ్యాసాన్ని, భూ పరాయికరణ లక్ష్యంతో సాగుతున్న రైతుబంధు-రైతు భరోసాల డొల్లతనాన్ని వెల్లడి చేసే వ్యాసాన్ని, ప్రస్తుత వ్యవసాయ కూలీల, గ్రామీణ పేదల జీవన స్థితిగతులను వివరించే వ్యాసాలను ఈ సంచికలో అందించారు.

అమూల్‌తో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం... రాష్ట్రంలో పాడి పరిశ్రమను ఏ విధంగా దెబ్బతీస్తుందో వివరించే వ్యాసం, ప్రజల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు కార్మిక, ప్రజా ఉద్యమ ఆవశ్యకతను నొక్కి చెప్పే వ్యాసం, పంజాబ్ రైతాంగంపై, వారి హక్కులపై బహుళజాతి పెప్సీ కంపెనీ సాగించిన దాడిని వివరించే వ్యాసం, జన్యుమార్పిడి ఆవాల సాగుకు పాలకులు అనుమతి తెలిపిన వ్యాసం, జన్యు మార్పిడి వరి దిశగా సాగుతున్న ప్రయోగాలను తెలిపే వ్యాసం, సేంద్రియ-జీరో బడ్జెట్ వ్యవసాయాలను పాలకులు పేర్కొనడం వెనుకనున్న మోసకారితనాన్ని వివరించే వ్యాసం, కరోనా కష్టకాలంలో పాలకుల విధానాల ఫలితంగా వలస కూలీలు ఎదుర్కొన్న దుర్భర పరిస్థితులను వివరించే వ్యాసం, దేశాన్ని మతతత్వ రొంపిలోకి లాగుతున్న సిఏఏ, ఎన్ఆర్‌సిల ప్రమాదకర అంశాలను విపులీకరించే వ్యాసం, మత మైనారిటీలపై, దళితులపై, మహిళలపై... హిందూ మతతత్వ శక్తుల ఫాసిస్టు తరహా దాడులను వివరించే వ్యాసం, నాలుగు లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులపై ముప్పేట దాడి సాగిస్తున్న ప్రభుత్వ విధానాలను వివరించే వ్యాసం, 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' పేరిట 75 సంవత్సరాల 'స్వాహా'తంత్రంలో దోపిడీ పాలకుల విధానాలను, ఫలితంగా ప్రజల జీవన స్థితిగతులు ఎంతగా దిగజారిపోతున్నాయో వివరించే వ్యాసాలతో పాటుగా అప్పటికి ప్రారంభమై కొనసాగుతున్న ఉక్రెయిన్ -రష్యా యుద్ధంలో సామ్రాజ్యవాదులనే నేరస్తులుగా పేర్కొంటూ వివరించే విలువైన వ్యాసాలు ఈ సంచికలో చోటుచేసుకున్నాయి.

❖❖❖

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) వార్షిక సంచిక - 2023... అఖిలభారత ఆదివాసి సదస్సు సావనీరుగా 56 పేజీలతో 2023 నవంబర్లో వెలువడింది. "ఆదివాసులకు, ప్రజలందరకు వ్యతిరేకమైన అటవీ సంరక్షణ (సవరణ) చట్టం- 2023 రద్దుకై పోరాడుదాం" అనే కేంద్ర నినాదంతో 2023 సెప్టెంబరు 12,13 తేదీలలో ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ (ఏఐకెఎంకెఎస్) ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగిన అఖిల భారత ఆదివాసీ సదస్సు విశేషాలు, వక్తల ప్రసంగ పాఠాలు, తీర్మానాలు ఈ సావనీర్లో ప్రధానంగా చోటు చేసుకున్నాయి.

ప్రముఖ పర్యావరణ వేత్త శ్రీ ప్రఫుల్ల సామంత రాయ్ (ఒరిస్సా), నక్సల్బరి ఉద్యమ మహిళా నాయకురాలు కామ్రేడ్ శాంతి ముండా, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గుమ్మడి నరసయ్యలతో పాటుగా ప్రారంభ సభలో పలువురు వక్తల ప్రసంగ పాఠాలు ఈ సావనీర్‌లో ఉన్నాయి.

ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించటంతో వేలాదిమంది ఆదివాసీ ప్రజానీకం ప్రారంభ సభ అనంతరం సమూహాలు సమూహాలుగా బహిరంగ సభా స్థలానికి చేరుకున్నారు. బహిరంగ సభ వక్తల ప్రసంగపాఠాలను ఈ సావనీర్‌లో అందించారు.

13వ తేదీన జరిగిన ప్రతినిధుల సభలో రాష్ట్ర రైతాంగ పోరాట సమన్వయ సమితి కన్వీనర్ శ్రీ వడ్డే శోభనాద్రీశ్వర రావు, సీనియర్ అడ్వకేట్ శ్రీ పల్లా త్రినాధరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎం.ఎల్.సి శ్రీ పాకలపాటి రఘువర్మ,అఖిలభారత ఆదివాసి మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ ఘూసీ రామ్ సోరెన్ లతోపాటు వివిధ రాష్ట్రాల

ఏఐకేఎంకేఎస్ ప్రతినిధుల ప్రసంగ వ్యాసాలు ఈసావనీర్లో అందించారు.

అటవీ సంరక్షణ(సవరణ) చట్టం రద్దు చేయాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయరాదని, పోలవరం నిర్వాసితులందరకు సమగ్ర, శాస్త్రీయ పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ సదస్సుచేసిన తీర్మానాలను సావనీర్లో ప్రచురించారు.

❖❖❖

2001 నుండి వరుసగా ప్రచురిస్తూ వస్తున్న మహాసభల సావనీర్లు లేదా వార్షిక సంచికలు... దాదాపు గత రెండున్నర దశాబ్దాల కాలపు ప్రధానమైన దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలను, ప్రత్యేకించి వ్యవసాయ రంగంలో, గ్రామీణ ప్రాంతంలో పాలకులు తీసుకు వస్తున్న మార్పులు, అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నమోదు చేస్తూ వస్తున్నాయి.

సన్న చిన్న కారు రైతులు, మధ్యతరగతి రైతులతో సహా వ్యవసాయ కూలీల, ముఖ్యంగా కౌలు రైతుల సమస్యలపైన, గిరిజన-గిరిజనేతర పేదల సమస్యలపైన, గ్రామీణ పేదలు, మత్స్య కారులు, చేతివృత్తుల వారి సమస్యలపై సాగిస్తూ వచ్చిన కార్యక్రమాలను... మహాసభల సావనీర్లలో, వార్షిక సంచికలలో పేర్కొన్న కార్యక్రమాల నివేదికలలో సంక్షిప్తంగా అందించారు.

అలాగే ఈ కాలంలో... సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ, దేవాదాయ, ధర్మాదాయ భూములు, పోరంబోకు, బంజరు, ఈనామ్దారి, శ్రోత్రియం తదితర రూపాల్లోని ప్రభుత్వ భూములను సాగు భూములుగా, నివాస స్థలాలుగా దక్కించుకునేందుకు రైతు-కూలీ, పేదలు, దళితులు సాగించిన వివిధ రూపాల్లో పోరాటాలను, ఆందోళనలను కూడా కార్యక్రమాల నివేదికల్లో పేర్కొన్నారు.

ఈ సంచికల్లో... అనేకమంది చిత్రకారుల చిత్రాలు, వందలాదిమంది ప్రజాపక్ష రచయితల, కవుల కవితలను, పాటలను సామాన్య ప్రజానీకానికి అనువైన వాటిని విస్తారంగా అందించారు. అలాగే ఈ అన్ని సంచికలలోనూ రాష్ట్రవ్యాప్తంగా సాగించిన ప్రధాన కార్యక్రమాల ఫోటోలను, గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగతమయ్యే విధంగా, ప్రత్యేకించి రంగుల్లో ఆకర్షణీయంగా ముద్రించి అందించడం విశేషం.

కార్మిక-కర్షక-విద్యార్థి-మేధావుల ఐక్యతా దృక్పథంతో ప్రజలను తక్షణ సమస్యలపై కదిలిస్తూనే, నూతన ప్రజాస్వామిక విప్లవ అవగాహనతో, వ్యవసాయక విప్లవం కీలక కర్తవ్యంగా, దున్నేవానికే భూమి నినాదంతో విప్లవోద్యమంలోకి రైతు- కూలీ- ఆదివాసీ- గ్రామీణ పేదలను సమీకరించి సంఘటితం చేసే కృషిలో కార్యకర్తలకు, శ్రేణులకేగాక విప్లవోద్యమ కార్యకర్తలందరికీ తోడ్పడే విధంగా... రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) నాయకత్వం ప్రచురిస్తున్న ఈ సావనీర్లను, వార్షిక సంచికలను మరింత ఫలప్రదంగా వినియోగించుకోవల్సిన అవసరం వుంది.

**(2024 జూన్ 'జనశక్తి' నుండి)**


*With Best Compliments From....*

**ప్రకాశంజిల్లా పర్మినెంట్ ఫండ్ "నిధి" లిమిటెడ్**

(భారత ప్రభుత్వంవారిచే **"నిధి"** కంపెనీగా గుర్తింపు పొందిన సంస్థ)

**గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురు, కోర్టు సెంటర్, ఒంగోలు.**

సభ్యుల శ్రేయస్సు, సంక్షేమం, సామాజిక అభ్యుదయమే మా లక్ష్యం

- **డిపాజిట్లపై అధిక వడ్డీ ఇచ్చే ఏకైక సంస్థ**
- **బంగారు ఆభరణములపై ఋణములు యివ్వబడును.**
- **తక్కువ వడ్డీపై తాకట్టు ఋణములు యివ్వబడును.**

ఛైర్మన్

**పోతినేని వెంకటేశ్వర్లు**

## అనుబంధం : 2

# భూమి సమస్య ప్రాధాన్యతను చాటి చెప్పిన మనుగోపాల (1997), బొమ్మన హాళ్ (1998), మక్కువ (1999), పల్నాడు (2000) భూ పోరాటాలు

**గ్రామాల** సమాహారమైన మన దేశంలో ఈనాటికీ, ఉత్పత్తి సాధనమైన సాగుభూమిలో అత్యధిక భాగం... భూస్వామ్య పెత్తందారుల, భూ యజమానుల, సంపన్న వర్గాల, సామ్రాజ్యవాద బహుళజాతి, కార్పొరేట్ కంపెనీల వద్ద పోగుపడి ఉంది. భూమిపై తమ రెక్కలు ముక్కలు చేసుకునే కష్టజీవులు, భూమి హీనులు, పేద రైతులు, రైతు కూలీలు, గిరిజనులు ఈనాటికీ చారెడు నేలపై హక్కు కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వాల బూటకపు భూ సంస్కరణలు తమకేమీ మేలు చేయవని గ్రహించి, సంఘటితమైన గ్రామీణ పేదలు, అటవీ హక్కుల కోసం ఆదివాసులు... విప్లవ కమ్యూనిస్టుల, రైతు కూలీ సంఘాల, ఏజెన్సీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు సాగించారు, సాగిస్తూ ఉన్నారు. ఆ విధంగా ఆంధ్రప్రదేశ్‌లో రెండున్నర దశాబ్దాల క్రితం సాగిన, విలువైన అనుభవాల నందిస్తున్న భూ పోరాటాలను ఒక్కసారి పరిశీలిద్దాం.

**1997 నవంబర్ 4 - మనుగోపాల గిరిజన ఉద్యమంపై భూస్వామ్య వర్గాల దాడి - కామ్రేడ్ కారం పార్వతి అమరత్వం**

కొండమొదలు ఉద్యమ ప్రేరణతో, 1987 ప్రాంతం నుండి పశ్చిమ గోదావరి జిల్లా జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాల్లో గిరిజనుల పోరాటాలు ప్రారంభమై నిలదొక్కుకున్నాయి. పోలవరం మండలం వెంకటరెడ్డిగూడెం, రామన్నపాలెం, గుంజవరం గ్రామ గిరిజనులు, గిరిజన సంఘం నాయకత్వాన సంఘటితమై భూ పోరాటం ప్రారంభించారు.

1993 నుండి ఏజెన్సీ గిరిజన సంఘం మనుగోపాల, పెంద్రాల, జిల్లెల్లగూడెం, కొత్త కుంకాల, పాత కుంకాల ప్రాంతంలో ప్రచార కార్యకలాపాలు ప్రారంభించింది. పాత కుంకాల గ్రామానికి చెందిన కొక్కెర చంద్రయ్య భూమిని మాజీ జమీందారు ఏజెంటు సద్గురు మూర్తి ఆక్రమించుకోవటాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన ప్రారంభమైంది. జమీందారు తరపున నిలిచిన పోలీసులు, కొక్కెర చంద్రయ్యను, ఆయన కుటుంబ సభ్యులను అరెస్టు చేశారు.

ఈ అరెస్టులను ఖండిస్తూ, చంద్రయ్య భూమి చంద్రయ్యకే దక్కాలనే డిమాండ్‌తో గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులంతా నిలిచారు. వారి మధ్యనున్న అనైక్యత నుండి గిరిజనులు బయటపడటం, భూమి సమస్యపై పిటిషన్లు పెట్టడమే మాజీ జమీందారు రాంపండుకు ఆగ్రహం కలిగించింది.

1996 మార్చిలో బాంబులతో, రౌడీ గుండాలను వెంటేసుకొని మనుగోపాల, కుంకాల గ్రామాలపై దాడి చేశాడు, వారు రైతుల పంటలు దొంగిలించారు, బంగారం దొంగిలించారు, మహిళలను అవమానపరిచారు. కారం వెంకటేశ్వరరావు అనే గిరిజన నాయకుడిని కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెట్టారు.

రాంపండు సాగించిన ఈ దాడి, బీభత్సాన్ని నిరసిస్తూ ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వెయ్యి మందికి పైగా గిరిజనులు మండల కార్యాలయాన్ని ముట్టడించి, రాంపండుపై, రౌడీ గుండాలపై చర్య తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫలితంగా హోతా శ్రీరామ చంద్రమూర్తి (రాంపండు) అరెస్ట్ అయ్యాడు. 1996 శ్రీరామనవమి నాటికి జైల్లో వుండి తన అరెస్టుకు కారకులైన ఆదివాసీ ప్రజలపై కక్ష పెంచుకొని వున్నాడు. నాటి నుండి అధికార యంత్రాంగం అతనికి అనుకూలంగా వ్యవహరించటానికి అన్ని మార్గాలూ వెదుకుతోంది.

1996 ఏప్రిల్‌లో గిరిజన సంఘం ఆధ్వర్యంలో మనుగోపాల, కుంకాల ప్రాంతాలలో సమీకృతమైన ఆ ప్రాంత గిరిజనులు... రాంపండు ఆధ్వర్యంలోని తమ భూములను తిరిగి స్వాధీనం చేసుకొని, 300 ఎకరాల మామిడి, జీడిమామిడి తోటలలో పండిన పంటను సమిష్టిగా పంచుకున్నారు. మరో 50 ఎకరాలలో జొన్న పంట పండించుకుని, అందరూ పంపిణీ చేసుకున్నారు.

1997 సెప్టెంబర్ నాటికి ప్రభుత్వం... గిరిజన పోరాటాలను అణచటానికి కృతనిశ్చయంతో ముందుకొచ్చింది. గిరిజన ప్రాంతాలలో నిర్బంధాన్ని తీవ్రం చేసింది. ప్రభుత్వ అండదండలతో తిరిగి రాంపండు కొత్త కుట్రలకు పూనుకున్నాడు. ఏవిధంగానైనా గిరిజనోద్యమాన్ని అణచాలన్న నిర్ణయంతో భూస్వామ్యశక్తులు, జమిందారు, జమిందారు ఏజెంట్లు... గిరిజనులతో ఎలాంటి సంబంధంలేని ఏలూరు వెకేషన్ కోర్టులో తెచ్చుకున్న ఒక ఇంజక్షన్ ఆర్డర్‌తో రాంపండు, అతని అనుచరులు, పోలీసుల బందోబస్తుతో గిరిజన గూడేలలోకి ప్రవేశించారు. తిరిగి వెళుతుండగా 1997 నవంబర్ 3న వీరందరినీ ప్రజలు నిలవేశారు. మనుగోపాల, కుంకాల గ్రామాలు షెడ్యూల్డు ప్రాంతాలన్నారు కదా, 1/70 చట్టం వర్తిస్తుందా, వర్తించదా తేల్చవలసిందిగా మహిళలు నిలవేశారు.

1997 నవంబర్ 4వ తేదీన, ప్రశాంతంగా ఉన్న మనుగోపాల గ్రామంపై 200 మంది పోలీసులు భాష్పవాయువు ప్రయోగిస్తూ దాడి చేశారు. రాంపండు, వీసుబాబులను గిరిజనుల మధ్య నుండి తప్పించి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నాలను గిరిజనులు నిలువరించారు. దీంతో రాంపండు పట్టరాని ఆవేశంతో, పోలీసుల చేతుల్లోని తుపాకీ తీసుకొని గిరిజనుల పైకి కాల్పులు జరిపాతడు.

ఈ కాల్పులలో తొలుత మిడియం రాజు పడిపోయాడు. తర్వాత కారం పార్వతికి

తూటా దెబ్బ తాకి నేలకూలింది. మిడియం భూదేవి, సున్నం రాములమ్మలు ఈ కాల్పులలో గాయపడ్డారు. తర్వాత రాంపండును తీసుకొని పోలీసులంతా వెళ్ళిపోయారు.

రాంపండుకు వ్యతిరేకంగా పోరాడినందుకే పోలీసులు ఈ దాడి చేశారు. గాయపడిన వారిని కూడా పట్టించుకోకుండా వెళ్లిపోయారు. గిరిజన సంఘ కార్యకర్తలే, గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించి వైద్యం చేయించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్త నిరసన వ్యక్తమైన తర్వాతనే, ప్రభుత్వం గాయపడిన బాధితులకు వైద్యం అందిస్తున్నట్లుగానైనా ప్రకటించక తప్పలేదు.

కారం పార్వతి భౌతిక కాయాన్ని ప్రజలకు అందకుండా ఖననం చేయాలని ప్రభుత్వం కుట్ర చేసింది. దీనిని ఏజెన్సీ గిరిజన సంఘం, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యకర్తలు అడ్డుకొని, నవంబర్ 5వ తేదీన కారం పార్వతికి ఘన నివాళులర్పిస్తూ అంత్యక్రియలు నిర్వహించారు. భూ పోరాటాన్ని కొనసాగించి తీరుతామని ప్రతినబూనారు. సాధించిన విజయాలను నిలుపుకునేందుకు సంఘర్షిస్తూ, ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు.

**1998 జులై 17 - అనంతపురం జిల్లా, బొమ్మనహాళ్‌లో భూస్వామ్య శక్తుల అమానుష దాడులు**

ప్రభుత్వం జమీందారీ, ఈనాందారి విధానాల్ని రద్దు చేసినప్పటికీ, ఆ భూములు మాత్రం భూస్వామ్య, పెత్తందారుల చేతుల్లోనే ఉండిపోయాయి. ప్రభుత్వ భూ సంస్కరణల బూటకత్వాన్ని వెల్లడి చేస్తూ.... ఒక్క అనంతపురం జిల్లాలోనే లక్ష ఎకరాల శ్రోత్రీయం భూములు, 34 వేల ఎకరాల దేవాలయ భూములు బినామీ పేర్లతో భూస్వామ్య శక్తులే అనుభవిస్తున్నారు. అంతేగాక, భూమిలేని నిరుపేద రైతుల అనుభవంలో ఉన్న అరకొరా భూములను కూడా అధికార యంత్రాంగం అండ దండలతో భూస్వామ్య, పెత్తందారులే కబ్జా చేస్తూ వస్తున్నారు.

ఈ నేపథ్యంలో రైతు కూలీ పేదలు ఈ భూముల కోసం సంఘటిత పడ్డారు. 1990 నుండి ఆందోళన పథంలో సాగారు. పేదలంతా సమీకృతులై భారీ సంఖ్యలో ప్రదర్శనలు చేశారు. అధికార యంత్రాంగానికి పలు దఫాలుగా విజ్ఞాపన పత్రాలు అందించారు. చాలా సహజంగానే ఈ ప్రయత్నాలన్నీ బుట్ట దాఖలు అయ్యాయి.

1995 నాటికి రైతు కూలీల ఉద్యమం విస్తృతమైంది. రాయదుర్గం, బళ్ళారిలకు సమీపంలోనున్న బొమ్మనహాళ్, గోవిందవాడ, కొత్తపల్లి, కనేకల్లు, బెనకల్లు, మళ్ళాప్ తదితర గ్రామాలకు విస్తరించింది. భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలను వ్యతిరేకించాలనే కసి, భూములను దక్కించుకోవాలనే తపన... రైతు కూలీ, పేదలలో పెరుగుతూ వచ్చింది.

బొమ్మన హాళ్ గ్రామంలో అగ్రకుల, భూస్వామ్య శక్తులు... గ్రామంలో అన్ని అధికారాలను, గ్రామ వనరులను తమ కబంధ హస్తాలలో బిగించారు. చౌక డిపో డీలర్‌షిప్‌ను సైతం తమ చెప్పు చేతల్లో ఉంచుకున్న మాజీ సమితి అధ్యక్షుడు రామప్ప కుటుంబం, ఆ ప్రాంతంలో సాగించే దాడులకు, దౌర్జన్యాలకు అంతులేకుండా పోయింది. అగ్రకుల అహంకారానికి హద్దే లేదు. చౌక డిపో ద్వారా ప్రభుత్వం అందించే సరుకులను కూడా అధిక ధరలకు, తప్పుడు తూకాలతో అమ్మి లాభాలు గడిస్తూ వచ్చారు.

భూస్వామ్య శక్తుల దుర్మార్గాలను, దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ సంఘం ఆధ్వర్యంలో ప్రజలు సంఘటిత పడ్డారు. చట్టప్రకారం కూడా ప్రజలకే చెందాల్సి ఉన్న భూస్వాముల స్వాధీనంలోని శ్రోత్రియం భూములను, దేవాలయ భూములను...పేద రైతులు, భూమి హీనులు తమ అనుభవంలోకి తెచ్చుకున్నారు.

దీనిని సహించలేని బొమ్మనహాళ్ అగ్రకుల, భూస్వామ్య శక్తులు, స్థానిక అధికార యంత్రాంగం అండదండలతో రైతు కూలీ ఉద్యమాన్ని నెత్తురుటేర్లలో ముంచడానికి పథకాలు వేశారు. కమ్మ, రెడ్డి పెత్తందారులు, సారా కాంట్రాక్టర్లు తోడయ్యారు. రైతు కూలీలలో పెరిగిన చైతన్యం వీరందరికీ కంటగింపుగానే ఉంది.

బళ్లారి వాస్తవ్యుడైన ముంధ్ల భూస్వామికి చెందిన 28 ఎకరాల మిగులు భూములను, ప్రభుత్వమే దళితులైన మునలప్ప తదితరులకు చట్టబద్ధంగా పట్టాలిచ్చింది. అయితే బొమ్మనహాళ్ అగ్రకుల, భూస్వామ్య శక్తులు.... ఆ 28 ఎకరాలను బినామీగా తామే హక్కు భుక్తం చేసుకున్నారు. అధికార యంత్రాంగానికి ఆధారాలతో సహా పేద రైతులు వివరించినా, వారు చెవొగ్గలేదు. ఎట్టకేలకు ఆర్డీవో గ్రామానికి వచ్చి, పరిశీలించి, బినామీలను రద్దుచేసి అర్హులైన పేదలకు పట్టాలిస్తామని హామీ ఇచ్చినా, ఆచరణలో అది అమలు కాలేదు.

1998 జులై 16న రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పేదలు సంసిద్ధమయ్యారు. భూస్వామ్య శక్తులను ఈ భూములలోకి దిగనీయకుండా అడ్డుకున్నారు. ఆర్డిఓ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. భూస్వామ్య శక్తులు దౌర్జన్యానికి పూనుకున్నా, వారిని భూములలోకి దిగనీయకుండా పేద రైతులు అడ్డుకోవడంతో.... అంతు చూస్తామని హెచ్చరిస్తూ వారు వెనుదిరిగారు.

కాగా ఆ రోజు రాత్రి భూస్వామ్య శక్తులు పథకం రూపొందించుకున్నారు. జులై 17వ తేదీ ఉదయం ముందుగా సిద్ధం చేసుకున్న వేట కొడవళ్ళు, గొడ్డళ్లు, రాడ్లతో వీఏవో సీతారామప్ప తదితరుల నాయకత్వాన బొమ్మనహాళ్‌పై దాడికి పాల్పడ్డారు. గ్రామ రైతు కూలీ సంఘం సభ్యుడు వడ్డే శ్రీనివాసులపై దాడి చేశారు. గురుస్వామి ఇంటిలోకి వెళ్లి ధ్వంసం చేశారు. పక్కనే హనుమంతు కిరాణా బంకును నాశనం చేసిన భూస్వామ్య మూకలు... కేకలు వేసుకుంటూ, మారణాయుధాలు ప్రదర్శిస్తూ, పోలీస్ స్టేషన్ మీదుగా వడ్డే క్యాంపు చేరుకున్నారు.

ఈ గుండా శక్తుల దాడి నుండి రక్షించుకునేందుకు ప్రజలు మిద్దెలపైకి చేరుకున్నారు. కాగా, పోలీసులు జోక్యం చేసుకొని, మిద్దెల మీద నుండి దిగి రమ్మని, భూస్వామ్య గుండాలను వెనక్కు పంపుతామని నమ్మించటంతో వారంతా కిందకు దిగివచ్చారు. తర్వాత పోలీసులు అక్కడనుండి తప్పుకున్నారు. మిద్దెల నుండి

దిగిన వారిపై భూస్వామ్య గుండాలు మారణాయుధాలతో క్రూరంగా వేట్లు వేసి, కొట్టంలో కుప్పలాగా ఒకరిపై ఒకరిని జంతువుల్లాగా పడేశారు. వాస్తవంగా రక్తం గడప మూల వరకు కాలువ కట్టింది. అడ్డం వచ్చిన మహిళలను జుట్టు పట్టుకొని ఈడ్చి కొట్టారు. బీహార్ భూస్వామ్య గుండాల తరహాలో సాగించిన ఈ దాడిలో 31 మంది తీవ్రంగా గాయాల పాలయ్యారు. అనేకమంది అంగవికలురయ్యారు.

ఈ బీభత్స దారుణాలకు కారణం.... భూస్వాముల ఆధీనంలోని తమ భూములను సంఘం ఆధ్వర్యంలో దక్కించుకునేందుకు, పేద దళిత, రైతు కూలీలు ఉద్యమించడమే! రెవెన్యూ, పోలీసు, రాజ్య యంత్రాంగం... అగ్రకుల భూస్వామ్య పెత్తందారీ శక్తులకు ఏ విధంగా కొమ్ము కాస్తుందో మరోసారి వెల్లడయింది.

ప్రభుత్వ అణచివేత విధానాలను, భూస్వామ్య పెత్తందారీ శక్తుల పైశాచిక దాడులను తిప్పికొట్టేందుకు... పీడిత వర్గ ప్రజలు మరింత సంఘటితపడాలి. ప్రజాతంత్ర వాదులు ఈ దాడులను ఖండించి వారికి అండగా నిలవాలి. భూమి – భుక్తి – విముక్తి కోసం పోరుతున్న గ్రామీణ పీడిత ప్రజల ఉద్యమానికి, కార్మికవర్గం వెన్నుదన్నుగా నిలవాలి.

**1999 నవంబర్ 17- దుగ్గేరు ఏరియా గిరిజనోద్యమంపై భూస్వామ్య హంతకదాడులు - కామ్రేడ్ జెన్ని తిరుపతి అమరత్వం**

రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా దుగ్గేరు ప్రాంత గిరిజనులు 1992 నుండి సంఘటితపడుతూ వస్తున్నారు. గిరిజనులను మాత్రమే కాక, గిరిజనేతర పేదలను ఐక్యపరుస్తూ, ఫ్యూడల్ అణిచివేత, పీడనలకు వ్యతిరేకంగా సంఘం ఉద్యమ కార్యకలాపాలు సాగిస్తూ వస్తోంది. ఈ క్రమంలో వేలాదిమందితో పలు దఫాలుగా ప్రదర్శనలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి, ప్రభుత్వం చేసిన చట్టాల ప్రకారమే గిరిజన–గిరిజనేతర పేదల హక్కులకు రక్షణ కల్పించాలని, అగ్రకుల భూస్వామ్య, పెత్తందారుల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. ఒకనాడు ప్రభుత్వాధికారులను, భూస్వాములను చూస్తే బెదిరిపోయే గిరిజనులను సంఘటితపరచి, చైతన్యయుతులను చేసి, జీవించే హక్కు కోసం పోరాడుతున్నామని చెప్పగలిగే విధంగా... సంఘం వారిని మలిచింది. గిరిజనుల– గిరిజనేతర పేదల ఐక్యత, అగ్రకుల భూస్వామ్య శక్తులకు కలవరం కలిగించింది.

దుగ్గేరు ఏరియా భూస్వామ్య పెత్తందారులు... అణచబడ్డ గిరిజనులకు, గిరిజనేతర పేదలకు అండగా ఉండి సంఘ నిర్మాణం చేస్తున్నందుకు, రైతు కూలీ సంఘ నాయకత్వంపై తప్పుడు ప్రచారాలు సాగించారు. నాయకత్వాన్ని నిర్మూలిస్తామని హెచ్చరించారు. మారణాయుధాలతో దారులు కాచారు. అయితే, చైతన్యవంతులైన సంఘ నిర్మాణం, వీరి దౌర్జన్యాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటూ వచ్చింది. మరోవైపున రెవెన్యూ, పోలీసు యంత్రాంగంతో కుమ్మక్కైన భూస్వామ్య పెత్తందారీ వర్గాలు... సంఘం నాయకులు, కార్యకర్తలు, ప్రజలపై ఎన్నో అక్రమ కేసులు బనాయించి, వేధింపులకు గురిచేసినా ప్రజలు వారికి లొంగి రాలేదు.

దీనితో, పెత్తందారీ శక్తులు తమ దాడులను తీవ్రం చేశారు. దుగ్గేరులో వారం వారం జరిగే సంతలకు వెళుతున్న వ్యాపారస్తులను అడ్డుకొని, సంతలు జరగనివ్వలేదు. మక్కువలో బస్సు ఎక్కటానికి వెళ్లిన గిరిజనులపై భౌతికదాడులు చేశారు. 1999 అక్టోబర్ 20న సాలూరులో జరిగే బహిరంగ సభకు వెళ్లేందుకు గిరిజనులు ఏర్పాటు చేసుకున్న వాహనాలను... భూస్వామ్య పెత్తందారుల నాయకుడు మామిడి వెంకటనాయుడు స్వయంగా అడ్డుకొని వెనక్కు పంపాడు. బస్సు ఎక్కుతున్న సంఘ నాయకులపై దాడి చేశారు.

పెత్తందారుల ఈ దాడులు, దౌర్జన్యాలను ఆపవలసిందిగా గిరిజనులు సంఘ నాయకత్వాన పోలీసులకు పలు దఫాలుగా విజ్ఞప్తి చేశారు. దుగ్గేరు గిరిజనుల పరిస్థితిని అధ్యయనం చేయడానికి వెళ్ళిన మేధావులు, ప్రజాతంత్రవాదులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బిడి శర్మ గారు, సంఘ నాయకులు... జిల్లా అధికారులను కలిసి గిరిజనులపై దాడి జరిగే ప్రమాదం ఉందని వారికి వివరించారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని దాడులు నిరోధించాలని విజ్ఞప్తి చేశారు. అయినా, ఎప్పటిలాగానే అధికారులు దీనిని పెడచెవిన పెట్టి భూస్వామ్య వర్గాల కొమ్ముకాశారు.

1999 నవంబర్ 17వ తేదీ సాయంత్రం మూడు గంటలకు, విజయనగరం జిల్లా – మక్కువ మండలం, దుగ్గేరు ఏరియా గిరిజనులపై... ఈ ప్రాంత భూస్వామ్య పెత్తందారులతో కలగలిసిన, వలస వచ్చిన మరికొందరు కమ్మ పెత్తందారులు మారణాయుధాలతో విరుచుకుపడ్డారు. ఈ దాడి నుండి మెలకువగా ఆత్మ రక్షణ చేసుకోకుంటే పదుల సంఖ్యలో గిరిజనులు ప్రాణాలు కోల్పోయేవారు.

గిరిజన సంఘ కార్యకర్త, 18 సంవత్సరాల యువకుడైన జెన్ని తిరుపతి తలపై, రౌడీ గూండా మూకలు ఇనుప రాడ్లతో మోదడంతో, జెన్ని తిరుపతి నేలకొరిగాడు. పెత్తందారులు రెచ్చగొట్టి తమ వెంట తీసుకువచ్చిన మక్కువ నివాసి, పేద కుటుంబీకుడైన బోరాడ యాదయ్య ఈ ఘర్షణలో మరణించాడు. ఈ మరణానికి కూడా కారకులు ఈ పెత్తందారులే.

ఈ ప్రాంతంలో పెత్తందారులు, వలస వచ్చిన కొంతమంది భూస్వాములు, కలప అక్రమ వ్యాపారులు కుమ్మక్కై గిరిజనేతరులైన కొందరిని ప్రలోభ పరచి, తమ వైపు మలచుకొని, వారికే "రైతు సంఘం" అనే బ్యానర్ తగిలించారు. భూస్వాముల దౌర్జన్యాలకు, దాడులకు సాకుగాను, రైతు కూలీ సంఘం నాయకత్వంపై అసత్య ప్రచారాలకు ఒక సాధనంగాను... ఈ రైతు సంఘాన్ని ఉప యోగించుకుంటూ వస్తున్నారు.

పీడితుల్లోనే అధమాధములైన గిరిజనులపై భూస్వామ్య గుండాలు క్రూరమైన దాడి జరిపితే... రైతు కూలీ సంఘానికి, 'రైతు సంఘానికి' మధ్య ఘర్షణ

అంటూ... తప్పుదారి పట్టించే ప్రకటనలు చేశారు. దీనిని ఖండిస్తూ, రైతుకూలీ సంఘం... భూస్వామ్య పెత్తందారీ వర్గాల దోపిడీ, దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ, ఈ దోపిడీ నుండి పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడుతుందని విస్తృత ప్రచారం చేసింది.

ప్రభుత్వ పోలీసు యంత్రాంగానికి... హంతకదాడులు చేసిన కొందరిని అరెస్టు చేయక తప్పలేదు. అయితే దాడికి గురైన గిరిజనుల పైన, సంఘ నాయకుల పైన కూడా పోలీసు అధికారులు తప్పుడు కేసులు బనాయించి దోపిడీ వర్గాలకు సేవచేసే తమ స్వభావాన్ని చాటుకున్నారు.

దుగ్గేరు ప్రాంత గిరిజన ప్రజానీకం, గిరిజనేతర పేదలతో ఐక్యంగా సాగుతూ గత 25 సంవత్సరాలుగా సాధించిన విజయాలను నిలుపుకుంటూ, కామ్రేడ్ జెన్ని తిరుపతి అమరత్వపు స్ఫూర్తితో, హక్కుల సాధనకు నిలకడగా ఉద్యమిస్తోన్నారు.

**2000 ఏప్రిల్ 11 - గుంటూరు జిల్లా, పల్నాడులో బూటకపు ఎదురు కాల్పుల హత్యాకాండలో నేలకొరిగిన కామ్రేడ్స్ విశ్వమోహన రెడ్డి, మరియమ్మ**

1994 ప్రాంతం నుండి...గుంటూరు జిల్లా పల్నాడు గ్రామాలలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ విశ్వ మోహన్ రెడ్డి నాయకత్వాన ఉద్యమ కార్యకలాపాలు సుడివేగంతో ప్రారంభమయ్యాయి. పల్నాడు ప్రాంతంలోని భూస్వాములు, పెత్తందార్లు వేలాది ఎకరాల బంజర్లు, దేవాలయ, ఫారెస్ట్ బంజరు భూములను స్వాధీనం చేసుకొని అనుభవిస్తూ ఉండడంతో పాటు దళితులు, మహిళలపై తీవ్రమైన పీడన, అణచివేతలు సాగిస్తూ వస్తున్నారు.

ముఖ్యంగా పిడుగురాళ్ల ప్రాంతంలో సున్నం బట్టీల, మిల్లుల, క్వారీల యజమానుల నిలువు దోపిడీ సాగుతూ ఉండేది. సున్నం మిల్లులలో 24 గంటల పాటు పనిచేయవలసిన దుర్మార్గ పరిస్థితులు ఉండేవి. కార్మికుల రక్తం పిండుకున్న యజమానులు అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తితే, గానుగలో పిప్పిలాగా కార్మికులు సత్తువంతా కోల్పోయి, జబ్బుల పాలై మృత్యు బారిన పడేవారు. వ్యవసాయ పనులు లేకపోవడం, పల్నాడులో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులలో, వినుకొండ, నడిగడ్డ తదితర ప్రాంతాల నుండి వలస కూలీలుగా వచ్చిన వీరు...బట్టీలు, మిల్లులు, క్వారీల్లో తీవ్ర ప్రమాదాలకు లోనైనా ప్రశ్నించేవారు లేకపోయేవారు.

బట్టీలు, మిల్లులు, క్వారీలలో పనిచేసే వేలాదిమంది... తలదాచుకునే అవకాశం లేక అల్లాడుతున్న పరిస్థితుల్లో, వారిని సమీకరించి 1995లో పిడుగురాళ్లలో 70 ఎకరాల స్థలంలో లెనిన్‌నగర్, కొండమోడులో టిఎన్‌నగర్‌ల నిర్మాణం, ఆంబోతు మాన్యంలో సాగు భూమిలోకి నిరుపేదలను సమీకరించడం... ఒకదాని వెంట మరొకటి వేగంగా జరిగిపోవటం... యాజమాన్య వర్గాలకు కంటగింపయింది. ముఖ్యంగా, నికృష్ట చాకిరీ చేసే కార్మికులంతా ఒకచోట సంఘటితం కావడం సహించలేని బడా వ్యాపారులు, యాజమాన్యాలు, భూస్వామ్య పెత్తందారీ శక్తులు... కాలనీలను విచ్ఛిన్నం చేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. రౌడీ గుండాలతో దాడులు చేశారు. పోలీసులతో కేసులు పెట్టించారు. కాలనీలను దురాక్రమించే కుట్రలెన్నో చేశారు. విశ్వమోహన్‌రెడ్డిపై హత్యా ప్రయత్నం చేశారు. కానీ సంఘ నాయకత్వంలో ప్రజలు దృఢంగా నిలిచారు. రౌడీ గూండాల దాడులను ఎదుర్కొన్నారు. కేసులకు జంక లేదు. కాలనీలను నిలబెట్టుకున్నారు.

కామ్రేడ్ విశ్వమోహన్ రెడ్డి నాయకత్వంలో రాజుపాలెం, బెల్లంకొండ మండలాల్లోని పెత్తందార్ల చేతుల్లోని వందలాది ఎకరాల ఫారెస్ట్, బంజరు, దేవాదాయ, సత్రం భూములను పేద ప్రజలు స్వాధీనం చేసుకుని సాగు చేశారు.

అలాగే వినుకొండ మండలం – దొండపాడు గ్రామంలో పెత్తందార్ల దౌర్జన్యాలు, హత్యాకాండకు వ్యతిరేకంగా సంఘం ఆధ్వర్యంలో ప్రజలు నిలబడ్డారు. కోట్లాది రూపాయల ఆదాయం లభిస్తున్న చేపల చెరువులో తమ వాటా కోసం నిలవేశారు. దీనితో గంగ వెర్రులెత్తిన పెత్తందారులు, హింసకాండకు పూనుకున్నారు. దీనిని ప్రజలు ఎదుర్కొన్నారు. దొండపాడు, పానకాలపాడు, ఉప్పలపాలెం గ్రామాలలో ప్రజలు కదిలి బంజరు, పోరంబోకు భూములను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బొల్లాపల్లి మండలంలోనూ అనేక గ్రామాలలో ప్రజలు భూములపై కదిలారు. సంఘం... భూస్వాములకు కంటగింపైంది. సంఘ నాయకత్వాన్ని నిర్మూలించేందుకు కంకణం కట్టుకున్నారు.

ఈ పోరాటాల ప్రేరణ... ప్రకాశం జిల్లా దొనకొండ, త్రిపురాంతకం, పుల్లల చెరువులకు పాకింది. అనేక గ్రామాలలో ప్రజలు భూముల పైకి కదిలారు. ప్రకాశం జిల్లాలో తొమ్మిది మండలాలకు భూ పోరాటం వ్యాపించింది. పల్నాడులో, ప్రకాశం జిల్లాలోని ఈ ప్రాంతాలలో భూస్వామ్య, పెత్తందారుల స్వాధీనంలో ఎంత పెద్ద మోతాదులో భూములు ఉన్నాయో... ప్రజలలో భూ కాంక్ష ఎంతగా దాగి ఉందో, వ్యవసాయ విప్లవం నేటికీ ఎంత ప్రాధాన్యత కలిగి ఉందో... కామ్రేడ్ విశ్వమోహన్ రెడ్డి నేతృత్వంలో, సంఘం ఆధ్వర్యంలో ప్రజల కదలిక వెల్లడి చేస్తోంది.

విస్తరిస్తున్న రైతాంగ ఉద్యమాన్ని చూసి కలవరపడిన భూస్వామ్య, పెత్తందార్లు, అధికార రాజకీయ నాయకులు, బడా వ్యాపారులు, పోలీసు యంత్రాంగం... సమన్వయంతో హత్యకు పథకాలు వేశారు.

భూస్వామ్య పెత్తందార్ల ఏజెంట్ల ద్వారా కామ్రేడ్ విశ్వమోహన్ రెడ్డి, మరియమ్మల ఆచూకీ తెలుసుకొని... ప్రకాశం జిల్లాలో పట్టుకొని, 2000 సంవత్సరం ఏప్రిల్ 11 అర్ధరాత్రి వారిని కాల్చి చంపారు. వారి మృతదేహాలతో పిడుగురాళ్లలో ప్రదర్శన జరపకుండా నిరోధించడానికి అధికార యంత్రాంగం విఫల ప్రయత్నం చేసింది. వేలాదిమంది ప్రజలు తరలివచ్చి ప్రియతమ నేతలకు కడసారి వీడ్కోలు పలికారు. సాధించిన విజయాలను నిలబెట్టుకుంటూ సంఘం ఆధ్వర్యంలో కార్యకలాపాలు సాగుతున్నాయి.

**(2024 జూన్ 'జనశక్తి' నుండి)**

## అనుబంధం : 3

**పుస్తక పరిచయం :**

# రైతాంగ ఉద్యమాలను శక్తిమంతంగా నిర్మించాల్సిన ఆవశ్యకతను తెలియజేసే ‘చరిత్రాత్మక రైతు రక్షణ యాత్ర’ (జులై 1937-మార్చి 1938)

**- రవి**

జాతీయోద్యమంలో భాగంగా రైతాంగ ఆందోళనలూ విస్తృతంగా సాగాయి. ఆనాటి రైతు సంఘ ఆధ్వర్యంలో నిర్మాణయుతంగా సాగిన ఈ ‘రైతు రక్షణ యాత్ర’ కూడా అందులో భాగమే. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుండి కోస్తా జిల్లాలన్నింటిలో పర్యటిస్తూ మద్రాసు వరకు సాగింది ఈ యాత్ర. కాలినడకన 1512 మైళ్ళ (2414 కి.మీ.) దూరం, 130 రోజులపాటు రైతు సంఘం నాయకులు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, చలసాని వాసుదేవరావు గార్ల నాయకత్వంలో సాగిన ఈ యాత్ర యావద్భారత దృష్టినా కర్షించింది. యాత్ర ముగింపుగా ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు రైతాంగ, ఆదివాసీ సమస్యలపైన, జమిందారీ విధాన రద్దు కోరుతూ విజ్ఞాపన పత్రం అందజేశారు.

రైతు రక్షణ యాత్ర రైతాంగాన్ని, ముఖ్యంగా ఆనాటికే వివిధ సంస్థానాల్లో మగ్గుతున్న రైతాంగ, పీడిత ప్రజానీకాన్ని బాగా ప్రభావితం చేసింది. జమిందారీ వ్యతిరేక పోరాటాలు ఊపందుకోవటానికి దోహదపడింది. ఈ కారణాలన్నింటి ఫలితంగానే మద్రాసు రాష్ట్ర శాసనసభలో జమిందారీ రద్దు బిల్లును నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టవలసి వచ్చింది. (జమిందారీ విధానాన్ని రద్దుచేస్తూ 1948 సం॥ నాటికి గానీ చట్టం రాలేదు)

రైతు రక్షణ యాత్ర జరిగి ఎనిమిదిన్నర దశాబ్దాలు అవుతున్నా, ఈ యాత్ర చారిత్రక ప్రాధాన్యతతోపాటు ప్రాసంగికతనూ కలిగి వుంది. మారుమూల పల్లెల్లోని నిరుపేద రైతాంగాన్ని, వ్యవసాయ కూలీలను, ఆదివాసులను సంఘాలలోకి సమీకరించి సంఘటిత పోరాటాలను ఎలా నడపాలో రైతు రక్షణ యాత్రను నిర్వహించిన తీరును పరిశీలిస్తే స్పష్టమౌతుంది.

ప్రస్తుతం కొనసాగుతున్న వ్యవసాయ, రైతాంగ సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో, ఈ సంక్షోభ పరిష్కారానికి రైతాంగ ఉద్యమాలను శక్తివంతంగా నిర్మించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పేందుకే రైతు రక్షణ యాత్ర పుస్తకాన్ని ముద్రిస్తున్నట్లుగా ప్రచురణకర్తలు పేర్కొనటం గమనించదగింది. గత చరిత్ర భుజాలపై నిలబడి వర్తమానం నుండి మెరుగైన భవిష్యత్‌కై ముందుకు సాగటానికి వకుళాభరణం రామకృష్ణ గారు వెలువరించిన ‘రైతు రక్షణ యాత్ర’ పుస్తకం విలువైన అనుభవాలనందిస్తోంది.

### రైతు రక్షణ యాత్ర - రాజకీయార్థిక నేపథ్యం

రైతు రక్షణ యాత్ర ఏ రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో నిర్వహించిందీ రామకృష్ణ గారు చారిత్రకంగా ఈ పుస్తకంలో వివరించారు. ఓవైపు బ్రిటీష్ సామ్రాజ్యవాదుల వలస దోపిడీకి తోడు, సంస్థానాధీశుల, జమీందార్ల పీడన అణచివేతలను రైతు, కూలీ, ప్రజానీకం ప్రధానంగా ఎదుర్కొంటున్న కాలమది.

బ్రిటీష్ వలసవాదులు మన దేశంలో వేళ్ళూనుకున్న తర్వాత భూమిపై జమిందారులకు ఆస్తి హక్కు కల్పించటంతో పాటు, భూమి శిస్తు విధానాన్ని ప్రవేశపెట్టారు. వేలం ద్వారా శిస్తు నిర్ణయించి విచ్చలవిడిగా వసూలుచేసే ఈ విధానానికి వ్యతిరేకంగా రైతాంగం ఉద్యమించారు. దీనితో 30 సం॥ల వరకు ఒకే రకమైన శిస్తు వుండే విధంగా శాశ్వత శిస్తు విధానం తెచ్చారు. రైతులు ఏవిధంగానూ శిస్తుల నుండి తప్పించుకోలేక పోయారు. 1802 నుండి 1930 మధ్య కాలంలో రైతులు చెల్లించిన శిస్తు నాలుగు




నుండి 25 రెట్లు పెరగటం, రైతాంగాన్ని ఎలా దోచుకున్నారో తెలియజేస్తోంది. ఈ దోపిడీని సహించలేకనే 1857 నాటికే మన దేశంలో వేలాది రైతాంగ, ఆదివాసులు, పౌరుల - తిరుగుబాట్లు సంభవించాయి.

బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా వివిధ పాయలుగా జాతీయోద్యమం సాగింది. 1920ల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకత్వ స్థానంలోనున్న గాంధీ, అహింసా సిద్ధాంతాన్ని ప్రబోధిస్తూ ప్రజా పోరాటాల వెల్లువపై నీళ్ళు చల్లుతున్నాడు. అయినప్పటికీ బ్రిటీష్ పాలకులపై తిరుగుబాట్లు ఆగలేదు. ఆంధ్ర రాష్ట్రంలో ఒక్క గుంటూరు జిల్లాలోనే 1930లలో జరిగిన చీరాల పేరాల శాసనోల్లంఘనం, పెదనందిపాడు శిస్తుల నిరాకరణ ఉద్యమాలతోపాటు పల్నాడులో పుల్లరి వ్యతిరేక పోరాటం దేశవ్యాపితంగా సంచలనం కలిగించాయి.

1920 దశకం దాకా రైతు సంఘాలకు దేశ స్థాయిలో నిర్మాణ స్వరూపం లేదు. చెదురుమదురుగానున్న సంఘాలన్నింటికీ కలిపి 1930లలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్మాణరూపం ఇచ్చారు. 1936లో ప్రాథమిక స్థాయిలో ఏర్పడిన అఖిల భారత కిసాన్ సభ, డిసెంబర్లోనే రెండవ మహాసభలు జరుపుకొని రైతాంగ సమస్యలపై విస్తృతంగా దృష్టి సారించింది. 1936 తర్వాతనే కాంగ్రెస్ పార్టీ తన ఎజెండాలో వ్యవసాయ సమస్యలను కార్యక్రమంగా చేర్చింది. సమస్యలను పేర్కొనటం వరకే కాంగ్రెస్ పరిమితమైంది కానీ, వాటిపై నిర్దిష్ట కార్యాచరణలోకి రాలేదు. పైగా ఈ డిమాండ్స్ పై పనిచేస్తున్న కిసాన్ సభ అంటే కాంగ్రెస్‌కు సరిపడని విధంగా తయారైంది. రైతు రక్షణ యాత్రలోనూ మొదట కాంగ్రెస్ నాయకత్వం భాగస్వామిగా వున్నా, క్రమక్రమంగా దానికి దూరం జరుగుతూ వచ్చింది. (గాంధేయవాదిగా, కిసాన్ సభ నాయకునిగా రైతు రక్షణ యాత్రకు నాయకత్వం వహించిన కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి గారు కాంగ్రెస్ నుండి విడగొట్టుకొని సోషలిజం ధ్యేయంగా, కార్మిక కర్షక రాజ్యం కోసం నిలిచారు.) ఇదీ రైతు రక్షణ యాత్ర రాజకీయ "నేపథ్యం.

## దిగజారిన రైతాంగ జీవన స్థితిగతులు

రైతు రక్షణ యాత్ర చేపట్టిన కాలంలో రైతాంగం, గ్రామీణ పేదల దుస్థితి ఇలా వుంది: రైతులలో వందకు 95 మంది దుర్భర దారిద్ర్యంలో మునిగి వున్నారు. పన్నుల భారం, భూమి శిస్తు భారం వారిని కుంగ దీస్తున్నది. వరదలు, కరువు కాటకాలు మొదలైన ప్రకృతి అవాంతరాలు తరచుగా పంటలకు నష్టం చేస్తున్నాయి. ఆర్థిక తోడ్పాటు లేక రైతులు నూతన వ్యవసాయ పరిశోధనా ఫలితాలను పొందలేకపోతున్నారు. రైతుల రుణ పరపతి అడుగంటిపోయింది. రైతులకు కుటుంబ పోషణయే భారమైంది. అనేకమంది రైతులు రుణభారాల వల్లనే భూములను కోల్పోయి నిరాధారులౌతున్నారు. రుణ భారమధికమై రైతుల భూములన్నీ వ్యవసాయేతరులైన బడా సంపన్నుల చేతుల్లోకి వెళ్తున్నాయి. ప్రభుత్వ బ్యాంకులు రైతులకిచ్చే రుణాలు చాలా పరిమితంగా వున్నాయి. మంచినీటి కోసం ఎంతోదూరం నడిచి పోవాల్సి వస్తోంది. సాగునీటి సౌకర్యాలు లేవు. ఫలితంగా రాయలసీమలో కరువులు సంభవిస్తున్నాయి. లంచగొండితనం తీవ్రమైంది. పోలీసుల జులుం పెరిగిపోయింది. ఫ్యూడల్ దౌర్జన్యాలు, అక్రమాలతో అనేక గ్రామాలు భూలోక నరకాన్ని తలపిస్తున్నాయి. అటవీ ప్రాంతవాసుల బాధలు తీవ్రంగా వున్నాయి. వారి హక్కులన్నింటినీ హరించి వేస్తున్నారు. రైతులలో నూటికి 95 మంది నిరక్షరాస్యులై వున్నారు. దళితులకు తిండి, ఇంటి వసతి లేక ఎంతో హీనంగా చూడబడుతున్నారు. సాంఘికంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడి వున్నారు. గ్రామాల్లో విద్య వైద్యమేకాక కనీస సౌకర్యాలు కూడా లేవు. ప్రభుత్వ పాలనంతా పరాయిభాషలో జరగటం ప్రజలకు చాలా కష్టంగా వుంది. (ఎనిమిదిన్నర దశాబ్దాల క్రితం నాటి కంటే నేటి గ్రామీణ పేదల స్థితిగతులు ఎంత 'మెరుగయ్యాయో' మన కళ్ళెదటే వుంది కదా?!)

పైన పేర్కొన్న రాజకీయార్థిక నేపథ్యంలో, రైతాంగ ప్రజానీకపు జీవనం తీవ్రంగా దిగజారిన పరిస్థితుల నేపథ్యంలో సాగిన రైతు రక్షణ యాత్రకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది.

## చైతన్యయుతంగా సాగిన రైతు రక్షణ యాత్ర

1937 జులై 3వ తేదీన ఈ యాత్ర ప్రారంభమైంది. 1512 మైళ్ళు కాలినడకన, 130 రోజులపాటు, 520 గ్రామాలగుండా సాగిన ఈ యాత్రలో నాలుగున్నర లక్షల మంది ప్రజానీకం వద్దకు ఉద్యమ సందేశాన్ని చేరవేశారు. 25 వేలమంది సంతకాలతో కూడిన దాదాపు 500 విజ్ఞాపన పత్రాలను క్షేత్రస్థాయిలో రైతాంగం వీరికి అందజేశారు.

రైతు రక్షణ యాత్ర నిర్వాహక కమిటీ, యాత్ర వివరాలను, ఏ సమయానికి ఏ గ్రామం చేరుకునేదీ ముందుగానే తెలియబర్చేవారు. దానికనుగుణంగా యాత్రను పొలిమేరల నుండే రైతుకూలీలు మేళతాళాలతో స్వాగతించేవారు. ప్రజలు వెంట నడుస్తూ మరొక గ్రామానికి దోవ తీసేవారు. మధ్యలో సభలు నిర్వహించటం తోపాటు రైతు రక్షణ నిధికి 'పైసా ఫండ్' ఇవ్వాలని ప్రజలను కోరేవారు. రైతు భజనలు, పాటలతో యాత్ర ఓ మహా ప్రవాహంలా సాగింది. ప్రధాన యాత్ర జరిగే మార్గానికి దగ్గరలోని గ్రామాల రైతులు పరిసర గ్రామాలను కలుపుతూ వారంతా ఒక యాత్రగా బయలుదేరి, ప్రధాన యాత్రలో కలిసే విధంగా చిన్న చిన్న యాత్రలు ఎన్నో జరిగాయి. రాత్రికి గ్రామస్థులు పెట్టిన అన్నం తినడం, దగ్గరలో వున్న సత్రాల్లో బసచేయటం జరిగేది. ఈ సభలలో స్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొనేవారు. కొమ్మారెడ్డి సత్యనారాయణ, చలసాని వాసుదేవరావుల నాయకత్వంలో సాగిన ఈ యాత్రలో ఎక్కువ ప్రాంతాలు పర్యటించిన ఇతర "నాయకులలో గౌతు లచ్చన్న, పుల్లెల శ్యాంసుందరరావు, ఎన్‌జి రంగా, భారతీదేవి రంగా, నెల్లూరు వెంకట్రాముడు, చుండి జగన్నాథం, నండూరి ప్రసాదరావు, పిన్నమనేని శీతారామయ్య, రెబ్బాప్రగాడ మందేశ్వరశర్మ, వావిలాల గోపాలకృష్ణయ్య, గొట్టిపాటి బ్రహ్మయ్య మొదలైనవారున్నారు.

ఆంధ్ర రాష్ట్ర ఉద్యమ చరిత్రలో ఒక ప్రాధాన్యత గల ఘట్టంగా చెప్పుకోదగిన రైతు రక్షణ యాత్ర గురించిన సమగ్ర నివేదిక లిఖిత చరిత్రకెక్కలేదు. ఈ యాత్ర గురించిన విశేషాలు అక్కడక్కడా పాక్షికంగా లభించటమే తప్ప యాత్రా క్రమమంతా మొత్తంగా నమోదు చేయబడలేదు. చరిత్ర పరిశోధకులుగా వకుళాభరణం రామకృష్ణ గారు ఆనాడు ప్రచురితమైన పత్రికా వార్తల నుండి, ఆ యాత్రలో పాల్గొన్న కొందరు వ్రాసుకున్న జ్ఞాపకాల నుండి సేకరించిన భాగాలన్నింటినీ ఒక దగ్గరకు కూర్చి, రైతు రక్షణ యాత్రను కాలక్రమానుగతంగా నమోదు చేసి అందివ్వటం ఆయనకున్న

ఉద్యమ స్ఫూర్తిని తెలియచేస్తుంది. కొన్ని జిల్లాలలో రైతు రక్షణ యాత్ర విశేషాలు చాలా పరిమితంగానే లభ్యమయ్యాయి. భవిష్యత్తులో దీనినింకా పరిపుష్టం చేసుకోవలసి వుంది.

ఇచ్ఛాపురంలో 1937 జులై 3న ప్రారంభమైన రైతు రక్షణ యాత్ర 525 గ్రామాలగుండా సాగి 1938 మార్చి 27న మద్రాసు చేరుకుంది. ఈ యాత్రలో కాంగ్రెస్వాదులు, సోషలిస్టులు, కమ్యూనిస్టులు, యువజనులు, కార్మికులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 1937 అక్టోబర్ 1 నుండి 1938 ఫిబ్రవరి 16 మధ్యకాలంలో – రైతు నాయకుల అనారోగ్యం, వర్షాలు, ప్రజలకు ముమ్మరమైన పనులు – కారణంగా యాత్రను తాత్కాలికంగా నిలిపి తర్వాత కొనసాగించారు. మొత్తం 1512 మైళ్ళు కాలినడకన, 542 మైళ్ళు మోటారు వాహనాల మీద యాత్ర సాగింది. 500 గ్రామాలలో సభలు, 60 తాలూకా స్థాయి సభలు జరిగాయి. ఈ సభలలో దాదాపు 4,50,000 మంది ప్రజలు హాజరయ్యారు. ఈ పైన తెల్పిన అంకెలన్నీ దాదాపు 85 సం॥ల క్రితం, ఎంతటి పట్టుదల, పథకం, సమన్వయంలతోపాటు ఎంతగా ప్రజల తోడ్పాటు వుంటే ఇది సాధ్యమౌతుందో తెలుపుతున్నాయి.

### రైతుల 'ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్'

ఈ యాత్రా క్రమంలో 25,000 ప్రజల సంతకాలతో కూడిన 800 దరఖాస్తులను, స్థానిక ఇబ్బందులను గురించి రైతులు పెట్టుకున్న 300 అర్జీలను క్రోడీకరించి దాదాపు 100 డిమాండ్లతో కూడిన 'ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్'ను రూపొందించి ప్రభుత్వానికి మెమోరాండం రూపంలో అందించారు.

రైతు రక్షణ యాత్ర పుస్తకంలో వర్గీకరించిన ఆ డిమాండ్స్ అన్నింటినీ అందించటం చాలా ఉపయోగకరంగా వుంది. ఆనాటి పరిస్థితుల్లో రైతులు, కూలీలు, గ్రామీణ పేదలు, ఆదివాసులు, దళితులు, కౌలుదార్లు మొదలగువారి సమస్యలన్నింటిపై రూపొందించిన డిమాండ్స్ ఇందులో వున్నాయి. ముఖ్యంగా నాటి జమిందారీ వ్యవస్థలో రైతులెదుర్కొంటున్న సమస్యలకు అధిక ప్రాధాన్యత నిచ్చారు. జమీన్ రైతులు, రెమిషన్స్, నీటి వసతులు, అడవులు, శిస్తు వసూళ్ళు, సాముదాయక భూములు, సర్వే సెటిల్మెంట్లు, లంక భూములు, స్వంత భూములు, జమాబంది, ల్యాండు కోర్టులు, రైత్వారీ రైతులు, రుణములు మొదలైన అంశాలపై డిమాండ్స్ ఇందులో వున్నాయి.

### ప్రస్తుత రైతాంగ సంక్షోభం – 'రైతు రక్షణ యాత్ర' ప్రాసంగికత

భూముల నుండి పెద్ద ఎత్తున రైతుల గెంటివేత, అడవుల నుండి ఆదివాసుల విస్థాపన, రైతుకూలీల వలసలు; సన్నకారు, చిన్నకారు రైతులేగాక మధ్యతరగతి రైతుల దివాలా.. ముఖ్యంగా కౌలురైతుల ఆత్మహత్యలు మొదలైన సవాలక్ష సమస్యలతో ప్రస్తుత రైతాంగం, ఆదివాసులు కుదేలై వున్నారు. ఎరువుల, పురుగుమందుల, విత్తనాల ధరలు పెంపు చేస్తూ వ్యవసాయ ఖర్చులను పెంచుతోన్న పాలకులు, ప్రకృతి విపత్తులకు ఎదురొడ్డి రైతులు దక్కించుకున్న ఆ కొద్దిపాటి పంటలకు సైతం న్యాయమైన ధర, గిట్టుబాటు ధర కాదు కదా, ప్రభుత్వమే ప్రకటించిన కనీస మద్దతు ధరను కూడా కల్పించకుండా సామ్రాజ్యవాద మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు వారిని వదిలి వేస్తున్నారు. ఉద్దేశ్యపూరితంగానే రైతులను దివాలా తీయించి, భూములు వదిలిపోయేట్లుగా, కార్పొరేటు సంస్థల బాధిత కూలీలుగా, కాంట్రాక్టు వ్యవసాయంలో నిర్బంధ పాలేర్లుగా కట్టివేస్తున్నారు. గ్రామాల్లో దళితులపై, నిరుపేదలపై, మహిళలపై ఫ్యూడల్ హంతక దాడులు పెచ్చరిల్లుతున్నాయి.

ఈ సంక్షోభ పరిస్థితులకు ప్రతిచర్యగానే ప్రస్తుతం దేశంలో సాగుతున్న రైతాంగ ఉద్యమం వుంది. రైతులను అన్నివిధాలా దగా చేసే మూడు వ్యవసాయ వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని గత 8 నెలలుగా రైతాంగం ఆందోళనలు సాగిస్తున్నారు. గత సంఎఐ నవంబర్ 26న 'ఛలో పార్లమెంట్' పిలుపుకు పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుండి లక్షలాదిగా రైతాంగ ప్రజానీకం తరలి వచ్చారు. పోలీసులు సృష్టించే ఆటంకాలను, అవరోధాలను అధిగమించి ముందుకు సాగుతున్నారు. ఢిల్లీ శివారు రహదార్లనే ఆవాసాలుగా చేసుకొని లక్షలాదిమంది రైతాంగం గడ్డ కట్టించే చలిని, వర్షాన్ని లెక్కచేయకుండా గత 3 నెలలుగా ఉద్యమిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేసే కుట్రలను తిప్పికొట్టారు. ప్రభుత్వ అనుకూల మీడియా సాగించే దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. లాఠీ ఛార్జీలు, జల ఫిరంగులను కాచుకున్నారు. ముఖ్యంగా జనవరి 26న 'ఎర్రకోట ఘటన' సాకుతో ప్రభుత్వం నిర్బంధాన్ని తీవ్రం చేసింది. ఢిల్లీ చేరుకునే జాతీయ రహదార్లపై కందకాలు తవ్వించింది; మొనదేలిన ఇనుప మేకులను రహదారులపై పాతించింది. ఇప్పటికే ఈ ఉద్యమంలో వివిధ కారణాలతో 200 మంది వరకూ మరణించారు. ఈ రైతాంగ ఉద్యమానికి దేశవ్యాపితంగానూ ప్రపంచవ్యాప్తంగానూ కార్మికులు, విద్యార్థి, యువజనులు, మేధావులు మద్దతుగా నిలుస్తున్నారు. కవులు, కళాకారులు దాదాపుగా దేశంలోని అన్ని భాషలలోనూ ఈ ఉద్యమాన్ని చిత్రిస్తూ, నిర్బంధాన్ని ఖండిస్తూ, సంఘీభావం ప్రకటిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా పాటలు, కవితలు, కథలు, కళారూపాల ద్వారా చాలా విస్తృతంగా స్పందిస్తున్నారు.

ప్రస్తుత రైతాంగ ఉద్యమ డిమాండ్లు దేశవ్యాపిత స్వభావానివైనప్పటికీ, ఉద్యమం వివిధ కారణాల వలన అన్ని ప్రాంతాల్లోనూ ఒకే విధంగా లేదు. ఏమైనా, తక్షణం రైతాంగాన్ని కదిలించగలిగిన నిర్దిష్ట డిమాండ్లను రూపొందించుకోవటం అవసరం. అందుకే క్షేత్ర స్థాయిలోని వాస్తవిక పరిస్థితులను నాయకత్వం అవగతం

చేసుకునేందుకు, ఒక ఉద్యమంగా ప్రజలను కదిలించేందుకు 'రైతు రక్షణ యాత్ర'ను ఈ కోణంలో పరిశీలించటానికి, అనుభవాలను గ్రహించేందుకు 'రైతు రక్షణ యాత్ర' పుస్తకం ఉపయోగకరంగా వుంటుంది. చట్టపరంగా జమిందారీ విధాన రద్దుకు రైతు రక్షణ యాత్ర నాంది పలికింది. మునగాల, వెంకటగిరి, కాళీపట్నం, పిఠాపురం, మందస, చల్లపల్లిలలో జమిందారీ, ఇనాందారీ వ్యతిరేక పోరాటాలు వూపందుకోవడానికి రైతు రక్షణ యాత్ర తోడ్పడింది. ఈ పోరాటాల ప్రధాన ఉద్దేశ్యం జమిందారీ, భూస్వామ్య విధానాన్ని రద్దుచేసి, దున్నేవానికే భూమిపై హక్కు కల్పించటం. రైతుసంఘ నిర్మాణం దృష్టితో నిర్వహించిన ఈ రైతు రక్షణ యాత్ర ఫలితంగా గ్రామస్థాయి నుండి నిర్మాణాన్ని ఏర్పరచుకొని బలోపేతం చేసుకోవటానికి రైతు సంఘం శాఖోపశాఖలుగా విస్తరించటానికి తోడ్పడింది. ఈ అనుభవాలను ప్రస్తుత పరిస్థితులకు అన్వయించుకోవటం అవసరం. పుస్తకం పేరు 'రైతు రక్షణ యాత్ర' అయినప్పటికీ, ఆ యాత్ర నేపథ్యాన్ని, ఆ యాత్ర ఫలితాల్ని కూడా రచయిత ఇందులో పొందుపరిచారు. యాత్రకు నాయకత్వం వహించిన కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి, చలసాని వాసుదేవరావుల జీవిత విశేషాలందించటం తోపాటు యాత్రలో పాల్గొన్న వివిధ జిల్లాల ముఖ్యుల వివరాలు అందించారు. ముఖ్యంగా 'అనుబంధం'లో రైతు రక్షణ యాత్ర మద్రాసులో రాష్ట్ర స్పీకరుకు అందించిన విజ్ఞాపన పత్రం, డిమాండ్స్ ఉద్యమ కార్యకర్తలు పరిశీలించాలి. చరిత్ర పఠనాసక్తి గలవారికి మాత్రమేగాక, ఉద్యమ కార్యకర్తలకు సైతం పునశ్చరణగా ఈ పుస్తకం తోడ్పడుతుంది.

**(2021 ఫిబ్రవరి–మార్చి**
**'ప్రజాసాహితి' సౌజన్యంతో)**



*With Best Compliments from.....*

GST No. : 37AABFD5446J1ZC
Agl No. : PKM/44/JDA/FW/2013/7092

**Cell : 9849 100 140 (Veeraiah)**
**Cell : 9849 592 900 (Shop)**

# DESU VEERAIAH SONS

## FERTILIZER DISTRIBUTORS

**#5-425(D), Desu Plaza, 1st Floor,**
**North Bypass Road, ONGOLE - 523002. A.P.**

E-mail : desuveeraiahsons@gmail.com

With Best Compliments from.....

**కారంశెట్టి కిరణ్‌కుమార్**

**77940 55550**
**98853 93780**



# అంబికా ఇండస్ట్రీస్

# AMBICA INDUSTRIES

**కారంశెట్టి వెంకటేశ్వర్లు బిల్డింగ్, కోట వీధి**

**ఒంగోలు - 523 001**

**మా వద్ద బ్యారన్ సామానులు, హార్డ్‌వేర్, టాటాడోరియా రేకులు, రేకులు లభించును.**


With Best Compliments From....
TRANSPARENT
ACCOUNTABLE
SUSTAINABLE GROWTH
inventaa
Industries Pvt. Ltd
since 1979
BUILDING PRODUCTS
HCS | PRECAST ELEMENTS | AAC BLOCKS/PANELS | DESIGNER PAVERS
MUSHROOMS
White Button - Fresh / Canned
Registered office and site address
Inventaa Industries Private Limited.
Sy. No. 137, Keesara
Kanchikacherla
Krishna District
Andhira Pradesh
CHEMICALS
API - Custom Manufacturing | Serving Regulatory Markets
www.inventaa.com



మహాసభల రెండవరోజు జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్నవారు వరుసగా (ఎడమ నుండి)
ప్రొఫెసర్ వేణుగోపాలరావు, శ్రీ బండ్ల శ్రీనివాస్, శ్రీ జే.డి. లక్ష్మీనారాయణ, కామ్రేడ్ వై. కోటేశ్వరరావు




09-08-23న "ఒడిదుడుకులను అధిగమిస్తూ సాగిన అర్ధశతాబ్దపు కొండమొదలు గిరిజనోద్యమం" పుస్తకావిష్కరణ



24-01-24న పోలవరం నిర్వాసితుల సమస్యలపై ధవళేశ్వరంలో ధర్నా

Rythu Coolie Sangham (A.P.) Rastra Mahasabhala Souvenir - 2024

రూ. 50/-






సహజ సంపదలపై హక్కు దేశ ప్రజలదే!!